సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 172
గురువారం 12-9-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'



సెమీస్‌లోకి భారత్
ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ మ్యాచ్‌లో మలేసియాపై 8–1తో విజయం -14లో



వాహనం.. బీమాకు దూరం
దేశంలోని ప్రతి వంద వాహనాల్లో తొమ్మిదింటికే బీమా ఉంది! -15లో



ప్రపంచమంతా ఇండియా చిప్‌లు
దేశంలో సెమీ కండక్టర్ల తయారీ రంగంలో భారీగా పెట్టుబడులు రాబట్టడానికి చర్యలు ప్రారంభించామని ప్రధాని మోదీ చెప్పారు. వివరాలు 6లో ▸



కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు
మద్యం కుంభకోణంపై సీబీఐ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని రౌజ్ అవెన్యూ కోర్టు 25 దాకా పొడిగించింది. వివరాలు 6లో ▸



ప్రత్యక్ష ప్రసారం చేయాలి
జూనియర్ డాక్టర్లతో చర్చల యత్నాలు బెడిసికొట్టాయి. సీఎం సమక్షంలోనే చర్చలు జరగాలని జూనియర్ డాక్టర్లు పట్టుబట్టారు. వివరాలు 6లో ▸



ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల కట్టడి
ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ, వాటి నిర్వహణ తీరును కట్టడి చేయాలని రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయపడింది. వివరాలు 12లో ▸

న్యూస్‌రీల్

సెంచరీ క్రాస్



హైడ్రా ఇప్పటి వరకు 111.72 ఎకరాలను పరిరక్షించింది. మొత్తంగా 23 ప్రాంతాల్లో 262 ఆక్రమణలను తొలగించింది. గడిచిన 74 రోజుల్లో తాము చేపట్టిన ఆపరేషన్లకు సంబంధించిన వివరాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం వెల్లడించారు.
- వివరాలు 2లో▶

అక్రమార్కులపై రెరా కొరడా



'రియల్' అక్రమాలపై 'రెరా' దృష్టిపెట్టింది. గుండ్లపోచంపల్లిలో సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ నిర్మిస్తున్న సాహితీ శిష్ట అబోడ్ ప్రాజెక్టుపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిన అథారిటీ.. 'రెరా' చట్టంలోని సెక్షన్ 80 కింద ప్రాసిక్యూషన్ చేయాలని ఆదేశించింది.
- వివరాలు 2లో▶

కుక్కకాటుకు బలవుతున్నా మొద్దునిద్ర: హరీశ్‌రావు



చిన్నారులు కుక్కకాటుకు బలవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడట్లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ ఏడాది 60వేలకు పైగా కుక్కకాటు కేసులు నమోదుకాగా.. పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని అన్నారు.
- వివరాలు 3లో▶

17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

- హైదరాబాద్‌లో జెండా ఆవిష్కరణ చేయనున్న సీఎం రేవంత్
- జిల్లా కేంద్రాల్లో ఉదయం 10 గంటలకు ఉత్సవాలు
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి

2లో

ఇంతంజాకత్



మన వైరస్ అంటే.. మనకంటే ఎక్కువగా ప్రపంచమే భయపడుతుంది సార్!

చెరువుల్ని వదలకుంటే చెరసాలకే!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక | **చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల వల్లే వరదలు**

ఆక్రమించుకున్న చెరువులను స్వచ్ఛందంగా వదిలేయాలని విజ్ఞప్తి చేస్తున్నా..

- లేకపోతే ఎంత గొప్పవారైనా అక్రమ నిర్మాణాల కూల్చివేత తప్పదు
- స్టే తెచ్చుకుంటే కోర్టుల్లో కొట్లాడతాం..అవసరమైతే జైలుకు పంపిస్తాం
- ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాల క్రమబద్ధీకరణ ప్రసక్తే లేదు
- ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న సీఎం
- ప్రజల్లో విశ్వాసాన్ని, పోలీసులపై గౌరవాన్ని పెంచేలా పనిచేయాలని సూచన
- కాస్మెటిక్ పోలీసింగ్ కాదు.. కాంక్రీట్ పోలీసింగ్ అవశ్యమని వ్యాఖ్య



బుధవారం ఎస్ఐల దీక్షాంత్ పరేడ్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/బండ్లగూడ

'చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల వల్లే వరదలు వస్తున్నాయి. వరదలతో పేదల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. ఫాంహౌస్‌ల నుంచి వచ్చే డ్రైనేజీని గండిపేటలో కలుపుతున్నారు. అందుకే చెరబట్టిన వారి నుంచి చెరువులను విడిపిస్తున్నాం. ఆక్రమించుకున్న చెరువులను స్వచ్ఛందంగా వదిలేయాలని ఆక్రమణ దారులకు విజ్ఞప్తి చేస్తున్నా..లేకపోతే చెరువులలోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి తీరుతాం. నాలాలపై ఆక్రమణలను కూడా తప్పనిసరిగా కూల్చేస్తాం. కూల్చివేతలపై స్టే తెచ్చుకుంటే కోర్టుల్లో కొట్లాడతాం. అవసరమైతే ఆక్రమణదారులను జైలుకు పంపేందుకూ వెనకాడం..'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. చెరువులు, నాలాల ఆక్రమణలు తొలగించే లక్ష్యంతోనే హైడ్రాను ఏర్పాటు చేశామని, ఆక్రమణదారులు ఎంత గొప్పవారైనా చర్యలు తప్పవని చెప్పారు. ఇదే తమ ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాలను క్రమబద్ధం చేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాజా బహదూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో బుధవారం నిర్వహించిన ఎస్ఐల దీక్షాంత్ పరేడ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 145 మంది మహిళలు సహా 547 మంది సివిల్ ఎస్ఐలు, రిజర్వ్ ఎస్ఐలు, ఏఎస్ఐల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. శిక్షణలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ట్రోఫీలను బహూకరించారు. పాసింగ్ అవుట్
మిగతా 2వ పేజీలో ▶

మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్రూం

'హైదరాబాద్ నుంచి వచ్చే కాలుష్యంతో నల్లగొండ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి కోమటిరెడ్డి నా దృష్టికి తెచ్చారు. ఆక్రమణలు తొలగించి మూసీని ప్రక్షాళన చేస్తాం. మూసీలో శాశ్వత నివాసదారుల విషయంలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరిస్తుంది. వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తాం. నివాసితులైన 11 వేల మందిలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుంది'
..: సీఎం రేవంత్ రెడ్డి :..

డిబేట్‌లో ట్రంప్, కమలా హారిస్



కమలదే పైచేయి!

డిబేట్‌లో ట్రంప్ బేజారు.. ప్రశ్నలకు నీళ్లు నమిలిన వైనం
చాలా అంశాల్లో హారిస్‌దే ఆధిపత్యం
వలసలు, ద్రవ్యోల్బణంపై ట్రంప్‌కు మార్కులు

మూడు నెలల్లోపే ఓడలు బళ్లయ్యాయి! జూన్ నెలాఖర్లో జరిగిన తొలి ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో నాటి ప్రత్యర్థి బైడెన్‌ను ఆటాడుకున్న ట్రంప్.. తాజా ముఖాముఖిలో మాత్రం కమలా హారిస్ ధాటికి చేతులెత్తేశారు.

..అబార్షన్లు మొదలుకుని విదేశీ విధానం దాకా పలు అంశాలపై ఆమె సాధికార వాదనల ముందు తేలిపోయారు. ఉక్రెయిన్, గాజా యుద్ధాలపై హారిస్ తన వైఖరిని స్పష్టంగా అమెరికన్ల ముందుంచగా ట్రంప్ మాత్రం పదేపదే తడబడ్డారు. వేదికనెక్కుతూనే చొరవగా ట్రంప్‌కు షేక్‌హ్యాండ్‌తో మొదలైన హారిస్ ఆధిపత్యం చివరిదాకా కొనసాగింది. పలు సందర్భాల్లో ఆమె విసిరిన చెణుకులకు మాజీ అధ్యక్షుడు దీటుగా బదులు కూడా ఇవ్వలేకపోయారు. అసహనంతో ఉడుక్కోవడమే గాక పలు అంశాలపై అబద్ధాలు, అవాస్తవాలు చెప్పుకొచ్చారు. అయితే అమెరికన్లను తీవ్రంగా కలవరపరుస్తున్న వలసలు, ద్రవ్యోల్బణంపై మాత్రం ట్రంప్ తన వాదనలను సమర్థంగా వినిపించారు. దాంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరు మరింత రసవత్తరంగా మారింది.
6లో

నిండా మునిగాం.. ఆదుకోండి

వరద నష్టాల పరిశీలన కోసం వచ్చిన కేంద్ర బృందానికి బాధితుల మొర

- రెండు సబ్ టీమ్‌లుగా విడిపోయి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో పర్యటించిన బృందం.. పంట, ఆస్తి నష్టాలను పరిశీలించిన ఒక సబ్ టీమ్
- రోడ్లు, చెరువులు, కాల్వలు, వంతెనల నష్టంపై ఫోకస్ చేసిన మరో సబ్ టీమ్
- సర్వం కోల్పోయామంటూ కన్నీటి పర్యంతమైన ముంపు బాధితులు
- నిద్ర లేచి చూస్తే నీళ్లలో ఉన్నాం.. ఎలాగోలా ప్రాణాలు కాపాడుకున్నామని ఆవేదన
- నేడు మున్నేరు ముంపు ప్రాంతం, సూర్యాపేట జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



ఆదుకోవాలని కేంద్ర బృందం ముందు కన్నీటి పర్యంతం అవుతున్న రాకాసితండా గిరిజన మహిళ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం/సాక్షి, మహబూబాబాద్: ''అర్ధరాత్రి దాటాక అకస్మాత్తు వరద.. మెలకువ వచ్చి చూస్తే నీళ్లలో ఉన్నాం.. దిక్కుతోచని పరిస్థితిలో ఇంటిపైకి ఎక్కి, ఎత్తైన ప్రాంతాలకు పరుగెత్తి ప్రాణాలు మాత్రం కాపాడుకున్నాం.. కానీ సర్వం కోల్పోయాం.. నిత్యావసరాల నుంచి ఇంట్లో వస్తువుల దాకా అన్నీ కొట్టుకుపోయాయి.. ఉన్నా పాడైపోయాయి.. మా బతుకులకు ఆధారమైన పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. నిండా మునిగిపోయాం.. ఆదుకోండి'' అని ముంపు బాధితులు కేంద్ర బృందానికి గోడు వెళ్లబోసుకున్నారు. భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల పరిధిలో తీవ్ర నష్టం జరిగిన విషయం తెలిసిందే. దీనిని పరిశీలించి, నష్టం అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బృందం బుధవారం రాష్ట్రంలో పర్యటించింది.

రెండు సబ్ టీమ్‌లుగా విడిపోయి..
ఆరుగురు సభ్యులతో కూడిన కేంద్ర వరద పరిశీలన బృందం.. తొలిరోజు బుధవారం ఖమ్మం,
మిగతా 12వ పేజీలో ▶

ప్రస్తుతానికి రూ. 5,438 కోట్లు!

వరద నష్టంపై కేంద్ర బృందానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక
12లో

70 ఏళ్లు పైబడిన అందరికీ రూ.5 లక్షల ఆరోగ్య బీమా



- ఆదాయంతో సంబంధం లేకుండా అందరికీ ఆయుష్మాన్ భారత్ వర్తింపు
- ఈ నిర్ణయంతో దేశంలోని 4.5 కోట్ల కుటుంబాల్లోని వృద్ధులకు లబ్ధి
- 31వేల మెగావాట్ల హైడ్రోపవర్ ప్రాజెక్టులకూ గ్రీన్‌సిగ్నల్.. పీఎం గ్రామ్ సడక్ యోజన–4 కింద 62,500 కి.మీ. మేర రోడ్ల నిర్మాణం
- రెండేళ్లలో రూ.2,000 కోట్ల వ్యయంతో 'మిషన్ మౌసమ్' అమలు
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

6లో



ఆయిల్ సింక్రనైజేషన్ స్విచ్ ఆన్ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

'యాదాద్రి'లో డిసెంబర్‌లోగా విద్యుదుత్పత్తి

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క వెల్లడి

- మూడు యూనిట్లలో 2,400 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా పనులు
- గత ప్రభుత్వ నిర్వాకంతోనే పవర్ ప్లాంట్ పనుల్లో జాప్యం
- దీంతో ప్రస్తుత ప్రభుత్వంపై ఆర్థిక భారం

5లో



60 రోడ్లు.. 1,712 కి.మీ.

- రీజనల్ రింగ్ రోడ్‌లో నిర్మించే రేడియల్ రోడ్ల స్వరూపమిదీ
- మూడు దశల్లో రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- తొలి రెండు దశల్లో 1,281 కిలోమీటర్ల మేర 32 రేడియల్ రోడ్లు
- 3వ దశలో 431 కిలోమీటర్లతో 28 లింక్ రోడ్లకు ప్రతిపాదనలు
- లీ అసోసియేట్‌కు 10 రేడియల్ రోడ్ల మాస్టర్ ప్లాన్ బాధ్యతలు

3లో

10 గ్రామాలు.. 2,114 దరఖాస్తులు

- మొత్తం 4,465 సర్వే నంబర్లు, సబ్ డివిజన్లలో భూ సమస్యలు.. యాచారం మండలంలో ధరణి చిక్కులపై 'లీఫ్స్' పైలట్ అధ్యయనం
- ఒక్క కుర్మిద్దలోనే 1,183 సర్వే నంబర్లలో సమస్యలు
- పది గ్రామాల్లోని 3,039 సర్వే నంబర్లు, సబ్ డివిజన్లలోని రైతుల యాజమాన్య హక్కులు మాయం!
- ఆర్డీవోకు 'లీఫ్స్' వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్‌కుమార్ నివేదిక

2లో

ధరణి

చెప్పుకోలేని బాధ..



ఏళ్లుగా తీరని వేదన.. రోజూ అదే 'వరుస'.. సిద్దిపేట జిల్లా మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150 మంది విద్యార్థులున్నారు. వీరిలో 90 మంది అమ్మాయిలు. వీరికున్నది ఒకటే మూత్రశాల. అదీ అధ్వానం.. విధిలేక దాన్నే ఉపయోగిద్దామంటే బారులు తీరి నిల్చోవాల్సిందే. ఈ కళాశాలకు ప్రహరీ కూడా లేదు. ఇక బాలురైతే అవసరాలు తీర్చుకోవాలంటే బయటకు వెళ్లాల్సిందే.
– మద్దూరు(హుస్నాబాద్)

1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్



- ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- వచ్చే నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు
- నవంబర్ 10న రాతపరీక్ష... అభ్యర్థులు ఎక్కువుంటే రెండు మూడు సెషన్లు
- మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యదర్శి గోపికాంత్‌రెడ్డి వెల్లడి

-వివరాలు 16లో

సెంచరీ క్రాస్

ఇప్పటివరకు 111.72 ఎకరాలను పరిరక్షించిన హైడ్రా

చెరువులు, పార్కులతో పాటు ప్రభుత్వ స్థలాలూ	23 ప్రాంతాల్లో 262 అక్రమ నిర్మాణాల తొలగింపు	వీటిలో అత్యధికం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోనివే	వివరాలు వెల్లడించిన కమిషనర్ ఏవీ రంగనాథ్



సాక్షి, హైదరాబాద్: హైడ్రా ఇప్పటివరకు 111.72 ఎకరాలను పరిరక్షించింది. మొత్తంగా 23 ప్రాంతాల్లో 262 అక్రమ నిర్మాణాలను తొలగించింది. వీటిలో చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులతోపాటు ప్రభుత్వ భూములు కూడా ఉన్నట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం ప్రకటించారు. గడిచిన 74 రోజుల్లో తాము చేపట్టిన ఆపరేషన్లకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.

లోటస్‌పాండ్ పార్కుతో మొదలు

ఈవీడీఎం డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న రంగనాథ్ ఈ ఏడాది జూన్ 27 నుంచి బుల్డోజర్లకు పనిచెప్పారు. ఫిల్మ్‌నగర్ కోఆపరేటివ్ సొసైటీలో తొలి ఆపరేషన్ చేపట్టి నార్నె గోకుల్ ఆక్రమించిన లోటస్ పాండ్‌లోని 16 గుంటల పార్కు స్థలానికి విముక్తి కల్పించారు. ఈవీడీఎం ద్వారానూ జూలై 1, 4, 5, 14 తేదీల్లో నాలుగుచోట్ల ఏడు అక్రమ నిర్మాణాలను కూల్చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏరియా నుంచి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వరకు పరిధిని విస్తరిస్తూ హైడ్రాకు రూపమిచ్చిన ప్రభుత్వం దీనికి సంబంధించి జూలై 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మరుసటి రోజే కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న రంగనాథ్ ఓఆర్ఆర్ వరకు ఉన్న ఆక్రమణలపై దృష్టి పెట్టారు.

హైడ్రా తొలి ఆపరేషన్ పార్కు భూమే..

హైడ్రా సైతం చేపట్టిన తొలి ఆపరేషన్ పార్కు భూమికి సంబంధించినదే కావడం గమనార్హం. గాజులరామారంలోని మహదేవ్‌పురంలో పార్కు స్థలాన్ని కబ్జా చేసి నిర్మించిన జీ+2 భవనాన్ని జూలై 21న కూల్చేసింది. అదే నెల 23న గాజులరామారంలోని పరికి చెరువు బఫర్‌జోన్‌లో ఐదు నిర్మాణాలను కూల్చేయడంతో జలవనరుల పరిరక్షణకు శ్రీకారం చుట్టింది. అంతకు ముందు రెండుచోట్ల నాలాలపై ఉన్న ఆక్రమణలను మాత్రమే తొలగించింది. ఇలా ఇప్పటివరకు హైడ్రా ఐదుచోట్ల పార్కులు, ఒకచోట రోడ్డు, 13 చోట్ల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్, రెండుచోట్ల నాలా, ఒక చోట ఫుట్‌పాత్‌లతోపాటు ఓ ప్రభుత్వ స్థలంలో ఉన్న మొత్తం 262 నిర్మాణాలను కూల్చేసింది.

చింతల్, అమీన్‌పూర్‌ల్లోనే అత్యధికం..

ఇప్పటివరకు హైడ్రా పరిరక్షించిన వాటిలో అత్యధికం చింతల్ చెరువు, అమీన్‌పూర్ చెరువుల్లోనివే. గాజులరామారం గ్రామంలోని సర్వే నంబరు 329లో ఉన్న చింతల్ చెరువులో బీఆర్ఎస్‌కి చెందిన నేత రత్నాకరం సాయిరాజు 54 షెడ్లు నిర్మించారు. అమీన్‌పూర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఆక్రమిస్తూ 51.78 ఎకరాలను ఆక్రమించి 20 కాంపౌండ్ వాల్స్, నాలుగు షెడ్లు నిర్మాణమయ్యాయి. చింతల్ చెరువులో గత నెల 6న, అమీన్‌పూర్ చెరువులో ఈ నెల 8న హైడ్రా నిర్మాణాలను కూల్చేసింది. ఈ నెల 8న ఒకే రోజు మూడు చోట్ల బుల్డోజర్లు పనిచేశాయి. అమీన్‌పూర్‌తోపాటు సున్నం, కత్వ చెరువుల్లో 79 ఆక్రమణల్ని హైడ్రా తొలగించింది.

సామాన్యులు, ప్రముఖులు కూడా..

హైడ్రా బుల్డోజర్ల బారినపడిన వారిలో సామాన్యుల నుంచి అత్యంత ప్రముఖుల వరకు ఉన్నారు. ఎన్ కన్వెన్షన్ యజమాని అక్కినేని నాగార్జున, కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ నేత పల్లం రాజు సోదరుడు పల్లం ఆనంద్, ప్రో కబడ్డీ యజమాని అనుపమ, కావేరి సీడ్స్ యజమాని భాస్కరరావు, మంథని బీజేపీ నేత సునీల్‌రెడ్డి, బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, ఎంఐఎం ఎమ్మెల్సీ మహ్మద్ మీర్జా, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు ఉన్నారు. దానం నిర్మాణాలను కూల్చకున్నా.. బంజారాహిల్స్‌లో చేపట్టిన ఆపరేషన్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఆయనపై కేసు నమోదైంది. ఈ విభాగం ఇప్పటి వరకు కేవలం ఈవీడీఎం, జీహెచ్ఎంసీలోని టౌన్ ప్లానింగ్ సిబ్బందితో పాటు స్థానిక పోలీసుల సహకారంతో కార్యకలాపాలు సాగిస్తోంది. హైడ్రాకు సిబ్బంది కేటాయింపు సోమవారం నుంచి ప్రారంభమైంది. తొలి విడతగా 23 మంది పోలీసులను కేటాయించారు. మిగిలిన సిబ్బందితోపాటు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ వస్తే ఇక వేగం పెరుగుతుంది.

17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

హైదరాబాద్‌లో జెండావిష్కరణ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: నిజాం పాలన నుంచి విముక్తి పొంది.. భారత దేశంలో తెలంగాణ ప్రాంతం విలీనమైన సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆ రోజు హైదరాబాద్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఉదయం 10 గంటలకు జరిగే ఉత్సవాల్లో సంబంధిత జిల్లా ఇన్‌చార్జీ మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ల చైర్మన్లు ముఖ్యఅతిథులుగా పాల్గొని జెండా ఆవిష్కరణ చేస్తారు. ఆ రోజు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థల కార్యాలయాలపై జాతీయ జెండాను ఆవిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈపీఎఫ్‌వో అడిషనల్ కమిషనర్‌గా సత్యనారాయణ బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర అడిషనల్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ (ఏసీపీఎఫ్‌సీ)గా ఎంఎస్‌కేవీవీ సత్యనారాయణ బుధవారం హైదరాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని ఈపీఎఫ్ఓ ప్రధాన కార్యాలయంతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో దాదాపు 27 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న సత్యనారాయణ తెలుగు వ్యక్తి కావడం గమనార్హం. తెలంగాణ ఈపీఎఫ్ఓ కార్యాలయంలో పరిపాలన పరంగా మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర కార్యాలయం ఆయన్ను ఇక్కడికి బదిలీ చేసింది.

ఎన్నికల లబ్ధి కోసమే సీఎం బ్రేక్‌ఫాస్ట్

కేటీఆర్ పోస్ట్‌పై సీతక్క ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఫార్స్‌గా మార్చింది మీరేనని మంత్రి సీతక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌కు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. అబద్ధాలకు అంబాసిడర్‌గా కేటీఆర్ మారారని ఆరోపించారు. సీఎం అల్పాహార పథకంపై కేటీఆర్ చేసిన పోస్ట్‌పై మంత్రి మండిపడ్డారు. ఎన్నికల షెడ్యూల్‌కు కేవలం మూడు రోజుల ముందు మొక్కుబడిగా వేళ్ల మీద లెక్కబెట్టేటన్ని పాఠశాలల్లో ప్రారంభించి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. ఎలాంటి మార్గదర్శకాలు, బడ్జెట్ కేటాయింపులు లేకుండానే ఎన్నికల లబ్ధి కోసం హడావుడిగా సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టి నయాపైసా ఖర్చు చేయకుండా ఆరంభ శూరత్వంగా మార్చి పురిట్లోనే చంపేశారని సీతక్క విరుచుకుపడ్డారు. ఏజెన్సీలకు మీరు బకాయి పడ్డ రూ.3.5 కోట్లను తమ ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు.

10 గ్రామాలు.. 2,114 దరఖాస్తులు

మొత్తం 4,465 సర్వే నంబర్లు, సబ్ డివిజన్లలో భూ సమస్యలు

- యాచారం మండలంలో ధరణి చిక్కులపై 'లీఫ్స్' పైలట్ అధ్యయనం
- ఒక్క కుర్మిద్ద గ్రామంలోనే 1,183 సర్వే నంబర్లలో సమస్యలు
- పది గ్రామాల్లోని 3,039 సర్వే నంబర్లు, సబ్ డివిజన్లలోని రైతుల యాజమాన్య హక్కులు మాయం!
- ఆర్డీవోకు 'లీఫ్స్' వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్‌కుమార్ నివేదిక



కోదండరెడ్డి సమక్షంలో అనంతరెడ్డి, అయ్యప్పలకు నివేదిక అందజేస్తున్న సునీల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ శివారులో ఉన్న రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని 10 గ్రామాలు, ధరణి పోర్టల్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు అద్దం పడుతున్నాయి. ఈ గ్రామాల్లో జనవరి 14 నుంచి ఆగస్టు 31 వరకు న్యాయ సాధికారత, రైతుల సహాయ సంస్థ (లీఫ్స్) ఆధ్వర్యంలో నిర్వహించిన పైలట్ అధ్యయనం ధరణి సమస్యలకు ఓ రూపం తీసుకువచ్చింది. యాచారం మండలంలోని 10 గ్రామాల నుంచి భూ సమస్యలకు సంబంధించి 2,114 దరఖాస్తులు రావడం గమనార్హం కాగా.. ఈ దరఖాస్తులను పరిశీలిస్తే మొత్తం 4,465 సర్వే నంబర్లు, సబ్ డివిజన్లలో ధరణి పోర్టల్ ద్వారా పరిష్కారం కావాల్సిన సమస్యలున్నాయని, ఆయా సమస్యలున్న సర్వే నంబర్లలో రైతుల హక్కులు మాయమయ్యాయని తేలింది. ఒక్క కుర్మిద్ద గ్రామంలోనే 1,183 సర్వే నంబర్లలో సమస్యలున్నాయంటూ రైతుల నుంచి దరఖాస్తులు రావడం గమనార్హం. ఇక పది గ్రామాల్లో కలిపి పట్టా భూముల్లోని 3,039 సర్వే నంబర్లు, సబ్ డివిజన్ నంబర్లలో రైతుల యాజమాన్య హక్కులు మాయం కాగా, గతంలో పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్లు ఉండి భూరికార్డుల ప్రక్షాళన అనంతరం కొత్త పాసు పుస్తకాలు రాని, టైటిల్ డీడ్లు లేని రైతులు 558 మంది ఉన్నారని వెల్లడయింది. ఇందులో గునగల్ గ్రామానికి చెందిన 93 మంది రైతులకు, నందివనపర్తి (26), తక్కెళ్లపల్లి (28), యాచారం (146), మొండిగౌరెల్లి (53), చింతపట్ల (48), మేడిపల్లి (42), కుర్మిద్ద (32), తాటిపత్రి (1), మంథన్‌గౌరెల్లికి చెందిన 89 మంది రైతులకు పాసు పుస్తకాలు రాలేదని తేలింది. ఈ మేరకు పూర్తి నివేదికను బుధవారం యాచారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి సమక్షంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి, యాచారం తహసీల్దార్ అయ్యప్పలకు 'లీఫ్స్'వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.సునీల్‌కుమార్ అందజేశారు. ఈ నివేదిక ప్రకారం ఒక్క యాచారం మండలంలోని 10 గ్రామాల్లోనే గ్రామానికి సగటున 200కు పైగా దరఖాస్తులు వచ్చాయంటే రాష్ట్రంలోని 11 వేల పైచిలుకు గ్రామాల్లో 22 లక్షల మందికి పైగా రైతులు ధరణి పోర్టల్ వల్ల సమస్యలు ఎదుర్కొంటూ ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

8 నెలల కష్టం

ఈ పైలట్ అధ్యయనానికి గాను 'లీఫ్స్'బృందం దాదాపు 8 నెలల పాటు శ్రమించింది. యాచారం మండలంలోని 10 గ్రామాలను రెండు దఫాలు సందర్శించింది. నలుగురు పారా లీగల్స్, ఇద్దరు న్యాయవాదులు అన్ని గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఒక దశలో దరఖాస్తులను స్వీకరించిన తర్వాత వాటన్నింటినీ పరిశీలించి ఇంకా అవసరమైన డాక్యుమెంట్ల సేకరణ కోసం రెండోసారి కూడా గ్రామాలకు వెళ్లారు. ఆ తర్వాత సమస్యలు, భూమి రకాలు, సర్వే నంబర్ల వారీగా డేటా ఎంట్రీ చేసి ఎక్కడ ఎలాంటి సమస్య ఉందో క్షుణ్ణంగా వివరిస్తూ నివేదిక తయారు చేశారు. సునీల్‌కుమార్, కోదండరెడ్డిలు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ, బృందాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకోవడంలో కీలకపాత్ర పోషించారు.

ఇప్పుడు ఐదు పనులు చేయాలి

ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా ధరణి సమస్యల గుర్తింపు ప్రక్రియ అవగతమైంది. దీని తర్వాత రాష్ట్ర స్థాయిలో ఐదు పనులు జరగాలి. ప్రజాపాలనలో దరఖాస్తులు తీసుకున్నట్టుగా భూన్యాయ శిబిరాలను ఏర్పాటు చేసి రాష్ట్రంలోని 11 వేల పైచిలుకు రెవెన్యూ గ్రామాల్లోని రైతుల నుంచి ఉచితంగా భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకోవాలి. తహశీల్దార్ కార్యాలయాల్లో భూచట్టాలపై అవగాహన ఉన్న ఐదుగురు సభ్యులతో సపోర్ట్ టీం ఏర్పాటు చేసి దరఖాస్తులు పరిశీలించాలి. తర్వాత గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలన్నింటినీ పరిష్కరించాలి. ఈ దరఖాస్తుల కోసం ప్రత్యేకంగా యాప్ తయారు చేసి డేటాను సమన్వయం చేసుకోవాలి. ఇక ఆర్‌వోఆర్ కొత్త చట్టం కూడా అమల్లోకి వస్తే 4 నెలల కాలంలోనే ధరణికి సంబంధించిన మెజార్టీ సమస్యలు పరిష్కారమవుతాయి.

- ఎం.సునీల్‌కుమార్, 'లీఫ్స్' వ్యవస్థాపక అధ్యక్షుడు

అక్రమార్కులపై 'రెరా' కొరడా

- ప్రీలాంచ్ ఆఫర్లతో రూ.వేల కోట్లు వసూలు చేసిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్‌పై ప్రాసిక్యూషన్‌కు ఆదేశం
- రిలయన్స్ డెవలపర్స్‌కు రూ.20 లక్షలు, జయభేరికి రూ.2.75 లక్షల జరిమానా

సాక్షి, హైదరాబాద్: చెరువులను ఆక్రమించి సాగించిన నిర్మాణాలపై ఓవైపు 'హైడ్రా' ఉక్కుపాదం మోపుతుండగా... రియల్ అక్రమాలపై రియల్ ఎస్టేట్ రెగ్యులరైజేషన్ అథారిటీ (రెరా) దృష్టి పెట్టింది. 'రెరా'రిజిస్ట్రేషన్ లేకుండా హైదరాబాద్‌తోపాటు జిల్లాల్లో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లు, ఏర్పాటు చేస్తున్న వెంచర్లకు సంబంధించి వస్తున్న ఫిర్యాదుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. తాజాగా మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లిలో సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ నిర్మిస్తున్న సాహితీ శిష్ట అబోడ్ ప్రాజెక్టుపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిన అథారిటీ.. 'రెరా'చట్టంలోని సెక్షన్ 80 కింద సదరు సంస్థను ప్రాసిక్యూషన్ చేయాలని ఆదేశించింది. నిర్ణీత సమయంలోగా కొనుగోలుదారులకు ఫ్లాట్లు నిర్మించి ఇవ్వకుండా వేధించడం, ఒకే ఫ్లాట్‌ను ఇద్దరికి విక్రయిస్తూ అగ్రిమెంట్లు చేసుకోవడం వంటి అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు సంస్థ యజమానులను హాజరుపరచాలని సంస్థ చైర్మన్ సత్యనారాయణ, ఇతర సభ్యులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు ఆదేశించారు. ఈ సంస్థ ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో జూన్ 2019 నుంచి పెద్ద మొత్తంలో కొనుగోలుదారుల నుంచి డబ్బులు సేకరించిందని, 3,000 మంది నుంచి 1,290 కోట్లు సేకరించిందని 'రెరా' గుర్తించింది. సాహితీ వెంచర్స్ కింద ఉన్న సాహితీ శార్వాణి ఎలైట్, సాహితీ కార్తికేయ, సాహితీ సితార కమర్షియల్ తదితర ప్రాజెక్టులు ఉండగా, వీటన్నింటిపైనా చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం.

జయభేరి సంస్థకు జరిమానా

మెజారిటీ కొనుగోలుదారులకు సమాచారం ఇవ్వకుండా క్లబ్‌హౌజ్ నిర్మించిన జయభేరి ప్రాజెక్ట్స్ సంస్థకు 'రెరా'రూ. 2.75 లక్షల అపరాధ రుసుము విధించింది. బేగంపేటలోని ఓ ఫ్లాట్ విక్రయం విషయంలో కొనుగోలుదారున్ని మోసం చేశారనే అభియోగంపై రిలయన్స్ డెవలపర్స్ అనే సంస్థకు రూ. 20 లక్షల జరిమానా విధించింది. అదే సమయంలో సదరు కొనుగోలుదారుడు చెల్లించిన రూ.1.20 కోట్లను వడ్డీతో సహా చెల్లించాలని స్పష్టం చేసింది. ఫ్లాట్లు, ప్లాట్ల కొనుగోలు చేసే వారి ప్రయోజనాలను కాపాడటమే 'రెరా'లక్ష్యమని సంస్థ చైర్మన్ సత్యనారాయణ చెప్పారు. కొనుగోలుదారుల ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా సాగే నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

వ్యాజ్యాల దాఖలులో ఆలస్యం సరికాదు

ఐఎంజీ భూకేటాయింపులపై సీబీఐ విచారణకు ఆదేశించలేం: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఐఎంజీ అకాడెమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంజీబీపీఎల్)కు 850 ఎకరాల భూ కేటాయింపుపై సీబీఐ విచారణకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. భూకేటాయింపును రద్దుచేస్తూ 2006లో ప్రభుత్వం జీవో ఇచ్చిందని.. 2012లో భూకేటాయింపులో అక్రమాలు జరిగాయంటూ పిల్‌లు దాఖలు చేయడాన్ని తప్పుబట్టింది. వ్యాజ్యాల్లో ఎలాంటి మెరిట్ (అర్హత) లేదంటూ కొట్టివేసింది. ఈ మేరకు 2012లో దాఖలైన రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను కొట్టివేసింది. 'హైదరాబాద్ పరిధిలో రూ.వేల కోట్ల విలువైన (నేటి విలువ ప్రకారం రూ.లక్ష కోట్లు) 850 ఎకరాల ప్రభుత్వ భూములను కారుచౌకగా ఓ బోగస్ కంపెనీకి నాటి చంద్రబాబు ప్రభుత్వం కేటాయించింది. దీని వెనుక చంద్రబాబు సర్కార్ పెద్దలు ఉన్నారు. వారెవరో తేలాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలి'అని కోరుతూ సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్, న్యాయవాది శ్రీరంగారావు తదితరుల తరఫున న్యాయవాదులు రఘునాథ్ రావు, గాడిపల్లి మల్లారెడ్డి హైకోర్టులో 2012లో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు వినింది. 'ఓ రాజకీయ పార్టీ నేత అయినంత మాత్రాన పిటిషన్ దాఖలు చేసేందుకు అనర్హుడని చట్టంలో ఎక్కడా చెప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వం 2007లో సీబీఐ విచారణ కోరిన విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సీబీఐ విచారణ కోరుతూ గతంలో రాసిన లేఖకు ప్రభుత్వం ఇప్పటికీ కట్టుబడి ఉందని ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది దివ్య ఆడెపు వెల్లడించారు. కోర్టు ఆదేశిస్తే సీబీఐ విచారణకు సిద్ధమని కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ పేర్కొన్నారు. పిటిషన్లను కొట్టివేయాలని మాజీ మంత్రి పి.రాములు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదించారు. సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం గత వారం తీర్పు రిజర్వు చేసి.. బుధవారం వెలువరించింది.

సీఎం సహాయ నిధికి పోలీసుల విరాళం


ఒకరోజు వేతనం రూ. 11.06 కోట్లు అందజేత



ఉద్యోగుల తరఫున సీఎంకు చెక్ అందజేస్తున్న డీజీపీ జితేందర్. చిత్రంలో రవిగుప్తా తదితరులు

సాక్షి, హైదరాబాద్: వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి పోలీసులు విరాళం అందించారు. ఉద్యోగుల ఒకరోజు వేతనం రూ.11,06,83,571 పోలీసు అధికారుల సంఘం తరఫున, డీజీపీ జితేందర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కును అందించారు. పోలీస్ అకాడమీలో పాసింగ్ ఔట్ కార్యక్రమంలో భాగంగా హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తా, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, పోలీస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సైనిక్ స్కూళ్ల తరహాలో పోలీసు ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక స్కూళ్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం తరఫున రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి, వెల్ఫేర్ లైజన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయనిధికి పవన్‌కల్యాణ్ రూ.కోటి విరాళం



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్ అందజేస్తున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సహాయ నిధికి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూ.కోటి విరాళం అందించారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి చెక్కును అందజేశారు. అలాగే వరద బాధితుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ తన ఒక నెల వేతనం విరాళంగా ప్రకటించారు. బుధవారం సెక్రటేరియట్‌లోని ముఖ్యమంత్రి సహాయ నిధి కార్యాలయంలోని సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్‌ను కలిసి చెక్కును అందజేశారు.

నేడు అమిత్ షాతో సీఎం భేటీ

> వరద సాయం త్వరగా అందించాలని కోరనున్న ముఖ్యమంత్రి
> ప్రధాని అపాయింట్‌మెంట్‌నూ కోరిన సీఎంవో వర్గాలు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. రాష్ట్రంలో వరదల కారణంగా జరిగిన నష్టాన్ని కేంద్ర ప్రభుత్వ పెద్దలకు వివరించి, వీలున్నంత త్వరగా సాయం అందించాలని కోరనున్నారు. అందులో భాగంగా గురువారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ముఖ్యమంత్రి సమావేశమవుతారని సీఎంవో వర్గాలు తెలిపాయి. ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ కూడా సీఎంవో అడిగిందని, అది ఖరారైతే ప్రధాని మోదీని కూడా కలిసి వరద సాయం గురించి విజ్ఞప్తి చేస్తారని తెలుస్తోంది. ఢిల్లీలో అందుబాటులో ఉన్న కాంగ్రెస్ పార్టీ పెద్దలను సైతం రేవంత్ కలుస్తారని, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను కలిసి మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయాల్లో గ్రీన్‌సిగ్నల్ తీసుకుంటారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఢిల్లీకి మహేశ్‌కుమార్ గౌడ్: టీపీసీసీ కొత్త అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ బుధవారం రాత్రి ఢిల్లీ వెళ్లారు. గురువారం పార్టీ పెద్దలను కలిసి తనను పీసీసీ అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలుపనున్నారు.

ఉత్పాదక రంగంలో అగ్రగామిగా నిలిపేలా మేకిన్ తెలంగాణ

ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాన్ని ఉత్పాదక రంగంలో అగ్రగామిలా నిలిపేలా మేక్ ఇన్ తెలంగాణ భావనను పెంపొందించాల్సిన అవసరముందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. దేశీయ మార్కెట్లో తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ ఉండేలా నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ 38వ వార్షిక సదస్సును బేగంపేటలో ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. పరిమాణంపైనే కాకుండా నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తే దేశమంతా మనవైపు చూస్తుందని శ్రీధర్‌బాబు తెలిపారు. కృత్రిమ మేధ వినియోగంపై ఉద్యోగులు, కార్మికులకు అవగాహన కల్పిస్తామన్నారు. కృత్రిమ మేధను మనం అందిపుచ్చుకుని దేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలని కోరారు. ఉద్యోగుల సృజనను వెలికితీసి ఉత్పాదకతను పెంచేందుకు క్వాలిటీ ఫోరం చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. క్యాంపస్ టు కార్పొరేట్ అనే మాడ్యూల్ శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. క్వాలిటీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలకు సహకరించిన ఈసీఐఎల్, ఎన్ఎండీసీ, ఆర్టీసీ, థర్మోప్యాడ్స్, థర్మోకేబుల్స్, ఉషా ఇంటర్నేషనల్, టాటా గ్రూప్, రేణుకా ప్లాస్టిక్, తోషిబా, రామ్ కో, కేసీపీ, హెచ్ఏఎల్, మిధాని, బీఈఎల్ సంస్థలకు మంత్రి బహుమతులు అందజేశారు.

చెరువుల్ని వదలకుంటే చెరసాలకే!

▶ మొదటి పేజీ తరువాయి

పరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన పల్లి భాగ్యశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సీఎం ప్రసంగించారు.

డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

'పోలీస్ ఉద్యోగాన్ని కేవలం ఉద్యోగ బాధ్యతగా మాత్రమే కాదు.. రాష్ట్ర ప్రజలను కాపాడే ఉద్యోగంగా, భావోద్వేగంతో చూడాలి. ప్రకృతి విపత్తులైనా, శాంతిభద్రతల సమస్యలైనా, ఏ ఇతర సమస్య వచ్చినా ముందుగా అందుబాటులో ఉండేది పోలీసులే. ఆ మేరకు ప్రజల్లో విశ్వాసాన్ని, పోలీసులపై గౌరవాన్ని పెంచేలా పనిచేయాలి. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిపై ఉక్కు పాదం మోపాలి. సైబర్ నేరాలకు తావులేకుండా యువ పోలీస్ అధికారులు పనిచేయాలి. డ్రగ్స్, గంజాయి పేరు వింటేనే వెన్నులో వణుకు పుట్టాలి. ఆక్రమణల కూల్చివేతలు, డ్రగ్స్ కట్టడి సహా ప్రభుత్వ అన్ని నిర్ణయాలను అమలు చేయాల్సిన బాధ్యత యువ అధికారులపై ఉంది. కాస్మెటిక్ పోలీసింగ్ కాదు.. కాంక్రీట్ పోలీసింగ్ అవసరం. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది బాధితులతోనే.. నేరస్తులతో కాదు. మీ అందరినీ చూస్తోంటే తెలంగాణ డ్రగ్స్ రహితంగా మారుతుందన్న విశ్వాసం కలుగుతోంది..'అని సీఎం అన్నారు.

రెండు రెసిడెన్షియల్ పోలీస్ స్కూళ్లు

'సైనిక్ స్కూళ్ల మాదిరిగా హైదరాబాద్, వరంగల్‌లో ఒక్కొక్కటి 50 ఎకరాలతో రెండు రెసిడెన్షియల్ పోలీస్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం. హోంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకు ఉచితంగా చదువుకునే ఏర్పాటు చేస్తాం. ఇందుకు సంబంధించి డీజీపీ జితేందర్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి చర్యలు తీసుకోవాలి..'అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఏడాది చివర్లో కొత్తగా 35 వేల ఉద్యోగాలు

'కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడులు తీసుకురావడమే కాదు.. రైతన్నలు, నేతన్నలు, గీతన్నలను ఆదుకుంటోంది. కేవలం 28 రోజుల్లోనే 22.22 లక్షల రైతుల ఖాతాల్లో రూ.18 వేల



ఎస్ఐల దీక్షాంత్ పరేడ్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి గ్రూప్ ఫొటో. చిత్రంలో డీజీపీ జితేందర్, పోలీస్ ఉన్నతాధికారులు రవి గుప్తా, సీవీ ఆనంద్, సందీప్ శాండిల్య, అభిలాష బిస్త్ తదితరులు

కోట్లు వేసి రుణమాఫీ చేశాం. తెలంగాణ వచ్చినా గత తొమ్మిదేళ్లలో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదు. గతంలో జిరాక్స్ సెంటర్లలో టీజీపీఎస్సీ ప్రశ్నపత్రాలు లభించే దారుణ పరిస్థితి ఉండేది. మా ప్రజా ప్రభుత్వంలో నిర్వహిస్తున్న ఉద్యోగ పరీక్షలపై నిరుద్యోగులకు ఎలాంటి అనుమానాలు లేవు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. గ్రూప్–2 పరీక్ష వాయిదా వేసి నిరుద్యోగులకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. ఏడాది చివరికి కొత్తగా 35 వేల ఉద్యోగాలు ఇస్తాం..' అని ముఖ్యమంత్రి వెల్లడించారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలు కాపాడడంలో, ప్రజలకు న్యాయం చేయడంలో ఎస్ఐల పాత్ర కీలకం అని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని పొందేలా పనిచేయాలని యువ అధికారులకు సూచించారు. కాగా పోలీస్ అకాడమీలో శిక్షణకు సంబంధిత వివరాలను పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇతర సీనియర్ అధికారులు, యువ ఎస్ఐల కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్.ఐయామ్ ఆన్ డ్యూటీ
13వ పేజీలో...

ప్రతి పేద విద్యార్థికి ఉచితంగా కార్పొరేట్ విద్య

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకే సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. గురుకుల విద్యా సంస్థలను ఒకే చోటుకు చేర్చి కార్పొరేట్ పాఠశాల తరహాలో విద్యాబోధన నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం సచివాలయంలో సమీకృత గురుకుల పాఠశాలలు, స్కిల్ యూనివర్సిటీ భవనాల నమూనాలపై సంబంధిత అధికారులతో భట్టి సమీక్ష నిర్వహించారు. సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక సమీకృత గురుకులాన్ని నిర్మించేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు వివరించారు. జిల్లాల వారీగా స్థలాల గుర్తింపు ప్రక్రియ పురోగతిని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు ఉంటాయన్నారు. విద్యతోనే జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, విద్యపై పెట్టే ఖర్చు దేశ భవిష్యత్తుకు పెట్టుబడిగా భావిస్తున్నామని భట్టి పేర్కొన్నారు. సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎస్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి, గిరిజన గురుకుల సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక మంత్రుల సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: కేరళ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆర్థిక మంత్రుల సదస్సులో పాల్గొనేందుకు ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం తిరువనంతపురం వెళ్లారు. గురువారం ఉదయం 11 గంటలకు హయత్‌రీజెన్సీ హోటల్‌లో ఈ సదస్సును కేరళ సీఎం పినరయి విజయన్ ప్రారంభించనున్నారు. ఈ సదస్సుకు తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ ఆర్థిక మంత్రులు, కేరళ ప్రతిపక్ష నాయకుడు సతీశన్, ఆ రాష్ట్రానికి చెందిన మంత్రులు, అధికారులు, ఆర్థిక నిపుణులు హాజరుకానున్నారు. ఈ సదస్సు నుద్దేశించి సమకాలీన ఆర్థికాంశాలు, రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం మధ్య సమన్వయం తదితర అంశాలపై భట్టి విక్రమార్క ప్రసంగించనున్నారు.

60 రోడ్లు.. 1,712 కిలోమీటర్లు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణంపై ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా 352 కిలోమీటర్ల మేర విస్తరించి ఉండే.. రీజనల్ రింగ్ రోడ్డులో భాగంగా 1,712 కిలోమీటర్ల పొడవునా మొత్తం 60 రేడియల్ రోడ్లను నిర్మించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో తొలి, రెండో దశలో 1,281 కిలోమీటర్ల మేర 32 రేడియల్ రోడ్లను, మూడో దశలో 28 లింక్ రోడ్లను నిర్మించాలని నిర్ణయించింది.

200 అడుగుల వెడల్పుతో..


రేడియల్ రోడ్లు 200 అడుగుల వెడల్పుతో ఉంటాయి. ప్రధాన రేడియల్ రోడ్ వంద అడుగులు కాగా.. భవిష్యత్తు అవసరాల కోసం దానికి ఇరువైపులా 50 అడుగుల చొప్పున బఫర్‌గా ఉంచుతారు. ఉత్తర భాగంలో తూప్రాన్–గజ్వేల్–చౌటుప్పల్‌లను కలుపుతూ 158 కిలోమీటర్లు, దక్షిణ భాగంలో చౌటుప్పల్–షాద్‌నగర్–సంగారెడ్డిలను కలుపుతూ 194 కిలోమీటర్ల మేర రీజనల్ రోడ్డు ఉండనుంది.

లీ అసోసియేట్స్‌కు 10 రేడియల్ రోడ్లు

ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన, సాంకేతిక సేవల బాధ్యతలను కెనడాకు చెందిన లీ అసోసియేట్స్ సౌత్ ఏషియా సంస్థకు అప్పగించింది. ఉత్తర భాగంలో ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్‌ను కలిపేందుకు 10 రేడియల్ రోడ్ల నిర్మాణ పనులను ఈ సంస్థకు అప్పగించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే ఈ సంస్థ హెచ్ఎండీఏ, టీజీఆర్డీసీ, ఓఆర్ఆర్ రోడ్ల నిర్మాణం, మాస్టర్ ప్లాన్ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసింది.

రీజనల్ రింగ్ రోడ్‌లో నిర్మించే రేడియల్ రోడ్ల స్వరూపమిదీ

మూడు దశల్లో రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం



మూడు దశల్లో రేడియల్ రోడ్ల స్వరూపమిదీ:

ఫేజ్-1:

రేడియల్ రోడ్ల సంఖ్య: 16 ; రోడ్ల పొడవు: 748 కి.మీ.

- 5 రేడియల్ రోడ్లు ఓఆర్ఆర్ నుంచి రీజనల్ రింగ్‌రోడ్డుకు అనుసంధానమై ఉంటాయి. మిగతా 11 రేడియల్ రోడ్లలో 9 జాతీయ రహదారులు, 2 రాష్ట్ర రహదారులను కలుపుతూ ట్రిపుల్ ఆర్, ఓఆర్ఆర్ గుండా సాగుతాయి.
- ఓఆర్ఆర్‌తో అనుసంధానమయ్యే రోడ్లలో.. యాద్గార్‌పల్లి నుంచి ఇటిక్యాల వరకు, కీసర నుంచి దత్తాయిపల్లి, నాగులపల్లి నుంచి మందాపూర్, నార్సింగి నుంచి చీమలదరి, రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబరు-17 నుంచి కంకాల్ వరకు నిర్మించనున్నారు. అలాగే హైదరాబాద్ మీదుగా వెళ్లే మెదక్, నాగ్‌పూర్, ముంబై, వికారాబాద్, బెంగళూరు, శ్రీశైలం, విజయవాడ, మందాపురం, వరంగల్ జాతీయ రహదారులను, నాగార్జునసాగర్, కరీంనగర్ రాష్ట్ర రహదారులను కలుపుతూ ట్రిపుల్ ఆర్ సాగుతుంది.

ఫేజ్-2:

రేడియల్ రోడ్ల సంఖ్య: 16 ; రోడ్ల పొడవు: 533 కి.మీ.

- ఇందులో ఫ్యూచర్ సిటీ భవిష్యత్తు అవసరాల నిమిత్తం రావిర్యాల నుంచి ఆమన్‌గల్ వరకు 41.5 కిలోమీటర్ల మేర 300 ఫీట్ల వెడల్పుతో గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ ఉంటుంది.
- ఇక ఆదిబట్ల నుంచి తుర్కాలకుంట వరకు.. కోహెడ నుంచి కోతులాపురం.. పెద్ద అంబర్‌పేట నుంచి మందోళ్లగూడెం.. కొర్రెముల నుంచి ఎర్రంబెల్లి.. పడమట సాయిగూడ నుంచి దాతర్‌పల్లి.. ధర్మవరం నుంచి చేబర్తి.. మునీరాబాద్ నుంచి రంగంపేట.. ఓఆర్ఆర్ ఇంద్రజీత్ మెహతా నుంచి తియల్పూర్.. ఎగ్జిట్ నంబర్-4ఏ నుంచి కాసాల.. ఎగ్జిట్ నంబర్-4 నుంచి శివంపేట.. కర్దనూరు నుంచి గోపులారం.. వెలిమల నుంచి తేలుపోల్.. జన్వాడ ఎస్ఆర్ఆర్‌సీ క్రికెట్ గ్రౌండ్ నుంచి అక్నాపూర్.. ఎగ్జిట్ నంబర్-15 నుంచి మధురాపూర్.. ఎగ్జిట్ నంబరు-15 నుంచి కేశంపేట వరకు రేడియల్ రోడ్లు ఉంటాయి.

ఫేజ్-3:

లింక్ రోడ్ల సంఖ్య: 28 ; రోడ్ల పొడవు: 431 కి.మీ.

- ఫేజ్-1 లేదా ఫేజ్-2లను కలుపుతూ ట్రిపుల్ ఆర్ వరకు ఉంటాయి.
- ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్‌లను కలుపుతూ 18 లింక్ రోడ్లు. అలాగే ఓఆర్ఆర్, గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల నుంచి జాతీయ, రాష్ట్ర రహదారులను అనుసంధానం చేస్తూ 10 లింక్ రోడ్లు ఉంటాయి.
- రావిర్యాల నుంచి గుమ్మడవల్లి.. మాల్ నుంచి వట్టిపల్లి.. గున్‌గల్ నుంచి కొత్తాల.. ఇబ్రహీంపట్నం నుంచి జనగాం.. కొత్తూరు నుంచి చౌలపల్లి.. తుక్కుగూడ నుంచి మహేశ్వరం మీదుగా తలకొండపల్లి.. నేదునూరు క్రాస్ రోడ్ నుంచి చీపునుంతల.. కడ్తాల్ నుంచి చుక్కాపూర్.. రూప్‌సింగ్ తండా నుంచి పాంబండ.. ఇలా లింక్ రోడ్లు నిర్మిస్తారు.

క్లుప్తంగా...

మండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ప్రతిపక్షనాయకుడిగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారిని గుర్తిస్తూ అసెంబ్లీ సెక్రటరీ నర్సింహాచార్యులు బుధవారం బులెటిన్ విడుదల చేశారు. ఈ ఏడాది జూలై 25న మండలిలో బీఆర్ఎస్ పక్ష నేతగా మధుసూదనాచారిని పార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. ఆయన్ను ఎల్‌ఓపీ లీడర్‌గా గుర్తించాలని అసెంబ్లీ కార్యదర్శికి లేఖ ఇచ్చారు.

నేడు ఈడీని కలవనున్న బీఆర్ఎస్ బృందం

సాక్షి, హైదరాబాద్: సివిల్ సప్లయ్స్‌శాఖలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం ఈడీని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పౌర సరఫరాల శాఖలో జరిగిన అవినీతికి సంబంధించి ఆధారాలను ఈడీ అధికారులకు బీఆర్ఎస్ నేతలు అందజేయనున్నారు. టెండర్ల ధరకంటే అదనంగా మిల్లర్ల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆ డబ్బును విశాఖపట్నంలో దాస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఢిల్లీకి డబ్బులు ఇవ్వనివారిని డిఫాల్టర్స్ చేస్తామని బెదిరిస్తున్నారని, రాష్ట్రంలో బ్రూ ట్యాక్స్ చెల్లించిన వారికే క్లియరెన్స్ ఆర్డర్స్ ఇస్తున్నారని తెలిపింది. సన్న బియ్యం, ధాన్యం కొనుగోలు కోసం పిలిచిన గ్లోబల్ టెండర్లలో అవకతవకలు జరిగాయని, రూ.వందల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డ కాంగ్రెస్‌పై విచారణ చేయాలనే డిమాండ్‌తో ఈడీని కలవనుంది.

ఒక్కో పోలింగ్ బూత్‌లో వెయ్యి మంది ఓటర్లే

సాక్షి, హైదరాబాద్: ఒక్కో పోలింగ్ బూత్‌లో వెయ్యి మంది ఓటర్ల వరకే ఉండేలా చూడాలని బీఆర్ఎస్ పార్టీ కోరింది. బుధవారం ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఆల్ పార్టీ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు శశిధర్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, పల్లె రవికుమార్‌గౌడ్, చిరుమిల్ల రాకేశ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ సీఈవో సుదర్శన్‌రెడ్డి దృష్టికి పలు విషయాలు తీసుకెళ్లారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. జీహెచ్ఎంసీ పరిధిలో పోలింగ్ సరళి తక్కువగా ఉంటుందని, ఓటర్లకు పోలింగ్ బూత్‌లు దూరంగా ఉన్నాయని చెప్పారు.

కుక్కకాటుకు బలవుతున్నా మొద్దునిద్ర

పసికందులను పీక్కుతింటున్నా ప్రభుత్వం స్పందించడం లేదు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చిన్నారులు కుక్కకాటుకు బలవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడటం లేదని మాజీమంత్రి టి.హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పసికందులను కుక్కలు పీక్కుతింటున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ ఏడాది 60 వేలకు పైగా కుక్కకాటు ఘటనలు నమోదు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ మేరకు బుధవారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు.యాంటిరేబిస్ ఇంజెక్షన్లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో పెట్టడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. 'పట్టణాలు, పల్లెల్లో పారిశుధ్యం లేక వీధికుక్కల బెడద తీవ్రమైంది. రాష్ట్రంలో 20 లక్షల వీధి కుక్కలు ఉండగా, వీటిలో 10 లక్షలు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉన్నాయి. వాటి సంతాన నియంత్రణకు స్టెరిలైజేషన్‌కు నిధులు విడుదల చేయడం లేదు. హైకోర్టు మందలించినా ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ ప్రకటించడం లేదు. కుక్కల నియంత్రణకు గోవాతోపాటు ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతులను అధ్యయనం చేయాలి. హరియాణా, పంజాబ్ రాష్ట్రాల తరహాలో కుక్కకాటుతో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల పరిహారం చెల్లించాలి'అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వల్లే జిల్లాకో మెడికల్ కాలేజీ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. తెలంగాణ ఆవిర్భావం నాటికి కేవలం ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా, 9 ఏళ్లలో కేసీఆర్ ప్రభుత్వం మరో 29 కాలేజీలు ఏర్పాటు చేసిందన్నారు.

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు దెబ్బ

నర్సాపూర్: సీఎంరేవంత్‌రెడ్డి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను హత్య చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులందరికీ రుణమాఫీ చేయలేదని, 50 శాతం రైతులకే చేసి మిగిలిన రైతులను, ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులకు వసతులు కల్పించకుండా మోసం చేశారన్నారు. పారిశుధ్య సిబ్బందికి జీతాలు లేక, లబ్ధిదారులకు పింఛన్లు పెంచకుండా మోసం చేశారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రచారానికి వాల్మీకి స్కామ్ డబ్బు

- నిధులను దారిమళ్లించిన నేతలను శిక్షించాలి: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో గిరిజన సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన సొమ్మును కాంగ్రెస్ తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం వాడుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపించారు. వాల్మీకి స్కామ్‌గా చెప్తున్న ఈ కుంభకోణంలో నిధులను దారి మళ్లించి వాడుకున్న కాంగ్రెస్ నేతలను శిక్షించాలని బుధవారం 'ఎక్స్'వేదికగా ఆయన డిమాండ్ చేశారు. 'వాల్మీకి కుంభకోణంలో కాంగ్రెస్ నేత, కర్ణాటక మాజీ మంత్రి బి.నాగేంద్రను కీలక సూత్రధారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన చార్జిషీట్‌లో నిర్ధారించింది. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన రూ.187 కోట్లు కాంగ్రెస్ మంత్రి చేతుల మీదుగా దారి మళ్లాయి. ఆ సొమ్మును తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇటీవలి లోక్‌సభ ఎన్నికల కోసం ఉపయోగించింది. ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉపయోగించిన రూ.20 కోట్ల నగదు కాంగ్రెస్ కీలక నాయకుడి అనుచరుడిదే అని తేలింది. ఈ స్కామ్‌లో హైదరాబాద్‌కు చెందిన బిల్డర్ సత్యనారాయణ వర్మ ప్రధాన నిందితుడు. తెలంగాణకు చెందిన ఇద్దరు కీలక కాంగ్రెస్ నేతలకు సత్యనారాయణ వర్మ అత్యంత సన్నిహితుడు. ఇతనికి సంబంధించిన వ్యాపారంలోనూ ఇక్కడి కాంగ్రెస్ నేతలు భాగస్వాములుగా ఉన్నట్టు అనుమానాలు ఉన్నాయి. అవినీతిని పెంచి పోషించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే కాంగ్రెస్ అసలు సిసలు నైజం. దర్యాప్తు సంస్థలు వాల్మీకి స్కామ్‌లో నిజాలు నిగ్గు తేల్చి దోషులను కఠినంగా శిక్షించాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు. లోతుగా విచారణ జరిపితే తెలంగాణ కాంగ్రెస్‌లోని పెద్ద నాయకుల పేర్లు బయటకు వస్తాయని అన్నారు.

'నారీ న్యాయ్'కు ఇదేనా నిర్వచనం?

'సంచలనం సృష్టించిన కథువా రేప్ కేసులో నిందితులకు మద్దతుగా నిలిచిన లాల్ సింగ్ అనే వ్యక్తికి కాంగ్రెస్ అసెంబ్లీ టికెట్ ప్రకటించడం సిగ్గుచేటు. నారీ న్యాయ్ అంటూ గొప్పలు చెప్పే కాంగ్రెస్ రేపిస్టులను సమర్థించిన వ్యక్తికి సీటును కేటాయించింది. 'నారీ న్యాయ్'కు కాంగ్రెస్ చెప్పే నిర్వచనం ఇదేనా?' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

2028లో తెలంగాణలో బీజేపీదే అధికారం



- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా
- మా విజయాన్ని రేవంత్, కేసీఆర్, ఒవైసీ అడ్డుకోలేరు
- జీహెచ్ఎంసీ మేయర్ పదవినీ కైవసం చేసుకుంటాం

రాయదుర్గం (హైదరాబాద్): రాష్ట్రంలో 2028లో బీజేపీని అధికారంలోకి తీసుకొస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈసారి జరిగే ఎన్నికలు బీజేపీ గెలుపే లక్ష్యంగా ఉంటాయని, వార్ వన్‌సైడ్ ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి పోటీచేస్తాయని, అయినా బీజేపీకి తిరుగుండదని చెప్పారు. తమ విజయాన్ని రేవంత్ రెడ్డి, కేసీఆర్, ఒవైసీ అడ్డుకోలేరని, ఎంఐఎం పార్టీని ఆనవాళ్లు లేకుండా చేస్తామన్నారు. ఎంఐఎంను తెలంగాణ నుంచి తరిమికొడతామని పేర్కొన్నారు. ఏదేమైనా వచ్చే ఎన్నికల్లో అటు రాష్ట్రంలో, ఇటు జీహెచ్ఎంసీలో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బండి సంజయ్ శేరిలింగంపల్లిలోని గోలిదొడ్డిలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలను ప్రజలు మర్చిపోయేలా చేసేందుకు హైడ్రాతో హైడ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం బీజేపీ నాయకులపై అనేక కేసులు పెట్టిందని, రౌడీషీట్లు ఓపెన్ చేసిందని చెప్పారు. తనపై 109 కేసులు పెట్టారని, 14 సార్లు జైలుకు పంపారన్నారు. అలాంటి కేసీఆర్‌ను వదిలిపెడ్తామా అని ధ్వజమెత్తారు.

రాష్ట్రంలో 50 లక్షల మందికి సభ్యత్వం

దేశంలో 10 కోట్ల మందికి, రాష్ట్రంలో 50 లక్షల మందికి సభ్యత్వం చేయించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని బండి చెప్పారు. ప్రతి రాజకీయ నాయకుడు ఒక్కసారైనా ప్రజాప్రతినిధిగా మారాలని, అందుకోసం పార్టీ సభ్యత్వం చేయించాలన్నారు. హైదరాబాద్‌లో, రంగారెడ్డి జిల్లాలోని 22 డివిజన్లలో అధికంగా చేయించాలనే తపనతో అందరూ పోటీ పడాలని పిలుపునిచ్చారు.

జీవోలు ఇస్తే మెడికల్ కాలేజీలు వస్తాయా?: దామోదర



సాక్షి, హైదరాబాద్: రాజకీయ లబ్ధి కోసం ఎన్నికలకు ముందు జీవోలు విడుదల చేసినంత మాత్రాన మెడికల్ కాలేజీలు రావని మాజీ మంత్రి హరీశ్‌రావుకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కౌంటర్ ఇచ్చారు. 'హరీశ్‌రావ్.. మీరు ఇచ్చిన జీవోలో అంకెలు తప్ప, కాలేజీలు నడిపేందుకు కనీస సౌకర్యాలు లేవు. కాలేజీలకు అనుబంధంగా 220 బెడ్ల ఆసుపత్రులు అవసరమైతే, కనీసం ఒక్క పడక కూడా మీ ప్రభుత్వం వేయలేదు. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవసరమైన నిధులు కేటాయించి, వంద బెడ్ల దవాఖానాలను, నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా 220 పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేశాం. దశాబ్దకాలంలో మీరు నాశనం చేసిన వ్యవస్థను గాడిన పెట్టేందుకు బదిలీలు చేశాం. అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లను, ప్రొఫెసర్లను నియమించాం. ల్యాబొరేటరీలు, డయాగ్నోస్టిక్స్ ఎక్విప్‌మెంట్ సమకూర్చాం. ఇవన్నీ చేశాం కాబట్టే కాలేజీలకు అనుమతులు వచ్చాయి. ఉస్మానియా కొత్త దవాఖానాను నిర్మించబోతున్నాం. గాంధీ కాలేజీ విద్యార్థుల కోసం హాస్టల్ భవనం మంజూరు చేశాం. ఇప్పటికైనా రాజకీయాల కోసం అబద్ధాలు, అసత్యాలు చెప్పడం మానండి'అని హరీశ్‌రావుకు దామోదర రాజనర్సింహ గట్టి కౌంటర్ ఇచ్చారు.

అనర్హత పిటిషన్ల విచారణ షెడ్యూల్ ప్రకటించండి

- హైకోర్టు ఆదేశాల మేరకు కాలయాపన చేయకుండా చర్యలు తీసుకోండి
- అసెంబ్లీ కార్యదర్శిని కోరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్, వివేక్
- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు చీర, గాజులు పంపుతామని కౌశిక్ వ్యాఖ్యలు



మీడియా సమావేశంలో చీర, గాజులు చూపుతున్న పాడి కౌశిక్‌రెడ్డి


సాక్షి, హైదరాబాద్: ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసేందుకు కాలయాపన చేయకుండా వెంటనే చర్యలు ప్రారంభించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఇద్దరు ఎమ్మెల్యేలు బుధవారం అసెంబ్లీ కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందజేశారు. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా తాము ఇచ్చిన అనర్హత పిటిషన్లను స్పీకర్ ముందు పెట్టి షెడ్యూల్ నిర్ణయించాలంటూ లేఖను ఇచ్చారు. అనంతరం తెలంగాణ భవన్‌లో వివేకానంద్, కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి మోసం చేసి తడిబట్టతో గొంతు కోశారు. పార్టీలో చేరితే పదవులు ఇస్తానని పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలకు రేవంత్ రాజకీయంగా సమాధి కట్టారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు తిరిగి బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమైతే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో విందు సమావేశం పెట్టి బెదిరింపులకు దిగారు. తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళితే అనర్హులుగా ప్రకటించేలా చూస్తానని భయపెట్టారు. హైకోర్టు తీర్పుతో ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఆగం అవుతున్నారు'అని వివేకానంద్ అన్నారు. 'మంత్రి శ్రీధర్ హైకోర్టు తీర్పును వక్రీకరణలతో అగౌరవపరుస్తున్నారు. పీఏసీ చైర్మన్ ఎన్నిక విషయంలో హరీశ్‌రావు నామినేషన్ ఏమైందో చెప్పాలి. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు చెప్పాలి'అని వివేక్ వ్యాఖ్యానించారు.

చీర, గాజులు వేసుకుని తిరగండి: కౌశిక్‌రెడ్డి

'ఉప ఎన్నికలు వస్తాయని తెలిసి పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలకు చీర, గాజులు కానుకగా పంపిస్తున్నా. పదవులకు రాజీనామా చేయడం చేతకాకపోతే ఇవి వేసుకుని తిరగండి. మీరు మొగోళ్లు అయితే పదవులకు రాజీనామా చేసి ప్రజల్లోకి రండి. పార్టీ మారలేదంటున్న అరికెపూడి గాంధీ ఒరిజినల్ గాంధీ కాదు.. నకిలీ గాంధీ. పూటకో పార్టీ మార్చే దానం నాగేందర్ బిచ్చగాడు, చీటర్. కడియం శ్రీహరి ఉదయం కేసీఆర్ దగ్గర బ్యాగులు తీసుకుని సాయంత్రం కాంగ్రెస్‌లో చేరాడు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు హైకోర్టు తీర్పు తర్వాత గజగజ వణుకుతున్నారు'అని కౌశిక్‌రెడ్డి అన్నారు.

చీర, గాజులు కేసీఆర్‌కు పంపు

- మహిళలను అవమానిస్తే ఊరుకోం.. పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ మహిళా నేతల ధ్వజం
- ప్రెస్‌మీట్‌లో బూటు చూపించిన మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి



మీడియా సమావేశంలో బూటు చూపుతున్న శోభారాణి

సాక్షి, హైదరాబాద్: ఫిరాయింపు ఎమ్మెల్యేలకు చీర, గాజులు పంపుతున్నానంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మహిళా నేతలు ధ్వజమెత్తారు. మహిళలను అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యేగా గెలిచిన పాడి కౌశిక్‌రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, మహిళలను అవమానిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి మాట్లాడారు. తెలంగాణ మహిళలకు పోరాట స్ఫూర్తి ఉందని, అలాంటి మహిళలను అవమానిస్తూ చీర, గాజులు చూపించి తక్కువ చేసి మాట్లాడటం సరైంది కాదన్నారు. తెలంగాణలో ఫిరాయింపులు మొదలుపెట్టిందే కేసీఆర్ అని, కౌశిక్‌రెడ్డి చీర, గాజులు పంపాలంటే మొదట కేసీఆర్‌కు పంపాలని దుయ్యబట్టారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుని విచారణకు పిలవాలని కోరారు. కౌశిక్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, ఆయన్ను సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరతామని చెప్పారు.

పాడె ఎక్కే సమయం వచ్చింది: ఆర్యవైశ్య

కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత మాట్లాడుతూ పాడి కౌశిక్‌రెడ్డికి పాడె ఎక్కే సమయం వచ్చిందని ఎద్దేవా చేశారు. భార్యాబిడ్డలను అడ్డుపెట్టుకుని, చనిపోతామని బెదిరించి ఎన్నికల్లో గెలిచిన ఆయన పతివ్రతా శిరోమణిలాగా మాట్లాడుతున్నారన్నారు. మహిళలకు క్షమాపణలు చెప్పకపోతే బయట తిరగనివ్వబోమని హెచ్చరించారు. పీసీసీ అధికార ప్రతినిధి బొజ్జా సంధ్యారెడ్డి మాట్లాడుతూ చీర, గాజులు పంపాల్సింది కేసీఆర్, కేటీఆర్‌లకేనని అన్నారు. వంట చేసిన చేతులతోనే పాడె కట్టే శక్తి కూడా మహిళలకు ఉందని గుర్తుంచుకోవాలని చెప్పారు. మహిళలను కించపర్చే విధంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడినందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని అధికార ప్రతినిధి భవానీరెడ్డి డిమాండ్ చేశారు. కాగా, మహిళలను అవమానిస్తే ఊరుకునేది లేదంటూ విలేకరుల సమావేశంలో మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి తన కాలుకు ఉన్న బూటు తీసి చూపించడం గమనార్హం.

సాక్షి

గురువారం, 12 సెప్టెంబర్ 2024

ఆసక్తికరమైన పోరు

జమ్మూ– కశ్మీర్‌లో తొలి విడత పోలింగ్‌కు మరొక్క వారమే మిగిలింది. హర్యానాలో నామినేషన్ల దాఖలుకు గడువు నేటితో ముగియనుంది. ఈ పరిస్థితుల్లో కశ్మీర్‌లో ప్రచారం ఊపందుకుంటుంటే, హర్యానాలో అభ్యర్థుల ఖరారు తుది అంకానికి చేరింది. కశ్మీర్‌ను అటుంచితే... కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ల మధ్య సీట్ల సర్దుబాటు విఫలమవడంతో హర్యానా ఆసక్తి రేపుతోంది. బహుముఖ పోటీ అనివార్యమయ్యేసరికి పరిస్థితి సంక్లిష్టంగా మారింది. ఆప్ ఒంటరి పోరుకు దిగడమే కాక, మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో కలాయత్ లాంటి చోట్ల గెలిచిన ఊపుతో, సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న స్థానాల్లో అభ్యర్థుల్ని నిలిపి, పట్టణ ప్రాంతాలకే కాక మిగతా చోట్లకూ తన ఉనికిని విస్తరించుకోవాలని సాహసిస్తోంది. వీధికెక్కి పోరాడినా, లైంగిక వేధింపుల సమస్యను పరిష్కరించని కేంద్ర సర్కార్ వైఖరితో విసిగిన రెజ్లర్లు వినేశ్ ఫోగట్, బజరంగ్ పూనియాలు కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయం మరింత వేడెక్కింది. మహిళా రెజ్లర్లపై జనంలో సానుభూతి, పాలకుల నిర్లక్ష్యంతో రైతుల ఆగ్రహం, జాట్లు సహా వివిధ వర్గాల్లో అసంతృప్తి మధ్య అధికార బీజేపీ ఎదురీదుతోంది.

మొత్తం 90 స్థానాలకు గాను కాషాయపార్టీ ఇప్పటికే 87 స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించింది. మిగతా 3 స్థానాలను హర్యానా లోక్‌హిత్ పార్టీ (హెచ్‌ఎల్పీ) లాంటి చిరు మిత్రపక్షాల కోసం అట్టిపెట్టింది. అభ్యర్థుల ప్రకటనపై పార్టీలో తీవ్ర అసంతృప్తి చెలరేగింది. తొలి విడత అభ్యర్థుల జాబితా ప్రకటనతోనే అసంతృప్తి జ్వాలలు రగిలినా, రెండో విడత జాబితా కూడా ప్రకటించేసరికి అది మరింత పైకి ఎగసింది. పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకూ, మంత్రులకూ, మాజీ మంత్రులకూ టికెట్లు నిరాకరించేసరికి సమస్య పెద్దదైంది. పార్టీ రాష్ట్ర శాఖ ఆఫీస్ బేరర్ల మొదలు పలువురు సీనియర్ నాయకులు రాజీనామా చేయడం గమనార్హం. బీజేపీ హర్యానా శాఖ వైస్ ప్రెసిడెంట్టైన మాజీ డిప్యూటీ స్పీకర్, అలాగే రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, కొందరు మంత్రులు, మాజీ మంత్రులు సైతం అసెంబ్లీ టికెట్ దక్కలేదని కినుక వహించి, పార్టీని వీడారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అసలైన కార్యకర్తల్ని నిర్లక్ష్యం చేసి, పనిచేయనివారికీ, అసలు ఆ నియోజకవర్గ పౌరులే కానివారికీ సీట్లు కేటాయిస్తోందని సొంత పార్టీ వారే ఆరోపిస్తున్నారు.

నిజానికి ఇతర వెనుకబడిన కులాలకు (ఓబీసీ) చెందిన నయబ్ సైనీని కొంతకాలం క్రితం సీఎంను చేశాక హర్యానాలో పార్టీ గ్రాఫ్ కొంత పెరిగింది. ఇప్పుడూ సైనీనే సీఎం అభ్యర్థిగా చూపుతూ బీజేపీ ఎన్నికలకు వెళుతోంది. అయితే, ఆచరణలో మాత్రం ఆయన ప్రమేయం పెద్దగా లేకుండానే బీజేపీ టికెట్ల కేటాయింపు ప్రక్రియ జరిగిపోయిందని చెబుతున్నారు. ఏళ్ళ తరబడిగా పార్టీ కోసం పనిచేస్తున్నవారిని కాదని కొత్తవారికీ, ఇతర పార్టీల నుంచి ఫిరాయించి వచ్చిన వారికీ బీజేపీ పట్టం కట్టడం సైతం రేపు ఎన్నికల్లో పార్టీని కొంత దెబ్బ తీయవచ్చు. దానికి తోడు పార్టీలో అంతర్గత విభేదాలు, ఆశావహ సీఎం అభ్యర్థుల తాకిడి ఉండనే ఉన్నాయి. పదేళ్ళుగా అధికారంలో కొనసాగాక బీజేపీకి ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం చిత్రమే. ఈసారి ఎన్నికల్లోనూ గెలిచి, వరుసగా మూడోసారి గద్దెనెక్కాలని చూస్తున్న కాషాయపార్టీకి ఇప్పుడది సులభం కాకపోవచ్చు. కాంగ్రెస్ పుంజుకున్నట్టు కనిపిస్తోంది. పైగా ఎన్నికలంటే ఎక్కడైనా అధికార పక్షం పట్ల వ్యతిరేకత సహజం. బీజేపీలోని వర్గవిభేదాలు, రైతులు – జాట్ల లాంటి వర్గాలతో సహా గ్రామీణ ప్రాంతాల్లో దాని పట్ల అసంతృప్తి కనిపిస్తున్నాయి. ఇవన్నీ కలసి అక్టోబర్ 8న పోలింగ్‌లో విపక్షానికి అనుకూలించవచ్చు.

లోక్‌సభ ఎన్నికల ఫలితాల సరళి, ప్రాథమిక ఒపీనియన్ పోల్స్‌ను బట్టి చూస్తే, కాంగ్రెస్‌కు కొంత అనుకూలత కనిపిస్తోంది. కానీ, అంతర్గత విభేదాలు ఆ పార్టీనీ పీడిస్తున్నాయి. స్వతంత్రులుగా బరిలోకి దిగే అసమ్మతులతో అన్ని పార్టీలకూ చిక్కే. మరోపక్క ఎన్నికలిప్పుడు బీజేపీ, కాంగ్రెస్, ఆప్‌ల మధ్య త్రిముఖ పోటీ కావడంతో అధికారపక్ష వ్యతిరేక ఓటు ఏ మేరకు చీలుతుంది, అది బీజేపీకి ఎంత మేర లాభిస్తుంది అన్నది ఆసక్తికరం. గతంలోకి వెళితే – 2019 ఎన్నికల్లో హర్యానాలో హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. అంతకు పదేళ్ళ ముందూ అలాగే జరిగింది. అలాంటి పరిస్థితుల్లో చిన్న పార్టీల వారు, స్వతంత్రులు కీలకమవుతారు. ఈ 'ఇతరులు' పాతికేళ్ళ క్రితం 30 శాతం ఓట్లు సాధిస్తే, క్రితంసారి అది 18 శాతానికి పడిపోయింది. అయితేనేం, ప్రతిసారీ వారు 8 నుంచి 16 సీట్ల మధ్య గెలుస్తున్నారని మర్చిపోలేం. 2009లో కాంగ్రెస్ స్వతంత్రులు, చిన్న పార్టీల మద్దతుతోనే గద్దెనెక్కింది. 2019లో బీజేపీ సైతం జననాయక్ జనతా పార్టీ (జేజేపీ)తో ఎన్నికల అనంతర పొత్తుతోనే అధికారం చేపట్టింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో 'ఇతరుల'కు 8 శాతం ఓట్లే వచ్చినా, స్థానిక అంశాలు ప్రధానమయ్యే అసెంబ్లీ ఎన్నికల్లో వారి పాత్ర గణనీయమవుతుంది.

కాకపోతే, స్థానికమైన జేజేపీ గ్రామీణ ప్రాంతాల్లోని తన పట్టును నిలుపుకోలేకపోతోందనీ, సాంప్రదాయిక రైతు ఓటర్లున్న ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్‌ఎల్డీ) బలం ప్రస్తుతం కొద్ది స్థానాలకే పరిమితమనీ విశ్లేషకులు చెబుతున్నారు. అదే సమయంలో పెరుగుతున్న నిరుద్యోగం, లోపించిన పారిశ్రామికీకరణ, వివాదాస్పద అగ్నిపథ్ పథకం లాంటి అంశాలు బీజేపీని వెనక్కి లాగుతున్నాయి. హర్యానా జనాభా 20 శాతం దళితులే. తాజా లోక్‌సభ ఎన్నికల్లో వారిలో 68 శాతం మంది, అలాగే సగానికి పైగా ఓబీసీలు 'ఇండియా' కూటమికి మద్దతునిచ్చినట్టు విశ్లేషణ. ఇప్పుడూ అదే ధోరణి కొనసాగి, జాట్లు సహా ఇతర చిరకాల సమర్థక వర్గాల నుంచి విపక్షానికే మద్దతుంటే... అధికార పక్షానికి చిక్కులు తప్పకపోవచ్చు. నిరుడు కర్ణాటక లానే ఇప్పుడు హర్యానాలో బీజేపీకి శృంగభంగం జరగవచ్చు. అక్టోబర్ 5న జరగనున్న ఎన్నికలు బీజేపీ ప్రతిష్ఠకు పెనుసవాలుగా మారింది అందుకే!

కనీస ధరే రైతుకు భరోసా

విశ్లేషణ



దేవీందర్ శర్మ

భారతీయ రైతులు అభివృద్ధి నిచ్చెనలో అట్టడుగున ఉండటమే కాకుండా, దాదాపు పాతికేళ్లుగా ఏటా నష్టాలను చవిచూస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు ప్రభుత్వాలు రైతులను వదిలేశాయి. శాశ్వత పేదరికం నుండి రైతులను బయటపడేయడానికి ఉన్న ఏకైక ఆమోదయోగ్యమైన మార్గం – కనీస మద్దతు ధరకు హామీ ఇచ్చే చట్టాన్ని తేవడమే! చట్టపరమైన కనీస మద్దతు ధర వినియోగదారులపై ధరల భారాన్ని పెంచుతుందనీ, తద్వారా అది మార్కెట్‌లను దెబ్బతీస్తుందనీ ఆర్థికవేత్తలు భావిస్తుంటారు. అదే కార్పొరేట్లు వినియోగదారులపై ధరల భారాన్ని మోపినప్పుడు మాత్రం వీళ్లు నిశ్శబ్దంగా ఉంటారు. చట్టబద్ధంగా హామీ ఇచ్చే కనీస మద్దతు ధరను అందించడం వ్యవసాయ రంగం ఎదురుచూస్తున్న పెద్ద సంస్కరణ.

ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్) ప్రభుత్వ ఉద్యోగులకు గౌరవాన్ని, ఆర్థిక భద్రతను కల్పిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దాన్ని పెన్షన్ సంస్కరణ అన్నారు. దేశ ప్రగతికి గణనీయంగా దోహదపడే ప్రభుత్వ ఉద్యోగులందరి కృషిని చూసి గర్విస్తున్నామని కూడా అన్నారు.

చివరిగా ఉద్యోగి పొందిన వేతనంలో 50 శాతానికి సమానమైన పెన్షన్‌కు హామీ ఇచ్చే యూపీఎస్, వాస్తవానికి మునుపటి మార్కెట్ అనుసంధానిత నూతన పెన్షన్ స్కీమ్(ఎన్‌పీఎస్) ప్రభుత్వ ఉద్యోగులకు మేలు చేయలేదని అంగీకరించింది. ప్రభుత్వ ఉద్యోగులకు 'నిర్ధారిత ప్రయోజనపు' హామీ ఇవ్వడం కోసం, వాళ్ల మార్కెట్ల దౌర్జన్యాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం లేకుండా కేంద్ర మంత్రిమండలి పెన్షన్ పథకాన్ని సవరించింది.

ప్రధానమంత్రి అనేక సందర్భాల్లో దేశంలోని రైతులను ప్రశంసించినప్పటికీ తమ పంటలకు హామీ ధరలు ఉండాలని దీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్‌ను మాత్రం పట్టించుకున్న నాథుడు లేడు. ఉద్యోగులకు భరోసా పెన్షన్ అవసరమైనప్పుడు, రైతులకు కూడా భరోసా ధర అవసరమే.

ప్రపంచంలో ఎక్కడా మార్కెట్లు రైతులకు అధిక ఆదాయాన్ని అందించడం లేదు. ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో సబ్సిడీ ఆదాయ అంతరాన్ని భర్తీ చేస్తుంది. వ్యవసాయ రాయితీలను అందించడంలో చైనా అగ్రస్థానంలో ఉంది. భారతదేశం మాత్రం వ్యవసాయ మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు రైతులను వదిలేసింది. కొన్ని అధ్యయనాలు చెబుతున్నట్టుగా, భారతీయ రైతులు అభివృద్ధి నిచ్చెనలో అట్టడుగున ఉండటమే కాకుండా, దాదాపు పాతికేళ్లుగా ఏటా నష్టాలను చవిచూస్తున్నారు.

శాశ్వత పేదరికం నుండి రైతులను బయటపడేయడానికి ఏకైక ఆమోదయోగ్యమైన మార్గం, వ్యవసాయ ధరలకు హామీ ఇవ్వడం కోసం ఒక చట్టబద్ధమైన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడం. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి హామీ ఇచ్చే చట్టం మార్కెట్లను అస్తవ్యస్తం చేస్తుందని ఎన్డీయే ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. విచిత్రమేమిటంటే, రైతుల విషయానికి వచ్చేసరికి, విధాన నిర్ణేతలు మార్కెట్లు అస్తవ్యస్తం అవుతాయన్న పల్లవిని ఎత్తుకుంటారు. అదే ఉద్యోగుల విషయంలో అంతా బానేవుంటుంది. మార్కెట్ల అస్తవ్యస్త భయం అకస్మాత్తుగా అదృశ్యమవుతుంది.

చట్టపరమైన కనీస మద్దతు ధర వినియోగదారులపై ధరల భారాన్ని పెంచుతుందనీ, తద్వారా అది మార్కెట్‌లను దెబ్బతీస్తుందనీ ప్రధాన ఆర్థికవేత్తలు విశ్వసిస్తున్నారు; వాస్తవంలో, ఇది కార్పొరేట్ల లాభాలను పిండేస్తుంది కాబట్టే నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అదే స్వేచ్ఛా మార్కెట్ ప్రబోధక ఆర్థికవేత్తలు అమెరికాలోని కార్పొరేట్లు వినియోగదారులపై ధరల



భారాన్ని మోపినప్పుడు మాత్రం నిశ్శబ్దంగా ఉంటారు. ఇదీ నిజానికి ధరలను వక్రీకరించడం. అందుకే ఇప్పటికే కాలిఫోర్నియా, ఫ్లోరిడా, న్యూయార్క్‌తో సహా 38 రాష్ట్రాలు ఈ ధరల పెరుగుదలను నిషేధించే చట్టాలను తెచ్చాయి. ఉదాహరణకు, కోవిడ్ మహమ్మారి సమయంలో హ్యాండ్ శానిటైజర్ల ధరలను 400 శాతం మేరకు పెంచిన కంపెనీలకు వ్యతిరేకంగా న్యూయార్క్ రాష్ట్రం చర్యలు తీసుకుంది. అయినప్పటికీ చాలామంది మార్కెట్ సమర్థక ఆర్థిక వేత్తలు స్పష్టంగా కనిపిస్తున్న ఈ మార్కెట్ వక్రీకరణలపై జరిగే ఇటువంటి తనిఖీలను సోవియట్ శైలి ధరల నియంత్రణగా పేర్కొంటున్నారు.

రైతులకు ఆర్థిక భద్రత కల్పించాల్సిన సమయంలో మార్కెట్‌కు అనుకూలమైన పక్షపాత దృష్టి పెరుగుతుంది. కానీ కార్పొరేట్లు వినియోగదారుల రక్తమాంసాలను పీల్చివేయడం కోసం ధరలను పెంచినప్పుడు మాత్రం ఎవరూ మాట్లాడరు. మార్కెట్ వక్రీకరణ అనే ఈ ద్వంద్వ ప్రమాణం రైతులకు జీవన ఆదాయాన్ని అందించే మార్గంలో అడ్డుగా నిలుస్తోంది. నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా, మార్కెట్లు రైతుల హామీ ధరలకు అనుగుణంగా వాటికవే సర్దుబాటు చేసుకుంటాయి. కేవలం భావజాలమే దీనికి అడ్డు నిలుస్తోంది.

మహమ్మారి తర్వాత ఆహారం, కిరాణా వస్తువుల ధరలు 53 శాతం పెరగడానికి కారణమైన కార్పొరేట్ ధరల పెరుగుదలపై నిషేధం విధించాలని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ పిలుపునిచ్చారు. రిపబ్లికన్లు ఆమె వైఖరిని 'కమ్యూనిస్ట్' అన్నారు. మితవాద పక్షం ఏదైనా చెప్పనీ... కొందరు ఆర్థికవేత్తలు అంగీకరించినట్లుగా, ధరల పెరుగుదలపై నిషేధం అనేది మంచి ఆర్థిక శాస్త్రం, మంచి రాజకీయం అనే అభిప్రాయాన్ని ఎవరూ తిరస్కరించడం లేదు. ఈ సందర్భంగానే, ఆహార పదార్థాల ధరలను కృత్రిమంగా ఎక్కువగా ఉంచుతున్న కంపెనీలపై చర్యలు తీసుకుంటామని కమలా హారిస్ హామీ ఇచ్చారు.

ఉద్యోగుల పెన్షన్ విషయానికి తిరిగి వస్తే, కేంద్ర వ్యయ శాఖ ఈ నిర్ణయాన్ని సమర్థించేందుకు అన్ని ప్రయత్నాలూ చేయడం ఆసక్తికరం. ఇది 'ఆర్థికంగా వివేకవంతమైన' నిర్ణయమనీ, 'ఇది భవిష్యత్ తరాల పౌరులకు ఆర్థిక కష్టాలను నివారిస్తుం'దనీ పేర్కొంది. ఉద్యోగులకు ఇస్తున్న హామీ పెన్షన్ పథకానికి ఎవరూ వ్యతిరేకం కాదు. ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించగలుగుతున్నప్పుడు, రైతులకు ఆర్థిక భద్రత కల్పించలేకపోవడానికి కారణం ఏదీ లేదు. ఎందుకంటే రైతులు కూడా దేశ ప్రగతికి గణనీయంగా దోహదపడుతున్నారు. వారి నిర్విరామ కృషి వల్లే దేశానికి ఆహార భద్రత ఏర్పడింది.

మధ్యప్రదేశ్‌లోని మందసార్ జిల్లాకు చెందిన కమలేశ్ పాటీదార్ అనే రైతు తన పదెకరాల్లోని సోయాబీన్ పంటను దున్నివేసినప్పుడు, అది ఒక గొలుసుకట్టు చర్యను ప్రేరేపిస్తుందని అతను అనుకోలేదు. ఈ సంఘటన తాలూకు వీడియో వైరల్ అయిన కొద్ది రోజులకే, చాలా మంది రైతులు తమ పంటను దున్నేశారని వార్తలొచ్చాయి.

సోయాబీన్ ధరల పతనం... అది కూడా, కోత కాలానికి నెలన్నర ముందు ధరలు పడిపోవడం అనేది, రైతులు మంచి ధరను పొందే వరకు పంటను నిల్వ ఉంచుకోవాలని సూచించే మరొక ఆర్థిక నమ్మకాన్ని పోగొట్టింది. తర్వాతైనా ఎక్కువ ధర వస్తుందనే ఆశతో కమలేష్ పాటీదార్ గత ఏడాది పండించిన పంటను అలాగే నిల్వ ఉంచుకున్నాడు. అది కూడా ఫలించలేదు.

సోయాబీన్ ధరలు పన్నెండేళ్ల క్రితపు స్థాయికి పడిపోవడంతో వ్యవసాయ జీవనోపాధి ధ్వంసమైన లక్షలాది మంది రైతులకు ఇది ఆగ్రహం కలిగించింది. కనీస మద్దతు ధర కంటే చాలా తక్కువగా ఉన్న ధరలు ఉత్పత్తి ఖర్చులకు కూడా సరిపోవు. భవిష్యత్ తరాల రైతులకు మాత్రమే కాకుండా ప్రస్తుత రైతులకు కూడా ఆర్థిక కష్టాలను నివారించే భరోసా ధరల విధానం ఎప్పుడు వస్తుందా అని నేను ఎదురుచూస్తున్నాను.

ఆ తర్వాత, టమోటా ధరలు 60 శాతం క్షీణించి, 25 కిలోల పెట్టెకు 300 రూపాయల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయని వార్తలొచ్చాయి. అనంతరం, బాస్మతి బియ్యం ధర క్వింటాల్‌కు 28 శాతం తగ్గి రూ. 2,500కు చేరుకుందని వార్తలొచ్చాయి. ఇది ఈ సంవత్సరం మాత్రమే జరిగిన ప్రత్యేకమైన ఘటనలు కావు. ఇది దేశం ఏమాత్రం ఆందోళన చెందని బాధాకరమైన వార్షిక ధోరణిగా తయారైంది.

అమ్ముకోదగినంత మిగులు ఉన్న రైతులకు చట్టబద్ధంగా హామీ ఇచ్చే కనీస మద్దతు ధరను అందించడం, సన్నకారు రైతులకు ప్రత్యక్ష ఆదాయ మద్దతులను అందించడం అనేవి వ్యవసాయ రంగం ఎదురుచూస్తున్న పెద్ద సంస్కరణలుగా చెప్పాలి.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గౌరవంగా...!



మణిపుర్ మీద జరుగుతున్న చర్చ పూర్తిగా అవమానకరంగా తయారైంది. క్షేత్రస్థాయిలో ఉన్న కమ్యూనిటీలు కొంతైనా సభ్యతను ఆశించే హక్కును కలిగివున్నారు. ప్రేక్షకులను రెచ్చ గొట్టడమో, ఉత్సాహపరచడమో ఎజెండా కారాదు.

– రామి నిరంజన్ దేశాయ్, ఆంత్రొపాలజిస్ట్

ఫోన్లకు దూరంగా...



పిల్లలు ఫోన్లకు దూరంగా ఉండి, నిజమైన స్నేహితులను, నిజమైన అనుభవాలను ఏర్పరచుకోవాలని తల్లితండ్రులు కోరుకుంటున్నారు. అందుకే సామాజిక మాధ్యమాలను ఉపయోగించేందుకు కనీస వయసును చట్టబద్ధం చేయడం అనేది పిల్లలను కాపాడుతుంది. తల్లితండ్రులకు సహాయకారి అవుతుంది.

– ఆంథోనీ అల్బనీస్, ఆస్ట్రేలియా ప్రధాని

ఇలాగేనా వ్యవహారం?



నూపుర్ శర్మ వివాదం సమయంలో భారత హైకమిషనర్‌ను మలేషియా పిలిపించింది. తర్వాత జకీర్ నాయక్ నివాసానికి అనుమతించింది. ఆయన ఇప్పుడు భారత ప్రజాస్వామ్యంలో బహిరంగంగా కలగజేసుకుంటున్నాడు. కానీ మన మంత్రులేమో ఆయన ట్వీట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. మిమ్మల్ని మీరే సీరియస్‌గా తీసుకోకపోతే, ఎవరూ తీసుకోరు.

– హార్దిక్ రాజ్‌గోర్, రచయిత

జేబుదొంగలా?



టిఫ్ (టొరంటో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్) నేపథ్యంలో డౌన్‌టౌన్‌లో జేబుదొంగలున్నారని టొరంటో (కెనడా) పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటివి మూడో ప్రపంచ దేశాల్లో జరగాలి. ఆఖరికి నా మాతృభూమి అయిన ఇండియా పెద్ద నగరాల్లోనూ దాదాపుగా లేకుండా పోయాయి.

– రూపా సుబ్రమణ్య, ఆర్థికవేత్త

ఉచితం వల్లేనా?



ఒకవేళ ఉన్నట్టుండి టీకాలు ఖరీదైపోయి, కేవలం ధనవంతులే వాటిని కొనగలిగేట్టయితే ఈ టీకా వ్యతిరేక ఉద్యమం అనేది ఒక్క రోజులో చచ్చిపోతుంది. జనాలు డోసుల కోసం ప్రాథేయపడుతుంటారు.

– ఇంతియాజ్ మహమూద్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇన్‌బాక్స్

వారి హక్కులకు రక్షణ ఉందా?

ఆదివాసుల జీవన విధానం ప్రధానంగా పర్యావరణం, అడవులు, అక్కడ ఉండే సహజ వనరులు వంటి వాటితో ముడిపడి ఉన్నది. ప్రస్తుతం వారి హక్కులు సంక్షోభంలో ఉన్నాయి. ఈ స్థితి నుండి వీరిని రక్షించాల్సిన అనివార్యత ఎంతైనా ఉంది. అందుకే 1994 ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ప్రకటించడం జరిగింది. 2006 జూన్ 29న ప్రపంచ మానవ హక్కుల కౌన్సిల్ ఆదివాసీల హక్కుల రక్షణకై ఒక తీర్మానం జరగాలని సూచించింది. అప్పుడు మానవ హక్కుల కౌన్సిల్, యూఎన్‌ఓలు కలిసి ఆదివాసీల హక్కుల రక్షణకు తీర్మానించాయి. ఈ తీర్మానం 61/295 ప్రకారం జనరల్ అసెంబ్లీ 2007 సదస్సులో ప్రతి ఏటా సెప్టెంబర్ 13వ తేదీని ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీ హక్కుల దినంగా జరుపుకోవాలని ప్రకటించింది. ఈ సందర్భంగా వెలువడిన డిక్లరేషన్‌లో మొత్తం 46 ప్రకరణలలో వారికి ఉండాల్సిన హక్కులూ, రక్షణలూ పేర్కొనబడ్డాయి. అందులో ముఖ్య మైనవి కొన్ని...

1. ప్రపంచ మానవ హక్కుల చట్టం ప్రకారం, ఆదివాసీలు స్వేచ్ఛగా మానవ హక్కులు, ప్రాథమిక హక్కులను కలిగి వాటిని ఆనందంగా అనుభవించాలి. 2. ఆదివాసీలు ఇతరులతోపాటు సమానంగా హక్కులను అనుభవించాలి. 3. ఆదివాసీలు సంకల్పంతో వారి ఇష్ట ప్రకారం, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి తోడ్పడు అంశాలను వారి ఇష్టమైన రీతిలో నిర్వహించుకొని అభివృద్ధి చెందవచ్చు. 4. స్వయంప్రతిపత్తి, స్వయం పాలనను వారి అంతరంగిక స్థానిక అంశాలలో నిర్వహించుకోవచ్చు. 5. రాజకీయంగా, ఆర్థికంగా, చట్టాలను బలోపేతం చేసుకునే అధికారం వారికి ఉంది. 6. ప్రతి ఆదివాసీ ఏ దేశంలో నివసిస్తున్నప్పటికీ ఆ దేశ పౌరసత్వం పొంది ఉండే హక్కును కలిగి ఉంటాడు. 7. ప్రతి ఆదివాసీ మానసిక సమగ్రతతో జీవితంలో స్వేచ్ఛ, రక్షణ హక్కును కలిగి ఎటువంటి మారణ హోమానికి గురికాకుండా, వ్యక్తిగతంగా, సామూహికంగానూ రక్షణతో కూడిన శాంతి కలిగి ఉండే హక్కు ఉంది. 8. జాతిపరంగా రెచ్చగొట్టే చర్యలు, వివక్ష ఉండకూడదు. భూమిపై హక్కులు కాలరాయకుండా, వనరుల దోపిడి జరగకుండా బాధ్యతాయుతమైన యంత్రాంగాన్ని ఆ యా రాష్ట్రాలే కల్పించాలి. 9. ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఏదైనా జాతీయతను కలిగి వుండవచ్చును. వీటిపై ఎట్టి వివక్ష చూపరాదు. మరి ఈ హక్కులనూ, రక్షణలనూ ఇవ్వాళ ఆదివాసీలు కలిగి ఉన్నారా అనేది ఎవరికి వారు ఆలోచించాల్సిన ప్రశ్న.

– గుమ్మడి లక్ష్మీ నారాయణ, ఆదివాసీ రచయితల వేదిక పూర్వ కార్యదర్శి

(సెప్టెంబర్ 13న ప్రపంచ ఆదివాసీ హక్కుల దినోత్సవం)

సర్వే చేసి బీసీల పునర్వర్గీకరణ చేయాలి!

అభిప్రాయం



జూలూరు గౌరీశంకర్

కులగణన కోసం సమగ్ర కుటుంబ సర్వే చేసినప్పుడే బీసీ, ఎంబీసీ, సంచార జాతుల వారి జీవన పరిస్థితులు పాలకులకూ, ఇతర ప్రపంచానికీ తెలిసి వస్తాయి. ఏ కులం జనాభా ఎంత ఉంది అన్న విషయం తెలియకుండా ఏ ఏ కులాలకు ఎన్నికల్లో ఎన్నెన్ని సీట్లు ఇవ్వాలి; విద్య, ఉద్యోగాల్లో వారి వాటా ఎంత అనే వాటిని నిర్ణయించలేరు. బీసీ సంఘాలు తమ హక్కుల సాధన కోసం గత కొన్ని నెలలుగా సమావేశాలు, ప్రెస్ కాన్ఫరెన్స్‌లు, మండల, జిల్లా ఆఫీసుల్లో వినతిపత్రాలు, ధర్నాలు, పికెటింగ్‌లు చేసుకుంటూ పోతున్నారు. రాజకీయ పార్టీలు, విధాన సభలు, మంత్రివర్గాలు... బీసీల సమస్యలను ఇంతవరకు సీరియస్‌గా తీసుకోకపోవటం, పెదవి విప్పకపోవటం విచారకరం.

బ్రిటిష్ పాలకులన్నా బీసీల లెక్కలు తీసి చూశారు కానీ మన పాలకులు మాత్రం ఆ పని చేయటం లేదు. రాష్ట్రంలో బీసీలెంతమందో పాలించేవారికి లెక్క తెలియదు. ఆ లెక్కలు తీయమంటే తీయరు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటారు. ఏ లెక్కన ఇస్తారు? 56 శాతం ఉన్న వారికి 42 శాతం ఇస్తామనటం ఎంతవరకు శాస్త్రీయమైనదో ఆలోచించాలి.

2014లో జరిగిన ఒక సర్వే ప్రకారం... మొత్తం బీసీ జనాభాలో ముదిరాజ్‌లు 24,28,942; యాదవులు 21,77,368; గౌడ 19,76,297; మున్నూరు కాపు 13,05,296; పద్మశాలీలు 12,15,078; విశ్వబ్రాహ్మణులు 9,63,151; రజకులు 8,66,243; కురుమలు 5,56,112; బెస్తలు 4,27,055; వడ్డెర 3,79,123; కుమ్మరి 3,72,341; నాయీ బ్రాహ్మలు 3,09,798; పెరికలు 2,10,580 మంది ఉన్నారు. మెహర్, ఉప్పర, ఆరెోట్ల కులాల వారు రెండు లక్షల జనాభా గ్రూప్‌లో ఉన్నారు. 90 నుంచి 15 వేల లోపు జనాభా కలిగిన కులాలు 35 దాకా ఉన్నాయి. 15 నుంచి 5వేల లోపు జనాభా ఉన్న కులాలు 20 దాకా ఉంటాయి. 5 నుంచి 3 వేలలోపు జనాభా ఉన్న కులాలు 8 దాకా ఉన్నాయి. 3 వేల నుంచి 1500 లోపు జనాభా ఉన్న కులాలు 11 ఉన్నాయి. 1000 నుంచి 235 లోపు జనాభా ఉన్న కులాలు 23 దాకా ఉన్నాయి. వెయ్యి నుంచి 2000లోపు



జనాభా ఉన్న సంచార జాతుల కులాలు చాలా ఉన్నాయి. నేటికీ బీసీ కులపట్టికలోకి ఎక్కని సంచార, అర్ధసంచార జాతుల వాళ్ళు ఇంకా ఉన్నారు. ఆశ్రిత కులమైన రంజకుల జనాభా 100కు మించి ఉండదు. సంచార, అర్ధసంచార జాతుల భిక్షాటక, ఆశ్రిత కులాలకు చెందిన బీసీలు అత్యంత దారుణంగా అర్ధాకలితో జీవిస్తున్నారు. వీరిలో 80 శాతం మందికి పక్కా ఇళ్ళు లేవు. వాళ్ల పిల్లలు ఏం చేస్తున్నారో? ఏం చదువుతున్నారో తెలియదు. ఊళ్లలో యాచకవృత్తి చేస్తూ జీవిస్తున్న వాళ్ళున్నారు. రోడ్ల పక్కన జీవించే బైల్ కమ్మరులు పొద్దు పొడవక ముందే తాము నిద్రించిన చోటులోనే తిరిగి కొలిమి రాజేసి వస్తువులు తయారు చేస్తున్నారు. మన నాగరిక ప్రపంచం రోజూ వారిని చూస్తూనే ఉంటుంది. ఇటువంటి వారి జీవన స్థితిగతులు మార్చడానికి కృషి జరగాలి. కులగణన చేసి జనాభా లెక్కలు తేల్చుకుని జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు పొందినప్పుడే ఇటువంటి వారి జీవితాలు మారతాయి.

ఎన్నెన్ని ప్రభుత్వాలు మారినా వాళ్ళ స్థితిగతులు మారలేదు. ఇలాంటి సంచార, అర్ధసంచార, అత్యంత వెనుకబడిన బీసీ కులాలవాళ్ళు లక్షల సంఖ్యలో ఉన్నారు. వీళ్ళందరి జీవితాలను సర్వసమగ్రంగా అధ్యయనం చేయాలి. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో చెప్పినట్లుగా సమగ్ర కుటుంబ సర్వే చేసి వాళ్ళ జనాభా ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వటం అన్నది ఓటర్ లిస్టుల ఆధారంగా జరిగే పని కాదు. అందుకు సమగ్ర అవగాహనతో సర్వే చేయాలి. 130 కులాలకు సంబంధించిన వారి ప్రాతినిధ్యం స్థానిక సంస్థల్లో ఉండాలి. అంటే ఏ కులం వారు ఎక్కడున్నారో సంపూర్ణంగా తెలియాలి. ఈ విషయాన్నే 77 ఏళ్ళ తర్వాత బీసీలు తమ కుల అస్తిత్వ చైతన్యంతో అడుగుతున్నారు. దీన్ని తెలివిగా దాటవేయాలని చూసే రాజకీయ పార్టీల ఎత్తుగడలను బీసీ వర్గాలు తిప్పికొట్టి తీరతాయి.

ప్రస్తుతం చేపట్టనున్న సమగ్ర సర్వేలో బీసీ, ఎంబీసీ, సంచార, అర్ధసంచార కులాల జనాభా లెక్కలు తేలిన తర్వాత వారిని తిరిగి వర్గీకరించి రిజర్వేషన్లు అమలు జరపాలి. అప్పుడే బీసీలలోని కింది కులాలకు రాజకీయ, ఆర్థిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో ఎవరి వాటా వారికి దక్కుతుంది. రాజ్యాంగం పేర్కొన్న సమన్యాయం సాకారమవుతుంది.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు

కర్మ – దైవానుకూలత

సత్కర్మకు – అనగా నలుగురికీ మేలును చేకూర్చే మంచి పనికి దైవానుకూలత తప్పకుండా ఉంటుందని భావిస్తాం, ఉండాలని ప్రార్థిస్తాం. చేసే కర్మలో శుద్ధత్వం, పవిత్రత తగ్గిపోగానే దానికి అనుగుణంగా దైవానుకూలత కూడ క్షీణించిపోతుందని ఆంధ్ర మహాభారతం, అనుశాసనిక పర్వం, ప్రథమాశ్వాసంలోని ఈ కింది పద్యం చెప్పింది.

కం. నేయి పోలు పఱిన దీవియ
మాయుకరణి, గర్మశుద్ధి మలిగిన హీన
త్వాయత్తంబై తానును
మాయును దైవానుకూల్య మహిమ మహీశా!

జ్యోతిర్మయం

'నెయ్యి అయిపోయిన వెంటనే దీపం ఆరిపోయే విధంగా, చేసే కర్మలో శుద్ధత్వం ఎప్పుడైతే లోపిస్తుందో అప్పటి నుండి దైవానుకూలత కూడా తగ్గిపోవడం ప్రారంభమౌతుంది' అని పై పద్యం భావం. తిక్కన మహాకవి రచనలోని ఈ పద్యానికి మూలమైన సంస్కృత మహాభారతం, అనుశాసనిక పర్వం, షష్ఠాశ్వాసం, 44వ శ్లోకంలో ఇలా ఉంది.

యథా తైల క్షయాద్ దీపః ప్రహ్రాసముపగచ్ఛతి
తథా కర్మ క్షయాద్ దైవం ప్రహ్రాసముపగచ్ఛతి.

'ఏలాగైతే తైలం అడుగంటగానే దీపం ఆరిపోతుందో, అలాగే చేసే కర్మ క్షీణ దశకు చేరడంతోనే దైవానుకూలత కూడ నష్టమైపోతుంది' – అని పై శ్లోకం భావం. ఈ శ్లోకంలో వ్యాసభగవానుడు చెప్పిన 'కర్మ' అన్న మాటను తిక్కన మహాకవి తెలుగులో 'కర్మశుద్ధి'గా మార్చాడు. చేసే కర్మలో శుద్ధత్వం, నిర్మలత్వం, పవిత్రత అనే అర్థాలు తిక్కన సూచించిన 'కర్మశుద్ధి' అనే మాటలో ద్యోతకమౌతాయి. వ్యాసభగవానుడు మాత్రం 'శుద్ధత్వం' అనే విషయం జోలికి పోకుండా కేవలం 'కర్మ' అన్న మాటతోనే విషయాన్ని చెప్పాడు. కర్మలో శుద్ధత్వం ఉన్నదా, లేదా అన్నది ముఖ్య విషయం కాదని, అసలు కర్మ నిర్వహించబడుతున్నదా లేదా అన్నదే ముఖ్యమని వ్యాసులవారి ఉద్దేశంగా ఇందులో కనపడుతుంది. కర్మ నిర్వహించబడుతున్నప్పుడు ఆ కర్మలో నిర్మలత్వం, శుద్ధత్వం ఉన్నదా లేదా అన్నది దైవం నిర్ణయించి, ఆ నిర్ణయానికి తగిన విధంగా అనుకూలతను ప్రసాదిస్తాడన్నది వ్యాసులవారి ఉద్దేశంగా ఇందులో మనకు బోధపడుతుంది. అయితే, తిక్కన మహాకవి మాత్రం ఆ బాధ్యతను కర్మను ఆచరించే వ్యక్తికే ఆపాదించి ముఖ్య విషయానికి స్పష్టతను చేకూర్చి చెప్పాడని గ్రహించవచ్చు.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.నవమి సా.6.10 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** మూల సా.6.01 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.4.24 నుండి 6.00 వరకు, తదుపరి తె.3.39 నుండి 5.15 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.43 వరకు, తదుపరి ప.2.49 నుండి 3.37 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.22 నుండి 1.01 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.50, **సూర్యాస్తమయం:** 6.04.

గోదావరి తగ్గుముఖం


భద్రాచలం వద్ద గోదావరి నది ప్రవాహం

భద్రాచలం/భద్రాచలం అర్బన్: భద్రాచలం వద్ద గోదావరిలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. బుధవారం ఉదయం 7 గంటలకు నీటిమట్టం 50.30 అడుగులుగా నమోదైంది. అప్పటి నుంచి 10 గంటల వరకు నిలకడగా ఉన్న గోదావరి, 11 గంటల నుంచి నెమ్మదించింది. గంటకు 0.2/0.3 అడుగుల చొప్పున తగ్గుతూ సాయంత్రం 4 గంటలకు 49 అడుగులకు తగ్గింది. రాత్రి 7.47 గంటలకు 48 అడుగుల కంటే తక్కువగా నీటిమట్టం నమోదు కావడంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. రాత్రి 8 గంటలకు 47.80 అడుగులుగా నమోదుకాగా, 11,39,375 క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళ్తోంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వరదలపట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. బుధవారం భద్రాచలంలో పర్యటించిన ఆయన గోదావరి వరద ఉధృతిని పరిశీలించి, అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరదలతో ఏజెన్సీలో నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

‘సాక్షి’లో చూసి సాయమందించాం

- ఖమ్మంవరద బాధితులకు నిజామాబాద్ జిల్లా యువకుల బాసట
- 77 కుటుంబాలకు సీలింగ్ ఫ్యాన్ల అందజేత
- వైద్య విద్యార్థినికి ట్యాబ్, నగదు


రాకాసితండా వారికి సాయం అందిస్తున్న వన్నెల్(కె) యువకులు


తేజశ్రీకి ట్యాబ్, నగదు అందజేస్తున్న ఖమ్మం కిట్టి పార్టీ సభ్యులు

ఖమ్మం మయూరిసెంటర్: స్పందించే మనసుంటే ఎక్కడి వారికైనా సాయం చేయొచ్చని నిరూపించారు నిజామాబాద్ జిల్లా యువకులు. ఇటీవలి వరదలతో ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసితండా ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. వీరి కష్టాలపై ఈనెల 6న సాక్షిలో ‘భూమి రాళ్లపాలు.. బతుకు రోడ్డుపాలు’శీర్షికన ప్రచురితమైన కథనం నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం వన్నెల్ (కె) గ్రామ యువకులను కదిలించింది. దీంతో వారు బాధితులను ఆదుకునేందుకు నడుం బిగించి రూ. లక్ష విరాళాలు సేకరించారు. ఖమ్మంలో పరిచయం ఉన్న వారిని తోడ్కొని బుధవారం రాకాసితండాకు వచ్చారు. దీంతో యువకులు 77 కుటుంబాలకు 77 సీలింగ్ ఫ్యాన్లు కొనుగోలు చేసి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వన్నెల్ (కె) గ్రామ యువకులు అర్గుల శ్రీకాంత్, మచ్చేందర్, అనంతుల శ్రీను, డాక్టర్ సాయి, గజానంద్, జి.హనుమాను పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని తేజశ్రీకి కూడా...

ఈనెల 4న ‘సర్టిఫికెట్లు మున్నేరు పాలు’.. ‘చదువుల తల్లులకు ఎంత కష్టం’శీర్షికతో సాక్షి ప్రధాన సంచికలో వచ్చిన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 55వ డివిజన్‌కు చెందిన మహిళలు స్థానిక కార్పొరేటర్ మోతారపు శ్రావణి ఆధ్వర్యంలో తేజశ్రీని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. హైమావతి ట్యాబ్ అందించగా, కిట్టి పార్టీ ఆధ్వర్యంలో మహిళలు రూ.10 వేలు, కొల్లు జ్యోతి రూ.5 వేలు, పారిజాతం కమలం ప్రసాద్ రూ.5 వేలు అందజేశారు. తేజశ్రీ మాట్లాడుతూ అండగా నిలిచిన సాక్షికి, దాతలకు ధన్యవాదాలు చెప్పారు.

సాక్షిలో చూసి చలించిపోయాను



రాకాసితండా ప్రజలు పడిన ఇబ్బందులను సాక్షి పత్రిక లో చూశాను. వారికి ఏదో ఒకటి చేయాలన్న సంకల్పంతో మా కొంతమంది యువకులను సంప్రదించి, విరాళాలు సేకరించాం. ఖమ్మంలో ఉన్న మిత్రుల ద్వారా ప్రజలకు అందించాం.

– అర్గుల శ్రీకాంత్

విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

వామపక్ష నేతలు నారాయణ,కూనంనేని, చాడ డిమాండ్


ర్యాలీలో నారాయణ, కూనంనేని తదితరులు

లిబర్టీ (హైదరాబాద్): తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా హైదరాబాద్ సమితి ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న తెలంగాణ సాయుధ పోరాట యోధులు మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం నుంచి లిబర్టీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వరకు రెడ్ షర్ట్ వాలంటీర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతోనే భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైందని చెప్పారు. అంతటి మహోత్తర పోరాటం జరిగిన తెలంగాణలో నేటికీ పాలకులు విలీన దినోత్సవాన్ని అధికారికంగా జరపకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

‘యాదాద్రి’లో డిసెంబర్‌లోగా విద్యుదుత్పత్తి

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క


యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వచ్చే ఏడాది మార్చి 31 నాటికి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని అన్ని యూనిట్ల (ఐదు)లో విద్యుదుత్పత్తి ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. వచ్చే డిసెంబర్ నాటికి మూడు యూనిట్ల ద్వారా 2,400 మెగావాట్ల విద్యుదుత్పత్తిని ప్రారంభించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. మిగతా రెండు యూనిట్లలో మార్చి 31 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తామని చెప్పారు. బుధవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆయన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రెండో యూనిట్ ఆయిల్ సింక్రనైజేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్లాంట్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు.

బొగ్గు రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు..

మార్చి 31కి విద్యుదుత్పత్తిని ప్రారంభించేందుకు సివిల్ పనులతోపాటు రైల్వే లైన్, రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు భట్టి చెప్పారు. బొగ్గు రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇదే వేగంతో ప్రాజెక్టు పనులు పూర్తిచేసి యూనిట్ విద్యుత్తును రూ.6.35కు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు భూనిర్వాసితులకు భూసేకరణ నిధులతోపాటు, ప్రాజెక్టులో ఉద్యోగాలు కల్పిస్తామని, ఇచ్చిన మాట ప్రకారం వారి కుటుంబాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. 2015 జూన్ 8న థర్మల్ పవర్ ప్లాంట్ పనులకు శంకుస్థాపన జరగ్గా, 2017 అక్టోబర్‌లో పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. 2020 అక్టోబర్ నాటికి 2 యూనిట్లు, 2021 నాటికి మూడు యూనిట్లు పూర్తి చేయాలని చేయాల్సి ఉన్నా.. చేయలేదన్నారు. దీంతో ఇప్పుడు ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆర్థిక భారం పడిందని పేర్కొన్నారు. దీనికి ప్రధాన కారణం గత ప్రభుత్వ చిత్తశుద్ధి లోపమేనని మండిపడ్డారు. గత ప్రభుత్వం 50 శాతం దేశీయ బొగ్గును, 50 శాతం విదేశీ బొగ్గును వినియోగించాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా నూటికి నూరు శాతం దేశీయ బొగ్గును వినియోగించిందని, దీంతో పర్యావరణ వేత్తలు కేసు వేశారన్నారు. అందువల్లే ఎన్జీటీ క్లియరెన్స్‌ను సస్పెండ్ చేసిందని వివరించారు. అప్పటి ప్రభుత్వం తగిన చర్యలు చేపడితే ఆలస్యమయ్యేది కాదని చెప్పారు. తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎన్జీటీ క్లియరెన్స్‌ను తీసుకోవడంతోపాటు, ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. తద్వారానే ఆయిల్ సింక్రనైజేషన్ చేసే స్టేజీకి తెచ్చినట్లు పేర్కొన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. పవర్ ప్లాంట్ పనులను గత ప్రభుత్వం ఆలస్యం చేసిందని, తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పనులను పూర్తి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జెన్‌కో ఎండీ రోనాల్డ్ రోస్, నల్లగొండ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ పాల్గొన్నారు.

ఎన్డీఎస్ఏ తుది నివేదిక త్వరగా తెప్పించండి

- నీటిపారుదల శాఖకు మంత్రి ఉత్తమ్ ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల శాశ్వత పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ నుంచి త్వరగా తుది నివేదిక తెప్పించుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో బరాజ్‌లకు నిర్వహించాల్సిన పరీక్షలు పూర్తి చేసి, వాటికి సంబంధించిన నివేదికలను నిపుణుల కమిటీకి అందజేయాలన్నారు. నీటిపారుదల శాఖపై బుధవారం ఆయన జలసౌధలో సమీక్షించారు. సమ్మక్క బరాజ్ నిర్మాణంతో ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడనున్న ముంపు విషయంలో ఆ రాష్ట్రం నుంచి ఎన్ఓసీని సత్వరంగా రాబట్టుకోవాలని ఆదేశించారు. ముంపునకు గురయ్యే భూములకు సంబంధించి పరిహారం చెల్లింపు విషయంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలన్నారు. సమ్మక్క బరాజ్ డీపీఆర్‌కు అనుమతుల విషయంలో ఎ డబ్ల్యూసీ లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. భూసేకరణను 2025 మార్చిలోగా పూర్తిచేయాలని చెప్పారు. ఆనకట్టు, కాల్వల భద్రతను పర్యవేక్షించేందుకు 1,800 మంది లష్కర్‌ల నియామకాలను సత్వరమే పూర్తి చేయాలన్నారు. దీనిపై నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా స్పందిస్తూ ఈ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు. దీంతో మంత్రి ఉత్తమ్ ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రామకృష్ణారావుతో అక్కడి నుంచి ఫోన్‌లో మాట్లాడి అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు పంపించిన విజ్ఞాపనలను సత్వరంగా పరిష్కరించి, జవాబు పంపించాలన్నారు. ఆనకట్టు, కాల్వల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదన్నారు. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్, ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

‘పొదుపు డబ్బుల’కు ఎసరు పెట్టారని....

- గ్రూప్ లీడర్ భర్తను చెట్టుకు కట్టేసిన సభ్యులు
- మరో ఘటనలో ఇంటిని వేలం వేసిన మహిళా సంఘం


గ్రూప్ లీడరు భర్త భిక్షపతిని చెట్టుకు కట్టేసిన సభ్యులు


కల్లూర్‌లో సీఎస్పీ ఇంటిని వేలం వేస్తున్న దృశ్యం

తూప్రాన్/రుద్రూర్: దాచుకున్న పొదుపు సొమ్మును పక్కదారి పట్టించి, సొంతానికి వాడుకోవడంతో సభ్యుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఓ ఘటనలో గ్రూప్ లీడర్ భర్తను చెట్టుకు కట్టేయగా, మరో ఘటనలో ఏకంగా ఆ మహిళ ఇంటిని వేలం వేశారు. వివరాలు.. మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పడాల్‌పల్లి ఎస్సీ కాలనీకి చెందిన పదిమంది అంబేడ్కర్ సంఘం పేరుతో డ్వాక్రా గ్రూపు కొనసాగిస్తున్నారు. ఎస్‌బీఐ బ్యాంకులో రూ.10 లక్షలను సభ్యులు రుణంగా తీసుకున్నారు. గ్రూపు సభ్యులు సంఘం లీడర్ మున్నీకి రూ. 40 వేలు చెల్లిస్తున్నారు. ఆ డబ్బులు గ్రూపు పేరుమీద బ్యాంకుకు జమ చేయాల్సి ఉంది. కానీ 11 నెలలుగా మున్నీని భర్త భిక్షపతి బెదిరించి తన సొంతానికి ఆ డబ్బులు వాడుకుంటున్నాడు. దీంతో బ్యాంకు అధికారులు సభ్యుల రూ. 67 వేలు పొదుపు డబ్బులను రుణం కింద జమ చేసుకున్నారు.లోన్ చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు రూ. 1.55 లక్షలను సభ్యులపై భారం మోపారు. దీంతో లీడర్ మున్నీ, భర్త భిక్షపతి మొత్తం రూ.7 లక్షలకు పైగా కాజేసినట్లు సభ్యులకు తెలిసింది. ఈ విషయమై మున్నీని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పింది. పెద్దల సమక్షంలో ఈనెల 1న పంచాయితీ నిర్వహించారు. అయితే భార్యను చంపివేస్తే డబ్బులు కట్టాల్సిన అవసరం ఉండదని అందరి సమక్షంలోనే మద్యం మత్తులో ఉన్న భిక్షపతి భార్యను చంపేందుకు వెంటపడ్డాడు. అక్కడే ఉన్న గ్రూపు సభ్యులు భర్తను చెట్టుకు కట్టేసి భార్యను పక్కింట్లో దాచిపెట్టారు. కాగా, ఈ ఘటనలో నిందితులు, బాధితులు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడం గమనార్హం.

- నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం కల్లూర్ గ్రామంలోని ఒక బ్యాంకుకు చెందిన కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకురాలి ఇంటిని బుధవారం వేలం వేశారు. సీఎస్పీ సెంటర్ నిర్వహించే సంధ్య.. పొదుపు సంఘాల ద్వారా మహిళలు సేకరించిన డబ్బులను బ్యాంకులో జమ చేయకుండా సుమారు రూ.40 లక్షలు సొంతానికి వాడుకుంది. ఇటీవల ఈ విషయాన్ని గుర్తించిన బాధిత మహిళలు నిర్వాహకురాలిని నిలదీయడంతో కొంత గడువు కావాలని కోరింది. అయితే గడువు ముగిసినా డబ్బులు చెల్లించకపోవడంతో సీఎస్పీ ఇంటిని బుధవారం స్థానికుల సహకారంతో మహిళా సంఘాల సభ్యులు వేలం వేశారు. వేలంలో గ్రామానికి చెందిన ఒకరు రూ.14 లక్షల 80 వేలకు ఇంటిని సొంతం చేసుకున్నట్లు ఐకేపీ సిబ్బంది వెల్లడించారు. ఇంతకు ముందు సంధ్య రూ.6 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేసినట్టు వారు తెలిపారు.



డిబేట్ కోసం ప్రత్యర్థులిద్దరూ ఏబీసీ వేదికపైకి రాగానే హారిసే చొరవ తీసుకుని ట్రంప్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. తద్వారా ముందే పైచేయి సాధించారు. డిబేట్ చక్కగా సాగాలని ఆమె ఆకాంక్షించగా, 'హావ్ ఫన్' అంటూ ట్రంప్ స్పందించారు.

గంటా నలభై ఐదు నిమిషాల పాటు సాగిన డిబేట్ ముగిశాక మాత్రం కరచాలనం వంటివేమీ లేకుండానే ఎవరికి వాళ్లు వేదిక నుంచి నిష్క్రమించారు.

డిబేట్ పొడవునా హారిస్ పదేపదే ట్రంప్‌ను ఉడికించే వ్యాఖ్యలు చేశారు. పలు కేసుల్లో ఆయన దోషి అని ఇప్పటికే నిరూపణ అయిందంటూ ఎత్తిచూపారు. ఆయనపై మరెన్నో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. ట్రంప్ మాట్లాడుతుండగా పదేపదే నవ్వులు, ప్రశ్నార్థక చూపులతో ఆయన్ను ఒత్తిడిలోకి నెట్టారు.

ఈ ఎత్తుగడలన్నీ బాగా ఫలించాయి. హారిస్ ఇలాంటి విమర్శలు చేసినప్పుడల్లా ట్రంప్ తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఆగ్రహంలో అదుపు తప్పి పదేపదే అబద్ధాలు, అవాస్తవాలు చెప్పారు.

ఆఫ్రో అమెరికన్ల ఓట్ల కోసం హారిస్ ఇటీవల ఆమె నల్లజాతి మూలాలను పదేపదే చెప్పుకుంటున్నారన్న తన గత వ్యాఖ్యలపై స్పందించేందుకు ట్రంప్ నిరాకరించారు. హారిస్ మాత్రం పలు సందర్భాల్లో ట్రంప్ చేసిన వివాదాస్పద జాతి వివక్షపూరిత, విద్వేష వ్యాఖ్యలన్నింటినీ ఏకరువు పెట్టారు.

హారిస్‌కే 63 శాతం మంది ఓటు

- డిబేట్‌లో ట్రంప్‌ను హారిస్ చిత్తు చేశారని సీఎన్ఎన్ వార్తా సంస్థ నిర్వహించిన ఫ్లాష్ పోల్‌లో 63 శాతం మంది పేర్కొన్నారు!
- ట్రంప్‌కు బాగా అనుకూలమని పేరున్న ఫాక్స్ న్యూస్ కూడా డిబేట్ విజేత హారిసేనని అంగీకరించడం విశేషం.
- చర్చకు వేదికైన ఏబీసీ న్యూస్ అభ్యర్థులిద్దరి వ్యాఖ్యలు, ప్రకటనలను లైవ్‌లో అప్పటికప్పుడు ఫ్యాక్ట్ చెక్ చేసింది. ట్రంప్ చెప్పిన వాటిలో చాలావరకు అవాస్తవాలేనని తేలడం విశేషం.

కమలదే పైచేయి!

డిబేట్లో ట్రంప్ బేజారు ● ప్రశ్నలకు నీళ్లు నమిలిన ట్రంప్



వాషింగ్టన్: అంతా అత్యంత ఉత్కంఠతో ఎదురుచూసిన తొలి, బహుశా ఏకైక ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ (59)దే పైచేయి అయింది. ఆమె దూకుడు ముందు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ (78) వెలవెలబోయారు. మంగళవారం రాత్రి పెన్సిల్వేనియాలో ఏబీసీ వార్తా సంస్థ వేదికగా జరిగిన డిబేట్లో మాజీ అధ్యక్షునిపై హారిస్ ఆద్యంతం స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించారు. దాదాపుగా ప్రతి అంశంలోనూ ట్రంప్‌ను చిత్తు చేశారు. ఆమె పక్కాగా హోం వర్క్ చేసి వచ్చిన తీరు డిబేట్‌లో అడుగడుగునా కన్పించింది. తొలుత కాస్త తడబడ్డా డిబేట్ సాగుతున్న కొద్దీ హారిస్ దూకుడు కనబరిచారు. పదునైన పంచ్‌లతో, టైమ్లీ వన్ లైనర్లతో ఎక్కడికక్కడ ట్రంప్‌ను ఇరుకున పెట్టారు. ఆర్థిక వ్యవస్థ మొదలుకుని విదేశీ విధానం, వలసలు, అబార్షన్ల దాకా ప్రతి అంశం మీదా చర్చను తను కోరుకున్న దిశగా నడిపించడంలో విజయవంతమయ్యారు. పూర్వాశ్రమంలో లాయర్ అయిన హారిస్ వాదనా పటిమ ముందు ట్రంప్ నిలువలేకపోయారు. చాలావరకు ఆమె ప్రశ్నలకు, లేవనెత్తిన అంశాలకు వివరణలు ఇచ్చుకోవడానికే పరిమితమయ్యారు. తొలి ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో అధ్యక్షుడు జో బైడెన్‌ను ట్రంప్ ఓ ఆటాడుకోవడం తెలిసిందే. ట్రంప్ పచ్చి అబద్ధాలు చెప్పినా బైడెన్ కనీసం వాటిని వేలెత్తి చూపలేకపోయారు. పైగా ప్రసంగం మధ్యలో పదేపదే ఆగుతూ, పదాల కోసం తడుముకుంటూ, వయోభారంతో వణుకుతూ అభాసుపాలయ్యారు. ఈ దారుణ వైఫల్యంతో చివరికి పోటీ నుంచే బైడెన్ తప్పుకోవాల్సి వచ్చింది. ఆయన స్థానంలో అధ్యక్ష రేసులోకి వచ్చిన హారిస్ మాత్రం తాజా డిబేట్లో ట్రంప్‌కు చెమటలు పట్టించారు. ''మన దేశాన్ని ఎలా నడపాలన్న ప్రధానాంశంపై ఈ రాత్రి మీరు ఇంతసేపూ రెండు భిన్నమైన వాదనలు విన్నారు. ఒకటి భవిష్యత్తుపై దృష్టి పెట్టిన నా వాదన. రెండోది గతం గురించి మాత్రమే మాట్లాడిన, దేశాన్ని వెనక్కే తీసుకెళ్లజూస్తున్న ట్రంప్ వాదన'' అంటూ డిబేట్‌ను అంతే ప్రభావవంతంగా ముగించారు హారిస్.

ట్రంప్‌పై హారిస్ పంచ్‌లు

- ట్రంప్ ఓ బలహీన నాయకుడు. తప్పుడు నేత. ఆయన్ను చూసి ప్రపంచ దేశాధినేతలంతా నవ్వుతున్నారు.
- అధ్యక్ష పదవికి ట్రంప్ కళంకమని ఆయనతో కలిసి పని చేసిన సైనిక ఉన్నతాధికారులే అంటున్నారు.
- ట్రంప్ అంటేనే అబద్ధాలు, అభూత కల్పనలు. ఈ డిబేట్లో కూడా ఆయన చేసేదదే.
- ట్రంప్ ఎంతసేపూ తన గురించే మాట్లాడతారు. ప్రజలు ఆయనకు అసలే పట్టరు. దేశానికి కావాల్సింది ప్రజల కోసం పాటుపడే నాయకుడే తప్ప ట్రంప్ వంటి స్వార్థపరుడు కాదు.
- ఆయన 2020 ఎన్నికల్లో ఓడిపోయారు. 8.1 కోట్ల మంది ఆయనకు అధ్యక్ష పదవి నుంచి ఉద్వాసన పలికారు (బైడెన్‌కు ఓటేసిన వారి సంఖ్యను ఉటంకిస్తూ). దాన్ని ట్రంప్ ఇప్పటికీ అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు.

2020 ఎన్నికల ఫలితాలపై

ట్రంప్: వాటిలో నిజమైన విజేతను నేనే. క్యాపిటల్ హిల్ భవనంపై దాడితో నాకు సంబంధం లేదు.

హారిస్: అమెరికా చరిత్రపై చెరగని మచ్చ ఏదన్నా ఉంటే అది కాపిటల్ హిల్‌పై దాడే. దాన్ని మర్చిపోయి ముందుకు సాగాలి.

అబార్షన్‌పై

హారిస్
- ట్రంప్ గెలిస్తే అబార్షన్లను నిషేధిస్తూ చట్టం తెస్తారు.
- గర్భధారణలు, అబార్షన్లను ప్రభుత్వం వేయి కళ్లతో గమనిస్తుంటుంది.
- అమెరికన్ల శరీరాలకు సంబంధించిన కీలక నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోరాదన్నదే నా వైఖరి.
- ట్రంప్ మాత్రం మహిళల శరీరాలపై హక్కులు ప్రభుత్వాలవేనంటున్నారు.

ట్రంప్
- అబార్షన్లపై నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉండాలన్నదే నా విధానం.
- అదిప్పటికే అమల్లో ఉంది. కనుక దీనిపై అసలు గొడవ గానీ, భిన్నాభిప్రాయాలు గానీ లేవు.
- అంతే తప్ప నేనేమీ అబార్షన్లను నిషేధించబోవడం లేదు.
- ఈ విషయంలో హారిస్ చెప్పేవన్నీ అబద్ధాలే.

ఎన్నికల ర్యాలీలపై

హారిస్
- ట్రంప్ ఎన్నికల ర్యాలీలు ఆద్యంతం పరమ బోరుగా సాగుతున్నాయి.
- జనాన్ని ఆకట్టుకునేలా మాట్లాడటంలో ఆయన ఘోరంగా విఫలమవుతున్నారు.
- విండ్ మిల్లుల వల్ల క్యాన్సర్ వస్తుంది వంటి కామెంట్లతో అభాసుపాలవుతున్నారు.
- ట్రంప్ ప్రసంగం వినలేక జనం మధ్యలోనే వెళ్లిపోతున్నారు.

ట్రంప్
- అన్నీ శుద్ధ అబద్ధాలు. బైడెన్–హారిస్ విధానాలతో అమెరికా అన్ని రంగాల్లోనూ కుదేలవుతోంది. అందుకే అమెరికన్లు పాత రోజులను కోరుకుంటున్నారు.
- దాంతో నా ర్యాలీలకు జనం పోటెత్తుతున్నారు.
- వాటికి అమెరికా చరిత్రలోనూ అపూర్వమైన ఆదరణ దక్కుతోంది.
- హారిస్ తన ర్యాలీలకు డబ్బులిచ్చి జనాన్ని రప్పించుకుంటున్నారు.

ఆర్థిక వ్యవస్థపై

ట్రంప్: ఈ విషయంలో నేనేం చేయబోతున్నదీ అందరికీ తెలుసు. నా హయాంలో కరోనా కల్లోలాన్ని తట్టుకుంటూ అమెరికా ఆర్థిక వ్యవస్థను గొప్పగా మలిచా. దాన్ని మరోసారి చేసి చూపిస్తా. పన్నులకు భారీగా కోత పెడతా. హారిస్ మార్క్సిస్టు. మార్క్సిస్టు తండ్రి నుంచి పాఠాలు నేర్చుకున్నారు. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్థిక విధానాల్లో ఆమె ఇప్పుడు నా భాషనే మాట్లాడుతున్నారు. కానీ గెలిచారంటే మాత్రం దేశాన్ని సర్వనాశనం చేస్తారు. బైడెన్‌కు, ఆమెకు తేడా లేదు.

హారిస్: నేను బైడెన్‌నూ కాను, ట్రంప్‌ను అంతకన్నా కాను. ఈ విషయంలో నేను చెప్పదలచుకున్నది ఒక్కటే. దేశానికి కొత్త తరం నాయకత్వాన్ని అందిస్తా. ఉత్త మాటలే తప్ప నిజానికి ఆర్థిక వ్యవస్థను మెరుగు పరిచేందుకు ట్రంప్ వద్ద ఎలాంటి ప్రణాళికా లేదు. తన క్షేమం తప్ప ఆయనకు మీరెవరూ పట్టరు. మధ్యతరగతి నేపథ్యం నుంచి వచ్చిన నాకు ఆర్థికంగా దేశానికి ఏం కావాలో బాగా తెలుసు.

వలసలపై

ట్రంప్: సరిహద్దుల నుంచి లక్షలాది మంది చొరబడుతున్నారంటే వలసల వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న హారిసే ప్రధాన కారణం. వాళ్లు మన పెంపుడు జంతువులను కూడా తినేస్తున్నారు. ఈ చొరబాట్లు అమెరికాకు చాలా చేటు చేస్తాయి.

హారిస్: ట్రంప్ వల్లే వలసల బిల్లు బుట్టదాఖలైందని విమర్శించడం మినహా ఈ అంశంపై పెద్దగా ఏమీ మాట్లాడలేదు. వలసదారులు పెంపుడు జంతువులను తింటున్నారన్న ట్రంప్ వ్యాఖ్యలపై అమెరికన్లే పెదవి విరుస్తున్న నేపథ్యంలో వాటిపై వ్యూహాత్మక మౌనం పాటించారు.

యుద్ధాలు, విదేశీ వ్యవహారాలపై...

ట్రంప్
- నేను గెలిస్తే ఉక్రెయిన్ యుద్ధానికి ఒక్క రోజులో ముగింపు పలుకుతా. నేను ప్రెసిడెంట్‌గా ఉంటే యుద్ధం జరిగేదే కాదు. (ఉక్రెయిన్ గెలవాలనుకుంటున్నారా అన్న మోడరేటర్ల ప్రశ్నకు బదులు దాటవేశారు. పైగా యుద్ధానికి మిలియన్ల మంది బలయ్యారని అవాస్తవాలు చెప్పారు)
- 2021లో అఫ్గానిస్తాన్ నుంచి అమెరికా సైన్యం వైదొలగడం దేశ చరిత్రలోనే అత్యంత సిగ్గుచేటైన సందర్భం.
- ఇజ్రాయెల్‌ను హారిస్ ద్వేషిస్తారు. హారిస్ గెలిస్తే రెండేళ్లలోనే ఇజ్రాయెల్ సర్వనాశనం ఖాయం. అరబ్బులన్నా ఆమెకు ద్వేషమే.

హారిస్
- అఫ్గాన్ నుంచి వైదొలగాలన్న బైడెన్ నిర్ణయం నాటి పరిస్థితుల్లో పూర్తిగా సబబే. ట్రంప్ తాలిబన్లతో అత్యంత బలహీన ఒప్పందం చేసుకున్నారు.
- నియంతలంటే ట్రంప్‌కు మహా ఆరాధన.
- నేను ఇజ్రాయెల్‌ను ద్వేషిస్తానన్నది పచ్చి అబద్ధం. యూదు రాజ్యాన్ని మొదటినుంచీ సమర్థిస్తున్నా. అక్టోబర్ 7 దాడి తర్వాత ఇజ్రాయెల్‌కు స్వీయరక్షణకు అన్ని హక్కులూ ఉన్నాయి. కానీ అమాయక పాలస్తీనియన్లు భారీ సంఖ్యలో యుద్ధానికి బలవుతున్నారన్నది కూడా వాస్తవమే. కనుక యుద్ధం తక్షణం ఆగాలి. కాల్పుల విరమణ, బందీల విడుదలే అందుకు మార్గం. దానికోసం కృషి చేస్తా.



కమలా హారిస్‌కే ఓటు

టేలర్ స్విఫ్ట్ ప్రకటన

వాషింగ్టన్: డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మద్దతిస్తున్న ప్రముఖుల జాబితా నానాటికీ పెరిగిపోతోంది. తాజాగా అమెరికన్ పాప్ స్టార్ టేలర్ స్విఫ్ట్ కూడా హారిస్‌కు మద్దతు పలికారు. బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) రిపబ్లికన్ల అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో హారిస్ తొలి డిబేట్ ముగిసిన కాసేపటికే స్విఫ్ట్ తన ఇన్‌స్టాగ్రాం ఖాతాలో ఈ మేరకు పోస్ట్ పెట్టారు. హారిస్‌ను యోధురాలిగా అభివర్ణించారు. నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ఆమెకే ఓటేస్తానని స్పష్టం చేశారు. 'నా ఓటు హారిస్‌కే. ఎందుకంటే ఆమె సమర్థురాలైన, ప్రతిభావంతురాలైన నేత. మన హక్కుల కోసం పోరాడుతున్నారు. అన్నివిధాలా పరిశీలించిన మీదటే నాకు ప్రెసిడెంట్‌గా హారిస్‌ను ఎంపిక చేసుకున్నా. మీరూ లోతుగా పరిశీలించి ఎంపిక చేసుకోండి'' ఆమె అమెరికన్లకు పిలుపునిచ్చారు. నిస్సంతు అంటూ హారిస్‌పై ట్రంప్ రన్నింగ్ మేట్ జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలకు కూడా స్విఫ్ట్ కౌంటరిచ్చారు. తాను పిల్లితో ఉన్న ఫొటోను పోస్టుకు జత చేసి, 'టేలర్ స్విఫ్ట్.. చైల్డ్ లెస్ క్యాట్ లేడీ' అంటూ క్యాప్షన్ పెట్టారు.

నీకో పాపనిస్తా

టేలర్ స్విఫ్ట్‌కు మస్క్ ఆఫర్

టేలర్ స్విఫ్ట్ 'చైల్డ్ లెస్ క్యాట్ లేడీ' వ్యాఖ్యలపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యంగ్యంగా స్పందించారు. ''నీకో పాపాయినిస్తా. నీ పిల్లులను కూడా నా ప్రాణాలు అడ్డు పెట్టి కాపలా కాస్తా'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మూల్యం తప్పదు

హారిస్‌కు స్విఫ్ట్ మద్దతుపై ట్రంప్

హారిస్‌కు టేలర్ స్విఫ్ట్ మద్దతు తనకేమీ ఆశ్చర్యం కలిగించలేదని ట్రంప్ అన్నారు. ''ఆమె ఎప్పుడూ డెమొక్రాట్ల మద్దతుదారే. అయితే తాజా ప్రకటనకు మార్కెట్లో స్విఫ్ట్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి రావచ్చు''అన్నారు.

ప్రపంచమంతా ఇండియా చిప్‌లు

- దేశంలో సెమీ కండక్టర్ల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం
- పారిశ్రామికవేత్తలు ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టాలి
- 'సెమీకాన్–2024' సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

గ్రేటర్ నోయిడా: దేశంలో సెమీ కండక్టర్ల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని, ఈ రంగంలో భారీగా పెట్టుబడులు రాబట్టడానికి చర్యలు ప్రారంభించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. బుధవారం నోయిడాలో 'సెమీకాన్–2024' సదస్సులో ఆయన ప్రసంగించారు. ఇండియాలో ఎలక్ట్రానిక్స్ రంగం విలువ 150 బిలియన్ డాలర్లకు చేరిందని తెలిపారు. ఈ దశాబ్దం ఆఖరు నాటికి దీన్ని 500 బిలియన్ డాలర్లు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో 60 లక్షల కొత్త ఉద్యోగాలు రాబోతున్నాయని స్పష్టం చేశారు. ఈ రంగంలో వృద్ధితో సెమీకండక్టర్ రంగం లబ్ధి పొందుతుందని ఉద్ఘాటించారు. దేశంలో ఉపయోగించే ఎలక్ట్రానిక్స్ పరికరాలు వంద శాతం ఇక్కడే తయారు కావాలన్నది తమ ధ్యేయమన్నారు.

85 వేల మందికి శిక్షణ

భారత్‌లో అమలవుతున్న సంస్కరణలు, స్థిరమైన ప్రభుత్వ విధానాలు పెట్టుబడులకు ఊతం ఇస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలో సెమీ కండక్టర్ల తయారీ రంగంలో అద్భుత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాలు ఉపయోగించుకోవాలని, పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలని దేశ విదేశీ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఇతర దేశాల్లో చిప్‌లకు డిమాండ్ తగ్గినా, భారత్‌లో మాత్రం పెరుగుతూనే ఉంటుందని స్పష్టంచేశారు. ప్రపంచవ్యాప్తంగా తయారయ్యే ప్రతి ఎలక్ట్రానిక్ పరికరంలో భారత్‌లో తయారైన చిప్ ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని వ్యాఖ్యానించారు. సెమీకండక్టర్ల డిజైనింగ్, తయారీ కోసం 85 వేల మందిని నిపుణులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. వీరిలో సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లు, ఆర్అండ్‌డీ నిపుణులు ఉంటారని వెల్లడించారు. ప్రపంచంలో ఎక్కడా కనిపించని 3డీ పవర్(త్రి–డైమెన్షనల్ పవర్) ఇండియాలో ఉందని ప్రధానమంత్రి మోదీ తెలియజేశారు.





ప్రత్యక్షప్రసారం చేయాలి

మమత సమక్షంలోనే చర్చలు

- 30 మందిని అనుమతించాలి
- జూనియర్ డాక్టర్ల షరతులు
- కుదిరే పనికాదన్న సర్కారు

కోల్‌కతా: నెలరోజులకు పైగా విధులను బహిష్కరిస్తున్న జూనియర్ డాక్టర్లతో చర్చలకు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం వరుసగా రెండోరోజు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ముఖ్యమంత్రి సమక్షంలోనే చర్చలు జరగాలని జూనియర్ డాక్టర్లు పట్టుబట్టారు. అలాగే చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయాలని, తమ తరఫున 30 మంది ప్రతినిధుల బృందాన్ని చర్చలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. సచివాలయం నబన్నాలో బుధవారం సాయంత్రం 6 గంటలకు చర్చలకు రావాలని బెంగాల్ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ జూనియర్ డాక్టర్లకు ఈ–మెయిల్ ద్వారా ఆహ్వానాన్ని పంపారు. 12 నుంచి 15 మంది రావాలని కోరారు. సీఎం మమతా బెనర్జీ నేరుగా చర్చల్లో పాల్గొనే విషయాన్ని సీఎస్ మెయిల్‌లో ధృవీకరించలేదు. చట్టానికి బద్ధులై ఉండే పౌరులుగా సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించడం ప్రతి ఒక్కరి విధి అయినప్పటికీ జూనియర్ డాక్టర్లు దానికి కట్టుబడలేదని పంత్ పేర్కొన్నారు. దీనిపై సాయంత్రం 5:23 గంటలకు జూనియర్ డాక్టర్లు విలేకరుల సమావేశంలో స్పందించారు. 'సీఎం మమతా బెనర్జీ సమక్షంలోనే చర్చలు జరగాలి. టీవీల్లో ప్రత్యక్షప్రసారం ఉండాలి. పలు మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులకు చెందిన జూనియర్ డాక్టర్లు ఆందోళనలో పాలుపంచుకొంటున్నందున కనీసం 30 మందిని చర్చలకు అనుమతించాలి' అని జుడాల ఫోరం ప్రకటించింది.

షరతులకు ఒప్పుకోం

బేషరతుగా చర్చలకు రావాలని, జూనియర్ డాక్టర్లు పెట్టిన ఏ షరతునూ అంగీకరించడానికి బెంగాల్ సర్కారు సిద్ధంగా లేదని ఆరోగ్యమంత్రి చంద్రిమా భట్టాచార్య స్పష్టం చేశారు. షరతులు పెట్టారంటే వారు మనస్ఫూర్తిగా చర్చలకు సిద్ధంగా లేరని అర్థమన్నారు.

చైనాను అడ్డుకోలేకపోయారు

- డ్రాగన్ ఆధీనంలో 4 వేల చదరపు కి.మీ. భారత భూభాగం
- ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ ధ్వజం

వాషింగ్టన్: అమెరికా పర్యటనలో పలు అంశాలపై పదునైన వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తాజాగా చైనా అంశాన్ని ప్రస్తావించారు. అమెరికాలోని ప్రతిష్టాత్మక నేషనల్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన పత్రికాసమావేశంలో మాట్లాడారు. '' 4,000 చదరపు కి.మీ.ల భారత భూభాగంలో చైనా బలగాలు తిష్టవేసిన ఉదంతంలో మోదీ సమర్థవంతంగా వ్యవహరించారా అంటే కాదు అనే చెప్తా. లద్దాఖ్‌లో ఢిల్లీ అంత పరిమాణంలో భూభాగాన్ని చైనా బలగాలు ఆక్రమించాయి. ఇది తీవ్ర వైఫల్యం. ఒక వేళ అమెరికాకు చెందిన 4వేల చదరపు కి.మీ.ల భూభాగాన్ని పొరుగుదేశం ఆక్రమిస్తే అమెరికా ఊరుకుంటుందా? ఎలా స్పందిస్తుంది?. ఈ విషయాన్ని అద్భుతంగా చక్కదిద్దానని అమెరికా అధ్యక్షుడు చేతులు దులిపేసుకుంటాడా?. అందుకే ఈ కోణంలో చూస్తే మోదీ చైనా విషయంలో విఫలమయ్యారు''అని అన్నారు. '' అమెరికా– భారత్ సంబంధాల విషయంలో మోదీని సమర్థిస్తా. ఎందుకంటే కాంగ్రెస్ హయాంలో అనుసరించిన విధానాలనే ఇప్పుడు మోదీ కొనసాగిస్తున్నారు. అయితే భారత అంతర్గత అంశాల్లో అమెరికా ప్రమేయాన్ని నేను ఏమాత్రం ఒప్పుకోను. భారత్‌లో ప్రజాస్వామ్యం మెరుగు కోసం దేశీయంగా జరుగుతున్న పోరు ఇండియా సొంత విషయం. దీనిని మేమే పరిష్కరించుకుంటాం'' అని రాహుల్ అన్నారు.

నిరాధార ఆరోపణలు: రాజ్‌నాథ్

భారత భూభాగాన్ని చైనా ఆక్రమించిందన్న రాహుల్ వ్యాఖ్యలపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ స్పందించారు. '' లోక్‌సభలో విపక్షనేత హోదాలో ఉన్న వ్యక్తి ఇలా తప్పుడు, నిరాధార, అబద్ధపు వ్యాఖ్యానాలు చేయడం నిజంగా సిగ్గుచేటు. అసంబద్ధంగా మాట్లాడి విదేశీ గడ్డపై భారత పరువు తీస్తున్నారు. గురుద్వారాకు వెళ్లే సిక్కులు తలపాగా ధరించడానికి కూడా పోరాడాల్సి వస్తోందని రాహుల్ సత్యదూరమైన వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ప్రేమ దుకాణాలు తెరిచానని చెప్పుకుని తిరిగే రాహుల్ .. అబద్ధాల దుకాణాలు నడుపుతున్నారు'' అని రాజ్‌నాథ్ అన్నారు.



బెయిల్‌పై విడుదలైన రషీద్

న్యూఢిల్లీ: ఉగ్రనిధుల కేసులో తిహార్ జైలులో ఉన్న బారాముల్లా ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్ ఢిల్లీ కోర్టు బెయిల్ నేపథ్యంలో బుధవారం విడుదలయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లాను ఓడించిన ఆయన అభ్యర్థన మేరకు జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార నిమిత్తం అక్టోబర్ 2 దాకా అదనపు సెషన్స్ జడ్జి మధ్యంతర బెయిలివ్వడం తెల్సిందే. రషీద్‌కు చెందిన అవామీ ఇత్తెహాద్ పార్టీ ఎన్నికల్లో పోటీచేస్తోంది. విడుదలయ్యాక ఆయన మీడియాతో మాట్లాడారు. ''ఒమర్ అబ్దుల్లా, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ కశ్మీర్‌ను నాశనం చేశారు. కశ్మీర్ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తా. ఐదున్నరేళ్లు నేను జైల్లో మగ్గిపోతే ఒమర్ లండన్‌లో దాక్కున్నారు. కశ్మీర్‌కు మేలు చేశానంటూ ప్రధాని మోదీ చెబుతున్నవన్నీ కట్టుకథలని నిరూపిస్తా. కశ్మీర్‌లో శాశ్వత శాంతికి కృషిచేస్తా. కశ్మీరీలంటే రాళ్లు రువ్వే బృందాలన్న మచ్చ పోగొడతా'' అని అన్నారు.

70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఆరోగ్య బీమా

న్యూఢిల్లీ: డెబ్బై ఏళ్లు, ఆ పైబడిన వృద్ధుల ఆరోగ్య సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆదాయంతో నిమిత్తం లేకుండా వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధాన్‌మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) కింద రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమాకు కేంద్ర కేబినెట్ అంగీకారం తెలిపింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ పలు ప్రతిపాదనలను ఆమోదించింది. అర్హులైన లబ్ధిదారులకు త్వరలో కొత్త కార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపింది.

కుటుంబసభ్యులు ఏబీపీఎంజేఏవై కింద లబ్ధిదారులుగా ఉన్నా 70 ఏళ్లు, ఆపై వయసు సీనియర్ సిటిజన్లకు విడిగా ఏటా రూ.5 లక్షల ఆరోగ్యబీమా కల్పించనున్నారు. వృద్ధులు ప్రైవేట్ ఆరోగ్య బీమా పాలసీలు, ఈఎస్ఐ పథకంలో ఉన్నా ఈ పథకం వర్తిస్తుంది. కేంద్రప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్ఎస్), మాజీ సైనికుల కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఈసీహెచ్ఎస్), ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) పథకాల లబ్ధి పొందుతున్న వాళ్లు మాత్రం వాటినో, ఏబీపీఎంజేఏవైనో ఏదో ఒకదానినే ఎంచుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో 4.5 కోట్ల కుటుంబాల్లోని వృద్ధులకు మేలు చేకూరనుంది. ఏబీపీఎంజేఏవై ప్రపంచంలోనే ప్రభుత్వరంగంలో అమలవుతోన్న అతిపెద్ద ఆరోగ్యబీమా పథకమని కేంద్రం తెలిపింది. 12.34 కోట్ల కుటుంబాల్లోని 55 కోట్ల మందికి ఈ పథకం లబ్ధిచేకూరుస్తుందని కేంద్రం పేర్కొంది. వయసుతో సంబంధంలేకుండా కుటుంబంలోని అందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద ఇప్పటికే 7.37 కోట్ల మంది ఆస్పత్రిలో వైద్య సేవలు పొందారు. వీరిలో 49 శాతం మంది మహిళలే ఉన్నారు. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చుచేసింది. తొలినాళ్లలో జనాభాలో దిగువ తరగతి 40 శాతం మంది ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. తర్వాత 2022 జనవరిలో లబ్ధిదారుల సంఖ్యను 12 కోట్ల కుటుంబాలకు పెంచింది. తర్వాత 37 లక్షల ఆశా/అంగన్‌వాడీ/ఏడబ్ల్యూహెచ్ఎస్‌లకూ వర్తింపజేశారు.

31వేల మెగావాట్ల హైడ్రో ప్రాజెక్టులకూ గ్రీన్ సిగ్నల్

రూ.12,461 కోట్ల వ్యయంతో మొత్తంగా 31,350 మెగావాట్ల సామర్థ్యంతో జలవిద్యుత్ ప్రాజెక్టులకూ కేబినెట్ ఓకే చెప్పింది.

- పీఎం గ్రామ్ సడక్ యోజన–4 కింద అదనంగా 62,500 కి.మీ. మేర రోడ్ల నిర్మాణానికి కేబినెట్ సరేనంది. కొత్తగా 25వేల జనావాసాలను కలుపుతూ ఈ రోడ్లను నిర్మించనున్నారు. ఈ మార్గాల్లో వంతెనలనూ ఆధునీకరించనున్నారు.
- విద్యుత్ వాహనాలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన పీఎం ఈ–డ్రైవ్, పీఎం–ఈబస్ సేవా–పేమెంట్ సెక్యూరిటీ మెకానిజం పథకాల అమలు కోసం రూ.14,335 కోట్లు కేటాయించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. విద్యుత్ ద్విచక్ర, త్రిచక్ర, అంబులెన్స్, ట్రక్కు, ఇతర వాహనాలపై రూ.3,679 కోట్ల మేర సబ్సిడీ ప్రయోజనాలు పౌరులకు కల్పించనున్నారు.
- ముందస్తు వాతావరణ అంచనా వ్యవస్థలను మరింత బలోపేతం చేయనున్నారు. రెండేళ్లలో రూ.2,000 కోట్ల వ్యయంతో 'మిషన్ మౌసమ్'ను అమలుచేయనున్నారు. భారత వాతావరణ శాఖతో పాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటరాలజీ, నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ విభాగాల ద్వారా ఈ మిషన్‌ను అమలు చేయనున్నారు.

కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణంపై సీబీఐ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ కస్టడీని రౌజ్ అవెన్యూ కోర్టు ఈ నెల 25 దాకా పొడిగించింది. మరో నిందితుడు ఆప్ నేత దుర్గేశ్ పాఠక్‌కు బెయిల్ మంజూరు చేసింది. సెప్టెంబరు 3న కేజ్రీవాల్, పాఠక్, ఇతరులపై సీబీఐ దాఖలు చేసిన చార్జిషీటును రౌజ్ అవెన్యూ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. కేజ్రీవాల్‌పై విచారణ జరపడానికి తగినన్ని ఆధారాలున్నాయని పేర్కొంది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అరుణ్ రామచంద్ర పిళ్లైకి మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ హైకోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. పిళ్లైని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఈ ఏడాది మార్చి 6న అరెస్టు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవితకు పిళ్లై అత్యంత సన్నిహితుడని, ఢిల్లీ ఎక్సైజ్ పాలసీని మార్చేందుకు ఆప్ నేతలతో జరిగిన సమావేశాల్లో సౌత్‌గ్రూపునకు ప్రాతినిధ్యం వహించినట్టు ఈడీ పేర్కొంది.

సాక్షి హైదరాబాద్

గురువారం ❘ 12 ❘ సెప్టెంబర్ ❘ 2024



బర్త్‌డే పార్టీలో గంజాయి కలకలం

బర్త్‌డే పార్టీలోనూ గంజాయి గుప్పుమంది. సైబరాబాద్ కమిషనరేట్‌కు కూతవేటు దూరంలో జరిగిన పుట్టినరోజు వేడుకలో గంజాయి సేవించడం కలకలం రేపింది. -8లో



ఐటీ.. డివోటీ

ఉరుకులు పరుగుల జీవితంలో కొందరు ఐటీ ఉద్యోగులు దైవ చింతన వైపు అడుగులు వేస్తున్నారు. నగరంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. - సిటీ ప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/24.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 29, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.





కొత్వాల్ సాబ్ జర దేఖో!

ఉల్లంఘనులపై మీ మార్కు చూపించరూ!!

నగరవాసికి ట్రాఫిక్ నరకం చూపిస్తోంది. ఎక్కడపడితే అక్కడ ఉల్లంఘనలు, ఎప్పుడుపడితే అప్పుడు ట్రాఫిక్‌జాంలు తప్పట్లేదు. వాహనాలను నియంత్రించాల్సిన ట్రాఫిక్ విభాగం సిబ్బంది కెమెరాలు, ట్యాబ్‌లు చేతపట్టి ఈ–చలాన్లకే పరిమితమవుతున్నారు. చౌరస్తాలతో పాటు కొన్ని ప్రాంతాల్లోనే ఉంటూ ఈ డ్రైవ్స్ చేస్తున్నారు. దీంతో మిగిలిన ప్రాంతాల్లో ఎక్కడికక్కడ ఉల్లంఘనులు రెచ్చిపోతున్నారు. రహదారులపై దూసుకుపోతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ట్రాఫిక్ పోలీసులు ఉల్లంఘనల్ని ప్రధానంగా మూడు కేటగిరీలుగా విభజిస్తారు. వాహనం నడిపే వ్యక్తికి ముప్పు కలిగించేవి, ఎదుటి వారికి ముప్పుగా మారేవి, వాహన చోదకుడితో పాటు ఎదుటి వ్యక్తికీ ముప్పును తెచ్చిపెట్టేవి. ట్రిపుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్.. ఇలా ఇవన్నీ మూడో కేటగిరీ కిందికి వస్తాయి. రాజధానిలో మూడో కేటగిరీకి చెందిన ఉల్లంఘనలే ఎక్కువగా ఉంటున్నాయి. రెండోసారి సిటీ కొత్వాల్‌గా వచ్చిన సీపీ ఆనంద్‌కు ట్రాఫిక్ విభాగంపై మంచి పట్టుంది. గతంలో సుదీర్ఘకాలం సిటీ ట్రాఫిక్ చీఫ్‌గా వ్యవహరించారు. అప్పట్లో ఆయన వేసుకున్న మార్కు ఇప్పటికీ పదిలమే. సైబరాబాద్, హైదరాబాద్ సీపీలుగా పని చేసినప్పుడూ అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. ట్రాఫిక్‌పై సీపీ ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నగర వాసులు కోరుతున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

సీఎం షటిల్ జోష్



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హిమాయత్‌సాగర్‌లోని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో బుధవారం జరిగిన నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్)లో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన సరదాగా షటిల్ ఆడారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఒకవైపు, పట్నం మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ సి.వి.ఆనంద్ మరో వైపు ఉండి షటిల్ ఆడారు.

‘శిక్ష’లపై సమీక్ష!

నగరంలో కొన్నాళ్లుగా ఎడాపెడా ‘చర్యలు’

- కొత్వాల్‌కు సిబ్బంది నుంచి వినతుల వెల్లువ
- సమీక్షించి నిర్ణయం తీసుకోనున్న సీపీ ఆనంద్



సౌత్ వెస్ట్ జోన్ అధికారులతో సమీక్షిస్తున్న సీపీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: నగర కమిషనరేట్‌కు రెండోసారి కొత్వాల్‌గా వచ్చిన సీపీ ఆనంద్ అధికారులు, సిబ్బంది సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా గడిచిన కొన్ని నెలలుగా ఉన్నతాధికారులు విధించిన ‘శిక్ష’లను సమీక్షించాలని నిర్ణయించారు. కొన్నాళ్లుగా నగర కమిషనరేట్‌లో మెమోలు, చార్జ్‌మెమోలతో పాటు బదిలీలు, సరెండర్లు, సస్పెన్షన్లు వంటి ‘శిక్ష’లు ఏకపక్షంగా, అకారణంగా జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా కొన్ని జోన్లలోనే వీటి బాధితులు ఎక్కువగా ఉన్నారు. సాధారణంగా ఎవరైనా తమకు ఇలాంటి పనిష్మెంట్లు ఎదురైతే అత్యున్నత అధికారులకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. కాగా.. అనివార్య కారణాల నేపథ్యంలో చాలాకాలం మిన్నకుండిపోయిన అధికారులు, సిబ్బంది సోమవారం నుంచి తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీ ఐసీసీసీ) ఉన్న హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ బాటపట్టారు. కొత్త కొత్వాల్ సీపీ ఆనంద్‌ను కలిసి వినతి పత్రాలు అందిస్తున్నారు.

సానుకూలంగా స్పందించాలని..

- తీవ్ర ఒత్తిడితో పాటు ఇతర కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన వాళ్లూ వచ్చి రిపోర్టు చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సీపీ ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కొన్ని నెలలుగా అధికారులు, సిబ్బందికి ఉన్నతాధికారులు విధించిన శిక్షలపై సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే దీనికి సంబంధించిన జాబితాలు తయారు చేయాల్సిందిగా పరిపాలన విభాగం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మరోపక్క ఓ ఉన్నతాధికారితో జరిగిన వాగ్వాదం నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైన
- మధురానగర్ కానిస్టేబుల్ తిరుపాల్ నాయక్ సైతం బుధవారం ఉన్నతాధికారులను కలిసి తనకు న్యాయం చేయాలంటూ వినతి పత్రం అందించారు. మరోపక్క నగర పోలీసు అధికారుల సంఘం నాయకులు కమిషనరేట్‌లో బుధవారం కొత్వాల్‌ను కలిశారు. వివిధ కారణాల నేపథ్యంలో కొంత కాలంగా సస్పెన్షన్‌లో ఉన్న వారిని విధుల్లోకి తీసుకోవాలని వినతి పత్రం అందించారు. వాస్తవిక కారణాలతో పెట్టుకున్న బదిలీ దరఖాస్తుల పైనా సానుకూలంగా స్పందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, సరెండర్, జీపీఎఫ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. కొత్వాల్‌ను కలిసిన వారిలో ప్రెసిడెంట్ ఎన్.శంకర్‌రెడ్డి సహా ఇతర నాయకులు ఉన్నారు.

జోన్లవారీగా సమీక్షలు..

ప్రస్తుతం గణేష్ ఉత్సవాలు జరుగుతుండటం, సామూహిక నిమజ్జనం సమీపిస్తుండటంతో బందోబస్తు, భద్రత ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. సాధారణంగా కొత్తగా పోలీసు కమిషనర్లు వచ్చిన ప్రతిసారీ అన్ని జోన్లకు చెందిన అధికారులను టీజీ సీసీసీకి పిలిచి సమావేశం నిర్వహిస్తుంటారు. ఈ పరిస్థితుల్లో అలా చేస్తే పని గంటలు వృథా అవుతాయని భావించిన సీపీ ఆనంద్.. జోన్ల వారీగా సమీక్షలు ప్రారంభిస్తున్నారు. ఆయా జోన్లకు వెళ్తున్న ఆయన అక్కడి డీసీపీ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం సౌత్ జోన్‌లో పూర్తి చేసిన కొత్వాల్ బుధవారం సౌత్ వెస్ట్ జోన్‌లో నిర్వహించారు.

సిటీ లైట్స్!

త్వరలో 15వేల వీధి దీపాలు

- అంచనా వ్యయం రూ.3 కోట్లు
- ఏర్పాట్లలో జీహెచ్‌ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: ఎట్టకేలకు జీహెచ్‌ఎంసీలో నెలకొన్న అంధకారాన్ని తొలగించి, వెలుతురు లేని ప్రాంతాల్లో కొత్తగా స్ట్రీట్‌లైట్స్ వెలిగించి సిటీని కాంతిమయం చేసే చర్యలకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. జీహెచ్‌ఎంసీలో ఎల్‌ఈడీ స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటు, నిర్వహణ బాధ్యతల్ని కాంట్రాక్టుకు పొందిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఈఈఎస్‌ఎల్ (ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్) ఒప్పందం మేరకు పని చేయకపోవడంతో.. జీహెచ్‌ఎంసీయే కొత్త బల్బులు కొని ఏర్పాటు చేయాలనే నిర్ణయానికొచ్చింది. స్ట్రీట్‌లైట్స్‌కు సంబంధించిన బాధ్యతలన్నీ ఈఈఎస్‌ఎల్‌కే ఉన్నప్పటికీ చాలా కాలంగా అది పని చేయడం లేదు. ప్రజల నుంచి నిత్యం వస్తున్న విమర్శలతో పాటు జీహెచ్‌ఎంసీ పాలకమండలి సమావేశాల్లోనూ స్ట్రీట్‌లైట్స్ సమస్యల గురించి సభ్యులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈఎస్‌ఎల్ బాధ్యులతో ఎన్ని పర్యాయాలు సమావేశాలు నిర్వహించినా, లేఖలు రాసినా పట్టించుకోవడం లేదని తెలిసింది. బఫర్‌స్టాక్‌గా దాదాపు 30వేల స్ట్రీట్ లైట్స్ స్టాకుతో ఉండాల్సి ఉన్నప్పటికీ, ఈఈఎస్‌ఎల్ ఒక్క లైటు కూడా కొత్తగా వేస్తున్న దాఖలాల్లేవు. ఒప్పందం మేరకు స్ట్రీట్‌లైట్స్ ఆటోమేటిక్‌గా పనిచేసేందుకు అవసరమైన సీసీఎంఎస్ బాక్సుల ఏర్పాటు, నిర్వహణలోనూ ఈఈఎస్‌ఎల్ నిర్లక్ష్యంగానే ఉంది. దాని వైఖరితో విసిగివేసారిన జీహెచ్‌ఎంసీ.. ప్రజల ఫిర్యాదుల్ని తట్టుకోలేక తనే రంగంలోకి దిగేందుకు సిద్ధమైంది.

జీహెచ్‌ఎంసీ పోల్స్ వేసినా..

ఒప్పందం మేరకు స్ట్రీట్‌లైట్స్‌కు సంబంధించి పోల్స్, కేబుల్స్ పనులు జీహెచ్‌ఎంసీవి కాగా, బల్బులు ఈఈఎస్‌ఎల్ అమర్చాలి. కానీ.. ఇప్పటికే దాదాపు 2 వేల పోల్స్, కేబుల్స్ పనుల్ని జీహెచ్‌ఎంసీ పూర్తి చేసినా ఈఈఎస్‌ఎల్ బల్బులు వేయలేదు. నగరంలో కొత్తగా విస్తరించిన ప్రాంతాలు, పోలీసులు గుర్తించిన బ్లాక్ స్పాట్స్ తదితరాలను పరిగణనలోకి తీసుకొని దాదాపు 15వేల లైట్స్ అవసరమని గుర్తించిన జీహెచ్‌ఎంసీ.. 15,500 లైట్స్ సమకూర్చుకోవడానికి టెండర్లకు సిద్ధమైంది. వీటి అంచనా వ్యయం దాదాపు రూ. 3 కోట్లు. వీటిలో 35 వాట్స్, 70 వాట్స్, 110వాట్స్‌వి ఉన్నాయి. నేడు జరగనున్న స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందగానే షార్ట్ నోటీసుతో టెండర్లు పిలిచి వెంటనే సమకూర్చుకునేందుకు సంబంధిత అధికారులు సిద్ధమయ్యారు.

పండగల దృష్ట్యా..

ఇప్పటికే వినాయక నవరాత్రులు కొనసాగుతున్నాయి. నిమజ్జనాలు కూడా జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్స్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గణేశ్ శోభాయాత్రతో పాటు త్వరలోనే మిలాద్ ఉన్‌నబీ కూడా ఉంది. రెండు పండగలను విద్యుత్ దీపాల ధగధగలతో నిర్వహించుకోవడం ఆనవాయితీ. ప్రజలు స్వయంగా ఏర్పాటు చేసుకునే రంగుల దీపాలతో పాటు అన్ని ప్రాంతాల్లో వెలుగులు లేకపోతే ఎదురయ్యే ఇబ్బందులను కూడా దృష్టిలో ఉంచుకొని జీహెచ్‌ఎంసీ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.



ప్రమాదాలు జరిగితే..?

వర్షాకాలం ఇంకా ముగియలేదు. నగరంలో అక్టోబర్‌లో కూడా భారీ వర్షాలు కురిసిన అనుభవాలున్నాయి. వర్షాలకు పగటి పూటే రోడ్ల కింద ఎక్కడ గుంతలున్నాయో, మ్యాన్‌హోల్స్ ఉన్నాయో తెలియదు. ఇక రాత్రిపూట స్ట్రీట్‌లైట్స్ కూడా లేకపోతే ప్రమాదాలు సంభవించి, జరగరాని ఘోరాలు జరిగితే బాధ్యత వహించాల్సింది జీహెచ్‌ఎంసీయే కావడంతో స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటుకు సిద్ధమైంది.

తాగునీటి బిల్లింగ్ వ్యవస్థలో మార్పులేదు: జలమండలి

సాక్షి, సిటీబ్యూరో: ఉచిత తాగునీటి సరఫరా పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి బిల్లింగ్ వ్యవస్థలో ఎటువంటి మార్పు లేదని జలమండలి వెల్లడించింది. సాక్షి దినపత్రికలో ‘మంచినీటి బిల్లులపై బస్తీవాసుల గగ్గోలు’ శీర్షికన ఇటీవల ప్రచురితమైన కథనంపై జలమండలి వివరణ ఇచ్చింది. వినియోగదారు రెండు అంతస్తుల భవన సముదాయం కలిగి ఉండటంతో పాటు అందులో ఓనర్‌తో పాటు కిరాయిదారులు కూడా నివాసం ఉండటంతో కనెక్షన్ డొమెస్టిక్ కేటగిరీ కింద వస్తుందన్నారు. వినియోగదారు నల్లా కనెక్షన్‌కు మీటర్ ఏర్పాటు/మరమ్మతు చేయనందున ఉచిత నీటి పథకం వర్తించడం లేదని పేర్కొంది. దీంతో వినియోగదారు మొబైల్‌కు ప్రతి నెలా డిజిటల్ బిల్లు ఎస్‌ఎంఎస్ రూపంలో అందుతోందని వెల్లడించింది. నాన్ ఫ్రీ వాటర్ సప్లై కస్టమర్లకు 3 నెలలకు ఒకసారి రీ ప్రింట్ ఇస్తున్నామని పేర్కొంది. వినియోగదారు ఆరోపణల్లో వాస్తవం లేదని జలమండలి స్పష్టం చేసింది.

హెచ్‌ఎండీఏలో నిలిచిన ఆన్‌లైన్ సేవలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)లో బుధవారం ఆన్‌లైన్ సేవలకు తాత్కాలికంగా ఆటంకం ఏర్పడింది. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్ని రకాల సేవలు నిలిచిపోయాయి. వివిధ రకాల అనుమతుల కోసం హెచ్‌ఎండీఏ కు వచ్చిన దరఖాస్తుదారులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. మధ్యాహ్నం తరువాత సాంకేతికంగా తలెత్తిన సమస్యలను పరిష్కరించి సేవలను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు.

హాస్టళ్లలో వసతులు మరింత మెరుగుపర్చాలి: ఆర్.కృష్ణయ్య



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, కోదండరామ్ తదితరులు

కాచిగూడ: బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో వసతులు మరింతగా మెరుగుపర్చాలని అవసరముందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గుజ్జ కృష్ణ, సతీష్ నేతృత్వంలో జరిగిన బీసీ యువజన సంఘం రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. హాస్టళ్లకు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, దీంతో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని హాస్టళ్ల స్థితిగతులను మెరుగుపర్చాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. 7 సంవత్సరాల క్రితం ఉన్న మెస్ చార్జీలనే ఇప్పటికీ చెల్లిస్తుండటంతో విద్యార్థులకు సరైన భోజనం అందడం లేదని, దీంతో వారు అనారోగ్యం పాలవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ.. హాస్టల్, గురుకుల పాఠశాలల విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించినప్పుడే వారు విద్యలో మరింత ఉన్నతంగా రాణించగలుగుతారని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, గవ్వల భరత్ కుమార్, ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, టి. రాజ్‌కుమార్, రఘుపతి, కరుణశ్రీ, మట్ట జయంతి, మహేష్ యాదవ్, ప్రతమ్, రామలింగం, రవికుమార్, రాజేష్, విజయ్ కుమార్, లింగంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మరో 5 ఎస్టీపీలు..

ఈ నెలాఖరులోగా ప్రారంభం

- మిగిలినవి డిసెంబర్ నాటికి పూర్తి..
- వందశాతం మురుగునీటి శుద్ధి లక్ష్యంగా జలమండలి అడుగులు

సాక్షి, సిటీబ్యూరో:

మహానగరంలో వంద శాతం మురుగునీటి శుద్ధిలో భాగంగా మరో 5 ఎస్టీపీలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. నాగోల్, ఫతేనగర్, మీరాలం, మియాపూర్ - పటేల్ చెరువు, సఫిల్‌గూడ ఎస్టీపీలను ఈ నెలాఖరులోగా ప్రారంభించేందుకు జలమండలి చర్యలు చేపట్టింది. మిగిలిన ఎస్టీపీల నిర్మాణాలు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది.

వంద శాతం మురుగు శుద్ధికి..

నగరంలో రోజువారీగా ఉత్పన్నమయ్యే మురుగు నీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేసేందుకు ఎస్టీపీల ప్రాజెక్టుకు జలమండలి శ్రీకారం చుట్టింది. మూడు ప్యాకేజీల్లో మొత్తం 31 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మించి సుమారు 1259.50 ఎంఎల్డీల మురుగు నీటిని శుద్ధి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. ప్యాకేజీ–1 కింద అల్వాల్, మల్కాజిగిరి, కాప్రా, ఉప్పల్ సర్కిల్ ప్రాంతాల్లో 8 ఎస్టీపీలు, ప్యాకేజీ-2 కింద రాజేంద్రనగర్, ఎల్బీనగర్ సర్కిల్ ప్రాతాల్లో 6 ఎస్టీపీలు, ప్యాకేజీ-3 కింద కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి సర్కిల్ ప్రాంతాల్లో 17 ఎస్టీపీల నిర్మాణ పనులు చేపట్టింది. ఇప్పటికే కోకాపేట, దుర్గం చెరువు, పెద్ద చెరువు, నల్ల చెరువుల నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రారంభమయ్యాయి.

ప్రస్తుతం ఇలా..

హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో ప్రస్తుతం రోజూ 1950 ఎంఎల్డీల మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. ఇది జీహెచ్‌ఎంసీ ప్రాంతంలో 1650 ఎంఎల్డీలుగా ఉంది. ఇప్పటికే 25 ఎస్టీపీల ద్వారా 772 ఎంఎల్డీల మురుగు నీటిని (46 శాతం) శుద్ధి చేస్తున్నారు. ఇది దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అధికం. మిగిలిన 878 ఎంఎల్డీల మురుగు నీటిని శుభ్రం చేసేందుకు కొత్త ఎస్టీపీల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. 2036 వరకు ఉత్పన్నమయ్యే మురుగును వీటి ద్వారా శుద్ధి చేయవచ్చని సర్కారు భావిస్తోంది. తాజాగా అమృత్ పథకం కింద మరి కొన్ని ఎస్టీపీలు కూడా మంజూరయ్యాయి.



నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి: జలమండలి ఎండీ

ఎస్టీపీల నిర్మాణ పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎస్టీపీల నిర్మాణంపై ఆయన బుధవారం సమీక్షించారు. ఎస్టీపీల నిర్మాణంపై నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అందుకోసం ప్రతి వారం డైరెక్టర్, సీజీఎం స్థాయిలో పనులు సమీక్షించాలని తెలిపారు. వారం రోజుల పనితీరును అధికారులకు సమర్పించాలని నిర్మాణ సంస్థ ప్రతినిధుల్ని ఆదేశించారు. ఏకకాలంలో అన్ని పనులు పూర్తయ్యేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. విద్యుత్, స్థలం, న్యాయ పరమైన సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. తుది దశలో ఉన్న ఎస్టీపీల నిర్మాణం పూర్తి చేసి ట్రయల్ రన్ నిర్వహించి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, సీజీఎంలు, జీఎంలు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనాల్లో సదుపాయాలు కల్పించాలి : ఆమ్రపాలి

సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తవద్దు. అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో రోడ్లపై పడే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. తగినంతమంది పారిశుద్ధ్య కార్మికులను విధుల్లో నియమించాలి అని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం అడిషనల్, జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. నగరం అంతటా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లపై పాట్ హోల్స్ పూడ్చాలని, చెట్లకొమ్మలు నరికివేయాలని, వేలాడే విద్యుత్ తీగలను తొలగించాలని ఆదేశించారు. ఇందుకుగాను ఎక్కడికక్కడే స్థానికంగా ఉండే అధికారులతో కమిటీలు వేసుకొని వెంటనే చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. తీసుకున్న చర్యల గురించి తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవాలని సూచించారు.



అట్టహాసంగా పాసింగ్ అవుట్ పరేడ్

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హిమాయత్ సాగర్‌లోని తెలంగాణ పోలీస్ అకాదమీలో బుధవారం పోలీస్ పాసింగ్ అవుట్ పరేడ్ అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్‌లో పాల్గొన్న పలువురు పోలీసులు తమ కుటుంబ సభ్యులతో సెల్ఫీలు తీసుకుని ఆత్మీయతను పంచుకున్నారు.









నగర సీపీగా నియమితులైన సీవీ ఆనంద్ బుధవారం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్రంలో మంత్రి సీతక్క ఉన్నారు. – సాక్షి, సిటీబ్యూరో

ఇక్కడ దోచి..అక్కడ దాచి

- ఘరానా బైక్‌ల దొంగ అరెస్టు
- పార్కింగ్ స్థలాలే టార్గెట్
- 59 బైక్‌లు స్వాధీనం..

సనత్‌నగర్: బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలోని పార్కింగ్ స్థలాలను లక్ష్యంగా చేసుకుని అక్కడ పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను చోరీ చేసే కరడుగట్టిన దొంగతో పాటు వాటిని కొనుగోలు చేస్తున్న ఇద్దరు రిసీవర్లను బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 59 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ ఎస్.రష్మీ పెరుమాళ్ వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ, మంచుకుంటినగర్‌కు చెందిన రాయుడు చైతన్య సాయికుమార్ పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతూ మధ్యలోనే చదువుకు స్వస్తి పలికాడు. ఉపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చిన తను పలు ప్రైవేటు సంస్థల్లో పని చేశాడు. జల్సాలు, వ్యసనాలకు అలవాటుపడిన సాయికుమార్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో వారు అతన్ని తొలగిస్తుండేవారు. ఈ క్రమంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అతను బైక్‌ల చోరీని ఎంచుకున్నాడు. మెట్రో, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలోని పార్కింగ్ స్థలాలను టార్గెట్ చేసుకున్నాడు. వాహనాల హ్యాండిల్ లాక్ విరగ్గొట్టి మారుతాళం చెవులతో బైక్‌లను ఎత్తుకెళ్లేవాడు. అయితే చోరీ చేసిన వాహనాన్ని అప్పుడే విక్రయించకుండా దూరంగా ఉన్న మరో పార్కింగ్ స్థలంలో దాచేవాడు. సదరు వాహనం వివరాలను రిసీవర్లకు పంపి విక్రయానికి ఉంచేవాడు. వాహనం విక్రయించే సమయంలోనే పార్కింగ్ స్థలంలో తాను దాచిన వాహనాన్ని తీసుకెళ్లేవాడు. ఇదే తరహాలో చాటుప్పల్, ఉప్పల్, మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 27 బైక్‌లను చోరీ చేశాడు. ఈ కేసుల్లో ఉప్పల్ పోలీసులు సాయికుమార్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన అతను తన పంథా మార్చుకోలేదు. తాజాగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 17, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 18, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 19 వాహనాలను చోరీ చేశాడు. దీనిపై కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన బేగంపేట పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా సాయికుమార్ వాహనం చోరీ చేస్తున్న దృశ్యాలను గుర్తించారు. దీంతో అతనిపై నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద వాహనాలను కొనుగోలు చేస్తున్న కొత్తగూడెం, దమ్మపేట, గండుగులపల్లికి చెందిన జగదీష్, ప్రకాశం జిల్లా, కందుకూరు గ్రామానికి చెందిన కుంచాల హరికృష్ణలను కూడా అరెస్టు చేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అశోక్, ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రామయ్య, డీఐ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐ శ్రీరాములు ఇతర క్రైం ఇబ్బంది పాల్గొన్నారు.



బర్త్ డే పార్టీలో గంజాయి కలకలం

- ముగ్గురికి డ్రగ్ పాజిటివ్ 18 మందిపై న్యూసెన్స్ కేసు నమోదు
- నిందితుల్లో ఆరుగురు యువతులు
- పాజిటివ్ వచ్చిన వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం చర్యలు



స్వాధీనం చేసుకున్న గంజాయి, మద్యం బాటిళ్లు



డ్రగ్ పాజిటివ్ వచ్చిన యువకులు

గచ్చిబౌలి: నగరాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి బర్త్ డే పార్టీలోనూ ప్రవేశించింది. సైబరాబాద్ కమిషనరేట్‌కు కూతవేటు దూరంలో జరిగిన పుట్టినరోజు వేడుకలో గంజాయి సేవించడం కలకలం రేపింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆంజనేయులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీ అనే మహిళకు చెందిన టీఎన్‌జీవోస్ ఫేజ్–1 ప్లాట్ నెంబర్ 93లో రెండేళ్లుగా రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో పని చేసే పెద్దారెడ్డి గారి చరణ్, వినీల్, శివశంకర్ రెడ్డి అద్దెకు ఉంటున్నారు. వీరికి కామన్ ఫ్రెండ్ అయిన రాధ ద్వారా ఆదిత్య అనే రైల్వే కాంట్రాక్టర్‌తో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆదిత్య బర్త్ డే వేడుకలు జరుపుకునేందుకు అందరూ టీఎన్‌జీవోస్‌లోని ప్లాట్‌కు వచ్చారు. అర్ధరాత్రి వారు గంజాయి సేవిస్తున్నట్లుగా సమాచారం అందడంతో ప్లాట్‌పై దాడి చేసిన పోలీసులు సంఘటనా స్థలంలో 40 గ్రాముల గంజాయి, మద్యం బాటిళ్లు, హుక్కా పాట్, ఓసీబీ పేపర్లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారికి డ్రగ్ పరీక్షలు నిర్వహించగా ఆదిత్య, వీరపనేని వరుణ్, గోర్తి సాయి ప్రవీణ్‌లకు పాజిటివ్ రావడంతో అరెస్ట్ చేశామన్నారు. నిందితులను తదుపరి పరీక్షల కోసం ఆస్పత్రికి పంపనున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా నిర్వహించిన పార్టీలో పాల్గొని న్యూసెన్స్ చేసినందుకు పిన్నింటి రామకృష్ణ, పెద్దింటిగారి చరణ్, శివశంకర్ రెడ్డి, వీర శివారెడ్డి, మద్దినేని హరికృష్ణ, కాటేపల్లి రమేష్, మండపూడి కోటేశ్వర్ రావు, అనపర్తి విజయ్ కుమార్, కోట్ల అజయ్,డి.సంధ్య, కుకటి ఆశా, కుకటి రీతూ, షేక్ షమాసుల్తానా, ఎం.కీర్తి, యశోదలపై కేసు నమోదు చేశామన్నారు. వారిలో ఇద్దరు జూనియర్ ఆర్టిస్టులు ఉన్నట్లు తెలిపారు. వీరపనేని వరుణ్ దూల్‌పేట్ నుంచి 50 గ్రాముల డ్రై గంజాయి కొనుగోలు చేశాడని, అక్కడ డ్రగ్ పెడ్లర్ ఎవరనే విషయమై విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు

ఇళ్లల్లో పార్టీలు చేసుకుంటూ గుట్టు చప్పుడు కాకుండా గంజాయితో పాటు డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. అద్దెకు ఉండె వారిపై యజమానులు నిఘా ఉంచాలని, ఎలాంటి అనుమానం వచ్చినా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్ కొనుగోలు చేసినా, వినియోగించినా వారి వివరాలు తెలియజేసి పోలీసులకు సహకరించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

3 తులాల పుస్తెల తాడు స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: చెడు వ్యవసనాలు బానిసగా మారి చెయిన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న వ్యక్తిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ కే నర్సింహ బుధవారం వివరాలు వెల్లడించారు. మియాపూర్‌కు చెందిన ఉప్పుగుంట సాగర్ లింగంపల్లిలోని గుల్మోహర్ పార్క్‌లో ఉంటూ ప్రైవేట్ పాఠశాల వ్యాన్ డ్రైవర్‌గా పని చేసేవాడు. చాలీచాలని జీతంతో కుటుంబ పోషణ కష్టం కావడంతో అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు.

- ఈ క్రమంలో గత నెల 17న సాయంత్రం బైక్‌పై పుప్పాలగూడ ప్రాంతానికి వెళ్లిన అతను ఎవరూ తనను గుర్తించకుండా ముఖానికి మాస్క్, హెల్మెట్ ధరించాడు. బైక్ నంబరు ప్లేట్ కనిపించకుండా స్టిక్కర్ అతికించాడు. అదే సమయంలో పుప్పాలగూడకు చెందిన గంగా భవాని స్కూల్ నుంచి పిల్లలను తీసుకుని ఇంటికి వెళుతుండగా ఆమె మెడలోని మూడు తులాల పుస్తెల తాడును లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో అల్కాపూర్ కాలనీ వద్ద స్పెషల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), రాజేంద్రనగర్ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై వస్తున్న సాగర్‌ను ఆపి తనిఖీ చేయగా స్నాచింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. అతడి నుంచి పుస్తెల తాడు, బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతను 2022లోనూ కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. 25 రోజుల జ్యుడీషయల్ కస్టడీ అనంతరం బెయిల్‌పై బయటికి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ఎల్వీ ప్రసాద్ మరో ఘనత

50 వేల కార్నియా మార్పిడులు పూర్తి

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచంలోనే అత్యధిక కార్నియా మార్పిడి చేసిన ఘనతను ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలోని శాంతిలాల్ సింఘ్వీ కార్నియా ఇనిస్టిట్యూట్ సాధించినట్టు సంస్థ వెల్లడించింది. 50 వేలకు పైగా మార్పిడులు చేశామని, ఇది తమ వైద్యుల ఘనత అని, తమపై ఎంతో మంది తమపై ఉంచిన నమ్మకానికి ప్రతీక అని బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎంతో మంది దాతల కుటుంబాల వల్లే ఇది సాధ్యమైందన్నారు. తాము ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే సమయంలో ఎన్నో అనుమానాలు తమను చుట్టుముట్టాయని, వ్యవస్థాపక అధ్యక్షుడు డా.గుళ్లపల్లి ఎన్ రావు అన్నారు. అయితే వారి అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ ఎంతో మెరుగైన సిబ్బందితో, నిర్విరామంగా సేవలు అందిస్తున్నామన్నారు. ఎంతో గొప్ప మైలు రాయిని దాటుతున్నందుకు తాము సంతోషిస్తున్నట్లు తెలిపారు. 'కార్నియా వ్యాధుల ఫలితంగా వచ్చే కంటి సమస్యలకు సరైన చికిత్స అందుబాటును కొనసాగించడంపై శాంతిలాల్ సంఘ్వీ కార్నియా ఇనిస్టిట్యూట్ ఎప్పుడూ ముందంజలో ఉంటుంది'అని ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డా.ప్రవీణ్ వడ్డవల్లి అన్నారు.

భవనం పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య

ఉప్పల్: ప్రైవేట్ హాస్టల్ భవనం పైనుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. రామంతాపూర్, బాలకృష్ణానగర్ ప్రాంతానికి చెందిన దొంతు రాము(27) గత కొన్నాళ్లుగా ఉద్యోగం కోసం అన్వేషించి విఫలమయ్యాడు. ఈనెల 7న గోఖలేనగర్‌లోని శివశ్రీ డీలక్స్ బాయ్స్ హాస్టల్‌లో చేరాడు. మంగళవారం రాత్రి స్నేహితులతో కలిసి ఖైరతాబాద్ గణేష్‌ను చూసేందుకు వెళ్లి తిరిగి వచ్చిన అతను బుధవారం తెల్లవారుజామున తాను ఉంటున్న హాస్టల్ భవనం నాల్గో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగం దొరక్కపోవడంతో మనస్తాపానికి లోనై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

'ఆరోగ్య చట్టాల అమలు బాధ్యత అందరిదీ'

సాక్షి,సిటీబ్యూరో: వైద్యరంగం పటిష్టతతోపాటు ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఆరోగ్య చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్. రఘునాథ్‌స్వామి అన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్, ప్రీ-కాన్సెప్షన్, ప్రీ-నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్, సరోగసీ తదితర చట్టాలను అమలు చేయాలని సూచించారు. బుధవారం నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, మేనేజింగ్ అండ్ మెడికల్ డైరెక్టర్లు, గైనకాలజిస్ట్, రేడియాలజిస్టులు , పాథాలజిస్టులకు 'వైద్య చట్టాల అమలు- పర్యవేక్షణపై నిర్వహించిన ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ అమలు, వెక్టర్-బోర్న్ - కమ్యూనికేబుల్ డిసీజెస్, రొటీన్ ఇమ్యునైజేషన్ అండ్ చైల్డ్ హెల్త్ ఇమ్యునైజేషన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన అన్ని చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రైవేట్ హెల్త్‌కేర్ నిపుణులు పూర్తి సమాచారంతో కూడిన చట్టపరమైన, నియంత్రణ ప్రమాణాలకు కట్టుబడి ఉండేలా ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. రోగి హక్కులను పరిరక్షించడానికి, నైతిక వైద్య విధానాలను నిర్ధారించటంతోపాటు ప్రజారోగ్య ప్రమాణాలను కాపాడాలన్నారు. ఆరోగ్య చట్టాలను అమలు చేయటం ద్వారానే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర , జిల్లా స్థాయి ప్రోగ్రామ్ అధికారులతో పాటు మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు పాల్గొన్నారు.

కంపెనీలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తాం

జయేష్ రంజన్

సాక్షి, సిటీబ్యూరో: పరిశ్రమలు తమ సాంకేతికతను మెరుగుపరచుకోవడానికి మద్దతు ఇచ్చే మొదటి రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుందని తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖ, ఐటీఈ అండ్ సీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అన్నారు. 'జాతీయ భద్రత కోసం కొత్త సామర్థ్యాలను అన్వేషించడం' అనే థీమ్‌తో తెలంగాణ సీఐఐ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో రక్షణ, అంతరిక్ష రంగాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, ప్రతిభ, ఆవిష్కరణల ప్రాముఖ్యతను వివరించారు. ప్రైవేట్ రంగ సహకారంతో తెలంగాణ ఒక బలమైన పర్యావరణ వ్యవస్థను పెంపొందించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రక్షణ, అంతరిక్ష రంగాల్లో పురోగతి, జాతీయ భద్రతను బలోపేతం చేసే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహించినట్లు వివరించారు. రక్షణ సామర్థ్యాలను పెంపొందించడం, జాతీయ భద్రతకు సంబంధించి వినూత్న స్టార్ట్-అప్‌లను ప్రోత్సహించడం, ప్రపంచ ఏరోస్పేస్, రక్షణ డిమాండ్‌లను తీర్చడానికి భారతీయ తయారీ రంగాన్ని రూపొందించడం వంటి కీలక అంశాలు ఇందులో ఉన్నాయన్నారు. ఈ సదస్సులో పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో మహిళా జూడాపై దాడి

గాంధీ అత్యవసర విభాగంలో ఘటన



నిందితుడు ప్రకాశ్



వైద్య విద్యార్థినిపై దాడి చేస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి : కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటన మరువక ముందే సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఓ దారుణం చోటుచేసుకుంది. అత్యవసర విభాగంలో విధి నిర్వహణలో ఉన్న మహిళా ఇంటర్నీ (జూనియర్ డాక్టర్)పై చికిత్స కోసం వచ్చిన ఓ రోగి దాడి చేశాడు. మహిళ ఇంటర్నీ చేయి, యాప్రాన్ పట్టుకుని గట్టిగా లాగడంతో ఆమె భయాందోళనకు గురైంది. దీనిని గమనించిన తోటి వైద్యులు, సిబ్బంది రోగి చేతుల్లోంచి ఆమెను విడిపించారు. ప్రత్యక్ష సాక్షులు, గాంధీ అధికారులు, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బన్సీలాల్‌పేటకు చెందిన జీ.ప్రకాశ్ (60) దినసరి కూలీగా పని చేస్తున్నాడు. మద్యం, కల్లు తాగే అలవాటు ఉన్న ప్రకాశ్ బుధవారం ఫుల్లుగా మద్యం సేవించి, పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండటంతో అతడి భార్య వైద్యసేవల నిమిత్తం ప్రకాశ్‌ను గాంధీ ఎమర్జెన్సీ విభాగానికి తీసుకువచ్చింది. భార్య పక్కనే ఉన్న ప్రకాశ్ అక్కడే డ్యూటీలో ఉన్న ఓ వైద్యవిద్యార్థిని చేయి పట్టుకుని గట్టిగా లాగాడు. ఆమె యాప్రాన్ పట్టుకుని బయటికి లాక్కెళ్లేందుకు యత్నించాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో గమనించిన తోటి వైద్యులు, సిబ్బంది అతడిని కొట్టి అతని చేతుల్లోంచి ఆమెను విడిపించారు. ఈ ఘటన దృశ్యాలు అత్యవసర విభాగంలోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ముందుగా అతడిని గాంధీ పోలీస్ అవుట్‌పోస్ట్‌కు అక్కడి నుంచి చిలకలగూడ ఠాణాకు తరలించారు. మద్యం మత్తులో మతిస్థిమితం కోల్పోయి దాడికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనను జూనియర్ డాక్టర్ల సంఘం గాంధీ యూనిట్ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. వైద్యులు, వైద్య విద్యార్థులపై దాడులు జరగకుండా, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని జూడా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, లౌక్య, గిరిప్రసాద్‌లు డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చిలకలగూడ పోలీసులు తెలిపారు.

నిఘా నేత్రం పట్టేసింది

నగరంలో నేరం చేసిన వారెవరైనా తమ నుంచి తప్పించుకోలేరని సీసీ కెమెరాలు మరోసారి రుజువు చేశాయి. నగరంలో బుధవారం ఒకే రోజు మూడు వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న నేరాలను పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా గంటల వ్యవధిలో ఛేదించారు.. వివరాల్లోకి వెళితే...

అన్న మాట్లాడడం లేదని...

- ఇంట్లో నుంచి బాలిక పరారీ
- 24 గంటల్లో పట్టుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు..
- 200 సీసీ కెమెరాల వడబోత...

బంజారాహిల్స్: అన్నయ్య మాట్లాడడం లేదని అలిగిన ఓ బాలిక (17) ఇంట్లో చెప్పకుండా అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. కాగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు 200 సీసీ కెమెరాలను వడబోసి 24 గంటల్లోనే బాధిత బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకృష్ణానగర్‌లో నివసించే బాలిక (17) అమీర్‌పేటలోని పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. మంగళవారం ఉదయం సోదరుడు కాలేజీకి వెళ్లడానికి రెడీ అవుతుండగా తన సోదరి కనిపించలేదు. దీంతో అతను పరిసర ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో స్వగ్రామంలో ఉంటున్న తల్లిదండ్రులకు సమాచారం అందించాడురు. అంతేగాక తన చెల్లెలు కనిపించడం లేదంటూ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన జూబ్లీహిల్స్ కానిస్టేబుళ్లు నాగేశ్వరరావు, కైలాష్ బాలిక ఇంటి పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. బాలిక యూసుఫ్‌గూడ మెట్రో స్టేషన్‌లో రైలు ఎక్కుతున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే నాగోలు మెట్రో ప్రధాన కార్యాలయానికి వెళ్లి సదరు బాలిక యూసుఫ్‌గూడలో టికెట్ తీసుకుని ఏ స్టేషన్‌లో దిగిందో ఆరాతీశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మెట్రో దిగినట్లుగా మెట్రో సిబ్బంది చెప్పడంతో వెంటనే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద మెట్రో స్టేషన్ నుంచి సుమారుగా 200 సీసీ కెమెరాలను పరిశీలించగా సాయంత్రం రైల్వే స్టేషన్‌లోకి వెళ్తున్నట్లుగా దృశ్యాలు కనిపించాయి. బుధవారం తెల్లవారుజామున 3 గంటల వరకూ రైల్వేస్టేషన్‌లోని సీసీ ఫుటేజీలు పరిశీలించగా సదరు బాలిక రెస్ట్‌రూమ్‌లో ఓ మూల కూర్చుని బిక్కుబిక్కుమంటూ భయంతో వణికిపోతూ కనిపించింది. పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. అంతకముందే బాధితురాలు నా కోసం వెతకవద్దు..ప్రశాంతంగా ఉండేందుకు బయటకు వెళ్తున్నాను అంటూ ఓ లేఖ కూడా రాసినట్లు గుర్తించారు. ఆమెను ఆరా తీయగా ఇంట్లో అన్న సరిగ్గా మాట్లాడడం లేదని మనస్తాపానికి గురై వెళ్లిపోయినట్లుగా తెలిపింది. మొత్తానికి బాలిక తప్పిపోయిన 24 గంటల్లోనే గుర్తించి ఆమెను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

గణేష్ లడ్డూ చోరీ



జీడిమెట్ల: గణేష్ లడ్డూతో పాటు రూ.24 వేల నగదు, 2 మొబైల్ ఫోన్లు చోరీకి గురైన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుభాష్‌నగర్ డివిజన్ డీపీ కాలనీలో వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో గణేష్ మండపం ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి మండపంలోకి ప్రవేశించిన నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు గణపతి వద్ద ఉన్న 8,2 కిలోల లడ్డూతో పాటు అక్కడే నిద్రిస్తున్న వారి జేబుల్లో రూ.24 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లను దొంగలు ఎత్తుకెళ్లారు. యూత్ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీష్ తెలిపారు. కాగా లడ్డూను ఎత్తుకెళ్తున్న వ్యక్తి ఫొటో సీసీ కెమెరాకు చిక్కింది.



12 గంటల్లో పట్టేశారు..

- మొబైల్ స్నాచర్ల అరెస్టు..
- సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల పట్టివేత

బంజారాహిల్స్: మొబైల్ స్నాచింగ్ జరిగిన 12 గంటల్లోనే జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రెండు ఫోన్లను రికవరీ చేశారు. వివరాల్లోకి వెళితే..వెంకటగిరికి చెందిన మజహర్ మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తుండగా ఇద్దరు వ్యక్తులు కిటికీలో నుంచి చేతులు పెట్టి అక్కడ ఉన్న రెండు సెల్‌ఫోన్లను తస్కరించి పరారయ్యారు. ఉదయం లేచి చూసుకునే సరికి ఫోన్లు కనిపించకపోవడంతో మజహర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన క్రైమ్ కానిస్టేబుల్ శంకర్ ఘటనా స్థలానికి వెళ్లి బాధితుడి ఇంట్లో ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా ఇద్దరు యువకులు సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళుతున్న దృశ్యాలు కనిపించాయి. వాటి ఆధారంగా వెంకటగిరి నుంచి యూసుఫ్‌గూడ మీదుగా రహమత్‌నగర్, కార్మికనగర్ వరకు సుమారుగా 40 సీసీ కెమెరాలను క్రైమ్ పోలీసులు పరిశీలించారు. ఈ ఫోటోను బాధితుడు తన వాట్సాప్ గ్రూపుల్లోనూ సర్కులేట్ చేశాడు. సీసీ కెమెరాల్లో నిందితుడి ఫోటో ఆధారంగా అతను కార్మికనగర్‌లోని ఓ ఇంట్లోకి వెళ్తున్నట్లుగా గుర్తించారు. దీంతో పోలీసులు ఆ ఇంటిని చుట్టిముట్టి నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో అబ్దుల్ నదీం డెలివరీబాయ్‌గా, రఫీ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్ : స్టేట్‌హోం 11 కేవీ ఫీడర్ కల్యాణ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు మధురానగర్ ఏ,సీ,డీ,హెచ్ బ్లాకుల్లో విద్యుత్ సరఫలో అంతరాయం ఉంటుందని బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాలివాహననగర్ 11 కేవీ ఫీడర్ ఎల్లారెడ్డిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 వరకు మసీదులైన్, తవక్కల్‌నగర్, అంబేద్కర్‌నగర్, బీఎస్ఎన్ఎల్, కీర్తి అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో, ఉడ్స్ 11 కేవీ ఫీడర్ ప్రశాసన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హుడా ఎన్‌క్లేవ్, అశ్వినీ లే అవుట్, డీకేనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వరద బాధితులకు నిత్యావసరాల అందజేత

రహమత్‌నగర్ : జూబ్లీహిల్స్ క్రిస్టియన్స్ ఫోరం (జేసీఎఫ్) హైదరాబాద్ నాయకులు, పాస్టర్లు విజయవాడ వరద బాధితులకు దాదాపు రూ1.50 వేల విలువైన నిత్యావసర సరుకులను బుధవారం పంపించారు. ఈ సందర్భంగా జేసీఎఫ్ నాయకులు మాట్లాడుతూ బాధితులు త్వరగా సామాన్య జీవనం సాగించాలని కోరుతూ ప్రార్థనలు చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగ నియామకాల్లో తీవ్ర అన్యాయం

లిబర్టీ: బీసీ, ఎస్టీ, ఎస్టీ, మైనార్టీలకు ఉద్యోగ నియామకాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. దళ్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగ నియామకాలు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక జనాభా వర్గాల కంటే అతి తక్కువ ఉన్న జనాభా వర్గాలకే ఎక్కువ ఉద్యోగాలు ఉన్నాయన్నారు. జనాభాకు అనుగుణంగా ఉద్యోగుల శాతాన్ని కూడా పెంచాలని ఆయన కోరారు.

మేమున్నామని... ఒంటరి కాదని..

ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థి బర్త్‌డే వేడుకలు



బర్త్‌డే వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బంజారాహిల్స్: కోవిడ్ సమయంలో తండ్రి మృతి.. తల్లి రోజువారీ కూలీ పని చేస్తే తప్ప పూట గడవని పరిస్థితి. అయితే తన పుట్టిన రోజును అందరిలాగే చేసుకోవాలని ఉన్నా చేసుకోని దుస్థితిలో రక్షిత్ అనే పదో తరగతి విద్యార్థి ఉన్నాడు. విషయం తెలుసుకున్న రక్షిత్ పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఒక్కటై బుధవారం జూబ్లీహిల్స్ గాయత్రి హిల్స్‌లోని లిటిల్ స్టార్ పాఠశాలలో ప్రిన్సిపాల్ అస్మతున్నిసా చొరవతో రక్షిత్ బర్త్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

మాలల అణిచివేత కుట్ర

లిబర్టీ: మాల కులస్తుల అణిచివేతకు కుట్ర జరుగుతోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. మాల మహానాడు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ హక్కుల కోసం దళితుల రిజర్వేషన్ల పరిరక్షణకు పోరాడుతామని పేర్కొన్నారు. అన్ని పార్టీల్లోని మాల ప్రజా ప్రతినిధులు కులస్తుల అణచివేతపై గళం విప్పాలని కోరారు.

ఇనుప స్తంభాల చోరీ

ఫిలింనగర్: 12 ఇనుప స్తంభాలను దొంగిలించిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట లక్ష్మణ్‌నగర్‌లో ఈ నెల 5న సీసీ రోడ్డు నిర్మాణం కోసం 12 ఐరన్ చానళ్లను ఏర్పాటు చేశారు. ఈ నెల 10న జీహెచ్ఎంసీ సీసీ రోడ్డు వర్క్ చేస్తున్న రాములు వచ్చి చూడగా స్తంభాలు కనిపించలేదు. వెంటనే అక్కడి సీసీ ఫుటేజీలు పరిశీలించగా టీఎస్ 13 యూసీ 5541 ఆటో ట్రాలీలో ఓ వ్యక్తి స్తంభాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

మెరుగైన వైద్యం అందించాలి

లిబర్టీ: నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వాసుదేవరావు కోరారు. లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సీఎం, వైద్యారోగ్య శాక మంత్రి వెంటనే వైద్యారంగంపై పూర్తిస్థాయి సమీక్షించి ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే తెల్లరేషన్ కార్డుతో సంబంధం లేకుండా వైద్యాన్ని అందించాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు.

విశ్రాంత ఐపీఎస్ అధికారికి బెదిరింపులు

బంజారాహిల్స్: అటవీశాఖకు చెందిన భూములను కబ్జా చేశావంటూ గుర్తుతెలియని వ్యక్తి తనకు ఫోన్ చేసి బెదిరించడమే కాకుండా బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ విశ్రాంత ఐపీఎస్ అధికారి జేజీ మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..యూసుఫ్‌గూడలో ఉంటున్న జేజీ మురళికి గత నెల 28న రాత్రి గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. జిన్నారం మండలం, కొడకంచి గ్రామంలో సర్వేనెంబర్ 285లో 49 ఎకరాల ఫారెస్ట్ ల్యాండ్ కబ్జా చేశావంటూ బెదిరించాడు. అయితే సదరు స్థలాన్ని తాను పట్టాదారుల నుంచి కొనుగోలు చేశానని, 13 ఎకరాల అసైన్డ్ ల్యాండ్ కూడా ఉందని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ డీమార్కేషన్ కూడా చేసిందని, చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేసుకున్నట్లు మురళి తెలిపారు. గత నెల 31న మరోసారి అదే వ్యక్తి బెదిరింపులతో మెసేజ్ పెట్టి ఈ వ్యవహారాన్ని విజిలెన్స్ శాఖ, న్యూస్ ఛానెళ్లకు చెబుతానని హెచ్చరించాడు. గత రెండు నెలలుగా తాను ఇక్కడ టోన్ క్వారీ, క్రషర్ లీజు గ్రాంట్ల విషయంపై పోరాడుతున్నానని, జే లావణ్య ప్రసాద రాజు, ఈశ్వర్‌రెడ్డి, రవితేజ తదితరులపై తాను పోరాటం చేస్తున్నానని, తనను బెదిరించి వారికి అడ్డులేకుండా చేసుకోవడానికే ఈ రకమైన బెదిరింపులకు పాల్పడుతున్నట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. లావణ్యప్రసాద్‌రాజు, ఈశ్వర్‌రెడ్డి, రవితేజ, అర్జున్ తదితరులపై అనుమానం వ్యక్తం చేస్తూ వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనానికి చకచకా ఏర్పాట్లు..!

- వాహనాలు సాఫీగా వెళ్లేలా రోడ్ల చదును
- పీపుల్స్ ప్లాజా వద్ద బేబీపాండ్ నిర్మాణం
- పూర్తికావస్తున్న క్రేన్ల ఏర్పాటు
- పర్యవేక్షిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు



ఎన్టీఆర్ మార్గ్‌లో రోడ్డు చదును చేయిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: గణేశ్ నిమజ్జనానికి ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజాలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. నెక్లెస్‌రోడ్డులో బేబీపాండ్‌ను సుందరంగా తీర్చిదిద్ది నిమజ్జనాల కోసం క్రేన్లను అందుబాటులో పెట్టారు. పీపుల్స్‌ప్లాజాలోనూ క్రేన్ల బిగింపు తుదకు చేరుకున్నది. ఇక్కడే పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. పీపుల్స్‌ప్లాజా, నెక్లెస్‌రోడ్డులో విగ్రహాల వాహనాలు సాఫీగా వెళ్లేందుకు భూమిని చదును చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే వివిధ చోట్ల నుంచి నిమజ్జనానికి విగ్రహాలు తరలివస్తుండగా ఆ మేరకు క్రేన్ల ఏర్పాటు పూర్తిచేశారు. ఎక్కువగా బేబీపాండ్‌లలో విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతిరోజూ జీహెచ్ఎంసీ, పోలీసు, ఆర్అండ్‌బీ, హెచ్ఎండీఏ, ఎలక్ట్రిసిటీ అధికారులు పర్యటిస్తూ తమ శాఖల పరిధిలో చేయాల్సిన పనులపై సమీక్షిస్తున్నారు.



క్రేన్లను ఏర్పాటుచేస్తున్న దృశ్యం



నిర్మాణం పూర్తయిన బేబీపాండ్

ఐదో రోజు.. నిమజ్జనాల జోరు



గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను బుధవారం నిమజ్జనం చేసేందుకు నగరవాసులు పెద్ద సంఖ్యలో హుస్సేన్‌సాగర్‌కు తరలివచ్చారు. ఎన్టీఆర్ మార్గ్‌తో పాటు నెక్లెస్‌రోడ్డులో డప్పు చప్పుళ్ల మధ్య గణపయ్యలను నిమజ్జనం చేశారు.
– బంజారాహిల్స్





నెక్లెస్ రోడ్డులోని బేబీపాండ్ వద్ద నిమజ్జనం చేస్తున్న యువకులు





మహా గణపతికి మహా క్యూ..



శ్రీ లక్ష్మీగణపతి, రుద్రహోమంలో పాల్గొన్న కార్పొరేటర్ విజయారెడ్డి

- బడా గణేశ్ దర్శనానికి తరలివస్తున్న భక్తులు
- 70 హోమ గుండాలతో లక్ష్మీగణపతి, రుద్రహోమాలు



ఖైరతాబాద్ గణనాథుడిని దర్శించుకుంటున్న భక్తులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా భక్తుల పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఇదిలాఉంటే బుధవారం ఖైరతాబాద్ మహాగణపతి చెంత శ్రీ ఆర్య వైశ్య సంఘం ఖైరతాబాద్ ఆధ్వర్యంలో 70 హోమ గుండాలతో 280 మంది జంటలతో శ్రీ లక్ష్మీ గణపతి, రుద్రహోమాలను నిర్వహించారు. హోమంలో ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొన్నారు. హోమాలు నిర్వహించినందుకు సంతోషంగా ఉందని ఆర్యవైశ్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభాకర్ గుప్తా, అధ్యక్షుడు దేవర శెట్టి వీరేశ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి బెలిదె రాజు గుప్తా, కోశాధికారి మిర్యాల చంద్రప్రకాశ్ గుప్తా, మహేశ్‌గుప్తా, మల్లికార్జున రమేశ్ గుప్తా, గోపిశెట్టి ప్రవీణ్‌గుప్తా తెలిపారు.

అప్పు తీర్చమన్నందుకు దాడి

వెంగళరావునగర్ : తీసుకున్న అప్పు చెల్లించాలని వెళ్లిన వ్యక్తిపై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌కు చెందిన రాయపాటి హనుమంతరావు మధురానగర్‌లోని మధులిక ఎంటర్‌ప్రైజెస్ కన్సల్టెంట్ నిర్వాహకుడైన రవీందర్ గతంలో రూ.2.5 లక్షలను అప్పుగా ఇచ్చాడు. ఈనెల 10న రాత్రి అక్కడికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని అడిగాడు. ఆ సమయంలో రవీందర్ మద్యం సేవిస్తున్నాడు. దాంతో అతని స్నేహితుడు వెంకటశివ ఉదయం మాట్లాడవచ్చని పంపించాడు. ఇద్దరు రోడ్డుమీదకు రాగానే రవీందర్ ఐరన్ వస్తువు తీసుకుని హనుమంతరావుపై దాడి చేయగా గాయాలయ్యాయి. అనంతరం హనుమంతరావు ఇంటికి వెళ్లిన రవీందర్ నీ కొడుకుని చంపుతానని అతని తల్లిని కూడా బెదిరించాడు. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా శ్రీరాధాష్టమి వేడుకలు



వేడుకల్లో అభిషేకం చేస్తున్న దృశ్యాలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో శ్రీరాధాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆభరణాలతో రాధాగోవిందులను, వివిధ రకాల సుగంధ పుష్పాలతో ఆలయాన్ని ఆవిష్కరించారు. వేద మంత్రోచ్చారణలు, హరి నామ సంకీర్తనల నడుమ 108 కలశాలతో శ్రీరాధాగోవింద అభిషేకం అట్టహాసంగా జరిగింది. స్వామి వారి కోసం ప్రత్యేకంగా చప్పన్‌భోగ్ (56 ఆహార పదార్థాలతో కూడిన నైవేద్యం) సిద్ధం చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ రాధాష్టమి ప్రాముఖ్యతను వివరించారు.

ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాలి

కాచిగూడ: ఆక్రమణలకు గురైన భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, అడ్వకేట్ ఎన్.దశరథ రామ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజా శ్రీనివాస్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం హైడ్రాను ఏర్పాటు చేసి భూ అక్రమణలపై తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తున్నామని, ఈ విషయంలో ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

ఏకలవ్య కార్పొరేషన్‌కు పాలకమండలిని నియమించాలి

ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్‌కు పాలకమండలిని నియమించి యేటా రూ.1000 నిధులు కేటాయించాలని తెలంగాణ ఎరుకల హక్కుల ఐక్య పోరాట సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోనేరు సాయికుమార్ కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా, ఉద్యోగాల్లో ఎస్టీలకు వర్గీకరణను అనుసరించి రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం నేతలు జియా సాయిలు, చిరంజీవి, కూతాడి ఎల్లయ్య, కోనేరు యాదగిరి పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

పంజగుట్ట: ఎన్నికలకు ముందు ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని తెలంగాణ ముదిరాజ్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ పొల్కం లక్ష్మీ నారాయణ ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ ప్రధానకార్యదర్శి భీమా లక్ష్మణ్ ముదిరాజ్‌తో కలిసి మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ బీ నుంచి బీసీ ఏ లోకి మారుస్తానని చెప్పారన్నారు. 4 కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వాలని, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ. 5 వేల కోట్లు కేటాయించాలని, కులగణన తర్వాత బీసీల రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ మహిళా అధ్యక్షురాలు పుష్పలత, ప్రధాన కార్యదర్శి నీరజ, సురేశ్ ముదిరాజ్, ఉదయ్‌కాంత్, యువరాజ్, అజయ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బంజారాహిల్స్: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఖైరతాబాద్ సర్కిల్-7 డీటీ సయ్యద్ అంజద్ అలీ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఓ ఇంటిపై దాడి చేసి 39 బ్యాగుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఖైరతాబాద్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. నిందితురాలిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు నూర్‌సాబాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


పంజగుట్ట: ప్రభుత్వ శాఖల్లోని బీసీ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు దేవళ్ల సమ్మయ్య ఆధ్వర్యంలో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను బుధవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. అలాగే నూతన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు బాల లక్ష్మి, సురేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సతీశ్ కొట్టె, వినోద్ కురువా, దుర్గం రవీందర్, విజయ్, చక్రపాణి, సునిత, ప్రశాంత్ పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా గణేశ్ నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం మండపాల వద్ద భక్తులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల గణనాథుడు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు.
– ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జోన్ బృందం



రాజ్‌నగర్ మండపం వద్ద పూజల్లో బాబా ఫసీయుద్దీన్..



పుష్పాలంకరణలో విజయగణపతి



పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ సదాశివయాదవ్



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేశ్



ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఉద్యోగులు..



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న జూబ్లీహిల్స్ క్లబ్ సెక్రటరీ రాజేశ్వరరావు



మధురానగర్ బీ-బ్లాక్‌లో పూజల్లో మహిళలు

భార్య మందలించిందని అదృశ్యం

వెంగళరావునగర్ : ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌లో నివాసం ఉండే నసీర్ గతంలో పాన్‌షాపులో పని చేసేవాడు. అనారోగ్యంతో 2 నెలలుగా పని చేయడం లేదు. 2 రోజుల కిందట అతని భార్య ఊరికి వెళ్లి వచ్చేసరికి నసీర్ మద్యం సేవిస్తున్నాడు. దీంతో తాగవద్దని భార్య చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈనెల 9న రాత్రి బయటకు వెళ్లిన నసీర్ తిరిగి రాకపోవడంతో బావమరిది, భార్య బంధువులు చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేదు. బావమరిది అష్రాఫ్ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడితో కలిసి వివాహిత..

భర్తతో గొడవపడిన భార్య కుమారుడితో అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్మికనగర్‌లో నివసించే రహమతుల్లా బార్బర్‌గా పని చేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం అతనికి వివాహమైంది. వారికి పిల్లలు ఉన్నారు. 2021లో భార్య ప్రసవం సమయంలో గొడవపడి ఆంధ్రాలోని పుట్టింటికి వెళ్లి రెండేళ్ల వరకు రాలేదు. పెద్దలు మాట్లాడి ఇరువురిని కాపురానికి ఒప్పించారు. ఈనెల 9న మళ్లీ గొడవ జరిగింది. 10న తాను తన పెద్ద కొడుకు ఆలీ జుల్ఫీకర్‌తో కలిసి బార్బర్ షాపునకు వెళ్లి అనంతరం అతనిని ఆసుపత్రికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం తన భార్యతో మాట్లాడాడు. సాయంత్రం 4.30కు ఇంటికి వచ్చి చూడగా భార్య, చిన్న కుమారుడు కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద గాలించినా ఫలితం లేకుండా పోయింది. మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి గురువారం 12 సెప్టెంబర్ 2024

నిధులు మంజూరు చేయండి

సీఎంకు విన్నవించిన మేడ్చల్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు



సీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న మేడ్చల్ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపాలిటీల చైర్మన్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. తమ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు అధికంగా మంజూరు చేయాలని కోరారు. సీఎంను కలిసినవారిలో బోడుప్పల్, పీర్జాదిగూడ మేయర్లు తోటకూర అజయ్‌యాదవ్, అమర్‌సింగ్, మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి, బోడుప్పల్ డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్‌గౌడ్‌లు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలు సీఎంకు మేయర్లను పరిచయం చేశారు. అనంతరం నిధుల మంజూరు కోరుతూ మేయర్లు సీఎంకు వినతిపత్రాలు అందజేశారు.

16న మిలాద్ ఉన్ నబీ వేడుకలు

– 19న పాతబస్తీలో మిలాద్ ఊరేగింపు



సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 16వ తేదీన మహ్మద్ ప్రవక్త జయంతి పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ వేడుకను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని రుహియతే హిలాల్ కమిటీతో పాటు పలు మిలాద్ కమిటీలు ప్రకటించాయి. జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 16న, 19న పాతబస్తీలో ఊరేగింపు నిర్వహించాలని కమిటీలు నిర్ణయించాయి. నగరంలోని వివిధ మిలాద్ కమిటీలు సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రవక్త ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని కొనియాడుతూ గేయాలు పాడనున్నారు. ప్రసంగాలు చేయనున్నారు. ప్రధాన రహదారులతోపాటు గల్లీల్లో ఆకుపచ్చ తోరణాలు కట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రవక్త ఉపదేశాలు, సూచనలు తెలియజేసే బుక్‌లెట్‌లు, కరపత్రాల పంపిణీ ఊపందుకున్నాయి. నగరంలోని ముస్లింలు అత్యధికంగా నివసించే పాతబస్తీతోపాటు వివిధ ప్రదేశాల్లో పచ్చతోరణాలు, పచ్చ బ్యాడ్జీలు, టోపీలతోపాటు నెలవంక పచ్చజెండాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సామాజికంగా ఉత్తమ సేవలు అందించినవారికి అవార్డులు ప్రదానం చేయనున్నాయి.

పక్కాగా ఓటరు జాబితా రూపకల్పన

రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇంటింటి సర్వేకు తోడ్పాటును అందిస్తూ ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ శశాంక సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 18 తేదీ వరకు ప్రీ రివిజన్ ఆక్టివిటీస్ నిర్వహిస్తామని, అందులో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి అక్టోబర్ 29న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయనున్నామని తెలిపారు. ఎస్ఎస్ఆర్ – 2025లో భాగంగా బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించి కుటుంబసభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. అవసరం ఉన్న చోట పోలింగ్ కేంద్రాలను విభజించడం, కొత్త వాటిని ఏర్పాటు చేయడం వంటివి చేస్తామని, అలాంటి పోలింగ్ స్టేషన్లను గుర్తిస్తే, వాటి వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నాగార్జునతోపాటు గొరిగే హరికృష్ణ, నెట్టు ధనుంజయ(కాంగ్రెస్), జగదీష్(బీఆర్ఎస్), మహ్మద్ తాహెర్(ఎంఐఎం), పగడాల యాదయ్య(సీపీఎం) పాల్గొన్నారు.

అంతర్జాతీయంగా క్రీడాకారులు రాణించేలా కృషి

– రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి



చెస్ చాంపియన్ సంహితను సన్మానించిన శివసేనారెడ్డి తదితరులు

అబిడ్స్: క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి అన్నారు. రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కామన్వెల్త్ చెస్ టోర్నమెంట్–2024లో మూడు పతకాలు గెలుచుకున్న సంహితను బుధవారం ఎల్బీ స్టేడియంలో స్పోర్ట్స్ ఎండీ సోని బాలాదేవితో కలిసి సత్కరించారు. శివసేనారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే క్రీడలపట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేపట్టే విధంగా తాము సహకరిస్తామన్నారు. శ్రీలంకలో జరిగిన కామన్వెల్త్ చెస్ టోర్నమెంట్‌లో స్వర్ణం, రజతం, కాంస్య పతకాలు సాధించిన సంహితను విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

గవర్నర్‌తో డీఆర్‌డీవో మాజీ చైర్మన్ భేటీ



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను డీఆర్‌డీవో మాజీ చైర్మన్ జి.సతీశ్‌రెడ్డి రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఏరోనాటిక్స్, స్పేస్, డిఫెన్స్ రంగాల అభివృద్ధితోపాటు ఈ రంగాల్లో విద్య, పరిశ్రమలు, స్టార్టప్ వంటి పలు అంశాలపై ఇద్దరూ చర్చించుకున్నారు.

ఇన్నర్ టు ఔటర్!

- ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల రోడ్లకు మహర్దశ
- రూ.270 కోట్ల అంచనాతో 18 కొత్త రహదారులకు ప్రతిపాదనలు
- నగర ట్రాఫిక్ రద్దీ నియంత్రణ లక్ష్యంగా రేడియల్ రోడ్లు
- ఇన్నర్ టు ఔటర్.. అటు నుంచి ఆర్ఆర్ఆర్ వరకు రోడ్ల విస్తరణ
- 'సాక్షి'తో టీజీఆర్‌డీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'తెలంగాణ జనాభా నాలుగు కోట్లు కాగా, రెండు కోట్ల జనాభా గ్రేటర్ పరిధిలోని జిల్లాల్లోనే ఉంది. రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు వాహనాల రద్దీ కూడా తోడవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఈ నేపథ్యంలో ఇన్నర్ టు ఔటర్ రింగ్ రోడ్డు వరకు, అటు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న పాత లింకు రోడ్లను విస్తరించడం ద్వారా ట్రాఫిక్ రద్దీని నియంత్రించొచ్చని నిర్ణయించాం. ఈ మేరకు ఇప్పటికే ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని పలు మార్గాలను గుర్తించి రూ.270 కోట్ల అంచనాతో పలు కొత్త రోడ్లకు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశాం. రాబోయే రోజుల్లో ఆయా రోడ్లను వృద్ధి చేసి, నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి లేకుండా చూస్తాం' అని తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఆర్‌డీసీ) చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వం రోడ్ల విస్తరణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, దీనిలో భాగంగా జిల్లాలోని పలు రోడ్లను విస్తరించనున్నామని తెలిపారు.

18 మార్గాల్లో విస్తరణ పనులు...

- కేబీఆర్ ఫంక్షన్ హాల్ నుంచి మొదలై మన్సూరాబాద్, కుంట్లూరు క్రాస్‌రోడ్డు మీదుగా డంపింగ్ యార్డ్ వరకు..
- ఇన్నర్ రింగ్‌రోడ్డు నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా బండ్లగూడ, తట్టి అన్నారం, గౌరెల్లి, బాచారం వరకు..
- పెద్ద అంబర్‌పేట్ నుంచి తొర్రూరు మీదుగా మునగనూర్ వరకు ఉన్న రోడ్డు
- హయత్‌నగర్ సాయిబాబా దేవాలయం నుంచి కోహెడ ఔటర్ రింగ్‌రోడ్డు వరకు..
- ఇంజాపూర్ టు హయత్‌నగర్ ఇంటర్నల్ రోడ్డు
- హయత్‌నగర్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు, కుంట్లూరు, పసుమాముల, తారామతిపేట వరకు..
- ఇంజాపూర్ గ్రామపంచాయతీ నుంచి సాగర్ రోడ్డు మీదుగా తొర్రూరు, బ్రాహ్మణపల్లి రోడ్డు విస్తరణ
- కోహెడ నుంచి లష్కర్‌గూడ మీదుగా గండిచెరువు వరకు..
- ఎంఎం కుంట, రాగన్నగూడ, ఆదిభట్ల వరకు ఉన్న రోడ్డు విస్తరణ



- మునుగనూర్, కోహెడ బద్దంబావి మీదుగా రాజీవ్‌గృహకల్ప వరకు...
- పెద్ద అంబర్‌పేట నుంచి పసుమాముల వరకు ఉన్న రోడ్డు..
- వనస్థలిపురంలోని సుష్మా థియేటర్ నుంచి ఇంజాపూర్ మీదుగా సాహెబ్ నగర్ వరకు...
- బీఎన్‌రెడ్డి చౌరస్తా నుంచి జెడ్పీ రోడ్డు మీదుగా టీకేఆర్ కమాన్ వరకు...
- సాగర్ రోడ్డు నుంచి బీడీ రెడ్డి గార్డెన్, నంది హిల్స్, మీర్‌పేట్ మీదుగా ఆర్‌సీఐ వరకు...
- పెద్ద అంబర్‌పేట్, కవాడిపల్లి, బలిజగూడ మీదుగా ఓఆర్ఆర్ వరకు...
- ఆనంద్‌నగర్ చౌరస్తా నుంచి మన్సూరాబాద్ చౌరస్తా వరకు ఉన్న రోడ్డును...
- ఎల్బీనగర్ చౌరస్తా నుంచి సరూర్‌నగర్ చెరువు మీదుగా కోణార్క్ డయాగ్నోస్టిక్ సెంటర్ వరకు...

సాగర్ రోడ్డుకు మహర్దశ

హైదరాబాద్ టు నాగార్జున సాగర్ రోడ్డును ఆరు లేన్లు విస్తరింపజేసి, రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయా పనులను కూడా పరిశీలిస్తోంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రోడ్డు పూర్తి కాలేదు. ఓఆర్ఆర్‌కు 32 రేడియల్ రోడ్లు ఉండగా, వీటిలో సగం కూడా పూర్తి చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోంది. నల్లగొండ, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో 54 రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) పనులు కూడా చేపడుతున్నాం. దీనికిగాను రూ.ఐదు వేల కోట్లతో ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశాం. వీటిలో రూ.300 కోట్ల విలువ చేసే 30 పనులను టీజీఆర్‌డీసీకి అప్పగించాల్సిందిగా ప్రభుత్వాన్ని అభ్యర్థించాం. గత పాలకులు టీజీఆర్‌డీసీని పూర్తిగా గాలికొదిలేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు కేటాయించి, శాఖకు పూర్వ వైభవం తీసుకొచ్చింది.

పీడీఎస్‌యూ ఆవిర్భవించింది ఓయూలోనే...



పీడీఎస్‌యూ లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థుల సమస్యలపై పోరాడేందుకు 50 ఏళ్ల క్రితం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఓయూలో ఆవిర్భవించిందని వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట 50 ఏండ్ల పీడీఎస్‌యూ లోగోను జాతీయ కన్వీనర్ రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రొ.వెంకటదాస్ ఆవిష్కరించి మాట్లాడారు. ఆవిర్భవించిన నాటి నుంచి జార్జిరెడ్డి తదితరులు పీడీఎస్‌యూ ద్వారా విద్యార్థులకు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, విజయ్ ఖన్నా, ఏపీ కార్యదర్శి రఫీ, మాజీ ఉపాధ్యక్షుడు అప్పారావు, పీవోడబ్ల్యూ నేత సరళ, మిశ్రన్, సుల్తాన, గణేష్, సైదులు, ధరణి, సుమన్, రంజిత్, భాను ప్రసాద్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కులగణన ఉద్యమం చేపట్టాలి



'కులగణన రిజర్వేషన్లు- శాస్త్రీయ అవగాహన' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య

పంజగుట్ట: కులగణన, బీసీ సమస్యలపై సాగే ఉద్యమాన్ని బీఆర్ఎస్ తన భుజస్కంధాలపై ఎత్తుకుంటే ఆ పార్టీకి పూర్వవైభవం వస్తుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ జి.లక్ష్మణ్ రాసిన 'కులగణన, రిజర్వేషన్లు – శాస్త్రీయ అవగాహన' పుస్తకాన్ని బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జస్టిస్ ఈశ్వరయ్య, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ ఆవిష్కరించారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బీసీలకు అన్ని రంగాల్లో సమాన భాగస్వామ్యం ఉండాలని, బీసీ రిజర్వేషన్లు భిక్ష కాదని, వాటిని పొందడం మన హక్కు అని అన్నారు. అన్ని కులాలకు ప్రాధాన్యత కావాలంటే కులగణన జరగాల్సిందే అన్నారు. కేశవరావు మాట్లాడుతూ తమ వాటా తమకు ఇవ్వాలని బీసీలు ఎంతవరకు అడగరో అప్పటివరకు ఇదేస్థితిలో వారు కొనసాగుతారని అన్నారు. బీసీలది కులఉద్యమం కాదని, ఇది ప్రజాస్వామ్య ఉద్యమమని పేర్కొన్నారు. వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ పద్మవ్యూహంలో చిక్కుకున్న బీసీలను అందులో నుంచి బయటపడే మార్గాలు అన్వేషించాలని సూచించారు. ఈ పుస్తకాన్ని బీసీల రాజ్యాంగంగా పరిగణించి రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతీ గ్రామానికి తీసుకువెళ్లాలని అన్నారు. సామాజిక ఉద్యమకారుడు రౌతు కనకయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దేవళ్ల సమ్మయ్య, ఆకుల రజిత్, దుర్గం రవీందర్, వనమాల చంద్రశేఖర్, డి.మనోహర్ పాల్గొన్నారు.

రామకృష్ణ మఠంలో సంప్రీతి దివస్



హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద

కవాడిగూడ: జ్ఞానం, భక్తి సేవ ద్వారా వికసిత భారత్ సాధ్యమని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద తెలిపారు. అమెరికా చికాగో విశ్వమత మహాసభల్లో స్వామి వివేకానంద ప్రసంగించి 131 సంవత్సరాలైన సందర్భంగా రామకృష్ణ మఠంలో జరిగిన సంప్రీతి దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వామి వివేకానంద సాహిత్యపఠనంతో పవిత్రత, సహనం, పట్టుదల పెరుగుతాయన్నారు. ఇల్యుమైన్ నాలెడ్జి రిసోర్సెస్ సీఈవో శ్రీనివాస్ వెంకటరామన్ మాట్లాడుతూ స్వామి వివేకానంద సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని యువతకు సూచించారు. ట్యాంక్‌బండ్‌పైనున్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రామకృష్ణ మిషన్, మఠం ఉపాధ్యక్షులు స్వామి సుహితానంద ప్రసంగించారు. అనంతరం స్వామి వివేకానంద చికాగో ప్రసంగ పాఠాన్ని వివేకానంద వాణి సంస్థ డైరెక్టర్ స్వామి శితికంఠానంద చదివి వినిపించారు. అనంతరం ట్యాంక్‌బండ్ నుంచి రామకృష్ణ మఠం వరకు ర్యాలీ నిర్వహించారు.

14,15 తేదీల్లో జేవీవీ మహాసభలు

సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు వెల్లడి



సాక్షి,సిటీబ్యూరో: ఈ నెల 14,15 తేదీల్లో హైదరాబాద్‌లోని కాప్రా, ఏఎస్‌రావు నగర్‌లో నిర్వహించ తలపెట్టిన జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌రావు కోరారు. ఈ మహాసభల్లో ముఖ్యఅతిథులుగా ప్రముఖ ప్రజా వైద్యులు జతిన్ కుమార్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పురేంద్రప్రసాద్, పర్యావరణ కార్యకర్త డాక్టర్ లుబ్నా సార్వత్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ పాల్గొంటారని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే మహాసభలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రజల గొంతుక కాళోజీ



కాళోజీ జయంతి సందర్భంగా జరిగిన స్మారకోపన్యాస కార్యక్రమంలో రాములు

బంజారాహిల్స్: పాలకుల తప్పులు, అన్యాయాలపై మొహమాటం లేకుండా ప్రజాకవి కాళోజీ విమర్శనాస్త్రాలు సంధించారని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య పి.రాములు అన్నారు. తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు 110వ జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బుధవారం స్మారకోపన్యాసం నిర్వహించారు. 'కాళోజీ జీవితం, సాహిత్యం –నేటి సమాజానికి సందేశం' అనే అంశంపై రాములు ప్రసంగించారు. తాను నమ్ముకున్న సిద్ధాంతం కోసమే కాళోజీ చివరి వరకు పరితపించారన్నారు. అణచివేయబడిన సామాన్యులను చైతన్యవంతులుగా చేయడం, ప్రజల భాషలోనే సాహిత్య రచనలు చేయడం ఒక్క కాళోజీకే చెల్లిందన్నారు. తెలంగాణ భాష, యాసతో పాటు తెలంగాణ పల్లెల్లో వాడుకలో ఉండే మాండలికాలనే విరివిగా వాడేవారన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ పుష్పాచక్రపాణి, వర్సిటీ సామాజిక శాస్త్రాల డీన్, ఈఎంఆర్ అండ్ ఆర్‌సీ డైరెక్టర్ వడ్డాణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 527 అర్జీలు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో బుధవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 527 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ సమస్యలకు సంబంధించి 80, విద్యుత్ శాఖ 79, మైనారిటీ వెల్ఫేర్ 68, పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ 63, ఇతర శాఖలకు సంబంధించి 237 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు

తెలుగు వర్సిటీకి సోమనాథుడి పేరు పెట్టండి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పేరును మహిళా విశ్వవిద్యాలయానికి పెడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని సోమనాథ కళాపీఠం స్వాగతిస్తోందని పీఠం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే స్ఫూర్తితో తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ ఆదికవి, సామాజిక విప్లవకవి పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టాలని కోరారు.

మైనారిటీ గురుకుల విద్యార్థుల సత్తా

సాక్షి, సిటీబ్యూరో: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్–2024లో మైనారిటీ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ సెక్రెటరీ తఫ్సీర్ ఇక్బాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో టి మ్రీస్ బహదూర్‌పురా బాలుర–2కి చెందిన విద్యార్థులు సయ్యద్ గౌస్ 4వ, స య్యద్ ముజమ్మిల్ 41వ ర్యాంకులు సా దించారు. ఈ సందర్భంగా టీమ్రీస్ వైస్ చైర్మన్ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి, కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.

పబ్లిక్ గార్డెన్‌ను పచ్చగా ఉంచండి

– రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌ను నిత్యం ఆకుపచ్చగా ఉంచేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదంటూ కొట్టివేసింది. పబ్లిక్ గార్డెన్‌ను రిక్రియేషనల్ మినహా ఇతర ఏ అవసరాలకు వినియోగించకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ 2009లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది.

హైకోర్టు తీర్పు బీసీల నైతిక విజయం

– కులగణనపై జాజుల



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

పంజగుట్ట: కులగణనపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు బీసీల పోరాటానికి దక్కిన నైతిక విజయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కుల గణన చేయకుండా, బీసీల రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ తీర్పు చెంపపెట్టు అని అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ మూడు నెలల్లోగా రాష్ట్రంలో కులగణన పూర్తి చేసి బీసీ రిజర్వేషన్లు నిర్ధారించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కులగణనకు రోడ్‌మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. డెడికేషన్ కమిషన్ ద్వారా కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని తామే హైకోర్టులో పిటిషన్ వేశామని, ఈ మేరకు చారిత్రక తీర్పు వచ్చిందన్నారు. ఈ నెల 25న లక్షలాదిమంది బీసీలతో కలిసి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వరకు కులగణన మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, కనకాల శ్యామ్ కురుమ, వేముల వెంకటేష్, శేఖర్ సగర, లింగంగౌడ్, నాగరాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



సాక్షి, సిటీ బ్యూరో: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, తలసేమియా, సికిల్సెల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నిర్వాహకులు నాగరాజు కాచం మాట్లాడుతూ తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న చిన్నారులు సరైన సమయంలో రక్తం దొరక్క ఇబ్బందులు పడుతున్నారని, వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు 96 మంది యువకులు రక్తదానం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ ప్రెసిడెంట్ బాల కోటిరెడ్డి, రాంప్రసాద్, విసిరెడ్డి లక్ష్మి, పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ వెంకట నరసింహ రెడ్డి, నాగరాజు, మధుకర్ రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

మహాగణపతికి బండి సంజయ్ పూజలు



ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతిని బుధవారం రాత్రి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. సంజయ్ మాట్లాడుతూ 70 ఏళ్లుగా ఖైరతాబాద్‌లో వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అందరూ ఆయురోగ్యాలతో ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు సంజయ్‌ను ఘనంగా సన్మానించారు.

నవీన్ మిత్తల్ పూజలు

ఖైరతాబాద్ మహాగణపతిని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్‌మిత్తల్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కాగా, మహాగణపతి చెంత సాయంత్రం విద్యార్థినులు ప్రత్యేక కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. సుమారు గంటసేపు చేసిన నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.



దసరాలోగా డీఏలను ప్రకటించాలి

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం



నాంపల్లి: దసరాలోగా పెండింగ్ డీఏలను ప్రకటించాలని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నాంపల్లిలోని గృహకల్ప భవన సముదాయంలోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 33 జిల్లాలకు చెందిన అధ్యక్ష,కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర సంఘం అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ ఏపీలో పనిచేస్తున్న వంద మంది తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకురావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇచ్చిందని, అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్‌సీని ఇవ్వాలని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాల్గవ తరగతి ఉద్యోగులందరూ ఒకరోజు జీతాన్ని వరద బాధితుల సహాయార్థం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సహాధ్యక్షులు ఎల్.దాస్యానాయక్, కోశాధికారి ధన్‌రాజ్ పాల్గొన్నారు.

సాక్షి
11
హైదరాబాద్, గురువారం,
12 సెప్టెంబర్ 2024
సిటీ ప్లస్



క్యా ఫీల్.. హై..



సునాలిని మీనన్

- సిటీలో ఇండియన్ కాఫీ ఫెస్టివల్ 13 నుంచి..
- రెడీ అవుతున్న కాఫీ ప్రియులు

సాక్షి, సిటీబ్యూరో: సిటిజనుల రుచుల ఆస్వాదనలోని వైవిధ్యానికి అద్దం పడుతున్న ఇరానీ చాయ్‌కి పోటీగా ఆదరణ పొందుతోంది కాఫీ. సిటీలోని కాఫీ ప్రియుల ఆసక్తిని రెట్టింపు జేస్తూ పొగలుగక్కే పండుగ వారిని పలకరించనుంది. నో స్ట్రింగ్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ది ఇండియన్ కాఫీ ఫెస్టివల్ పేరుతో నిర్వహిస్తున్న ఈవెంట్ ఈ నెల 13 నుంచి సిటీలో ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్, రోడ్ నెం.51లో జరగనున్న ఈ ఫెస్ట్‌లో భాగంగా కాఫీ టేస్టింగ్ సెషన్స్, లాట్ ఆర్ట్ సెషన్స్, కాఫీ తయారీ నిపుణుల చర్చలు, బరిస్తా డిస్‌ప్లేలు.. వగైరాలు చోటు చేసుకోనున్నాయి. ఈ ఫెస్టివల్‌లో కథా కాఫీ, కరాఫా కాఫీ, ట్రూ బ్లాక్ కాఫీ, బిగ్ స్టార్ కేఫ్, కరాబీ కాఫీ, అరకు కాఫీ, ఎంఎస్‌పి హిల్ రోస్టర్స్, ఫస్ట్ క్రాక్ రోస్టర్స్, ఒడిస్సీ కాఫీలతో సహా భారత దేశంలోని పలు అత్యుత్తమ కాఫీ వెరైటీలు పాల్గొంటున్నాయి. ఈ బ్రాండ్‌లు తమ సిగ్నేచర్ మిశ్రమాలతో పాటు తమ ప్రీమియం కాఫీలను ప్రదర్శిస్తాయి. సందర్శకులకు విభిన్న రకాల రుచులు శైలులను రుచి చూసే అవకాశాన్ని అందిస్తాయి. అలాగే వెరైటీ వంటకాలు, లైవ్ మ్యూజిక్ కూడా ఉంటాయి. ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఆసియాలోనే ప్రథమ కాఫీ మహిళగా పేరొందిన సునాలిని మీనన్ హాజరుకానున్నారు. సో.. కాఫీ ప్రియులూ గెట్ రెడీ..





- దేవాలయాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు
- భజనలు చేస్తూ, సంకీర్తనలు పాడుతూ తన్మయత్వం
- నృత్యాలతో తమలో తామే లీనమైపోతున్న యువత

ఐటీ.. డివోటీ..

ఒత్తిడి తగ్గించుకునేందుకు ఆధ్యాత్మికత వైపు..

హైదరాబాద్ వైబ్స్

సాక్షి, సిటీబ్యూరో: ఎప్పుడూ చెప్పుకొనేదే.. నగరంలో ఉరుకులు పరుగుల జీవితం.. మానసిక సమస్యలు, చిరాకులు, కుటుంబ సమస్యలకు దారి తీస్తున్నాయనే విషయం తెలిసిందే. ఒత్తిళ్లు తట్టుకోలేక ఆందోళనలకు గురవుతూ.. మత్తుపానీయాలకు బానిసలు అవుతున్నారు. కంపెనీల్లో ఒత్తిడి ఎంతలా ఉందంటే ఒత్తిడి నుంచి బయటపడేందుకు పలు కంపెనీల్లో ప్రత్యేకంగా స్మోకింగ్ జోన్స్ ఏర్పాటు చేశాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చాలామంది ఉద్యోగులు వారాంతాల్లో కుటుంబంతో, స్నేహితులతో కలిసి జాలీగా గడిపేందుకు ప్లాన్స్ చేసుకుంటారు. సమీపంలోని ప్రశాంతంగా ఉండే రిసార్టులకు కొందరు వెళ్తుంటారు. మరికొందరు ఇంట్లోనే రెస్ట్ తీసుకుంటూ కుటుంబసభ్యులతో గడుపుతుంటారు. అయితే కొందరు ఉద్యోగులు.. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మాత్రం భక్తి చింతన, ఆధ్యాత్మికత వైపు అడుగులు వేస్తున్నారు. మరీ ముఖ్యంగా చిన్న వయసులోనే యువత కొత్త దారి వెతుక్కుంటూ.. నగరంలోని, శివారు ప్రాంతాల్లోని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతాల వైపు పరుగులు పెడుతున్నారు.

ఎందుకిలా..?

సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు ప్రాజెక్టులు, టార్గెట్లు, రిపోర్టులు, సబ్మిషన్లు ఇలా ఒక్కటేమిటి ఎన్నో ఒత్తిళ్లతో రోజును భారంగా గడుపుతుంటారు. నెలాఖరు రాగానే లోన్లు, ఈఎంఐలు కట్టేందుకు నానా తిప్పలు మరింత కామన్. ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఆల్కహాల్, సిగరెట్ వంటి అలవాటు చేసుకుని, అధికంగా సేవిస్తుంటారు. దీనికి తోడు ఎలాంటి శారీరక వ్యాయామాలు లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. దీంతో కలల ప్రపంచం ఒక్కసారిగా నేలకు దిగిపోతుంటుంది. అప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కొత్త దారి వెతుక్కుంటారు. సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్ అనగానే వీకెండ్స్ పార్టీలకు వెళ్తుంటారు అని భావిస్తుంటారు. కానీ అక్కడికి వెళ్లినా కూడా తమ ఉద్యోగ జీవితాల ద్వారా వచ్చే ఒత్తిడిని తట్టుకునేంత ప్రశాంతత దొరకట్లేదని ఆధ్యాత్మిక చింతన మార్గాన్ని ఎంచుకుంటున్నారు.



చిన్న వయసులోనే..

వారాంతాల్లో నగరంలోని పలు దేవాలయాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు యువతీ, యువకులతో కిటకిటలాడుతున్నాయి. నగరంలోని పలు ప్రముఖ ఆలయాలు, ఆధ్మాత్మిక క్షేత్రాలతో పాటు శివారు ప్రాంతాల్లోని నగరాలకు కూడా ఉద్యోగులు క్యూ కడుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మాత్రమే కాకుండా విద్యార్థులు కూడా ఇక్కడికి చేరుకుని చిన్న వయసులోనే వారిలో ఏర్పడిన ఒత్తిడిని దూరం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా ఏకాంతంగా కూర్చుని దేవుడి ముందు ధ్యానం చేసుకుంటూ కనిపిస్తున్నారు. నగరంలోని ఇస్కాన్ టెంపుల్స్, హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ వంటి క్షేత్రాల్లో నృత్యాలు చేస్తూ తన్మయత్వం చెందుతున్నారు. కృష్ణుడి సంకీర్తనలు, భజనలు చేసుకుంటూ వారిలోని ఆధ్యాత్మిక భావాన్ని చాటుకుంటున్నారు. జీవితానికి కొత్త ఒరవడిని చూపుకొంటున్నారు. జీవిత సత్యాన్ని తెలుసుకునేందుకు అన్వేషిగా బయల్దేరుతున్నారు.





ఆ రోజులే బాగున్నాయి..

చాలీచాలని డబ్బులతో ఉద్యోగం కోసం వెతుక్కుంటూ హైదరాబాద్‌లో తిరిగిన రోజులే బాగున్నాయి. అప్పుడు ఉద్యో గం వస్తే చాలు అనుకునే వాడిని. ఇప్పుడు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం.. లక్షల్లో జీతం.. అయినా ఏదో పోగొట్టుకున్న వెలితి ఉంది. సవాలక్ష సమస్యలు చుట్టు ముడుతున్నట్లు ఉంది. ప్రశాంతత అనే మాటే కరువైంది. నెలాఖరు రాగానే లోన్లు.. ఈఎంఐల వెంట పరిగెత్తాల్సి వస్తోంది. డబ్బులు అన్నీ ఇవ్వదనే విషయం అవగతమవుతోంది. అందుకే భక్తి మార్గం ప్రశాంతతను ఇస్తుందనే ఉద్దేశంతో ప్రతి వారం ఏదైనా గుడికి వెళ్లి ఒంటరిగా కాసేపు గడుపుతాను.

– నల్లం నవీన్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

మనసుకు ప్రశాంతత



నాకు ఆధ్యాత్మిక భావన ఎక్కువ. చిన్నప్పటి నుంచి దేవాలయాలకు వెళ్లడం, పూజా కార్యక్రమాలు చేపట్టడం అలవాటు. పెళ్లయిన తర్వాత ఉద్యోగం, విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడి ఎదుర్కొంటున్నాం. వారంలో శని, ఆదివారాలు రెండు రోజులు సెలవులు వస్తున్నాయి. పిల్లలు, ఇల్లు కుటుంబాన్ని చూసుకోవడానికే సరిపోతుంది. శని, ఆదివారాల్లో కుటుంబ సభ్యులంతా కలిసి ఆలయాలకు వెళ్తుంటాం. తిరుపతి, శ్రీశైలం, అరుణాచలం, వేములవాడ, యాదగిరిగుట్ట, ఈ మధ్య స్వర్ణగిరి వెళ్లాం.

– నిహారికారెడ్డి, మియాపూర్



గోథెజంత్రం ఆధ్వర్యంలో
ఎకో మేళా



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని జర్మన్ కల్చరల్ సెంటర్ గోథె జంత్రమ్ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఎకో మేళా పేరిట వేడుకల్ని నిర్వహిస్తున్నారు. గోథె జంత్రమ్ 20వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ మేళా సందర్భంగా పలు రకాల అంశాలపై చర్చలు, వర్క్‌షాప్స్, లఘు చిత్రాల ప్రదర్శన, ఆర్ట్ ఎగ్జిబిషన్స్, సంగీత ప్రదర్శన, స్టోరీ టెల్లింగ్.. తదితరాలతో పాటు విందు వినోదాలు కూడా చోటు చేసుకుంటాయని, ఉదయం 10.30 నుంచి రాత్రి 7గంటల దాకా ఇవి కొనసాగుతాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. బంజారాహిల్స్‌లోని జర్నలిస్ట్ కాలనీలో ఉన్న తమ గోథె జంత్రమ్ ఆవరణలో ఈ ఎకో మేళా జరుగుతుందని వివరించారు.

'సాల్వ్ ఫర్ టుమారో' ఫైనల్స్‌కి 10 టీమ్స్

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో విభిన్న అంశాలపై యువత, టీనేజర్లకు అవగాహన కల్పించనున్నారు. దీంతో పాటు సమస్యల పరిష్కారంలో వారికీ భాగం కల్పించేందుకు ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ (ఎఫ్ఐటీటీ), దీ మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఇఐటీవై), ఐఐటీ ఢిల్లీలతో కలిసి శామ్‌సంగ్ ఇండియా నిర్వహిస్తున్న సాల్వ్ ఫర్ టుమారో ఫైనల్స్‌కు 10 టీమ్స్ ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు. స్కూల్ ట్రాక్, యూత్ ట్రాక్ అనే రెండు విభాగాల్లో ఎంపికైన ఈ ఫైనలిస్ట్స్ విభిన్న రకాల సామాజిక సమస్యలకు పరిష్కారాలను అందించడం ద్వారా పోటీలో పాల్గొంటారన్నారు.

యాన్యువల్ సేల్



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆన్‌లైన్ వాణిజ్య వేదిక అమెజాన్ తమ వార్షికోత్సవ విక్రయాల సందడిని ఈ నెల 15 వరకూ కొనసాగించనుంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఏడాదికి ఒక్కసారే వచ్చే ఈ సేల్‌లో భాగంగా కొనుగోలు దారులకు వైవిధ్యభరితమైన ఉత్పత్తులను, రాయితీలను, క్యాష్ బ్యాక్ ఆఫర్లను అందుబాటులోకి తెచ్చామని వివరించారు.

- ఇప్పటికే సిటీలో అనుష్కవిరాట్ కోహ్లీ, రకుల్‌ల రెస్టారెంట్స్
- సిద్ధమవుతున్న శిల్పాశెట్టి బాస్టియన్ రెస్టారెంట్
- త్వరలో సన్నీలియోన్ చికాలోకా సైతం నగరానికి..

బాలీవుడ్ రెస్టారెంట్స్

నగర ఆహార రంగంపై బాలీవుడ్ తారల కన్ను



నచ్చిన రుచి కోసం ఎంత దూరమైనా ఎన్ని వ్యయప్రయాసలకైనా సై అంటారు ఫుడ్ లవర్స్. అలాంటి ఫుడ్ లవర్స్‌కి కేరాఫ్ అయిన హైదరాబాద్ అనేక మంది రెస్టారెంట్ రంగానికి చెందిన వారిని ఆకర్షించడంలో వింతేమీ లేదు. అయితే బాలీవుడ్ ప్రముఖులను కూడా ఆకర్షించడం విశేషం..

– సాక్షి, సిటీబ్యూరో

సిటీలో బిజినెస్ పరంగా చవులూరిస్తున్న ప్రధాన రంగాల్లో రెస్టారెంట్ వ్యాపారం ఒకటి. దీంతో ఇప్పటికే టాలీవుడ్ హీరోలు నాగార్జున, సందీప్ కిషన్, అల్లు అర్జున్, నాగచైతన్య.. తదితరులు ఆ రంగంలో లాభాల రుచిని ఆస్వాదిస్తున్నారు. అయితే వీరికి పోటీగా ఇప్పుడు బాలీవుడ్ తారలు కూడా రంగంలోకి దిగుతున్నారు.

మిస్చీఫ్‌తో మొదలైంది..

అయితే బాలీవుడ్ తారలు నగరంలో రెస్టారెంట్స్ ఏర్పాటు చేయడం అనేది ఇటీవల మొదలైన ట్రెండ్ కాదు. ఈ ట్రెండ్‌కి అప్పుడెప్పుడో.. ఆ మాటకొస్తే టాలీవుడ్ కంటే ముందుగా ఈ ట్రెండ్‌కి క్లాప్ కొట్టాడు బాలీవుడ్ స్టార్ సునీల్ శెట్టి. ఆయన స్థానికంగా కొందరిని భాగస్వాములుగా పెట్టుకుని అబిడ్స్‌లోని బిగ్‌బజార్‌లో మిస్చీఫ్ పేరుతో ఓ రెస్టారెంట్‌ను దాదాపు 2 దశాబ్దాల క్రితమే ప్రారంభించాడు. కారణాలేమో గానీ ఆ రెస్టారెంట్ కొన్నాళ్లకే మూత పడింది. ఆ తర్వాత చాన్నాళ్ల గ్యాప్ తర్వాత వరుస పెట్టి బాలీవుడ్ తారలు నగరంపై రుచుల అస్త్రాలతో దాడి చేయనుండటం కనిపిస్తోంది.



అనుష్కవిరాట్‌ల వన్8తో.. 'ఆరంభం'

నగరంలో బాలీవుడ్ నటి అనుష్కశర్మ, విరాట్ కోహ్లీలు వన్8 కమ్యూన్ పేరిట ఇటీవలే రెస్టో బార్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రస్తుతం బాలీవుడ్ తారగా పేరొందిన రకుల్ ప్రీతిసింగ్ సైతం ఆరంభం పేరుతో ఆర్గానిక్ రుచుల రెస్టారెంట్స్‌ను నెలకొల్పారు. వీటిని సిటీలో ఆమె మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నట్లు సమాచారం. మరో సీనియర్ నటి, యోగా క్వీన్‌గా కూడా పేరొందిన శిల్పాశెట్టి ఆధ్వర్యంలో ఇప్పటికే పలు నగరాల్లో ఏర్పాటైన శిల్పాశెట్టికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ బాస్టియన్ హైదరాబాద్‌కు రావడం ఖాయమైంది. లగ్జరీ కేఫ్‌లు రెస్టారెంట్‌లకు కేంద్రంగా ఉన్న జూబ్లీహిల్స్‌లో బాస్టియన్ గ్రాండ్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది 2025 ప్రథమార్థంలో ఇది ప్రారంభం కానున్నట్లు సమాచారం. ముంబైలో బాలీవుడ్ సెలబ్రిటీల సందడికి చిరునామాగా ఉంటున్న బాస్టియన్ బెంగళూర్ తర్వాత నగరానికి రానుండటం సిటీ రెస్టారెంట్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



నేను సైతం అంటున్న సన్నీలియోన్..

బాలీవుడ్ శృంగార తారగా సంచలనాలకు కేంద్రబిందువైన సన్నీలియోన్ సైతం సిటీవైపు చూపు మళ్లించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆమె నోయిడాలో చికాలోకా పేరుతో ఆసక్తికరమైన థీమ్‌తో రెస్టారెంట్ నెలకొల్పారు. ఆమె తన రెస్టారెంట్స్‌ను విస్తరించనున్నారని, విస్తరణ ప్రణాళికల్లో హైదరాబాద్ కూడా ప్రధానంగా ఉందని జాతీయ పత్రికల సమాచారం. శిల్పాశెట్టి, సన్నీలియోన్‌ల రెస్టారెంట్స్ సిటీలో ప్రారంభమై విజయాల బాట పడితే.. షారూఖ్‌ఖాన్ భార్య గౌరీఖాన్ నిర్వహిస్తున్న టోరి, మరో బాలీవుడ్ తార మౌనీరాయ్.. ఆధ్వర్యంలోని బద్మాష్.. తదితర రెస్టారెంట్స్ సైతం నగరానికి రావడం.. సిటిజనులకు సరికొత్త రుచులను వడ్డించడం తథ్యంగా కనిపిస్తోంది.



క్లుప్తంగా...

సీఎం రేవంత్‌ను కలిసిన అరికెపూడి గాంధీ



గచ్చిబౌలి (హైదరాబాద్): పీఏసీ చైర్మన్‌గా నియమితులైన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి పీఏసీ చైర్మన్‌గా నియమించినందుకు సీఎంకు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ సెక్రటరీ నర్సింహా చార్యులను కలిశారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

టీఎస్ఎల్ఎస్ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్



సాక్షి, హైదరాబాద్: లోక్ అదాలత్‌తో సత్వర, ఖర్చు లేని న్యాయం కక్షిదారులకు అందుతుందని తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్ చెప్పారు. ఈనెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న సందర్భంగా అథారిటీ జిల్లా చైర్‌పర్సన్లు, కార్యదర్శులతో బుధవారం ఆయన వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ, ఎస్పీలు, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్.. ఇలా అందరినీ కలవాలని సూచించారు. వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. లోక్ అదాలత్‌తో జరిగే ప్రయోజనం గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎల్ఎస్ఏ సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి, పరిపాలనాధికారి జి.కలార్చన తదితరులు పాల్గొన్నారు.

తడిసిన పెసర్లు కొనలేం

- చేతులెత్తేసిన మార్క్‌ఫెడ్

సాక్షి, హైదరాబాద్: తడిసిన పెసర పంటను కొనుగోలు చేయలేమని తెలంగాణ మార్క్‌ఫెడ్ చేతులెత్తేసింది. రంగుమారిన పెసరను కొనుగోలు చేయడం ఏమాత్రం సాధ్యం కాదని స్పష్టం చేసింది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సానుభూతితో వ్యవహరించి రైతులు పండించిన పంటను మద్దతు ధరకు కొనాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. కానీ ఆ బాధ్యతను మరిచి మార్క్‌ఫెడ్ వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాఫెడ్‌ను అడ్డంపెట్టుకొని కొనబోమంటే ఎలాగని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

64,175 ఎకరాల్లో సాగు..

ఈ ఏడాది వానాకాలంలో 64,175 ఎకరాల్లో పెసర పంట వేశారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో పంటలు ఊడ్చుకుపోయాయి. ఖమ్మం జిల్లాలో పెసర పంట చేతికొచ్చిన సమయంలోనే వరదలు రావడంతో అదంతా తడిసిపోయిందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 8,682 పలుకుతుండగా, తడిసిన పెసరను వ్యాపారులు అందులో సగం ధరకు కూడా కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే ఆదుకోవాల్సి ఉంటుంది.

మార్క్‌ఫెడ్ ఏం చేస్తున్నట్టు ?

మద్దతు ధరల కంటే మార్కెట్లో తక్కువ ఉంటే వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలి. పంటల సేకరణ కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కానీ మార్క్‌ఫెడ్ సేకరణ విభాగం ఇవేవీ చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఖమ్మంలో వరదలకు ముందే పెసర కోతకు వచ్చింది. ఆలోగా తక్షణం స్పందించకపోవడం..ఇప్పుడు కూడా తడిసిన పెసర్లపై నిర్ణయం తీసుకోవడంలోనూ, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడంలో ఈ సేకరణ విభాగం విఫలమైందన్న విమర్శలు వస్తున్నాయి.

బాబే బాధ్యుడు

ఆయనపై క్రిమినల్ నెగ్లిజెన్స్ కింద కేసు పెట్టాలి

వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ''వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. వర్షాలకు 60 మంది చనిపోవడం ఎప్పుడూ లేదు. సహాయక చర్యలకు సమయం ఉన్నా చంద్రబాబు నాయుడు స్పందించక పోవడం వల్లే అంత మంది మృతి చెందారు. క్రిమినల్ నెగ్లిజెన్స్ కింద చంద్రబాబునాయుడిపై ఎందుకు కేసు పెట్టకూడదు?''అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. వరదల్లో ప్రభుత్వ వైఫల్యాన్ని పక్కదారి పట్టించేందుకే మూడు, నాలుగేళ్ల క్రితం కేసును బయటకు తీసి దానిలో సంబంధం లేని ఒక దళిత మాజీ ఎంపీని అరెస్టు చేసి లోపలపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల గోడు పట్టించుకోకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలు, వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని మండిపడ్డారు. శిశుపాలుడి వంద తప్పులు త్వరలోనే పూర్తవుతాయని, ఎల్లకాలం మీ ప్రభుత్వమే ఉండదని.. తప్పుడు సంప్రదాయాలు సృష్టిస్తే దాని ఫలితం మీరు అనుభవించక తప్పదని హెచ్చరించారు. గుంటూరు జైలులో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్, విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాసరెడ్డిలను బుధవారం ఆయన ములాఖాత్‌లో కలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఇంత దుర్మార్గ పాలన ఎక్కడైనా ఉంటుందా?

ఏపీ చరిత్రలో ఇంత దుర్మార్గమైన, అన్యాయమైన పాలన ఎప్పుడూ చూసి ఉండరు. వర్షాలతో రాష్ట్రం అతలాకుతలమై పోతున్న సమయంలో ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి హైదరాబాద్‌కు వెళ్లి మాజీ పార్లమెంటు సభ్యుడైన ఒక దళిత నాయకుడ్ని అక్రమంగా అరెస్టు చేశారు. చంద్రబాబు నిర్లక్ష్యం వల్లే వరదల్లో దాదాపు 60 మంది చనిపోయారని విజయవాడ అట్టుడుకుతుంటే టాపిక్ డైవర్ట్ చేయడం కోసం నగర డిప్యూటీ మేయర్ భర్తను అరెస్టు చేశారు. వరద సహాయక చర్యల్లో చంద్రబాబు పూర్తిగా ఫెయిల్ అయ్యారు. డైవర్షన్ కోసమే ఈ అరెస్టులు. టీడీపీ కార్యాలయం కేసు జరిగి దాదాపు నాలుగేళ్లయింది. ఆ రోజు టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తిని బోసిడీకే అని తిట్టాడు. బోసిడీకే అంటే ఎంటో తెలుసా? లంజాకొడకా అని. నిజంగా ఆ మాదిరిగా తిడితే, అలాంటి మాటలు అన్న తర్వాత ఆ ముఖ్యమంత్రిని ప్రేమించే వారు, కడుపు మండిన వారు తెలుగుదేశం పార్టీ ఆఫీస్ వద్ద ధర్నాకు దిగారు. ధర్నా చేస్తున్న వారి మీద టీడీపీ వాళ్లు దాడులు చేశారు. ఆ దాడి జరిగిన సమయంలో, తొక్కిసలాటలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై రాళ్లు కూడా పడ్డాయి. సీఎంని అంత మాట అన్నా సరే, మేం చంద్రబాబు మీద కక్ష సాధింపుకు దిగలేదు. సీసీ కెమెరాలు, ఇతర ఆధారాలు చూసి ఆ ఘటనలో ఉన్న వారందరికీ చట్ట ప్రకారం 41ఏ నోటీసులు ఇచ్చి అరెస్టు చూపించాం. ఏడేళ్ల లోపు శిక్షా కాల పరిమితి ఉన్న కేసు కాబట్టి చట్ట ప్రకారం, నిబద్ధతతో వ్యవహరించాం. అప్పటి ఎంపీ నందిగం సురేష్ కానీ, విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త కాని ఈ ఘటనలో లేరు. ఈ విషయం సెల్‌ఫోన్లు ట్రాక్ చేస్తే తెలియదా? టీడీపీ ఆఫీసు సీసీ కెమెరాలు చూసినా తెలుస్తుంది. వీరెవరూ లేనప్పుడు, మూడేళ్ల తర్వాత దాన్ని మళ్లీ తవ్వి, అందులో ఉన్న వారిని భయపెట్టి, ప్రలోభపెట్టి తప్పుడు స్టేట్‌మెంట్లతో అరెస్టు చేస్తున్నారు. రెడ్‌బుక్‌లో పేర్లున్న వారి ఇళ్లు ధ్వంసం చేయడం, వాళ్లపై దాడులు చేయడం, వాళ్లపై కేసులు పెట్టడం, రాజ్యాధికారాన్ని చేతుల్లోకి తీసుకోవడం చేస్తున్నారు.



గుంటూరులో మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నిస్సిగ్గుగా డైవర్షన్ పాలిటిక్స్

వరదకు ప్రకాశం బ్యారేజీకి బోట్లు కొట్టుకు వస్తే, దాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారు. వాస్తవాలను వక్రీకరిస్తున్నారు. ఈ బోట్లు ఎవరివి? ఎవరి హయాంలో అనుమతులు వచ్చాయి? చంద్రబాబు హయాంలోనే కదా.. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇదే బోట్లలో విజయోత్సవం చేసుకున్నది నిజం కాదా? గత నాలుగు నెలలుగా చంద్రబాబు నాయుడితో కలిసి ఇసుక దోపిడీలో భాగస్వాములయ్యారు. ఉషాద్రి అనే వ్యక్తి ఎవరు? చంద్రబాబు, లోకేష్‌తో ఫొటోలు కూడా దిగారు. రామ్మోహన్‌అనే వ్యక్తి కూడా టీడీపీ ఎన్ఆర్ఐ నేత కోమటి జయరాం సోదరుడి కుమారుడు కాదా? ఆలూరి చిన్న అనే వ్యక్తి కూడా టీడీపీ మనిషే.

ఎల్లో మీడియాతో బోగస్ స్టోరీలు

ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5ని అడ్డం పెట్టుకుని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. ఎల్లో మీడియాతో బోగస్ స్టోరీలు రాయిస్తున్నారు. రెయిన్‌గేజ్ మీటర్లు చెడిపోయాయని ఈనాడులో స్టోరీ రాశారు. దీని వల్ల వర్షం ఎంత పడిందో చంద్రబాబుకు తెలియడం లేదన్నట్టు రాశారు. ఎంత దుర్మార్గంగా రాస్తున్నారంటే అసలు మనుషులేనా? రాష్ట్రంలో పాత రెయిన్ గేజ్ మీటర్ల స్థానంలో ఆటోమేటిక్ సెన్సార్ వ్యవస్థలు వచ్చాయి. రాష్ట్రంలో 1,599 వెదర్ స్టేషన్లు అందుబాటులో ఉన్నాయి. వాటిని మరింత బలపరుస్తూ మా ప్రభుత్వం వచ్చిన తర్వాత అదనంగా 450 ఏర్పాటు చేశాం. కళ్లెదుట ఇన్ని వాస్తవాలున్నా టాపిక్ డైవర్షన్‌లో భాగంగా రెయిన్ గేజ్ మీటర్లు చెడిపోతే పట్టించుకోలేదని, ఇప్పుడు చంద్రబాబు బాగు చేయిస్తున్నారని రాశారు. ఈనాడు దినపత్రికకు సిగ్గుండాలి.

ప్రశ్నించకూడదనే దాడులు..

చంద్రబాబు పాలన ఎంత దుర్మార్గంగా ఉందో మంగళవారం జరిగిన సంఘటనే సాక్ష్యం. వర్షాల వల్ల నష్టపోయిన రైతులను పరామర్శించి వారికి అండగా ఉండేందుకు వచ్చిన పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే శంకరరావును అడ్డుకున్నారు. ఆయన కార్లు పగలగొట్టారు. వరద బాధితులను పరామర్శించకూడదట. ఆ ప్రాంతాలను చూడకూడదట. అలా చేస్తే చంద్రబాబునాయుడి తప్పిదాలు బయటకు రావని వారు అనుకుంటున్నారు. అయ్యా చంద్రబాబూ.. ఇవన్నీ తాత్కాలికం. నష్టపోయింది, దెబ్బతిన్నదీ, నొప్పి కలిగేది ప్రజలకు. ఈ ప్రజలే చంద్రబాబు చేస్తున్న తప్పులను యాడ్ చేసుకుంటూ పోతున్నారు. శిశుపాలుడిలా వంద తప్పులు వేగంగా చేస్తుండటాన్ని వారు గమనిస్తున్నారు. మీరు, మీ పార్టీ భూస్థాపితం అయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

వైద్య విద్య కల ఛిద్రం.. ఇక ప్రైవేట్ 'మెడిసిన్'!

- ఏపీలో ఐదు కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు సర్కారు మోకాలడ్డు
- ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు అనుమతులను అడ్డుకుని విద్యార్థుల ఆశలపై నీళ్లు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల కట్టడి

- కోచింగ్ కేంద్రాలపై నియంత్రణ
- రెండేళ్లలో ఉన్నత విద్య ప్రమాణాల్లో మార్పు
- ఇంజనీరింగ్ కాలేజీలుగా 9 పాలిటెక్నిక్‌లు
- విద్యారంగ సంస్కరణలపై ఉపసంఘం సమీక్ష

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ, వాటి నిర్వహణ తీరును కట్టడి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయపడింది. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల చేరికలు పడిపోవడంపై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం -2020 అమలు వల్ల జరిగే ప్రయోజనాలు, సవాళ్లను సమగ్రంగా విశ్లేషించాలని సూచించింది. ఇంజనీరింగ్ విద్యలో నాణ్యత పెంపు దిశగా సరికొత్త మార్గాన్వేషణ చేయాల్సిన అవసరాన్ని విద్యాశాఖ ముందుంచింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం విద్యారంగంలో సంస్కరణలపై బుధవారం సమగ్రంగా చర్చించింది. సబ్ కమిటీ సభ్యురాలు మంత్రి సీతక్క ఈ సమీక్షలో పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు

కోచింగ్ కేంద్రాలపై నియంత్రణ

పలు రకాల పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే కోచింగ్ కేంద్రాలపై నియంత్రణ అవసరమని, అభ్యర్థుల భద్రత, ఫీజుల నియంత్రణపై దృష్టి పెట్టాలని మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను కోరారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను రాష్ట్రంలో కూడా అమలు చేస్తామన్నారు. ప్రైవేటు స్కూళ్లు, ఇంటర్మీడియట్ కళాశాల ఫీజుల నిర్ధారణపై నియంత్రణ కమిటీని ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పెంచితే, పేదలు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లరని, ఈ దిశగా ఎక్కడ లోపం ఉందో అన్వేషించాలని మంత్రి అధికారులకు సూచించారు. మానవ వనరులు వృథా అవ్వకుండా అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లను విలీనం చేసే అంశంపై అధ్యయనం చేయాలని విద్యాశాఖకు మంత్రి వర్గ ఉప సంఘం సూచించింది.

ప్రమాణాలు తగ్గడంపై ఆందోళన

రాష్ట్రంలో ఉన్నత విద్య ప్రమాణాలు తగ్గడంపై ఉప సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. విద్యా ప్రమాణాల్లో రాష్ట్రం 34వ స్థానంలో ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. డిగ్రీ కళాశాలల్లో బీఏ కోర్సుల పాఠ్య ప్రణాళికలో మార్పులు చేసి విద్యార్థులను ఉద్యోగాలకు సంసిద్ధం చేసేలా శిక్షణ ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలోని 9 పాలిటెక్నిక్ కాలేజీలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసే పనులను వేగవంతం చేయాలని చెప్పారు. మాసబ్‌ట్యాంక్, రామంతాపూర్, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, కొత్తగూడెం, సికింద్రాబాద్, కులీకుతుబ్ షా పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్ కాలేజీలను ప్రారంభిస్తామని శ్రీధర్‌బాబు తెలిపారు. మహిళలపై వేధింపులకు పాల్పడితే ఎలాంటి శిక్షలు ఉంటాయనే అంశాలను 5, 6 తరగతుల పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలుగా చేర్చాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు ప్రైవేటు కళాశాలలకు ఎందుకు వెళ్తున్నారో ఆత్మవిమర్శ చేసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

ప్రస్తుతానికి రూ. 5,438 కోట్లు!

- వరద నష్టంపై కేంద్ర బృందానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక
- ఇంకా నష్టం లెక్కలు తీస్తున్నాం..
- బాధితులందరికీ సాయం అందేలా నిబంధనలు సులభతరం చేయండి..
- వరదలపై వేగంగా స్పందించి ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగామని వెల్లడి
- ఎన్డీఆర్ఎఫ్ తరహా ప్రత్యేక బృందాల ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి
- సచివాలయంలో సీఎస్‌తో భేటీ అయిన కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలోని బృందం

సాక్షి, హైదరాబాద్: ఇటీవలి భారీ వర్షాలు, వరదల కారణంగా తెలంగాణలో సంభవించిన నష్టం విలువ రూ.5,438 కోట్లుగా ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశామని కేంద్ర బృందానికి రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. పూర్తిస్థాయి అంచనా ప్రక్రియ కొనసాగుతోందని, ఇంకా నష్టం లెక్కలు తీస్తున్నామని వివరించింది. ముంపు ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలు వేగంగా సాగేందుకు, బాధితులందరికీ సాయం అందేందుకు వీలుగా మార్గదర్శకాలను సులభతరం చేయాలని కోరింది.



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కేంద్ర బృందం

రాష్ట్రంలో వరదల ప్రభావాన్ని అంచనా వేసేందుకు కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కేంద్ర బృందం బుధవారం హైదరాబాద్‌కు వచ్చింది. తొలుత వరద నష్టంపై సచివాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించింది. అనంతరం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో భేటీ అయింది. ఈ సందర్భంగా అధికారులు రాష్ట్రంలో వరదల కారణంగా జరిగిన నష్టాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి వివరించారు. వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు అందిన తర్వాత, తక్కువ సమయంలోనే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని... వేగంగా తీసుకున్న చర్యలతో ప్రాణనష్టాన్ని తగ్గించగలిగామని సీఎస్ ఈ సందర్భంగా చెప్పారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు నిరంతరం పరిస్థితిని సమీక్షించారని తెలిపారు. పునరావాస కార్యక్రమాల కోసం నిధులను వెంటనే విడుదల చేశామన్నారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటుకు సహకరించండి

అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఎన్డీఆర్ఎఫ్‌తో సమానంగా రాష్ట్రంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారని కేంద్ర బృందానికి సీఎస్ వివరించారు. ఈ బృందాలకు శిక్షణ, ఇతర సౌకర్యాల కల్పనలో కేంద్రం సహకరించాలని కోరారు. భారీ వర్షాల సమయంలో ఎయిర్ రెస్క్యూ ఆపరేషన్ల నిర్వహణకు సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో 332 హెక్టార్ల విస్తీర్ణంలో పెద్ద సంఖ్యలో చెట్లు కూలిపోయిన అంశాన్ని కేంద్ర బృందానికి వివరించారు. దీంతో చెట్లు కూలిన ఘటనకు మూలకారణాన్ని తెలుసుకునేందుకు సమగ్ర అధ్యయనం చేయాలని సీఎస్‌కు కేంద్ర బృందం సూచించింది. ఇక వరదల కారణంగా సంభవించిన నష్టాలు, ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని కేంద్ర బృందానికి రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ వివరించారు. సమావేశం అనంతరం క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుసుకునేందుకు కేంద్ర బృందం ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు వెళ్లింది.

వరద నష్టంపై అమిత్ షాకు శివరాజ్‌సింగ్ ప్రాథమిక నివేదిక



సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరద నష్టానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అందించారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వరద ప్రభావిత జిల్లాల్లో శివరాజ్ సింగ్ చౌహాన్ పర్యటించిన విషయం తెలిసిందే. బుధవారం ఆయన ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో అమిత్ షాతో భేటీ అయి.. తెలుగు రాష్ట్రాల్లో వరద నష్టానికి సంబంధించిన అంశాలను వివరించారు. అనంతరం ఈ వివరాలను 'ఎక్స్'వేదికగా వెల్లడించారు. కేంద్ర బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పూర్తిస్థాయి నివేదికను సమర్పిస్తాయని తెలిపారు.

యూనిక్ నంబర్‌తో రాష్ట్ర ప్రజల హెల్త్ ప్రొఫైల్

- సకాలంలో మెరుగైన వైద్యం అందించడమే దీని లక్ష్యం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి
- ఫొటో, బార్ కోడ్‌తో ఐడీ కార్డులు జారీ చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: యూనిక్ నంబర్, ఫొటో, బార్ కోడ్‌తో రాష్ట్ర ప్రజల హెల్త్ ప్రొఫైల్ కార్డులు తయారు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్టేట్ హెల్త్ ప్రొఫైల్ తయారీ, హెల్త్ కార్డుల పంపిణీపై మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం సమీక్షించారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆ శాఖ కార్యదర్శి క్రిస్టినా, అధికారులు కర్ణన్, వాణి, అజయ్‌కుమార్, వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హెల్త్ ప్రొఫైల్, హెల్త్ కార్డులు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని చెప్పారు. ప్రజలను భయపెట్టేలా, వారికి ఇబ్బంది కలిగేలా సమాచార సేకరణ ఉండకూడదని, వారికి హెల్త్ ప్రొఫైల్ అవసరాన్ని వివరించి, వారి ఆమోదంతోనే సమాచార సేకరణ జరిగేలా కార్యాచరణ ఉండాలని తెలిపారు. ఇతర దేశాల్లో అవలంబిస్తున్న విధానాలను అధికారులు మంత్రికి వివరించారు. హెల్త్ ప్రొఫైల్‌లో ప్రాథమిక సమాచారం మాత్రమే సేకరించాలని, ఒకేసారి ప్రజలందరికీ రక్త పరీక్షలు చేయడం సాధ్యం కాదన్నారు. గతంలో ములుగు, సిరిసిల్లలో చేసిన పైలట్ ప్రాజెక్ట్ విఫలమవడానికి ఇదే కారణమని అధికారులు మంత్రికి తెలిపారు. గతంలో ఉన్న అనుభవాలను దృష్టిలో పెట్టుకొని, ఈసారి ప్రతిపాదనలను తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. తొలుత ప్రజల వద్ద పేరు, అడ్రస్, పుట్టిన తేదీ, ఏదైనా ఐడీకార్డు నంబర్, ఫోన్ నంబర్, వృత్తి వంటి సాధారణ వివరాలను సేకరించి వాటితో హెల్త్ కార్డులు తయారు చేయాలన్నారు.



ఆ తర్వాత వ్యక్తి బరువు, ఎత్తు, వృత్తి, బ్లడ్ గ్రూప్, బీపీ, షుగర్, గతంలో చేయించుకున్న ఆపరేషన్లు, కంటి సమస్యలు, దంత సమస్యలు, ఈఎన్‌టీ సమస్యలు, గతం తాలుకూ అనారోగ్య సమస్యలు, మద్యం, స్మోకింగ్, టొబాకో తదితర అనారోగ్య కారక అలవాట్ల సమాచారాన్ని సేకరించి, ఆ వివరాలను హెల్త్ కార్డుల్లో నిక్షిప్తం చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా హెల్త్ ప్రొఫైల్ పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని కమిషనర్ కర్ణన్‌కు సూచించారు. దవాఖానాల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా హెల్త్ ప్రొఫైల్ తయారీ కార్యాచరణ ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రజల ఆరోగ్య వివరాలను గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రతి గడపకు తిరిగి వారి హెల్త్ ప్రొఫైల్‌ను డిజిటల్ రూపంలో యాప్‌లో నమోదు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పర్సనల్ డిటైల్స్, హెల్త్ హిస్టరీ రికార్డులను ఈ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

హైటెన్షన్ కరెంట్ పిరం!

- హెచ్‌టీ కేటగిరీ చార్జీల పెంపునకు వారంలో ఈఆర్సీకి డిస్కంల ప్రతిపాదనలు !
- 11 కేవీ కనెక్షన్ల చార్జీలకు సమానంగా 33కేవీ, 132కేవీ/ఆపై కనెక్షన్ల చార్జీల పెంపునకు నిర్ణయం
- 33 కేవీ కనెక్షన్లకు యూనిట్‌కు అర్ధరూపాయి, 132/ఆపై కనెక్షన్లకు యూనిట్‌కు రూపాయి వరకు పెరిగే అవకాశం
- గృహాలు, వాణిజ్యంతో సహా ఎల్టీ కేటగిరీ పరిధిలోకి వచ్చే అన్ని కనెక్షన్లకు పెంపు లేనట్టే
- డిస్కంల ప్రతిపాదనల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత


సాక్షి, హైదరాబాద్: త్వరలో రాష్ట్రంలో హైటెన్షన్ (హెచ్‌టీ) కేటగిరీ విద్యుత్ చార్జీలు పెరగనున్నాయి. హెచ్‌టీ కేటగిరీలో 11 కేవీ, 33 కేవీ, 132 కేవీ/ఆపై సామర్థ్యం .అనే మూడు ఉప కేటగిరీల విద్యుత్ కనెక్షన్లుండగా, మూడింటికి వేర్వేరు చార్జీలు విధిస్తున్నారు. ఇకపై 33 కేవీ, 132కేవీ/ఆపై సామర్థ్యం కనెక్షన్ల చార్జీలను 11 కేవీ కనెక్షన్ల చార్జీలకు సమానంగా పెంచేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ప్రతిపాదించగా, రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చినట్టు సమాచారం. కొన్ని హెచ్‌టీ కేటగిరీల్లోని 33 కేవీ కనెక్షన్లకు యూనిట్ విద్యుత్‌పై అర్ధ రూపాయి వరకు, 132 కేవీ/ఆపై సామర్థ్యం కలిగిన కనెక్షన్లకు రూపాయి వరకు విద్యుత్ చార్జీలు పెరగనున్నట్టు తెలిసింది. రాష్ట్రంలోని దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్/టీజీఎన్పీడీసీఎల్) సంస్థలు వారంలోగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తమ వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)ను.. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి సమర్పించే అవకాశముంది.

నవంబర్‌లోనే సమర్పించాల్సి ఉండగా...

విద్యుత్ టారిఫ్ రెగ్యులేషన్స్ ప్రకారం ప్రతి ఏటా నవంబర్ 30లోగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విద్యుత్ టారిఫ్, ఏఆర్ఆర్ ప్రతిపాదనలను డిస్కంలు ఈఆర్సీకి సమర్పించాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే విద్యుత్ చార్జీల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలను డిస్కంలు సిద్ధం చేయగా, శాసనసభ ఎన్నికల నేపథ్యంలో అప్పట్లో గడువు పొడిగింపు పొందాయి. ఉత్తర/దక్షిణ డిస్కంలు గత ఆర్థిక సంవత్సరం 2023–24లో రూ.6299.29 కోట్ల కొత్త నష్టాలను మూటగట్టుకోగా, వాటి మొత్తం నష్టాలు రూ.57,448 కోట్లకు ఎగబాకాయి. ఒక్క టీజీఎస్పీడీసీఎల్ నష్టాలే రూ.39,692 కోట్లకు చేరగా, మరో రూ.17,756 కోట్ల నష్టాల్లో టీజీఎన్పీడీసీఎల్ సంస్థ ఉంది. దీంతో చార్జీల పెంపు అనివార్యంగా మారిందని అధికారులు అంటున్నారు.

గృహాలు, వాణిజ్య కేటగిరీలకు పెంపు లేదు

లోటెన్షన్ కేటగిరీ పరిధిలోకి వచ్చే గృహాలు, గృహేతర/వాణిజ్య, పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత కార్యకలాపాలు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా పథకాలు, సాధారణ వినియోగదారుల విద్యుత్ చార్జీలు పెరగవు.



హెచ్‌టీలో చార్జీల మోత..

హెచ్‌టీ కేటగిరీలోని సాధారణ పరిశ్రమలు, లైట్స్ అండ్ ఫ్యాన్స్, కోళ్ల ఫారాలు, సీజనల్ పరిశ్రమలు, ఫెర్రో అల్లయ్ యూనిట్లు, ఇతరులు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, తాత్కాలిక సరఫరా వంటి వినియోగదారులు వస్తారు. ఈ కేటగిరీల వినియోగదారులు తమ అవసరాల మేరకు 11 కేవీ, 33 కేవీ, 132 కేవీ/ఆపై సామర్థ్యంతో విద్యుత్ కనెక్షన్లను కలిగి ఉన్నారు. 11 కేవీ కనెక్షన్‌తో సమానంగా సంబంధిత 33 కేవీ, 132 కేవీ/ఆపై కనెక్షన్ల చార్జీలను పెంచే అవకాశముంది. 11 కేవీ కనెక్షన్ల చార్జీలు ఇప్పటికే అధికంగా ఉండడంతో యథాతథంగా ఉంచాలని నిర్ణయించారు. హెచ్‌టీ కేటగిరీలోని పారిశ్రామికవాడలు, ఆధ్యాత్మిక స్థలాలు, సాగునీటి పథకాలు, తాగునీటి పథకాలు, రైల్వే ట్రాక్షన్, మెట్రో రైలు, టౌన్‌షిప్పులు/రెసిడెన్షియల్ కాలనీలు, చార్జింగ్ స్టేషన్లకు సంబంధించిన 11 కేవీ, 33 కేవీ, 132 కేవీ/ఆపై సామర్థ్యమున్న కనెక్షన్లకు ఒకే తరహా చార్జీలు వసూలు చేస్తున్నారు. దీంతో వీటికి చార్జీల పెంపు వర్తించకపోవచ్చు.

నిండా మునిగాం.. ఆదుకోండి

▶ మొదటి పేజీ తరువాయి

మహబూబాబాద్ జిల్లాల్లో పర్యటించింది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి, హోం శాఖ జాయింట్ డైరెక్టర్ కల్నల్ కీర్తి ప్రతాప్‌సింగ్ నేతృత్వంలోని ఈ బృందంలో.. ఆర్థికశాఖ డిప్యూటీ డైరెక్టర్ మహేశ్‌కుమార్, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శాంతినాథ్ శివప్ప, జాతీయ రహదారులు, రోడ్డు రవాణా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.కె.కుశ్వంగ, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి టి.నియల్ ఖాన్సూన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాస్త్రవేత్త శశివర్ధన్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం రెండు సబ్ టీమ్‌లుగా విడిపోయి.. ఒక సబ్ టీమ్ పంట, ఆస్తి నష్టాలను పరిశీలించగా, మరో సబ్ టీమ్ తెగిపోయిన రోడ్లు, చెరువులు, వంతెనలు, కాల్వలు వంటివాటిని పరిశీలించింది. ఎక్కడికక్కడ రాష్ట్ర వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు వరద నష్టాలను కేంద్ర బృందం సభ్యులకు వివరించారు.

ఖమ్మంలో జిల్లాలో..

కేంద్ర బృందం సభ్యులు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం భగవత్‌వీడ్ తండాలో కోతకు గురైన, ఇసుక మేటలు వేసిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఖమ్మం, సూర్యాపేట మధ్యలో దెబ్బతిన్న జాతీయ రహదారిని, మల్లాయిగూడెంలో దెబ్బతిన్న రోడ్డును, పాలేరు వద్ద నాగార్జునసాగర్ కాలువకు పడిన గండిని, భక్తరామదాసు ఎత్తిపోతల పథకం పంపుహౌస్‌లను పరిశీలించారు. ఖమ్మం రూరల్ మండలంలోని గూడూరుపాడు, తనకంపాడు, తిరుమలాయపాలెం మండలంలోని రాకాసితండా, కస్నా తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పాలేరు, మున్నేరు వరదలతో తీవ్రంగా నష్టపోయామంటూ బాధితులు కేంద్ర బృందం ముందు కన్నీటి పర్యంతమయ్యారు. రాకాసితండాలో దెబ్బతిన్న ఇళ్లలోకి వెళ్లి పరిశీలించారు. సమీపంలో ఆకేరు వరదతో కొట్టుకుపోయిన ప్రాంతాన్ని చూశారు. ఈ సందర్భంగా తమ ఇళ్లు, పంట పొలాలు నామరూపాల్లేకుండా కొట్టుకుపోయాయని.. తమను ఆదుకోవాలని మహిళలు కేంద్ర బృందం సభ్యులకు దండం పెట్టి వేడుకున్నారు. తమకు మరో ప్రాంతంలో నివాసం కల్పించాలని విన్నవించారు.

మానుకోట జిల్లాలో పరిశీలించి..

కేంద్ర బృందం సభ్యులు మహబూబాబాద్ జిల్లాలోనూ రెండు సబ్ టీమ్‌లుగా పర్యటించారు. ఒక సబ్ టీమ్ సభ్యులు తొలుత మరిపెడ మండలం ఉల్లెపల్లిలో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. సీతారాంతండాలో వరదతో సర్వం కోల్పోయిన ఇస్లావత్ మంగీలాల్ కుటుంబంతో మాట్లాడారు. వరద వచ్చినప్పుడు సమయమెంత? మీకు మెలకువ ఎలా వచ్చింది? సురక్షిత ప్రాంతాలకు ఎప్పుడు వెళ్లారు? ఎంత నష్టం జరిగింది అంటూ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డోర్నకల్ మండలం ముల్కలపల్లిలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. మరో సబ్ టీమ్ సభ్యులు.. మరిపెడ మండలం అబ్బాయిపాలెం, గాలివారిగూడెం, పురుషోత్తమాయగూడెం, ముల్కలపల్లి గ్రామాల్లో తెగిన చెరువులు, రోడ్లు, వరద ప్రవాహం తీరును పరిశీలించారు. నష్టం ఫొటో ఎగ్జిబిషన్లను పరిశీలించారు.

నేడు మున్నేరు ముంపు, సూర్యాపేట జిల్లాలో పర్యటన

కేంద్ర బృందం సభ్యులు బుధవారం రాత్రి ఖమ్మంలో బస చేశారు. గురువారం ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. అనంతరం సూర్యాపేట జిల్లాలోని అనంతగిరి, కోదాడ మండలాల్లో నష్టాన్ని పరిశీలిస్తారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 12-9-2024



పాసింగ్ ఔట్ పరేడ్‌లో మహిళా ఎస్‌ఐలు

ఎస్.ఐయామ్ ఆన్ డ్యూటీ

- ఒక్కొక్కరిది ఒక్కో విజయగాథ..
- ప్రతి ఒక్క ఎస్సై కళ్లల్లో ఆనందం
- పీవోపీ సందర్భంగా ఆవిష్కృతమైన విజయోత్సాహం

ఎంతోమంది కలలను తమ భుజాలపై మోశారు.. ఎందరో ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలిచారు. సమాజ భద్రతకు తామున్నామంటూ ప్రతినబూనారు. తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందానికి కారణమయ్యారు. జీవిత భాగస్వాములు సగర్వంగా తలలు ఎత్తుకునేలా చేశారు. సొంతవారి కళ్లల్లో ఆనంద బాష్పాలయ్యారు. చిట్టిపొట్టి పాపాయిల సంతోషానికి అవధుల్లేకుండా చేశారు. పాసింగ్ ఔట్ పరేడ్ పూర్తి చేసుకుని ఎస్సైలుగా నియమితులైన ఎందరో విజయగాథలు బుధవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆవిష్కృతమయ్యాయి. వారిలో కొందరిని 'సాక్షి' పలకరించింది..

32 ఏళ్ల వయసులో...



భర్త, కుమార్తెతో భాగ్యశ్రీ

ఒడిలో పాపాయికి చనుబాలు మాన్పించి.. 32 ఏళ్ల వయసులో గ్రౌండ్ బాటపట్టారు. అనుక్షణం తనను తాను నిరూపించుకోవాలని వందకు రెండొందల రెట్లు కష్టపడ్డారు. మైదానంలో శివంగిలా దూకారు. మెదడుకు పదును పెట్టారు. పోలీసు శిక్షణలో భాగంగా ఇండోర్, ఔట్‌డోర్ విభాగాల్లో ఔరా అనిపించి టాపర్‌గా నిలిచి పాసింగ్ ఔట్ పరేడ్ కమాండెంట్‌గా నిలిచారు భాగ్యశ్రీ పల్లి. భద్రాచలంలోని సారపాక గ్రామానికి చెందిన భాగ్యశ్రీ చాలా పేదరికం నుంచి వచ్చారు. తండ్రి నాగేశ్వరరావు ఇప్పటికీ పెళ్లిళ్లకు వంటలు చేస్తుంటారు. తల్లి దుర్గ. భర్త పవన్ కుమార్ ప్రైవేటు ఉద్యోగి. చదువు మాత్రమే పేదరికాన్ని దూరం చేస్తుందని నమ్మి చదువుపై శ్రద్ధ పెట్టారు. గతంలో గ్రూప్–4 ఉద్యోగం చేస్తూ సమాజానికి నేరుగా ఏదైనా సాయం చేయాలన్న తలంపుతో ఎస్సై కోసం సన్నద్ధమయ్యారు. ఆ సమయంలో ఎన్నో కష్టాలకు ఎదురొడ్డారు. భర్త ప్రోద్బలంతో ఇదంతా సాధ్యమైందని చెబుతున్నారు. శిక్షణలో ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకున్నానని, ఫీల్డ్‌లో ఎంతో కష్టపడతానని పేర్కొన్నారు.

ఇద్దరు పిల్లల తల్లిగా..



తల్లిదండ్రులతో మణిమాల

ఇంట్లో ఏడు నెలల చిన్నారి.. మరో పాపకు రెండున్నర సంవత్సరాలు.. వారి ఆలనా పాలనా చూసుకోవడం చాలా కష్టం. అలాంటిది ఆ తల్లి వారిని అమ్మమ్మ వద్ద వద్ద వదిలి తన కలలను నెరవేర్చుకునేందుకు అడుగు బయట పెట్టింది. ఆమే మణిమాల. సివిల్ సర్వీసెస్ సాధించాలనేది తన కోరిక. కానీ ఇంతలో ఎస్సై నోటిఫికేషన్ రావడంతో ఎలాగైనా ఆ జాబ్ కొట్టాలనే ఆకాంక్షతో బయల్దేరారు. ఎట్టకేలకు తన గమ్యాన్ని చేరుకుని, హౌరా అనిపించుకుంటున్నారు. ఈవెంట్స్ కోసం కష్టనష్టాల కోర్చి నిరూపించుకున్నారు. నాన్న పేరు నాగళ్ల శ్రీనివాసరావు. అంబర్‌పేటలోని సీపీఎల్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. భర్త డి.వెంకటనాగేశ్వరరావు కూడా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. తమ్ముడు అశోక్ ఇటీవల ఏఈఈగా ఎంపికయ్యాడు. అక్కా తమ్ముళ్లు కలిసే చదువుకునేవారు. శిక్షణ పూర్తి చేసుకుని పీవోపీలో పాల్గొని తల్లిదండ్రులు, భర్త కళ్లల్లో ఆనందం చూశారు. తండ్రి శ్రీనివాసరావు, స్నేహితురాలు సృజన తనకు స్ఫూర్తి అని ఆమె చెప్పుకొచ్చారు. ఒక మహిళగా ఆర్థిక స్వావలంబన ఉండటం చాలా ముఖ్యమని, తన విధి నిర్వహణలో భాగంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు కృషి చేస్తానని వివరించారామె.

27 సార్లు ప్రయత్నించి..!



కుటుంబ సభ్యులతో నవీన్‌కుమార్

నవీన్ కుమార్ మానుపూరి.. సూర్యాపేట జిల్లా తాళ్లసింగారం గ్రామం. తల్లిదండ్రులు సంగయ్య, ఉపేంద్ర. తండ్రి చేనేత కార్మికుడు. ముగ్గురు కుమారుల్లో రెండో వ్యక్తి నవీన్. చిన్నప్పటి నుంచి యూనిఫాం వేసుకొని ఆఫీసర్ హోదాలో గౌరవం పొందాలనేది అతడి కోరిక. ఆర్మీలో చేరేందుకు పట్టుదలతో ఎంతో కృషి చేశాడు. కమాండెంట్ అధికారి హోదా కోసం 27 సార్లు విఫలప్రయత్నం చేశాడు. ప్రతిసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లి రిజెక్ట్ అవుతుండేవాడు. కానీ పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడాడు. చివరకు ఎస్సైగా ఎంపికై.. బుధవారం జరిగిన పాసింగ్ పరేడ్‌లో పాల్గొన్నాడు. పీవోపీ సమయంలో తల్లిదండ్రుల కళ్లల్లో కన్నీళ్లు చూసినప్పుడు నా ఆనందం మాటల్లో చెప్పలేనిదంటూ సంతోషం వ్యక్తం చేశాడు.

– వివేకానంద తంగెళ్లపల్లి, సాక్షి, హైదరాబాద్
ఫొటోలు: అనిల్‌కుమార్ మోర్ల

- కన్నీటిని తుడుస్తూ కాసిన్ని నవ్వులు

ఆ స్కూలు మళ్లీ సైకిలెక్కింది!



ట్రాన్స్‌ఫర్‌కు ముందు.... పిల్లలతో షాలినీ టీచర్

వాయనాడ్ వరదలకు రెండు నెలల ముందు షాలినీ టీచర్ ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లిపోయింది. స్కూల్ పిల్లల యూనిఫామ్‌లోనే సైకిల్ మీద తిరుగుతూ పిల్లలతో ఆడిన ఆమె వీడియో ఇంటర్నెట్‌లో ఎందరికో ఇష్టం. తర్వాత వరదలు వచ్చాయి. వీడియోలో ఉన్న పిల్లలు ముగ్గురు చనిపోయారు. 'నేను ఎప్పటికీ ఆ స్కూల్‌కి వెళ్లలేను' అని బాధపడింది షాలినీ టీచర్. కాని వారం క్రితం స్కూల్ తెరిచాక పిల్లలు కోరింది షాలినీ టీచర్ కావాలనే. వారి టీచర్ వారికి దొరికింది. ఇక గాయం తప్పక మానుతుంది.

టీచర్ల జీవితంలో అత్యంత కఠినమైన సందర్భం ఏమిటో తెలుసా?

విగత జీవులుగా ఉన్న పిల్లల ముఖాలను గుర్తు పట్టమని వారిని పిలవడం.

•••

జూలై 30 వాయనాడ్‌లోని కొండప్రాంత పల్లెలు ముండక్కై, చూరలమల వరదల్లో పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఊహించని వరద నిద్రలో ఉన్నవారిని నిద్రలోనే తీసుకెళ్లింది. ముండక్కైలో చిన్న ఎలిమెంటరీ స్కూల్ ఉంది. ఆ గవర్నమెంట్ స్కూల్ మొత్తం బురదతో నిండిపోయింది. దాని చుట్టూ ఉండే ఇళ్లు ధ్వంసమైపోయాయి. స్కూల్లోని 9 మంది విద్యార్థులు మరణించారు. వారిలో ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా మరణించారు. మృతదేహాల ఆచూకీ దొరికాక వారిని గుర్తించడానికి టీచర్లనే పిలిచారు. అక్కడ పని చేసిన షాలినీ టీచర్‌కు ఆ ఘటన ఎంత మనోవేదన కలిగించిందో! మిగిలిన టీచర్లు మళ్లీ ఈ స్కూల్ ముఖం చూడకూడదని ఎంతగా ఏడ్చారో!!

•••

షాలినీ టీచర్‌ది కొట్టాయం. కాని పట్నంలో పాఠాలు చెప్పడం కన్నా వాయనాడ్ ప్రాంతం ఆహ్లాదంగా ఉంటుంది... ప్రజలు అమాయకంగా ఉంటారని ముండక్కైలో ఎలిమెంటరీ స్కూల్లో అడిగి మరీ టీచర్‌గా చేరింది. అక్కడ పిల్లలకు ఆమె ఇష్టమైన టీచర్. వారి యూనిఫారమ్‌లాంటి చుడిదార్ వేసుకుని స్కూల్‌కు వచ్చి పిల్లల్లో కలిసిపోయేది. చిన్న స్కూలు... పిల్లల సంఖ్య తక్కువ కావడంతో అందరి ఇళ్లు, తల్లిదండ్రులు తెలుసు. ఒకరోజు గేమ్స్ పిరియడ్‌లో ఒక పాప సైకిల్‌ను ఆసక్తిగా చూడటం గమనించింది షాలినీ టీచర్. ఆ పాప స్లోచైల్డ్. తానుగా సైకిల్ తొక్కలేదు.



మళ్లీ అదే స్కూలుకు తిరిగి వచ్చాక షాలినీ టీచర్

షాలినీ టీచర్ అది గమనించి 'సైకిల్ ఎక్కుతావా' అని వెనుక నిలబెట్టి తాను తొక్కుతూ గ్రౌండ్‌లో ఒక రౌండ్ వేసింది. పిల్లలందరూ చుట్టూ చేరి ఎంజాయ్ చేశారు. ఎవరో ఇది షూట్ చేయగా ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యింది. రెండేళ్లు పని చేశాక షాలినీ టీచర్‌కి జూన్ నెలలో దగ్గరలోనే ఉన్న మీనన్‌గడి అనే ఊరికి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. పిల్లలు ఆమె వెళ్లడానికి ఒప్పుకోలేదు. కాని వెళ్లక తప్పలేదు. ఆ రోజు షాలినీ టీచర్ అనుకోలేదు.. వారిలో కొందరిని మళ్లెప్పుడూ చూడలేనని. వాయనాడ్ వరదలు పిల్లలకూ ఆమెకూ మధ్య శాశ్వత దూరం తెచ్చాయి. చనిపోయిన పిల్లలను గుర్తు పట్టమని పోలీసులు ఆమెను పిలిచినప్పుడు ఆమె హృదయం బద్దలైంది.

•••

వాయనాడ్ కోలుకుంది. సెప్టెంబర్ 2న ముండక్కైలోని స్కూల్‌ను రీ ఓపెన్ చేస్తూ సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి వి.శివకుట్టి హాజరయ్యారు. దారుణమైన విషాదాన్ని చవిచూసిన ఆ పిల్లల ముఖాలను చూసిన మంత్రి 'మీకు ఏం కావాలో అడగండి చేస్తాను' అన్నారు. వెంటనే పిల్లలు 'మా షాలినీ టీచర్‌ను మా దగ్గరకు పంపండి' అన్నారు. ఇలాంటి సమయంలో వారికి ఇష్టమైన టీచర్ తోడుంటే బాగుంటుందనుకున్న మంత్రి వెంటనే ఆదేశాలు ఇచ్చారు. షాలినీ తన స్కూల్‌కు తాను తిరిగి వచ్చింది.

ఆమెను చూసిన పిల్లలు కేరింతలు కొట్టారు. ఆమె కన్నీరు కార్చింది చనిపోయిన పిల్లలను తలుచుకుని. కాని ఆనందించింది తన స్కూలుకు తాను వచ్చానని.

ఆ స్కూల్‌ను తిరిగి ఆటపాటలతో నింపడమే ఆమె లక్ష్యం.

పిల్లల మోముల్లో చిర్నవ్వును పూయించడమే కర్తవ్యం.

షాలిటీ టీచర్ తప్పక సాధిస్తుంది.

బ్యూటిప్




బంగాళదుంప నాచురల్ బ్లీచ్. బంగాళదుంప రసాన్ని ముఖానికి రాసి ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. రసం తీయడం కుదరకపోతే బంగాళదుంపను పలుచగా తరిగి ముఖం మీద పరిచినట్లు అమర్చాలి. అందులోని రసాన్ని చర్మం పీల్చుకున్న తర్వాత ఆ ముక్కలతోనే ముఖమంతటినీ వలయాకారంగా రుద్ది ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఇలా వారానికి రెండు లేదా మూడుసార్లు చేస్తుంటే ఎండ తీవ్రత వల్ల, వాతావరణ కాలుష్యం వల్ల నల్లబడిన చర్మం తెల్లబడుతుంది.



మనసులో కుంచె ముంచి..

కళ సామాజిక ప్రయోజనం గురించి చెప్పుకోవడానికి బోలెడు మ్యాటర్ ఉంది. 'వ్యక్తిగతం' మాట ఏమిటి? అనే విషయానికి వస్తే... 'కళ అద్భుత ఔషధం' అంటున్నారు అమెరికాలోని బాల్టిమోర్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్వేతారావు గార్గ్. 'ఒత్తిడిని చిత్తు చేయడానికి, ఉత్సాహాన్ని శక్తిగా చేసుకోవడానికి కళ బలమైన ఔషధంలా ఉపయోగపడుతుంది' అంటున్న శ్వేతారావు గార్గ్ బోధకురాలు, రచయిత్రి, ఆర్టిస్ట్.



శ్వేతారావు గార్గ్

శ్వేతారావు గార్గ్ కాలేజీ రోజుల్లోకి వెళితే...

'ఒత్తిడి నుంచి బయటపడాలి'

'మనసుకు కాస్త ఉత్సాహం కావాలి' అనుకున్నప్పుడల్లా ఆమె చేసే పని... కలాన్ని చేతిలోకి తీసుకొని తన మనసులోని భావాలను కాగితంపై పెట్టడం. లేదా కుంచె తీసుకొని రంగు రంగుల చిత్రాలు వేయడం. ఈ ఉపశమనం, ఉత్సాహాన్ని ఇచ్చే పని కళాప్రపంచంలో తనకు చోటు కల్పిస్తుందని శ్వేత ఊహించి ఉండదు.

మొదట్లో తాను వేసిన చిత్రాలను ఇతరులకు చూపించేది కాదు. వాటిని రహస్యంగా దాచేది. వివిధ కారణాల వల్ల రచనలు చేయడానికి, బొమ్మలు వేయడానికి దూరమైన శ్వేత మళ్లీ కళాప్రపంచంలోకి వచ్చింది. అప్పుడు తనకు ఎంతో శక్తి వచ్చినట్లు అనిపించింది. బొమ్మలు వేయడమే కాదు నవలలు రాసే ప్రయత్నం కూడా మొదలుపెట్టింది.

రచనలు చేస్తున్న కొద్దీ, బొమ్మలు వేస్తున్న కొద్దీ తనమీద తనకు ఆత్మవిశ్వాసం పెరిగింది.

'వీటిని రహస్యంగా దాచుకోవడం ఎందుకు! ప్రపంచానికి చూపించాలి' అనుకుంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధ రచనలు, చిత్రాలను అధ్యయనం చేసిన శ్వేత అనుకరణ నీడల్లోకి వెళ్లకుండా తనదైన సొంత శైలిని సృష్టించుకుంది.

వంటగది నుంచి పిల్లల పెంపకం వరకు మహిళల దైనందిన జీవితంలో రకరకాల ఘట్టాలను కథలుగా మలిచింది. శ్వేత కళాత్మక సాధనలో 'స్త్రీవాదం' అనేది ప్రధాన అంశంగా మారింది. ఆమె రచనల్లో స్త్రీ పాత్రలు పరాధీనంగా, బేలగా, నిస్సహాయంగా కనిపించవు. పురుషాధిపత్య ధోరణులను సవాలు చేసేలా, స్వతంత్ర్య వ్యక్తిత్వంతో కనిపిస్తాయి. నిత్య ఉత్సాహంతో శక్తిమంతంగా కనిపిస్తాయి.

ఇక చిత్రకళ విషయానికి వస్తే శ్వేత ఏ ఆర్ట్ స్కూల్‌లోనూ పట్టా పుచ్చుకోలేదు. అయితే విన్సెంట్ వాన్ గోహ్ నుంచి అమృతా షేర్‌గిల్ వరకు ఎంతోమంది చిత్రకారులతో మౌన సంభాషణ చేస్తూనే ఉంటుంది. తనదైన విలక్షణ దృశ్యభాషను సృష్టించుకోవడానికి సాధన చేస్తూనే ఉంటుంది.

'కాలేజీ రోజుల నుంచి నా భావాల వ్యక్తీకరణకు కళ అనేది బలమైన మాధ్యమంగా ఉపయోగపడింది. కథ అయినా కవిత్వం అయినా చిత్రం అయినా కొత్త కోణంలో కనిపించాలనుకుంటాను' అంటుంది శ్వేత.

బోధన, పరిశోధన, కళలలో తనకు ఇష్టమైనది ఏమిటి?

ఆమె మాటల్లోనే చెప్పాలంటే... 'అవేమీ దేనికవి ప్రత్యేకమైన ప్రపంచాలు కావు. ఉదాహరణకు నా బోధన నేను చేసే పరిశోధనపై, నా పరిశోధన నా కళపై ప్రభావితం చూపిస్తాయి. ఒకదానికొకటి ఉపకరిస్తాయి'

వెల్‌కమ్ టు క్యాంపస్



శ్వేతారావు గార్గ్ గ్రాఫిక్ నవల 'ది టేల్స్ ఫ్రమ్ క్యాంపస్: ఏ మిస్ గైడ్ టు కాలేజ్' క్యాంపస్ వాతావరణం కాస్తో కూస్తో పరిచయం లేని వారిని కూడా క్యాంపస్‌లోకి తీసుకువెళ్లి ప్రత్యక్ష అనుభవాన్ని సొంతం చేస్తుంది. లింగభేదం, వేధింపులు, వర్గ హక్కులు, కులవివక్ష... ఇలా ఎన్నో అంశాలపై స్టూడెంట్స్ ఆలోచనలు, అవగాహనను ఈ నవల ప్రతిబింబిస్తుంది. పదమూడు చాప్టర్లలో ప్రతి చాప్టర్ తరువాత వచ్చే 'స్టాప్ అండ్ థింక్' సెక్షన్ ఎన్నో విషయాలలో పునరాలోచనకు అవకాశం కల్పిస్తుంది.

మన(సు)లో మాట

ఆయనకు స్త్రీ లాగా అలంకరించుకోవడం ఇష్టం!

మా ఆయన వయసు 27 ఏళ్లు. మా పెళ్లై ఏడాదయింది. ఒకరోజు రాత్రి నా దుస్తులు ధరించి అద్దంలో చూసుకుంటూ మురిసిపోవడం చూసి షాక్ తిన్నాను. ఏమిటిది అని అడిగితే అలా డ్రెస్ చేసుకుని ఆనందిస్తుంటానని చెప్పారు. నేనెంత గొడవ చేస్తున్నా, ఆయన మాత్రం అప్పుడప్పుడు అలా చేస్తూనే ఉన్నాడు. రాత్రి పూట నా డ్రెస్ వేసుకుని, ఉదయం మార్చుకుని ఆఫీసుకు వెళుతున్నారు. ఇతరత్రా మేము హ్యాపీగానే ఉన్నాం కానీ ఈ అలవాటు ఇలాగే కొనసాగితే ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందోనని చాలా భయంగా ఉంది. మా వారి ఈ వింత ప్రవర్తనకు ఏదైనా పరిష్కారముందా?

– సంధ్య, హన్మకొండ



మీ వారు ట్రాన్స్ వెస్టిజమ్ అనే ఒక అరుదైన సమస్యకు లోనయినట్లు అర్థమవుతోంది. పురుషుడు స్త్రీగాను, స్త్రీ– పురుషుడుగానూ అలంకరించుకుని లైంగికానందం పొందే ఈ వింత సమస్యకు ఒక ముఖ్య కారణం చిన్న వయసులో తల్లిదండ్రులు అమ్మాయిలు లేరని అబ్బాయిలకు గౌను, జడ వేసి పూలు పెట్టి అమ్మాయిలు లేని లోటును ఇలా తీర్చుకోవటం. మీ దాంపత్య జీవితం బాగానే ఉందన్నారు కాబట్టి కొంతవరకు నయం. మీరు ఆయనను ఎలాగైనా చికిత్సకు ఒప్పించగలిగితే సైకియాట్రిస్టుల పర్యవేక్షణలో బిహేవియర్ మాడిఫికేషన్, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ లాంటి కొన్ని ప్రత్యేక మానసిక చికిత్సలు చేసి మీ వారిని ఆ ప్రవర్తన నుంచి బయట పడేయవచ్చు. కేవలం మందుల ద్వారా లేదా కౌన్సెలింగ్ ద్వారా ఇలాంటి వింత ప్రవర్తనను మార్చలేము. రెండూ అవసరమే.

ప్రేమికుడు దూరమవుతాడేమో...

నేను గత రెండు సంవత్సరాలనుండి ఒక అబ్బాయిని ప్రేమిస్తున్నాను. ఇప్పటివరకు సంతోషంగానే ఉన్నాం కానీ ఈ మధ్య నాలో ఒక కొత్త భయం మొదలయింది. తను ఇంకెవరితో అయినా కొత్తగా బంధాన్ని ఏర్పరుచుకుంటాడేమో అని.. ఈ ఆలోచన నుంచి నేను బయట పడలేకపోతున్నాను. దీనికి కారణం ఏంటి? ఎలా ఈ ఆలోచన నుంచి బయటపడాలి?

– రాణి, జనగామ

మీలో ఏర్పడిన ఈ భయం కేవలం మీ ఊహ కావచ్చు. అకారణంగా కొందరిలో ఇలాంటి అభద్రతా భావాలు రావడం సహజమే! ఈ అభద్రత రావడానికి మీ రిలేషన్‌లో ఇటీవల ఏమైనా ఆ మార్పులు వచ్చాయా? లేక మీరు ఇంకేదైనా ఒత్తిడిలో ఉండి ఇలా ఆలోచిస్తున్నారా అని స్వయం పరిశీలన చేసుకోండి. మీ ప్రేమికుడితో మీ భయాన్ని పంచుకోండి. అతణ్ణి నొప్పించకుండా, నిందించకుండా ఎలాంటి సందర్భాలలో మీకీ భావాలు కలుగుతున్నాయో చెప్పడం ద్వారా అతను కూడా మీ బాధను అర్థం చేసుకుని, మీలోని ఫీలింగ్స్‌ను తగ్గించేందుకు తప్పకుండా సహకరిస్తాడు. మీ అభద్రత భావాన్ని అధిగమించాలంటే ఇద్దరూ కలిసి సమయాన్ని గడపటం, ఇద్దరికీ ఇష్టమైన పనులు చేస్తూ ఉండాలి. దీనివల్ల మీ బంధం మరింత గట్టిపడుతుంది. మీలో ఆత్మవిశ్వాసం పెంచుకునేందుకు, ఏదైనా కొత్త హాబీ, ధ్యానం, వ్యాయామం లాంటివి చేయండి. ఇదే విషయం గురించి అతిగా ఆలోచించడం మానేసి, అతడిలో మీకు బాగా నచ్చిన విషయాలు లేదా అంశాలు ఏంటో ఒకసారి గుర్తుచేసుకోండి. దీర్ఘకాలం పాటు ఉండే రిలేషన్‌షిప్స్‌లో అభద్రత కొంత సహజమే అయినప్పటికీ అది మిమ్మల్ని మరీ బాధించి, మనోవేదనకు గురి చేస్తుంటే మాత్రం ఒకసారి సైకియాట్రిస్టును లేదా క్లినికల్ సైకాలజిస్టును మీ ఇద్దరూ కలిస్తే, మీలోని ఈ భయాన్ని, అభద్రతను తగ్గించి, మీ మధ్య సంబంధాన్ని మరింత బలపర్చేందుకు కౌన్సెలింగ్ ద్వారా తగిన సూచనలు, సలహాలు చేస్తారు. ఆల్ ద బెస్ట్!



– డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

హెయిర్ కేర్

జుట్టుకు బలమైన చూర్ణం



అరకప్పు డ్రైఫ్రూట్స్... బాదం, పల్లీలు, పొద్దుతిరుగుడు గింజలు, వాల్‌నట్స్; అరకప్పు ఓట్స్, పచ్చి శనగపప్పు, పెసరపప్పు కలిపి అరకప్పు, సబ్జా గింజలు అరకప్పు, అవిసె గింజలు అరకప్పు చొప్పున తీసుకుని దోరగా వేయించి చూర్ణం చేసుకుని డబ్బాలో నిల్వ చేయాలి. ఈ పొడిని టేబుల్ స్పూన్ తీసుకుని టీ లేదా స్మూతీలో వేసుకుని తాగాలి. టీ అలవాటు లేని వాళ్లు వేడి నీళ్లలో కలుపుకొని రోజూ ఉదయాన్నే తాగితే రాలడం తగ్గి జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. ఈ పొడి జుట్టు సంరక్షణకే గాక ఆరోగ్యాన్నీ మెరుగు పరుస్తుంది.

కిచెన్ టిప్స్

పచ్చి బఠానీతో పచ్చగా...

పచ్చి బఠాణి మనకు ఎంత మేలు చేస్తుందో తెలిసిందే. అయితే బఠాణి పిక్కలు తీసి తొక్కలను పారేస్తుంటాము. కానీ ఈ తొక్కలు మొక్కలకు చక్కని పోషకాలు అందిస్తాయి. అందుకే తొక్కలను మిక్సీజార్‌లో వేసి పేస్టులా చేయాలి. ఈ పేస్టులో కాసిని నీళ్లు పోసి వడగట్టాలి. ఈ నీటిని గార్డెన్‌లోని మొక్కలకు పోయాలి. ఈ నీరు మంచి బలవర్ధకమైన టానిక్‌లా పనిచేసి మొక్కలు చక్కగా పెరిగేందుకు దోహదపడతాయి.





- గ్లాసు పుల్లటి మజ్జిగలో ఐదు గ్లాసులు నీళ్లు పోసి కలపాలి. ఈ నీటిని స్ప్రే బాటిల్‌లో పోసి మొక్కలపై చల్లాలి. ఉదయం సాయంత్రం ఒకసారి ఈ నీటిని మొక్కలు పోయడం వల్ల చీడపీడలు పోయి మొక్కలు చక్కగా పెరుగుతాయి.
- పూరీలు, పకోడీలు వేయించే నూనెలో చిటికెడు ఉప్పు వేస్తే పూరీలు, పకోడీలు పెద్దగా నూనె పీల్చవు. వీటిని వేయించడానికి తక్కువ నూనె పడుతుంది.





ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి జోడీ

హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి (భారత్) జోడీ శుభారంభం చేసింది. హాంకాంగ్‌లోని కౌలూన్ పట్టణంలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో తెలంగాణకు చెందిన సిక్కి-సుమీత్ ద్వయం 21-9, 21-10తో భారత్ తరఫున బరిలోకి దిగిన తెలంగాణ జోడీ కోనా తరుణ్-శ్రీ కృష్ణప్రియపై గెలిచింది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో గో సూన్ హువాట్-లాయ్ షెవోన్ జేమీ (మలేసియా)లతో సిక్కి-సుమీత్ తలపడతారు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో అశిత్ సూర్య-అమృత (భారత్) జంట 16-21, 20-22తో మింగ్ చె లు-హుంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ) ద్వయం చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రియాన్షు రజావత్ (భారత్) 9-21, 21-16, 9-21తో టకుమా ఉబయాషి (జపాన్) చేతిలో... కిరణ్ జార్జి (భారత్) 16-21, 16-21తో సులి యాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలయ్యారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో తాన్యా హేమంత్ (భారత్) 16-21, 21-23తో కొమాంగ్ అయు కాయదేవి (ఇండోనేసియా) చేతిలో... ఆకర్షి కశ్యప్ (భారత్) 15-21, 9-21తో అయా ఒహోరి (జపాన్) చేతిలో ఓటమి చవిచూశారు.

'హ్యాట్రిక్' విజయంతో సెమీస్‌లోకి భారత్

- మలేసియాపై 8-1 గోల్స్ తేడాతో ఘనవిజయం
- రాజ్‌కుమార్ పాల్ 'హ్యాట్రిక్'


రాజ్‌కుమార్

హులున్‌బుయిర్ (చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసింది. గత ఏడాది రన్నరప్ మలేసియా జట్టుతో బుధవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం 8-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. మలేసియా జట్టుపై భారత్‌కిది అతిపెద్ద విజయం కావడం విశేషం. ఈ గెలుపుతో భారత జట్టు మరో రెండు లీగ్ మ్యాచ్‌లు మిగిలి ఉండగానే తొమ్మిది పాయింట్లతో సెమీఫైనల్ బెర్త్‌ను అధికారికంగా ఖరారు చేసుకుంది. భారత్ తరఫున రాజ్‌కుమార్ పాల్ (3వ, 25వ, 33వ ని.లో) మూడు గోల్స్‌తో 'హ్యాట్రిక్' సాధించాడు. అరిజీత్ సింగ్ హుండల్ (6వ, 39వ ని.లో) రెండు గోల్స్ చేయగా... జుగ్‌రాజ్ సింగ్ (7వ ని.లో), హర్మన్‌ప్రీత్ సింగ్ (22వ ని.లో), ఉత్తమ్ సింగ్ (40వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. మలేసియా జట్టుకు అఖీముల్లా అనూర్ (34వ ని.లో) ఏకైక గోల్ అందజేశాడు. గత ఏడాది ఆసియా చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఈ రెండు జట్లు చివరిసారి ముఖాముఖిగా పోటీపడ్డాయి. నాటి ఫైనల్లో అర్ధభాగం ముగిసేసరికి 1-3 గోల్స్‌తో వెనుకబడ్డ భారత్ ఆ తర్వాత తేరుకొని చివరకు 4-3 గోల్స్ తేడాతో నెగ్గి విజేతగా అవతరించింది. ఈసారి మాత్రం మలేసియాపై ఆరంభం నుంచే భారత్ పూర్తి ఆధిపత్యం చలాయించింది. మ్యాచ్ మొదలైన మూడో నిమిషంలోనే రాజ్‌కుమార్ మలేసియా డిఫెండర్లను బోల్తా కొట్టిస్తూ గోల్ చేశాడు. ఆ తర్వాత నాలుగు నిమిషాల వ్యవధిలో భారత్ మరో రెండు గోల్స్ చేసి 3-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత కూడా భారత్ తమ జోరు కొనసాగించింది. ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో పాకిస్తాన్ 2-1తో జపాన్‌పై, కొరియా 3-2తో చైనాపై గెలిచాయి. నేడు జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో కొరియాతో భారత్ ఆడతుంది.


తానియా సచ్‌దేవ్, వంతిక అగర్వాల్, వైశాలి, దివ్య దేశ్‌ముఖ్, ద్రోణవల్లి హారిక


ఇరిగేశి అర్జున్, విదిత్ సంతోష్ గుజరాతి, పెంటేల హరికృష్ణ, దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద

భారత జట్ల శుభారంభం

చెస్ ఒలింపియాడ్ తొలి రౌండ్‌లో గెలిచిన పురుషుల, మహిళల జట్లు

బుడాపెస్ట్ (హంగేరి): ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు అలవోక విజయాలతో శుభారంభం చేశాయి. బుధవారం మొదలైన ఈ మెగా టోర్నీలో మొరాకోతో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 4-0తో గెలుపొందింది. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ, తమిళనాడు గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, దొమ్మరాజు గుకేశ్, మహారాష్ట్ర గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మొరాకో బలహీన ప్రత్యర్థి కావడంతో భారత బృందం ఈ మ్యాచ్‌లో గుకేశ్‌కు విశ్రాంతి ఇచ్చింది. తొలి రౌండ్ గేముల్లో ప్రజ్ఞానంద 30 ఎత్తుల్లో మొహమ్మద్ తిసిర్‌పై, అర్జున్ 40 ఎత్తుల్లో ఎల్బియా జాక్వెస్‌పై, విదిత్ 28 ఎత్తుల్లో మెహదీ పియరీపై, హరికృష్ణ 33 ఎత్తుల్లో అనస్ మొయాద్‌పై విజయం సాధించారు. మరోవైపు జమైకా జట్టుతో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 3.5-0.5తో గెలుపొందింది. తొలి రౌండ్ గేముల్లో వైశాలి 29 ఎత్తుల్లో క్లార్క్ అడానిపై, తానియా సచ్‌దేవ్ 41 ఎత్తుల్లో గాబ్రియేలా వాట్సన్‌పై, దివ్య దేశ్‌ముఖ్ 76 ఎత్తుల్లో రాచెల్ మిల్లర్‌పై విజయం సాధించగా... రెహానా బ్రౌన్‌తో జరిగిన గేమ్‌ను వంతిక అగర్వాల్ 53 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. భారత స్టార్ ద్రోణవల్లి హారికకు ఈ మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చారు. రెండేళ్ల క్రితం చెన్నై ఆతిథ్యమిచ్చిన చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు కాంస్య పతకాలు సాధించాయి.



విజేత హైదరాబాద్

చెన్నై: ఏడేళ్ల విరామం తర్వాత హైదరాబాద్ జట్టు ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలిచింది. ఛత్తీస్‌గఢ్ జట్టుతో జరిగిన ఫైనల్లో హైదరాబాద్ 243 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. హైదరాబాద్ నిర్దేశించిన 518 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన ఛత్తీస్‌గఢ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 61.1 ఓవర్లలో 274 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఓపెనర్ ఆయుష్ పాండే (117; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించగా... మరో ఓపెనర్ శశాంక్ చంద్రశేఖర్ (50; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు సరిగ్గా 100 పరుగులు జోడించారు. అనంతరం శశాంక్‌ను తనయ్ త్యాగరాజన్ అవుట్ చేయడంతో ఛత్తీస్‌గఢ్ వికెట్ల పతనం మొదలైంది. తనయ్ 61 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టగా... అనికేత్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. రోహిత్ రాయుడు, కన్నాల నితేశ్, తన్మయ్ అగర్వాల్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుకు విన్నర్స్ ట్రోఫీతో పాటు రూ. 3 లక్షల ప్రైజ్‌మనీ లభించింది.

వృత్తి అగర్వాల్‌కు స్వర్ణం



మంగళూరు: జాతీయ సీనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్ వృత్తి అగర్వాల్ రెండో పతకాన్ని సాధించింది. పోటీల రెండో రోజు బుధవారం హైదరాబాద్‌కు చెందిన వృత్తి అగర్వాల్ మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో విజేతగా నిలిచింది. వృత్తి 1500 మీటర్లను అందరికంటే వేగంగా 17 నిమిషాల 45.63 సెకన్లలో పూర్తి చేసి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. మంగళవారం జరిగిన 400 మీటర్ల ఫ్రీస్టయిల్ ఫైనల్లో వృత్తి రజత పతకం గెల్చుకుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మూడో రోజూ ఆట రద్దు

అఫ్గానిస్తాన్, న్యూజిలాండ్ ఏకైక టెస్టుకు తొలగని అడ్డంకులు

గ్రేటర్ నోయిడా: భారత్‌లో జరుగుతున్న అఫ్గానిస్తాన్ హోమ్ మ్యాచ్ మూడో రోజూ ముందుకు సాగలేదు. న్యూజిలాండ్‌తో జరగాల్సిన ఏకైక టెస్టుకు అడ్డంకులేవీ తొలగలేదు. దీంతో బుధవారం మూడోరోజు ఆటను కూడా ఫీల్డ్ అంపైర్లు ధర్మసేన, షర్ఫుద్దౌలా రద్దు చేశారు. మంగళవారం రాత్రి వర్షం కురవడంతో పగలంతా గ్రౌండ్ సిబ్బంది పడిన కష్టం నీటిపాలైంది. మైదానంలోని ప్రతికూల పరిస్థితులతో మొదటి రెండు రోజుల ఆట రద్దయితే... మూడో రోజు మాత్రం గతరాత్రి కురిసిన చినుకుల వల్ల ఆట వర్షార్పణమైంది. దీంతో ఇప్పటికీ ఇంకా టాసే వేయలేని పరిస్థితి నెలకొంది. ఇక మిగిలిన రెండు రోజుల్లోనైనా ఆట సాగుతుందా అంటే... గ్రౌండ్‌లో కనీస డ్రైనేజి సదుపాయాలు లేకపోవడం వల్ల అవుట్ ఫీల్డ్ తడారిపోయేందుకు అవకాశం లేదు. దీంతోపాటు ఇంకో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్థానిక వాతావరణ శాఖ వెల్లడించడంతో ఈ మ్యాచ్ సాగడం, ఆటగాళ్లు మైదానంలోకి దిగడం అనుమానంగానే ఉంది.

సినిమా

దియా వచ్చేశారు


సంయుక్తా మీనన్

శర్వానంద్ హీరోగా 'సామజవరగమన' మూవీ ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో 'శర్వా 37'(వర్కింగ్ టైటిల్) పేరుతో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర ఈ సినిమా నిర్మిస్తున్నారు. కాగా సెప్టెంబర్ 11న సంయుక్తా మీనన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా దియాగా సంయుక్త పాత్రని పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. సంప్రదాయ శాస్త్రీయ నృత్యం చేస్తున్న సంయుక్త లుక్ బాగుంది. ''పూర్తి వినోదాత్మకంగా రూపొందుతోన్న చిత్రం 'శర్వా 37'. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: జ్ఞాన శేఖర్ వీఎస్, సహ నిర్మాత: అజయ్ సుంకర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి.

స్వయంభూలో... నిఖిల్ హీరోగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'స్వయంభూ'. సంయుక్తా మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'ఠాగూర్' మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్‌పై భువన్, శ్రీకర్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. కాగా సంయుక్తా మీనన్ బర్త్ డే సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. విల్లు, బాణాలు పట్టుకుని వారియర్‌గా కనిపించారు సంయుక్త. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: కేకే సెంథిల్ కుమార్, సహ నిర్మాతలు: విజయ్ కామిశెట్టి, జీటీ ఆనంద్.

చలో చెన్నై


ప్రభాస్

చెన్నై వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారట ప్రభాస్. ఆయన హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే పీరియాడికల్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇమాన్వి ఎస్మాయిల్ హీరోయిన్‌గా నటించనున్నారు. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం తొలి షెడ్యూల్ రెగ్యులర్ షూటింగ్ వచ్చే వారంలో ప్రారంభం కానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమా కథ భారతదేశ స్వాతంత్ర్యానికి పూర్వం 1940 నేపథ్యంతో ఉంటుందని టాక్. చెన్నై, ముఖ్యంగా కారైకుడి లొకేషన్స్‌లో చిత్రీకరణను ప్లాన్ చేశారట హను రాఘవపూడి. ప్రభాస్‌పై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. ఈ సినిమాకు విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

మొరాకో మగువా..


గోపీచంద్, కావ్యా థాపర్

'మొరాకో మగువా..' అంటూ ఆడి పాడుతున్నారు హీరో గోపీచంద్. శ్రీనువైట్ల దర్శకత్వంలో గోపీచంద్, కావ్యా థాపర్ జోడీగా నటించిన చిత్రం 'విశ్వం'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్‌పై టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మించిన ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 11న విడుదల కానుంది. చైతన్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'మొరాకో మగువా...' పాటని రిలీజ్ చేసి, మ్యూజికల్ జర్నీని ఆరంభించారు మేకర్స్. రాకేందు మౌళి సాహిత్యం అందించిన ఈ పాటని పృథ్వీ చంద్ర, సాహితీ చాగంటి పాడారు. 'హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'విశ్వం'. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్‌కి అద్భుతమైన స్పందన రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'మొరాకో మగువా...' పాటలో గోపీచంద్, కావ్యా థాపర్ మధ్య కెమిస్ట్రీ, డ్యాన్స్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాకి సహ నిర్మాత: వివేక్ కూఛిబొట్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కొల్లి సుజిత్ కుమార్, ఆదిత్య చెంబోలు, కెమెరా: కేవీ గుహన్.

విడాకుల వార్తలతో వేదనకు గురయ్యాను

- 'జయం'రవి భార్య ఆర్తి



''మా('జయం' రవి, ఆర్తి) వివాహ జీవితం గురించి ఇటీవల వచ్చిన ప్రకటన చూసి చాలా బాధకు, వేదనకు గురయ్యాను. మేమిద్దరం విడిపోతున్నాం అన్నది నా దృష్టికి రాని, నా అంగీకారం లేకుండా విడుదలైన ప్రకటన'' అని నటుడు 'జయం'రవి భార్య ఆర్తి అన్నారు. తన భార్య ఆర్తి నుంచి విడిపోతున్నట్లు ఈ నెల 9న 'జయం' రవి ఓ ప్రకటన రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తన భార్య నుంచి విడాకులు కోరుతూ చెన్నై ఫ్యామిలీ కోర్టులో ఈ నెల 10న పిటిషన్ దాఖలు చేశారాయన. ఈ నేపథ్యంలో ఆర్తి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ''నా భర్తని కలవడానికి, మనసు విప్పి మాట్లాడటానికి ఇటీవల నేను చాలా ప్రయత్నాలు చేశాను. అందుకు ఆయన అవకాశం ఇవ్వలేదు. దీంతో నేను, నా ఇద్దరు పిల్లలు ఏమీ అర్థం కాక బాధపడుతున్నాం. వివాహ బంధం నుంచి వైదొలగాలన్నది పూర్తిగా ఆయన వ్యక్తిగత నిర్ణయమే. అందులో కుటుంబ మంచి కోసం అన్నది లేదు. ఒక తల్లిగా నా పిల్లల భవిష్యత్తే నాకు ముఖ్యం. ఈ నిరాధార ఆరోపణలు నా పిల్లల మనసుల్ని గాయపరచడాన్ని సహించలేను. అసత్యాలను ఖండించడం నా బాధ్యత'' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు ఆర్తి.

– సాక్షి సినిమా ప్రతినిధి, చెన్నై

ఇండస్ట్రీలో మార్పు వచ్చింది

- అభిరామి



''దాదాపు ఇరవయ్యేళ్ల క్రితం ఓ హీరోయిన్‌కు 35 ఏళ్లు దాటాయంటే పెద్దగా అవకాశాలు ఉండేవి కావు. కానీ, ఇప్పుడు ఇండస్ట్రీలో మార్పు వచ్చింది. ప్రేక్షకుల అభిరుచుల్లోనూ మార్పు వచ్చింది. సీనియర్ హీరోయిన్స్ కోసం రచయితలు, దర్శకులు మంచి పాత్రలు రాస్తున్నారు. ఓటీటీ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో కూడా మంచి అవకాశాలు లభిస్తున్నాయి'' అని నటి అభిరామి అన్నారు. రాజ్ తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా జె. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భలే ఉన్నాడే!'. దర్శకుడు మారుతి సమర్పణలో రవికిరణ్ ఆర్ట్స్ పతాకంపై ఎన్‌వీ కిరణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం రేపు(శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటించిన అభిరామి మాట్లాడుతూ–''దర్శకుడు మారుతిగారు ఫోన్ చేసి, 'భలే ఉన్నాడే' గురించి చెప్పారు. కథ నచ్చడంతో ఒప్పుకున్నాను. ఈ సినిమాలో గౌరి అనే బ్యాంకు ఉద్యోగినిగా నటించాను. మా అమ్మానాన్నలు కూడా బ్యాంకు ఉద్యోగులే కావడంతో గౌరి పాత్ర నాకు వ్యక్తిగతంగా కనెక్ట్ అయ్యింది. శివసాయి మంచి క్లారిటీ ఉన్న దర్శకుడు. రాజ్‌తరుణ్ మంచి నటుడు.. బాగా నటించాడు. ఈ సినిమా తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది. తెలుగులో 'చెప్పవే చిరుగాలి' తర్వాత నేను ఒప్పుకున్న తొలి చిత్రం 'భలే ఉన్నాడే'. కానీ 'సరిపోదా శనివారం' సినిమా ముందుగా విడుదల అయింది. కమల్‌హాసన్-మణిరత్నంగార్ల 'థగ్ లైఫ్'లో నటించాను. అలాగే రెండు తమిళ సినిమాలతో పాటు ఓ ఆంథాలజీ చేస్తున్నాను. తెలుగులో రెండు సినిమాల చర్చలు జరుగుతున్నాయి'' అని తెలిపారు.

సినిమాలు మన సంస్కృతిలో భాగమే

- ఎంపీ రఘునందన్ రావు



దీప్తి, తిరువీర్, రఘునందన్ రావు, ధృవ వాయు

''ఎవరు ఎంత బిజీగా ఉన్నా సినిమాలు చూడటం అనేది మన సంస్కృతిలో ఓ భాగమే. కరోనా తర్వాత అందరూ ఓటీటీకి అలవాటు పడ్డారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఇప్పుడు ఎక్కువగా ప్రయోగాత్మక చిత్రాలు వస్తున్నాయి. చిన్న సినిమాలు పెద్ద విజయాన్ని సాధిస్తున్నాయి. 'కళింగ' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. ఈ సినిమా భారీ విజయం సాధించి, నిర్మాతలకు మంచి లాభాలు తీసుకురావాలి'' అని మెదక్ ఎంపీ ఎం. రఘునందన్ రావు అన్నారు. ధృవ వాయు హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'కళింగ'. ప్రగ్యా నయన్ కథానాయిక. దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ నిర్మించిన ఈ సినిమా రేపు(శుక్రవారం) రిలీజ్ అవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ఎం.రఘునందన్ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ధృవ వాయు మాట్లాడుతూ–''కళింగ' టీజర్, ట్రైలర్ చూసిన తర్వాత చాలా మంది 'కాంతార, విరూపాక్ష, మంగళవారం' సినిమాల్లా ఉంటుందా? అని అడుగుతున్నారు. కానీ సరికొత్త కాన్సెప్ట్‌తో మా సినిమా రూపొందింది'' అన్నారు. ''కళింగ' అద్భుతంగా వచ్చింది'' అని దీప్తి కొండవీటి పేర్కొన్నారు. ''మా చిత్రాన్ని అందరూ చూసి, ఆదరించాలి'' అని పృథ్వీ యాదవ్ కోరారు. నటీనటులు ప్రగ్యా నయన్, ప్రీతి సుందర్, తిరువీర్, సంజయ్ మాట్లాడారు.

నాటకం అమ్మలాంటిది

- అనిల్ రావిపూడి


దిలీప్ ప్రకాష్, అనిల్ రావిపూడి, రెజీనా

''నాటకం అమ్మలాంటిది. సినిమా అనేది ఆ అమ్మకి బిడ్డలాంటిది. నాటకాల గురించి ఈ తరానికి చాలా కొద్దిగా తెలిసి ఉంటుంది. కానీ, నాటక రంగం నుంచి వచ్చి సినిమా రంగాన్ని ఏలిన చాలామంది గొప్పనటులు ఉన్నారు. అలాంటి నాటకరంగాన్ని నేపథ్యంగా ఎంచుకుని మంచి కాన్సెప్ట్‌తో తీసిన 'ఉత్సవం' సినిమా విజయోత్సవం జరుపుకోవాలి'' అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేష్ పాటిల్ నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అనిల్ రావిపూడి అతిథిగా హాజరయ్యారు. నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''నాటక రంగాన్ని బతికించాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా చేశాను'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన సినిమా ఇది'' అన్నారు దిలీప్ ప్రకాష్. ''కళ కోసం జీవితాలన్నీ అంకితం చేసిన 150 కుటుంబాలు ఉన్నాయి. వారి అంకితభావం చూసి 'ఉత్సవం' సినిమా తీశా'' అని అర్జున్ సాయి తెలిపారు. ''ఉత్సవం' చాలా మంచి సినిమా'' అని సురేష్ పాటిల్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, లిరిక్ రైటర్ అనంతశ్రీరామ్, రైటర్ రమణ గోపిశెట్టి, మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్ శశి మాట్లాడారు.

కమల్ ఔర్ మీనా


మీనాకుమారి

దివంగత ప్రముఖ హీరోయిన్ మీనాకుమారి జీవితం ఆధారంగా 'కమల్ ఔర్ మీనా' సినిమా తెరకెక్కనుంది. బుధవారం ఈ సినిమా అధికారిక ప్రకటన వెలువడింది. అయితే 'కమల్ ఔర్ మీనా' సినిమా మీనా కుమారి పూర్తిస్థాయి బయోపిక్ కాదని బాలీవుడ్ సమాచారం. దివంగత ప్రముఖ దర్శకుడు కమల్ అమ్రోహీ (మీనాకుమారి భర్త)తో మీనా పరిచయం, కమల్-మీనల ప్రేమ, పెళ్లి సంగతులు, వారి కాంబినేషన్‌లో వచ్చిన హిట్ ఫిల్మ్ 'పాకీజా' (1972) విశేషాలతో ఈ చిత్రం ఉంటుందట. 'మహారాజ్' సినిమా ఫేమ్ సిద్ధార్థ్ పి.మల్హోత్రా ఈ సినిమాకు దర్శకుడు. బిలాల్ అమ్రోహీ (కమల్ అమ్రోహీ మనవడు), రోహన్ దీప్ సింగ్, సారేగమ సంస్థ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ వచ్చే ఏడాది ప్రారంభమై, 2026లో రిలీజ్ కానుంది. ఈ మూవీకి ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు.

జీవిత కథలు


దేవియాని శర్మ

సత్య కేతినీడి, షాలిని కొండేపూడి, దేవియాని శర్మ, ఎం. వివాన్ జైన్, లక్ష్మీ సుంకర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '#లైఫ్ స్టోరీస్'. ఉజ్వల్ కశ్యప్ దర్శకత్వం వహించారు. అక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో ప్లానెట్ గ్రీన్ స్టూడియోస్ పతాకంపై ఉజ్వల్, ఎమ్ఎమ్ విజయజ్యోతి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ''వివిధ వయసుల్లోని వ్యక్తులకు చెందిన విభిన్నమైన కథలతో ఈ సినిమా చేశాం. ప్రేక్షకులందరికీ ఈ చిత్రం కనెక్ట్ అవుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి విన్ను సంగీతం అందించారు.

సాక్షి బిజినెస్
గురువారం
12-9-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
398	122
81,523	24,918

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,160	△	134
డోజోన్స్	40,555	▽	182
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,194	▽	12
డాక్స్	18,266	△	64
షాంఘై	2,742	▽	22
నికాయ్	35,620	▽	539

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్)		
71,450	△	360
బంగారం (22 క్యారెట్)		
68,050	△	350
వెండి (కిలో)		
91,500	△	1,500

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారమితి	82.14	85.82
£	బ్రిటన్ పౌండ్	భారమితి	106.95	111.86
€	యూరో	భారమితి	90.30	94.76
¥	జపాన్ ఎన్ (100)	భారమితి	48.00	70.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారమితి	53.44	58.26
S$	సింగపూర్ డాలర్	భారమితి	62.12	66.79
SAR	సౌదీ రియాల్	భారమితి	21.48	23.03
UAE D	యూఏఈ దిర్హామ్	భారమితి	21.90	23.69
¥	చైనా యువాన్	భారమితి	10.91	12.84

91 శాతం వాహనాలు బీమాకు దూరం

- పాలసీ రెన్యువల్స్ అంతంత మాత్రమే
- పెద్ద నగరాల్లోనే అవగాహన అధికం



బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ 2018లో తీసుకు వచ్చిన నిబంధనల ప్రకారం షోరూం నుంచి కొత్త కారు రోడ్డెక్కాలంటే ఒక ఏడాది ఓన్ డ్యామేజ్ ఇన్సూరెన్స్, మూడేళ్ల థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరి. ఐఆర్‌డీఏఐ 2019లో తెచ్చిన రూల్స్ ప్రకారం ద్విచక్ర వాహనాల విషయంలో ఇది 1+5 ఏళ్లు ఉంది. ఇదంతా సరే. మరి రెన్యువల్స్ సంగతి ఏంటి? తొలి పాలసీ గడువు ముగిసిన తర్వాత భారత్‌లో ఎంత మంది తమ వాహనాలను రెన్యువల్ చేస్తున్నారో తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే. 19 శాతం టూ వీలర్లు, 47 శాతం కార్లు మాత్రమే రెన్యువల్ అవుతున్నాయట. మొత్తంగా దేశంలో అన్ని వాహనాలకు కలిపి బీమా విస్తృతి 9 శాతమే ఉంది. అంటే రోడ్డుమీద తిరుగుతున్న 100 వాహనాల్లో తొమ్మిదికి మాత్రమే ఇన్సూరెన్స్ ఉన్నట్టు లెక్క. 2015కు ముందు ఇది కేవలం 3 శాతమే. వాహనానికి ఏమీ కాదు.. అనవసరంగా డబ్బులు ఖర్చు అన్న నిర్లక్ష్యపు భావనే ఇందుకు కారణమని బీమా కంపెనీలు అంటున్నాయి. బీమా లేకుంటే వాహనానికి జరగరానిది జరిగితే జేబులోంచి ఖర్చు చేయాల్సిందే. కొన్ని సందర్భాల్లో తీవ్ర నష్టమూ తప్పదు. సమగ్ర బీమా ఉంటే ప్రకృతి విపత్తుల నుంచీ వాహనానికి రక్షణ లభిస్తుంది.

డిజిటల్ పాలసీలదే హవా..

వ్యయాలను తగ్గించుకోవడానికి, పాలసీల జారీని వేగవంతం చేయడానికి బీమా కంపెనీలు డిజిటల్ వైపు మళ్లుతున్నాయి. 10 నిమిషాల్లోనే పాలసీలను కస్టమర్ల చేతుల్లో పెడుతున్నాయి. ఆన్‌లైన్‌లో జారీ అవుతున్న పాలసీల సంఖ్య ఏకంగా 65 శాతం ఉందంటే డిజిటల్ వేగాన్ని అర్థం చేసుకోవచ్చు. పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్స్ (పీవోఎస్‌పీ) అడ్వైజర్లు సైతం కస్టమర్లను నేరుగా చేరుకుని డిజిటల్ రూపంలో పాలసీలను అందిస్తున్నారు. 2029–30 నాటికి జారీ అవుతున్న పాలసీల్లో డిజిటల్ వాటా 75 శాతానికి చేరుతుందని పరిశ్రమ భావిస్తోంది. కస్టమర్లలో 15 శాతం మంది జీరో డిప్రీసియేషన్ కోరుకుంటున్నారు. నడిపే దూరానికి బీమా చెల్లించే 'పే యాజ్ యూ డ్రైవ్' ప్లాన్స్‌ను 6 శాతం మంది ఎంచుకుంటున్నారని పాలసీబజార్‌కు చెందిన పీబీపార్ట్‌నర్స్ మోటార్ ఇన్సూరెన్స్ అసోసియేట్ డైరెక్టర్, సేల్స్ హెడ్ అమిత్ భడోరియా సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. కంపెనీల మధ్య పోటీ కారణంగానే ప్రీమియంలో వ్యత్యాసం ఉంటోందని అన్నారు.

రూ.1.60 లక్షల కోట్లకు..

దేశంలో వాహన బీమాను 27 సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి. పాలసీల జారీలో 57 బ్రోకింగ్ కంపెనీలు పాలుపంచుకుంటున్నాయి. భారత్‌లో మోటార్ ఇన్సూరెన్స్ మార్కెట్ 2023–24లో 12.9 శాతం దూసుకెళ్లి రూ.91,781 కోట్లు నమోదు చేసింది. 2029 నాటికి ఇది సుమారు రూ.1.6 లక్షల కోట్లకు చేరుకుంటుందని మార్కెట్ అంచనా. వాహనాలన్నింటికీ బీమా కలిగి ఉండాలన్నదే ఐఆర్‌డీఏఐ లక్ష్యం. అంతేగాక బీమా ప్రీమియం వినియోగదార్లకు అందుబాటులో ఉంచేందుకు ఐఆర్‌డీఏఐ కృషి చేస్తోంది. బీమా పాలసీలను విస్తృతం చేసే లక్ష్యంతో 2015లో పాయింట్ ఆఫ్ సేల్స్ పర్సన్స్ (పీవోఎస్‌పీ) కాన్సెప్ట్‌కు ఐఆర్‌డీఏఐ శ్రీకారం చుట్టడం పరిశ్రమ వృద్ధికి ఆజ్యం పోసింది. జారీ అవుతున్న పాలసీల్లో 60 శాతం బ్రోకింగ్ కంపెనీల నుంచే ఉండడం గమనార్హం. 40 శాతం పాలసీలు నేరుగా బీమా కంపెనీల నుంచి జారీ చేస్తున్నారు.



75 శాతం చౌక ప్రీమియం పాలసీలే..

దేశంలో 2018కి ముందు రెన్యువల్స్ ద్విచక్ర వాహనాలకు 31 శాతం, కార్లకు 37 శాతం నమోదైంది. ఐఆర్‌డీఏఐ చొరవతో ఇన్సూరెన్స్ విస్తృతి పెరిగింది. పాలసీబజార్.కామ్ ప్రకారం టాప్–20 నగరాల్లో 50 శాతం టూ వీలర్స్, 60 శాతం కార్లకు బీమా ఉంది. తృతీయ, ఆపై తరగతి నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో 40 శాతం ద్విచక్ర వాహనాలు, 45 శాతం ఫోర్ వీలర్స్‌కు ఇన్సూరెన్స్ ఉంది. టాప్–20 నగరాల్లో సమగ్ర బీమా (కాంప్రహెన్సివ్) పాలసీని 55 శాతం మంది, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 70 శాతం మంది ఎంచుకుంటున్నారు. ఈ నగరాల వెలుపల 30 శాతం మంది సమగ్ర పాలసీ, 50 శాతం థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కొనుగోలు చేస్తున్నారు. తక్కువ ప్రీమియంలో లభించే పాలసీలను 75 శాతం మంది తీసుకుంటున్నారు. ఇక ప్రమాదానికి గురైన వాహనాల్లో 40 శాతం వాటికి బీమా ఉండడం లేదట.

– హైదరాబాద్, బిజినెస్ బ్యూరో

ఎలక్ట్రిక్ యుటిలిటీ కారు ఎంజీ విండ్సర్


ధర రూ. 9.9 లక్షలు

గురుగ్రామ్: ఆటోమొబైల్స్ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా తాజాగా 'ఎంజీ విండ్సర్' పేరిట ఎలక్ట్రిక్ యుటిలిటీ వాహనాన్ని ఆవిష్కరించింది. దీని ధర రూ. 9.9 లక్షలు కాగా కి.మీ.కు రూ. 3.5 చొప్పున బ్యాటరీ అద్దె ఉంటుంది. ఇందుకోసం బ్యాటరీ–యాజ్–ఎ–సర్వీస్ (బీఏఏఎస్)ను అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఒకసారి చార్జ్ చేస్తే దీని రేంజ్ 331 కిలోమీటర్లు ఉంటుంది. ఏదైనా డీసీ ఫాస్ట్ చార్జర్‌తో విండ్సర్‌ను 40 నిమిషాల్లో చార్జ్ చేయొచ్చు. ఎంజీ ఈ–హబ్ ద్వారా ఏడాది పాటు ఉచితంగా పబ్లిక్ చార్జింగ్ సదుపాయాన్ని పొందవచ్చని సంస్థ తెలిపింది. బుకింగ్స్ అక్టోబర్ 3 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొంది. ఎంజీ మోటార్ ఇండియాలో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఇన్వెస్ట్ చేసిన తర్వాత ప్రవేశపెట్టిన తొలి వాహనం విండ్సర్. తాము న్యూ ఎనర్జీ వెహికల్ (ఎన్‌ఈవీ) విభాగంపై మరింతగా దృష్టి పెట్టనున్నట్లు కంపెనీ డైరెక్టర్ పార్థ్ జిందాల్ తెలిపారు. ప్రతి 4–6 నెలల వ్యవధిలో ఒక కొత్త కారును ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

అలోపెక్స్‌తో భారత్ బయోటెక్ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యాంటీ–మైక్రోబియల్ టీకా ఏవీ0328ని సంయుక్తంగా అభివృద్ధి చేసేందుకు, భారత్‌తో పాటు అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో విక్రయించేందుకు అలోపెక్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు భారత్ బయోటెక్ తెలిపింది. ఇందుకోసం అలోపెక్స్‌కు వన్–టైమ్ ప్రాతిపదికన ముందస్తుగా కొంత చెల్లించడంతో పాటు ఇతరత్రా రాయల్టీ తదితర చెల్లింపులు ఉంటాయని పేర్కొంది. అంటువ్యాధులపై పోరు కోసం అత్యంత నాణ్యమైన, సురక్షితమైన, టీకాలను అందించాలన్న తమ లక్ష్యానికి ఈ ఒప్పందం సహాయకరంగా ఉంటుందని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్ల తెలిపారు.

వాణిజ్యానికి ప్రత్యేక పోర్టల్

ఎగుమతి, దిగుమతులకు దన్ను



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తాజాగా వాణిజ్యానికి ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ట్రేడ్ కనెక్ట్ ఈప్లాట్‌ఫామ్ పేరుతో ఏర్పాటు చేసిన పోర్టల్ ద్వారా ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించనుంది. వెరసి ప్రస్తుత, కొత్త వ్యాపారవేత్తల(ఆంట్రప్రెన్యూర్స్)కు ట్రేడ్ పోర్టల్ సహాయకారిగా నిలవనుంది. ఎంఎస్ఎంఈ శాఖ, ఎగ్జిమ్ బ్యాంక్, టీసీఎస్, ఆర్థిక సేవల శాఖ, విదేశీ వ్యవహారాల శాఖల సహకారంతో తాజా ట్రేడ్ పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. ట్రేడ్ పోర్టల్‌ను వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టారు. కస్టమ్స్ సుంకాలు, నిబంధనలు, నియంత్రణలు తదితర అన్ని రకాల సమాచారానికి ఒకే సొల్యూషన్‌గా తాజా పోర్టల్ నిలవనున్నట్లు గోయల్ వివరించారు. తద్వారా సమాచార లోపాలకు చెక్ పెట్టనున్నట్లు తెలియజేశారు.

లాభాల నుంచి నష్టాల్లోకి..

సెన్సెక్స్ నష్టం 398 పాయింట్లు



ముంబై: ఆరంభ లాభాలను నిలుపుకోవడంలో విఫలమైన స్టాక్ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి. అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో లాభాల స్వీకరణతో సూచీల ఆరంభ లాభాలు హరించుకుపోయాయి. సెన్సెక్స్ 398 పాయింట్లు పతనమై 81,523 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122 పాయింట్లు కోల్పోయి 25 వేల స్థాయి దిగువన 24,918 వద్ద నిలిచింది. చైనా ఆర్థిక మందగమనంతో ఆసియా, యూరప్ మార్కెట్లు నష్టాల్లోకి జారాయి. అమెరికా సూచీలు ఒకటిన్నర నష్టంతో ట్రేడవుతున్నాయి.

- టాటా మోటార్స్ షేరు ఆరుశాతం నష్టపోయి రూ.976 వద్ద ముగిసింది. అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ యూబీఎస్ ఈ షేరు టార్గెట్ ధరను రూ.825కు తగ్గించడంతో పాటు 'సెల్' రేటింగ్ ఇవ్వడం ప్రభావం చూపింది.

బజాజ్ హౌసింగ్ ఐపీవో సక్సెస్



న్యూఢిల్లీ: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూకు భారీ స్పందన లభించింది. ఇన్వెస్టర్లు క్యూ కట్టడంతో చివరి రోజుకల్లా 64 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. కంపెనీ 72.75 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. 4,627 కోట్లకు పైగా షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. వెరసి రూ. 66–70 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ.6,560 కోట్లు సమకూర్చుకుంది.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
ఐటీలో వృద్ధి 6 శాతం లోపే
కస్టమర్ సర్వీసులపై ఆటో రంగం దృష్టి పెట్టాలి: గడ్కరీ

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐటీబీపీలో 819 కానిస్టేబుల్ పోస్టులు

ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ).. నాన్ గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్) గ్రూప్–సి విభాగంలో.. కానిస్టేబుల్ (కిచెన్ సర్వీసెస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 819(యూఆర్–458, ఎస్సీ–48, ఎస్టీ–70, ఓబీసీ–162, ఈడబ్ల్యూఎస్–81). పురుషులకు 697, మహిళలకు 122 ఖాళీలు ఉన్నాయి.
» అర్హత: మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతితో పాటు ఫుడ్ ప్రొడక్షన్ లేదా కిచెన్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» శారీరక ప్రమాణాలు: పురుషులకు ఎత్తు 165 సెం.మీ., మహిళల ఎత్తు 155 సెం.మీ., పురుషుల ఛాతీ 75 సెం.మీ. నుంచి 80 సెం.మీ. మధ్య ఉండాలి.
» వయసు: 01.10.2024 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.21,700 నుంచి 69,100.
» ఎంపిక విధానం: ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాతపరీక్ష, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 02.09.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 01.10.2024.
» వెబ్‌సైట్: https://itbpolice.nic.in

ఫ్యాక్ట్‌లో 84 గ్రాడ్యుయేట్/ టెక్నీషియన్ అప్రెంటిస్‌లు

ఉద్యోగమండల్(కేరళ)లోని ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్(ఫ్యాక్ట్) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్/టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 84.
» అప్రెంటిస్‌షిప్ కాలవ్యవధి: ఒక సంవత్సరం.
» ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–27, టెక్నీషియన్(డిప్లొమా అప్రెంటిస్)–57.

విభాగాలు

» గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్–ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ –ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ –ఇన్‌స్ట్రుమెంటేషన్ /ఇన్‌స్ట్రుమెంటేషన్ –కంట్రోల్ ఇంజనీరింగ్/అప్లైడ్ ఎలక్ట్రానిక్స్–ఇన్ స్ట్రుమెంటేషన్, సేఫ్టీ అండ్ ఫైర్ ఇంజనీరింగ్.
» టెక్నీషియన్(డిప్లొమా అప్రెంటిస్‌లు): కెమికల్, కంప్యూటర్, సివిల్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్–ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్–ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, కమర్షియల్ ప్రాక్టీస్.
» అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» గరిష్ట వయో పరిమితి: 01.09.2024 నాటికి గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 25 ఏళ్లు, టెక్నీషియన్ అప్రెంటిస్‌కు 23 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: విద్యార్హత మార్కులు, మెడికల్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.09.2024.
» వెబ్‌సైట్: https://fact.co.in

బీహెచ్‌ఈఎల్, హైదరాబాద్‌లో 100 అప్రెంటిస్‌లు

హైదరాబాద్ రామచంద్రపురంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 100.
» విభాగాల వారీగా ఖాళీలు: ఫిట్టర్–20, మెషినిస్ట్–40, టర్నర్–26, వెల్డర్–14.
» అర్హత: సంబంధిత విభాగంలో మెట్రిక్యులేషన్/ఎస్ఎస్‌సీ, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ అభ్యర్థులు ఐటీఐలో కనీసం 60 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.
» వయసు: 01.09.2024 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: అసెస్‌మెంట్ టెస్ట్, మెడికల్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 04.09.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 13.09.2024.
» పరీక్ష తేది: 24.09.2024.
» వెబ్‌సైట్: https://hpep.bhel.com

యూబీఐలో అప్రెంటీస్ శిక్షణ

» మొత్తం 500 అప్రెంటీస్ ట్రైనీ ఖాళీలు
» ఏడాది శిక్షణతోపాటు రూ. 15 వేల స్టయిఫండ్
» బ్యాంకింగ్ కెరీర్‌కు చక్కటి అవకాశం

బ్యాంకింగ్ రంగంలో ఉన్నత అవకాశాలను అందుకోవాలనుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! ప్రభుత్వ రంగ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) అప్రెంటీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైతే బ్యాంకులో పని అనుభవంతో పాటు స్టయిఫండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకం కూడా లభించనుంది! ఈ నేపథ్యంలో.. యూబీఐ అప్రెంటీస్ ఖాళీలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, రాత పరీక్ష, అప్రెంటిస్ శిక్షణతో ప్రయోజనాలు తదితర వివరాలు..



బ్యాంకు ఉద్యోగాల పట్ల ఎంతో క్రేజ్. ప్రభుత్వ రంగంలో నియామకాలకు తీవ్రమైన పోటీ. నియామక పరీక్షల్లో విజయం సాధిస్తేనే కొలువు. మరో వైపు ప్రైవేట్ రంగంలో అనుభవానికి పెద్దపీట వేస్తున్న పరిస్థితి. దీంతో ప్రైవేట్ రంగంలో అవకాశాలు అందుకునేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులో అప్రెంటీస్ శిక్షణ అనుభవం ఎంతో తోడ్పడుతుంది.

అప్రెంటీసెస్ యాక్ట్‌కు అనుగుణంగా

దేశంలో ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. అప్రెంటీస్ ట్రైనీల నియామకం చేపట్టడానికి ప్రధాన కారణం.. అప్రెంటీసెస్ యాక్ట్–1961. దీనికి అనుగుణంగా బీఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో అప్రెంటీస్ ట్రెనింగ్ కల్పించే ఉద్దేశంతో ఈ నియామకాలు చేపడుతోంది.

500 అప్రెంటీస్ నియామకాలు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా... అప్రెంటీస్ తాజా నోటిఫికేషన్ ద్వారా జాతీయ స్థాయిలో మొత్తం 500 అప్రెంటీస్ ట్రైనీలను నియమించనుంది. రాష్ట్రాల వారీగా, ఆయా రాష్ట్రాల్లో జిల్లాల వారీగా అప్రెంటీస్ ఖాళీల సంఖ్యను పేర్కొంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి.. ఆంధ్రప్రదేశ్‌లో 50 ఖాళీలు, తెలంగాణలో 42 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

- 2024, సెప్టెంబర్ 17 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 2024, ఆగస్ట్ 1నాటికి 20–28 ఏళ్లు ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల ప్రకారం వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రాత పరీక్ష ద్వారా ఎంపిక

యూబీఐ అప్రెంటీస్ ట్రైనీల ఎంపిక ప్రక్రియలో భాగంగా రాత పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపడతారు. అభ్యర్థులు తాము ఏ రాష్ట్రానికి దరఖాస్తు చేసుకుంటున్నారో.. ఆ రాష్ట్రానికి నిర్దేశించిన భాషలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది. ఏపీ,తెలంగాణ విద్యార్థులు తెలుగు,ఉర్దూ భాషలో పరీక్షకు హాజరు కావచ్చు.

4 విభాగాలు.. 100 మార్కులు

యూబీఐ అప్రెంటీస్ ట్రైనీ రాత పరీక్షను నాలుగు విభాగాల్లో 100 మార్కులకు నిర్వహిస్తారు.జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 25ప్రశ్నలు–25 మార్కులు, జనరల్ ఇంగ్లిష్ 25 ప్రశ్నలు–25 మార్కులకు, క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–25 మార్కులకు, కంప్యూటర్ నాలెడ్జ్ 25 ప్రశ్నలు–25 మార్కులకు ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. నెగిటివ్ మార్కింగ్‌నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 వంతు మార్కులు తగ్గిస్తారు.

ప్రాంతీయ భాష పరీక్ష

యూబీఐ అప్రెంటీస్ నియామక ప్రక్రియలో పైన పేర్కొన్న రాత పరీక్షతో పాటు అభ్యర్థులు తాము ఎంచుకున్న ప్రాంతీయ భాష పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. రాత పరీక్షలో పొందిన మార్కులు, నిర్దేశిత కటాఫ్ ఆధారంగా మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు ఈ ప్రాంతీయ భాష పరీక్ష నిర్వహిస్తారు. ఇందుకోసం అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న ప్రాంతీయ భాషను ఎంచుకోవాలి. ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ భాష పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే అప్రెంటీస్ ట్రైనీగా నియామకం ఖరారవుతుంది. నిర్దిష్టంగా ఒక ప్రాంతీయ భాషను ఎంచుకున్న అభ్యర్థులు.. పదో తరగతి, ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సుల్లో సదరు భాషను అభ్యసించి ఉంటే వారికి ప్రాంతీయ భాష పరీక్ష నుంచి మినహాయింపు లభిస్తుంది.

మెడికల్ ఎగ్జామినేషన్

ఆన్‌లైన్ పరీక్షతోపాటు ప్రాంతీయ భాషలోనూ ఉత్తీర్ణత సాధించి ఫైనల్ మెరిట్ లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులకు మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులోనూ నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే నియామకం ఖరారు చేసి అప్రెంటీస్ ట్రైనీగా నియామక పత్రం అందిస్తారు.

అప్రెంటీస్ శిక్షణ ఇలా

అప్రెంటీస్ ట్రైనీగా నియమితులైన అభ్యర్థులు వారికి కేటాయించిన బ్రాంచ్‌లలో ఏడాది పాటు ట్రైనీగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. సీనియర్ సిబ్బందికి సహకరించడం, బ్యాంకింగ్ రంగంలో జరిగే కార్యకలాపాలకు సంబంధించిన విధులు నిర్వహించడం చేయాలి. ఈ సమయంలో నెలకు రూ.15 వేలు చొప్పున స్టయిఫండ్ అందిస్తారు.

అసెస్‌మెంట్ టెస్ట్

ఏడాది వ్యవధిలోని అప్రెంటీస్ ట్రెనింగ్ పూర్తి చేసుకున్న వారికి అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహించి సర్టిఫికెట్ కూడా అందిస్తారు. దీని ఆధారంగా భవిష్యత్తులో ఇతర బ్యాంకులకు దరఖాస్తు చేసుకునే సమయంలో ఈ సర్టిఫికెట్‌కు ప్రాధాన్యం లభించే అవకాశం ఉంటుంది. యూబీఐ అప్రెంటీస్ ట్రైనీ శిక్షణతో భవిష్యత్తులో బ్యాంకింగ్ రంగంలో ఉజ్వల కెరీర్ అవకాశాలు సొంతం చేసుకునే వీలుంది. దీనికి ప్రధాన కారణం.. ప్రైవేటు బ్యాంకులు అనుభవానికి ప్రాధాన్యం ఇస్తుండటమే.

రాత పరీక్షలో విజయం ఇలా

- **జనరల్/ఫైనాన్షియల్ ఎవేర్‌నెస్:** తాజా బ్యాంకింగ్ రంగం పరిణామాలు, విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బ్యాంకింగ్ రంగంలోని అబ్రివేషన్లు, పదజాలం, విధులు, బ్యాంకులకు సంబంధించిన కొత్త విధానాలు, కోర్ బ్యాంకింగ్‌కు సంబంధించి చట్టాలు, విధానాలు, రిజర్వ్ బ్యాంకు విధులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో.. కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ కోణంలోనూ ఆర్థిక సంబంధ వ్యవహారాలు(ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- **జనరల్ ఇంగ్లిష్:** ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ,సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్,వన్‌వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై పట్టు సాధించాలి. గ్రామర్‌కే పరిమితం కాకుండా.. జనరల్ ఇంగ్లిష్ నైపుణ్యం పెంచుకోవాలి.ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం, వాటిలో వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణం వంటి వాటిపైదృష్టి పెట్టాలి.
- **క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్:** అర్థమెటిక్ అంశాలు (పర్సంటేజెస్, నిష్పత్తులు, లాభ–నష్టాలు, నంబర్ సిరీస్, బాడ్‌మాస్ నియమాలు)పై పూర్తిగా అవగాహన పొందేలా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లపై ప్రత్యేక దృక్పథంతో అడుగులు వేయాలి.
- **కంప్యూటర్ నాలెడ్జ్:** ఈ విభాగంలో రాణించాలంటే.. కంప్యూటర్ ఆపరేషన్ సిస్టమ్స్, కంప్యూటర్ స్ట్రక్చర్, ఇంటర్నెట్ సంబంధిత అంశాలు, పదజాలంపై దృష్టి పెట్టాలి. కీ బోర్డ్ షార్ట్ కట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ సంబంధిత అంశాలు(సీపీయూ, మానిటర్, హార్డ్ డిస్క్ తదితర) గురించి తెలుసుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, సెప్టెంబర్ 17
- **రాత పరీక్ష:** అక్టోబర్ మొదటి వారంలో నిర్వహించే అవకాశం
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.unionbankofindia.co.in/english/recruitment.aspx

1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్

ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ.. అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు

నవంబర్ 10న రాతపరీక్ష..అభ్యర్థులు ఎక్కువగా ఉంటే..రెండుమూడు సెషన్లు.. మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యదర్శి గోపికాంత్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వైద్య,ఆరోగ్యశాఖలో 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2 పోస్టుల భర్తీకి మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు బోర్డు సభ్యకార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి ఆ వివరాలు వెల్లడించారు. అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబర్ ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువు విధించారు. దరఖాస్తులో ఏమైనా పొరపాట్లు ఉంటే వాటిని ఎడిట్ చేసుకునేందుకు అదే నెల ఐదో తేదీ నుంచి ఏడో తేదీ వరకు అవకాశం కల్పించారు. నవంబర్ 10వ తేదీన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ఉంటుందని గోపీకాంత్‌రెడ్డి వెల్లడించారు. వయో పరిమితి 46 సంవత్సరాలుగా పేర్కొన్నారు. అభ్యర్థులు ఎక్కువగా ఉంటే రాత పరీక్షలు రెండు, మూడు సెషన్లో నిర్వహిస్తారు. పరీక్ష పేపరు ఇంగ్లిష్‌లోనే ఉంటుంది.

➤ మొత్తంగా 1,284 పోస్టులుండగా, అందులో 1,088 ప్రజారోగ్య సంచాలకులు, వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) విభాగంలో, మరో 183 తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో, మరో 13 హైదరాబాద్ ఎంఎన్‌జే ఆస్పత్రిలో ఉన్నాయి.

➤ ప్రజారోగ్య సంచాలకులు, వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ), వైద్య విధాన పరిషత్ విభాగంలోని పోస్టులకు పేస్కేల్ రూ.32,810– రూ.96,890.

➤ ఎంఎన్‌జే ఆస్పత్రిలోని పోస్టులకు పేస్కేల్ రూ.31,040–రూ.92,050.

ఆయా జోన్ల పరిధిలో పోస్టులు ఇలా...

జోన్ 1	218
జోన్ 2	135
జోన్ 3	173
జోన్ 4	191
జోన్ 5	149
జోన్ 6	220
జోన్ 7	185



ముఖ్యాంశాలు...

➤ అన్ని పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 13 చోట్ల పరీక్ష కేంద్రాలుంటాయి. హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట.

➤ ఆన్‌లైన్ పరీక్ష ఫీజు రూ.500, ప్రాసెసింగ్ ఫీజు రూ.200

➤ మెరిట్ జాబితాను బోర్డు వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు.

➤ **విద్యార్హతలు:** అభ్యర్థులు ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చేసి ఉండాలి. ఎంఎల్ ఒకేషనల్, ఇంటర్మీడియట్‌లో ఎంఎల్ ఒకేషనల్ చేసి ఒక ఏడాది క్లినికల్ శిక్షణ పొందిన వారూ అర్హులే. డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు(డీఎంఎల్టీ), బీఎస్సీ (ఎంఎల్), ఎంఎస్సీ (ఎంఎల్టీ), డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ (క్లినికల్ పాథాలజీ) టెక్నీషియన్ కోర్సు, బ్యాచిలర్ ఆఫ్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ(బీఎంఎల్టీ) పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ, పీజీ డిప్లొమో ఇన్ క్లినికల్ బయోకెమిస్ట్రీ, బీఎస్సీ(మైక్రోబయాలజీ), ఎంఎస్సీ (మైక్రోబయాలజీ) ఎంఎస్సీ ఇన్ మెడికల్ బయోకెమిస్ట్రీ, ఎంఎస్సీ ఇన్ క్లినికల్ మైక్రోబయాలజీ, ఎంఎస్సీ ఇన్ బయోకెమిస్ట్రీ చేసినవారు ఈ పోస్టులకు అర్హులు

➤ పోస్టుల నియామక ప్రక్రియ వంద పాయింట్ల ప్రాతిపదికగా భర్తీ చేస్తారు. రాత పరీక్షకు 80 మార్కులు, మిగిలినవి వెయిటేజీ కింద కలుపుతారు. అభ్యర్థులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తే వెయిటేజీ కింద 20 పాయింట్లు కేటాయిస్తారు. ఇందులో గిరిజన ప్రాంతాల్లో కనీసం ఆరు మాసాలకు పైగా వైద్యసేవలందిస్తే 2.5 పాయింట్లు కేటాయిస్తారు. గిరిజనేతర ప్రాంతాల్లో అయితే ప్రతీ ఆరు నెలలకు 2 పాయింట్లు ఇస్తారు. కనీసం ఆరు నెలలు పనిచేస్తేనే వెయిటేజీ మార్కులొస్తాయి.

➤ నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి వెయిటేజీ కటాఫ్ తేదీగా నిర్ణయించారు.

➤ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ అభ్యర్థులు అనుభవపూర్వక ధ్రువీకరణపత్రాన్ని వారు విధులు నిర్వర్తిస్తున్న ఆస్పత్రుల నుంచే తీసుకోవాలి.

➤ మరిన్ని వివరాలకు అభ్యర్థులు www.mhsrb.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

‘అమ్మ’ అనే అబద్ధాన్ని నవ మాసాలు మోసింది

పిల్లలు పుట్టక మానసిక వ్యథతో కుమిలిపోయిన ఓ మహిళ

అపవాదు నుంచి తప్పించుకునేందుకు.. గర్భవతిని అయ్యానంటూ ఇంట్లో అబద్ధం..

9 నెలలు.. కడుపు చుట్టూ బట్టలు కట్టుకుని.. ఆస్పత్రికి ‘చెకప్’ కోసం వెళ్లి వచ్చిన వైనం..

చివరకు డెలివరీకని ఆస్పత్రికి వచ్చి టాయ్‌లెట్‌లో శిశువు జారి పోయిందని చెప్పి కప్పిపుచ్చే యత్నం..

పిల్లలు పుట్టడం లేదనే బాధతోనే ఇలా చేసిందంటున్న వైద్యులు

జనగామ: ఆమెకు పెళ్లయి మూడేళ్లు అయ్యింది. ఎంతకూ పిల్లలు పుట్టడం లేదు. అంతా ఏమనుకుంటారోనని తనలో తానే కుమిలిపోయింది. మానసికంగా కుంగిపోయింది. ఎలాగైనా ఈ అపవాదు నుంచి తప్పించుకోవాలనుకుంది. ఓ రోజు తాను గర్భం దాల్చినట్లు ఇంట్లో వారికి చెప్పింది. నమ్మకం కుదిరేలా కొద్దిరోజుల తర్వాత కడుపు చుట్టూ బట్టలు కట్టుకోవడం ప్రారంభించింది. నెలకోసారి ఆస్పత్రిలో చూపించుకుంటున్నట్టు కుటుంబసభ్యుల్ని నమ్మించింది. తొమ్మిది నెలలు అలాగే నెట్టుకొచ్చింది. చివరికి ప్రసవం కోసం అంటూ ఆస్పత్రికి వచ్చి శిశువు టాయ్‌లెట్‌లో జారి పోయిందని విలపిస్తూ చెప్పింది. అలా బయట పడదామని అనుకుంది. కానీ అంతా పరిశీలించిన వైద్యులు, సిబ్బంది చివరకు అదంతా ఉత్తదేనని తేల్చారు. ఈ విచిత్ర ఘటన బుధవారం జనగామ ఎంసీహెచ్‌లో జరిగింది.

నెలనెలా ఆస్పత్రికెళుతున్నానంటూ..

ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కొడకండ్ల మండలంలోని ఓ తండాకు చెందిన మహిళ.. గత ఏడాది డిసెంబర్‌లో జనగామ చంపక్ హిల్స్ మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి (ఎంసీహెచ్) ప్రెగ్నెన్సీ టెస్ట్ కోసం అంటూ వచ్చింది. వైద్యులు పరీక్ష చేయగా నెగిటివ్ వచ్చింది. తర్వాత గత జూలైలో మరోసారి ఆస్పత్రికి వచ్చింది. గర్భవతినని చెప్పడంతో గైనిక్ వైద్యులు హార్ట్ బీట్, స్కానింగ్ తదితర పరీక్షలు చేసుకుని రావాలని సూచించగా వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. కానీ ఇంట్లో వారికి నెలనెలా పరీక్షల కోసం ఎంసీహెచ్‌కు వెళుతున్నట్టు చెప్పేది. బుధవారం డెలివరీ డేట్ అని చెప్పి కుటుంబసభ్యులతో కలిసి ఆస్పత్రికి వచ్చింది. గైనిక్ డాక్టర్ ఆమెను పరీక్షించే సమయంలో వాష్‌రూమ్‌కు వెళ్లొస్తానని చెప్పి వెళ్లింది. ఇరవై నిమిషాల తర్వాత బోరున విలపిస్తూ బయటకు వచ్చింది. మూత్ర విసర్జన చేస్తుండగా శిశువు టాయ్‌లెట్‌లోకి జారి పోయిందని చెప్పింది. వెంటనే వైద్యులు, సిబ్బంది అప్రమత్తమై టాయ్‌లెట్‌ను పరిశీలించారు. ఎలాంటి రక్తపు మరకలు కన్పించలేదు. దీంతో టాయ్‌లెట్‌కు అనుబంధంగా ఉన్న డ్రైనేజీ పైపులైన్లను పరిశీలించారు. శిశువు జాడ లేకపోవడంతో అనుమానం వచ్చిన డాక్టర్లు మహిళను ప్రశ్నించారు. స్కానింగ్ రిపోర్టు ఏదంటూ గట్టిగా నిలదీశారు. దీంతో తనకు గర్భం రాలేదని, ఎంతకూ పిల్లలు పుట్టకపోవడంతో ఇలా చేశానంటూ ఆ మహిళ చెప్పింది. అయితే అప్పటికే ఆ మహిళ కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి రావడంతో వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. అన్ని పరీక్షలూ చేసి ఆమె గర్భం ధరించలేదని, అంతా ఉత్తదేనని నిర్ధారించారు. సదరు మహిళతో పాటు భర్తను సఖి కేంద్రానికి తరలించగా సిబ్బంది కౌన్సెలింగ్ ఇచ్చారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు. పిల్లలు పుట్టడం లేదనే బాధతో, అమాయకత్వంతో ఆ మహిళ అలా చేసిందని వైద్యులు వ్యాఖ్యానించారు.



గణపతి లడ్డు @ 2,100 కిలోలు



వరంగల్ పాపయ్యపేట చమన్‌లో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యకు 2,100 కిలోల లడ్డూ ప్రసాదాన్ని సమర్పించారు. డోసైల్ డెలివరీ సర్వీసెస్ సంస్థ ఈ లడ్డూను తయారుచేసింది. లడ్డూ తయారీలో సుమారు 400 కిలోల శనగపప్పు, 900 కిలోల చక్కెర, 200 కిలోల డ్రైఫ్రూట్స్, 350 కిలోల నెయ్యి, నూనె ఉపయోగించినట్లు తెలిపారు. ఈ కంపెనీ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ప్రసాదం బుక్ చేసుకున్న వారికి నిమజ్జనం అనంతరం లడ్డూ ప్రసాదం ఇంటికి ఫ్రీగా డెలివరీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, వరంగల్

బిల్లులు రాక పాఠశాల పనులు నిలిపివేత



కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలో మంజీర నది తీరాన ఉన్న తాండూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.కోటీ 14 లక్షలతో చేపట్టిన స్కూల్ భవనం రెండంతస్తులు స్లాబ్ వేశారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 107 మంది విద్యార్థులున్నారు. అక్కడ మూడు గదులు మాత్రమే ఉండగా వాటిలో మూడు తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక తరగతిని వరండాలో, మరో తరగతిని స్కూల్ ఆవరణలోని రేకుల షెడ్డు (స్టేజీ) లో నిర్వహిస్తున్నారు. బడి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో, విద్యార్థుల కష్టాలు ఎప్పుడు తీరుతాయో మరి..

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

పర్యావరణహితంగా మెడికల్ రీఏజెంట్స్!

- సరికొత్త విధానాన్ని అభివృద్ధి చేసిన పాలమూరు వర్సిటీ అధ్యాపకులు
- ఫ్యాక్టరీల్లోనే తయారు చేయగల కెమికల్స్.. సాధారణ ల్యాబ్‌లోనే సిద్ధం
- ఈ పరిశోధనకు పేటెంట్ హక్కులు ఇచ్చిన కేంద్రం
- పరిశీలన, ప్రయోగ దశల్లో మరికొన్ని రీఏజెంట్లు



పీయూలోని కెమిస్ట్రీ ల్యాబ్‌లో ప్రయోగాలపై చర్చిస్తున్న విభాగాధిపతి చంద్రకిరణ్, అధ్యాపకులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఫార్మా కంపెనీలు మందుల తయారీ, పరిశోధనల్లో ఉపయోగించే ‘రీఏజెంట్ల’ను పర్యావరణహిత విధానంలో రూపొందించే సరికొత్త విధానాలను పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులు అభివృద్ధి చేశారు. పెద్ద ఫ్యాక్టరీల్లో ప్రమాదకర పరిస్థితుల్లో తయారయ్యే సాంప్రదాయ కెమికల్స్‌ను.. సాధారణ ల్యాబ్‌లోనే రూపొందించగలిగా రు. ఈ పరిశోధనకు కేంద్ర ప్రభుత్వం పేటెంట్ హక్కులను కూడా ఇవ్వడం గమనార్హం. యూనివర్సిటీలో పరిశోధనలకు గుర్తింపు నేపథ్యంలో.. న్యాక్ గ్రేడింగ్ పెరిగి, కొత్త ప్రాజెక్టులు వచ్చే అవకాశాలు పెరుగుతాయని వర్సిటీ వర్గాలు చెప్తున్నాయి.

ముగ్గురి పరిశోధనలతో..

ఫార్మా కంపెనీలలో ఔషధాల తయారీ, టెస్టింగ్ కోసం కొన్నిరకాల రసాయనాలను వినియోగిస్తారు. వాటిని ‘రీఏజెంట్స్’గా పిలుస్తారు. బ్రోమైన్, ఎన్–బ్రోమైన్ సక్సినమైడ్, మెటల్ బ్రోమైడ్, కార్సినోజిన్ బ్రోమైడ్ వంటివి ‘రీఏజెంట్లు’గా పనిచేస్తాయి. వీటిని పెద్ద ఫ్యాక్టరీల్లో ప్రత్యేక పద్ధతుల ద్వారా తయారు చేస్తుంటారు. అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద రియాక్టర్లను ఉపయోగిస్తారు. రియాక్టర్లు పేలడం, లీకవడం వంటివాటితో తరచూ ఆస్తి, ప్రాణనష్టాలు సంభవిస్తుంటాయి. పైగా ఈ ఫ్యాక్టరీల ఏర్పాటుకు, కెమికల్స్ తయారీకి ఖర్చు ఎక్కువ. పైగా కాలుష్యం సమస్య. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పాలమూరు వర్సిటీ పీజీ కాలేజీ ప్రిన్సిపల్, కెమిస్ట్రీ విభాగం హెడ్ చంద్రకిరణ్, అధ్యాపకుడు సిద్ధరామగౌడ్, రీసెర్చ్ స్కాలర్ టి.స్వాతి కలసి రీఏజెంట్లపై పరిశోధనలు చేపట్టారు. వర్సిటీలోని సాధారణ కెమిస్ట్రీ ల్యాబ్‌లోనే ‘1–బ్రోమో–4–(డై మిథైల్ అమైనో) పిరిడినియం బ్రోమైడ్’, ‘1 అయొడో–4– (డై మిథైల్ అమైనో) పిరిడినియం అయోడైడ్’అనే కొత్త రీఏజెంట్లను రూపొందించారు. ప్రత్యేక యంత్రాలు, అధిక ఉష్ణోగ్రతలు, భారీ ఖర్చు అవసరం లేకుండా.. సులువుగా తయారు చేశారు. ఇవి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే.. రసాయన పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యాన్ని తగ్గించవచ్చని, మందుల ధరలు సైతం తగ్గుతాయని పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ తెలిపారు. మరో రీఏజెంట్ పరిశోధన పూర్తయి, పేటెంట్ కోసం కేంద్రం వద్ద పరిశీలనలో ఉందని.. మరో 20కిపైగా కెమికల్ రీఏజెంట్లపై పరిశోధన చేస్తున్నామని వెల్లడించారు.

ఒక బ్లడ్ గ్రూప్‌కు బదులు మరొకటి..

వైద్యం వికటించి గర్భిణి మృతి

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం వికటించి గర్భిణి మృతి చెందింది. నిర్మల్ జిల్లాకు చెందిన గర్భిణి డెలివరీ కోసం ఆస్పత్రికి వచ్చింది. బుధవారం ఆమెకు రక్తం ఎక్కించడానికి అవసరమైన రక్త పరీక్ష చేశారు. బ్లడ్ గ్రూప్ వివరాలను ఆస్పత్రిలోని ఏడవ అంతస్తులో గల బ్లడ్ బ్యాంకుకు పంపించారు. బ్లడ్ బ్యాంకులో ఒక గ్రూప్‌నకు బదులు మరో గ్రూప్ రక్తం బ్యాగ్ ఇచ్చారు. ఆ రక్తాన్ని గర్భిణికి వైద్య సిబ్బంది ఎక్కించారు. రక్తం వికటించి కొన్ని గంటల్లోనే గర్భిణి పరిస్థితి విషమంగా మారింది. ఆమెను వైద్యులు హుటాహుటిన అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. గర్భిణితో పాటు ఓ డాక్టర్ కూడా వెళ్లారు. అయితే గర్భిణి మార్గమధ్యలోనే మరణించింది.

అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గం

సాక్షి, హైదరాబాద్: నాలుగు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు 48 అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాల నియామకం పూర్తయిందని, మిగతా వాటికీ కమిటీలను నియమిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జైనాథ్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అల్లూరి అశోక్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా సవపూరె విలాస్, అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అంతటి రజిత, వైస్ చైర్‌పర్సన్‌గా రసుమొల్ల వెంకటయ్య, పరకాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా చందుపట్ల రాజిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా మరపల్లి రవీందర్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఇనాల చైతన్, వైస్ చైర్‌పర్సన్‌గా పచిమట్ల మదన్‌గౌడ్‌ను నియమించారు.

టెట్ ఆప్షన్లకు నేటి వరకు గడువు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష రాసిన అభ్యర్థులు, ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) వివరాల నమోదులో ఆప్షన్లు మార్చుకునేందుకు విద్యాశాఖ మరో అవకాశం ఇచ్చింది. గురు, శుక్రవారాల్లో www.schooledu.telangnana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్లు ఎడిట్ చేసుకోవచ్చని తెలిపింది.

గుర్గావ్ జిల్లా పరిశీలకుడిగా ఎంపీ చామల కిరణ్



సాక్షి, హైదరాబాద్: హరియాణాలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో గుర్గావ్ జిల్లా పరిశీలకుడిగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఆయన బుధవారం గుర్గావ్ జిల్లాలోని బాద్షాపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వర్ధన్‌యాదవ్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయనతో కలిసి ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.

టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా నూనె ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు సీనియర్ న్యాయవాది నూనె ప్రభాకర్ టీపీసీసీ లీగల్, హ్యూమన్‌రైట్స్, సమాచార హక్కు శాఖ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, తనను టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమించడం పట్ల నూనె ప్రభాకర్ కృతజ్ఞతలు చెప్పారు. తనపై నమ్మకంతో నియమించేందుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పొన్నం అశోక్‌గౌడ్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
గురువారం । 12-9-2024

రికార్డు స్థాయిలో కృష్ణమ్మ వరద



ఇప్పటివరకు శ్రీశైలం జలాశయానికి 1,139 టీఎంసీల వరదనీరు

రెండు నెలల్లో 858 టీఎంసీల నీరు గేట్ల ద్వారా కిందకు విడుదల

పదిరోజుల్లోనే డెడ్‌స్టోరేజీ నుంచి పూర్తి నిల్వ సామర్థ్యానికి చేరుకున్న వైనం

ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు ప్రాజెక్ట్ గేట్లు ఎత్తిన అధికారులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఈసారి వానాకాలం సీజన్‌లో కృష్ణానదిలో రికార్డుస్థాయిలో వరద పోటెత్తింది. గడిచిన 50 రోజులుగా శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన తుంగభద్ర, కృష్ణానదిలో పెరిగిన నీటి ప్రవాహంతో కేవలం పదిరోజుల్లోనే శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండింది. ఈ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో ఇప్పటివరకు 1,139 టీఎంసీల నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేయడంతో గత 50 రోజుల్లో 558 టీఎంసీల నీరు దిగువనున్న నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. గత రెండేళ్లలో శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి కూడా చేరుకోలేదు. ఈ సారి కృష్ణానదిలో భారీ స్థాయిలో వచ్చిన వరదలకు జూలై చివరకల్లా ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యానికి చేరుకుంది.

పది రోజుల్లోనే నిండిన ప్రాజెక్టు

కృష్ణమ్మ పరవళ్లతో ఈసారి కేవలం పదిరోజుల వ్యవధిలోనే శ్రీశైలం ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ నుంచి ప్రాజెక్టు స్పిల్‌వే ద్వారా నీటిని విడుదల చేసే వరకు చేరింది. జూలై నెల ప్రారంభంలో నీరు లేక వెలవెలబోయిన ప్రాజెక్టు చివరికల్లా నిండుకుండలా మారింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలకు జూలై 20 నాటికి కేవలం 35.629 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకు జలాశయంలో నీటి నిల్వ 812.30 అడుగులకు మాత్రమే పరిమితమైంది. అయితే తుంగభద్ర నదితో పాటు కృష్ణానదికి ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం పెరగడంతో అనూహ్యంగా పదిరోజుల వ్యవధిలోనే శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. తొమ్మిది రోజుల్లోనే 179 టీఎంసీల నీరు ప్రాజెక్టులో వచ్చి చేరింది. దీంతో జూలై 30న అధికారులు ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేశారు. ఆగస్టు, సెప్టెంబర్‌లోనూ నిత్యం 1.50 లక్షల క్యూసెక్కులకు పైగా నీటి ప్రవాహం కొనసాగడంతో ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా నీటిని కిందకు వదిలారు. ఆగస్టు నెలలో వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో సుమారు 20 రోజుల పాటు ప్రాజెక్టు పది గేట్లను ఎత్తి నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు.

పవర్‌హౌస్‌లో 17 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి

శ్రీశైలం ఎడమ గట్టున ఉన్న తెలంగాణ భూగర్భ జలవిద్యుత్ కేంద్రానికి నిత్యం 37 వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా రోజుకు 17 నుంచి 18 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రాజెక్టు నుంచి భూగర్భ జలవిద్యుత్ కేంద్రానికి మొత్తం 152.74 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఈ కేంద్రంలో మొత్తం ఆరు యూనిట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం 900 మెగావాట్లు కాగా, ప్రస్తుతం ఐదు యూనిట్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. గత జూలై 16 నుంచి భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించగా, నిత్యం 35 వేల క్యూసెక్కులకు పైగా నీటితో గరిష్ట స్థాయిలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నారు.

- వసతిగృహ సంక్షేమాధికారి నుంచి ఉప సంచాలకుల వరకు అంతే
- ఏఎస్‌డబ్ల్యూఓ పదోన్నతి బాధ్యతలు జోనల్ జిల్లా కలెక్టర్లకు అప్పగింత
- ఖాళీలపై స్పష్టత రాక.. అమలుపై అజమాయిషీ లేక తీవ్ర గందరగోళం
- ఎస్సీ అభివృద్ధి శాఖలో గాడితప్పిన వసతిగృహాల పర్యవేక్షణ



పదోన్నతి లేక.. పర్యవేక్షణ సాగక!

ఎస్సీ అభివృద్ధి శాఖలోని వసతి గృహాలపై పర్యవేక్షణ కరువైంది. ఆరేళ్లుగా పదోన్నతులు కల్పించకపోవడంతో పర్యవేక్షణ అధికారి పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉండడంతో ఈ పరిస్థితి తలెత్తింది. హెచ్‌డబ్ల్యూఓ స్థాయి నుంచి డిప్యూటీ డైరెక్టర్ స్థాయి వరకు పలు కేటగిరీల్లో పదోన్నతులు నిలిచిపోవడంతో అధికారుల కొరత తీవ్రంగా ఉంది. ఈ ప్రభావం వసతిగృహాలపై పడుతోంది. ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలో 880 (పాఠశాలు, కళాశాలలు కలిపి) వసతి గృహాలున్నాయి. వీటి పరిధిలో లక్ష మందికి పైబడి విద్యార్థులున్నారు. సంక్షేమాధికారులు కేవలం హాస్టళ్ల నిర్వహణ, పర్యవేక్షణే కాకుండా పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్ పథకాల అమలులోనూ కీలకంగా వ్యవహరిస్తారు.

–సాక్షి, హైదరాబాద్

4 కేటగిరీల్లో..

ఎస్సీ అభివృద్ధి శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్–1(హెచ్‌డబ్ల్యూఓ), హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(గ్రేడ్–2), సహాయ సాంఘిక సంక్షేమాధికారి(ఏఎస్‌డబ్ల్యూఓ), జిల్లా సాంఘిక సంక్షేమాధికారి(డీఎస్‌డబ్ల్యూఓ)ఉంటారు. ఈ నాలుగు కేటగిరీల్లోని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లా హెడ్‌క్వార్టర్‌లో ఉప సంచాలకులు(డీడీ) పోస్టు వీటికి అదనంగా ఉంటుంది. ఒక గొలుసు కట్టు విధానంలో కొంతకాలంగా పదోన్నతులు లేకపోవడంతో అంతరాలు ఏర్పడ్డాయి. ప్రధానంగా హెచ్‌డబ్ల్యూఓ గ్రేడ్–1, గ్రేడ్–2 కేటగిరీల్లోని వారికి పదోన్నతులు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ పదోన్నతుల బాధ్యతల నుంచి రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయం తప్పుకుంటూ జోనల్ కేంద్రంగా ఉన్న జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. ఈ క్రమంలో ఆయా జిల్లా కలెక్టర్లు పోస్టుల ఖాళీలు తేల్చకపోవడం, పదోన్నతులకు అర్హులైన వారి జాబితాలు తయారు చేయకపోవడం, కనీసం సీనియారిటీ జాబితాలను సైతం ప్రకటించకపోవడంతో పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇక్కడ పదోన్నతులు కల్పించకపోవడంతో ఆ తర్వాతి స్థాయిలోని ఏఎస్‌డబ్ల్యూఓ, డీఎస్‌డబ్ల్యూఓ, డిప్యూటీ డైరెక్టర్ కేటగిరీల్లో పదోన్నతులు ఇవ్వడం లేదు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ అధికారుల్లో ముందుండే ఏఎస్‌డబ్ల్యూఓ పోస్టులు దాదాపు 60 వరకు ఖాళీగా ఉన్నాయి. డీఎస్‌డబ్ల్యూఓ పోస్టులు సైతం పెద్ద సంఖ్యలోనే ఉన్నట్టు ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు.

అర్హతలున్నా అందని పదోన్నతి

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(హెచ్‌డబ్ల్యూఓ)గా నియమితులైన ఉద్యోగి కనీసం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకోవడంతోపాటు అకౌంట్స్ టెస్ట్ ఫర్ సబార్డినేట్ ఆఫీసర్స్ పార్ట్–1, అకౌంట్స్ టెస్ట్ ఫర్ సబార్డినేట్ ఆఫీసర్స్ పార్ట్–2, రెవెన్యూ టెస్ట్ పార్ట్–1: పేపర్–1 పరీక్షలో అర్హత సాధించాలి. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వెంటనే జాయిన్ అయిన పోస్టు నుంచి తదుపరి స్థాయికి పదోన్నతికి అర్హత సాధించినట్టే. ఈ లెక్కన దాదాపు వందమంది హెచ్‌డబ్ల్యూఓలు ఈ పరీక్షలు పాసై ఉన్నట్టు ఉద్యోగులు చెబుతున్నాయి. అయితే పదోన్నతుల ప్రక్రియ జోనల్ జిల్లా కలెక్టర్లు చేపట్టకపోవడంతో ప్రమోషన్ లేకుండా ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బీసీ, ఎస్టీ సంక్షేమశాఖల్లో జూనియర్లు పదోన్నతులు పొంది ఆఫీసర్ స్థాయికి చేరుకున్నా, ఎస్సీ అభివృద్ధి శాఖలో మాత్రం ఒకే స్థానంలో ఉంటున్నామని వసతిగృహ సంక్షేమాధికారుల సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రవాణాశాఖ సేవలకు ఇక 'వాహన్ సారథి'

వాహన్ సారథిలో డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీలు

- ఆన్‌లైన్‌లోనే పునరుద్ధరణ, చిరునామా బదిలీ
- లెర్నింగ్ లైసెన్స్ పరీక్షలు కూడా ఆన్‌లైన్‌లోనే
- గ్రేటర్ లైసెన్స్‌లన్నీ సారథిలో నిక్షిప్తం
- ఈ నెలాఖరులో సికింద్రాబాద్ ఆర్టీఏలో అమలు
- దశలవారీగా అన్ని ఆర్టీఏలకు విస్తరణ
- జాతీయ సమాచార కేంద్రంలో వాహనాలు, లైసెన్స్‌ల వివరాలు నమోదు

సాక్షి, హైదరాబాద్: రవాణాశాఖ అందజేసే వివిధ రకాల పౌరసేవలు మరింత పారదర్శకం కానున్నాయి. ఇప్పటికే ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు ద్వారా కొన్ని సేవలు నేరుగా, మరి కొన్ని పరోక్షంగా లభిస్తున్నాయి. డ్రైవింగ్ లైసెన్స్‌ల రెన్యువల్స్, వాహనాల నమోదు బదిలీ వంటి పౌర సేవలను వాహన వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు ఆర్టీఏ సన్నాహాలు చేపట్టింది. దేశ వ్యాప్తంగా రవాణా సేవలన్నింటిపైన ఏకీకృత విధానాన్ని అమలు చేసేందుకు ప్రవేశపెట్టిన వాహన్ సారథిని గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రస్తుతం టీ–యాప్ ఫోలియో వంటి మొబైల్ యాప్‌ల ద్వారా ప్రత్యక్ష సేవలను పొందేందుకు అవకాశం ఉండగా త్వరలో వాహన్ సారథిని వినియోగించుకొనే సదుపాయం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు వాహనాల వివరాలన్నింటినీ వాహన్‌లోనూ, వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌ల వివరాలను సారథిలోనూ నిక్షిప్తం చేయనున్నాయి. కేంద్రం కొత్తగా ఏర్పాటు చేసిన జాతీయ సమాచారం కేంద్రం (నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్) ద్వారా ఈ వివరాలన్నింటినీ నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మొదట లైసెన్స్‌ల డేటా నమోదు

సికింద్రాబాద్ ఆర్టీఏ కార్యాలయం నుంచి త్వరలోనే సారథి సేవలు ప్రయోగాత్మకంగా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా సారథి కార్యకలాపాలు సాగిస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన డ్రైవింగ్ లైసెన్స్‌ల వివరాలు సారథిలో నమోదయ్యాయి. ఇటీవల తెలంగాణ కూడా ఈ జాబితాలో చేరింది. దీంతో కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకొనే అభ్యర్థులు మినహాయించి పాతవి రెన్యువల్స్ చేసుకోవడం, చిరునామా బదిలీ చేసుకోవడం వంటి సేవలను సారథి నుంచి పొందవచ్చు. ప్రస్తుతం ఉద్యోగ, వ్యాపార అవసరాల రీత్యా ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు లేదా, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ అయినప్పుడు డ్రైవింగ్ లైసెన్స్‌లను బదిలీ చేసుకోవాలంటే సంబంధిత ఆర్టీఏ అధికారుల నుంచి నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీ) పొందాల్సి ఉంటుంది. కానీ కొత్తగా అందుబాటులోకి వచ్చిన సారథి వల్ల ఆ ఇబ్బంది ఉండదు. లైసెన్స్‌ల మొత్తం డేటా సారథిలో నిక్షిప్తమై ఉంటుంది. దీంతో వాహనదారులు తమ డేటాను ఎక్కడి నుంచి ఎక్కడికైనా మార్చుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనే ఈ సర్వీసులను పొందే అవకాశం ఉంటుంది. కానీ అధికారుల పర్యవేక్షణ, ఆమోదంతోనే సర్వీసుల బదిలీ సదుపాయం లభించనుంది. ఇందుకోసం ఆన్‌లైన్‌లోనే నిర్ణీత ఫీజు చెల్లించి డాక్యుమెంట్‌లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతంగ్రేటర్ హైదరాబాద్‌లోని 3 జిల్లాల పరిధిలో 62,7056 లైసెన్స్‌లు ఉన్నాయి. సుమారు 83 లక్షల వాహనాలు నమోదై ఉన్నాయి.



వాహనాల నమోదుకు 'వాహన్'

ఇప్పటికే దేశంలోని మెజారిటీ రాష్ట్రాలు వాహనాల వివరాలను 'వాహన్'లో నమోదు చేశాయి. ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న 'వాహన్'లో ఇటీవల తెలంగాణ కూడా చేరేందుకు చర్యలు చేపట్టింది. మొత్తం వాహనాల డేటాను వాహన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. దీనిద్వారా వాహనం కొనుగోలు చేసిన వెంటనే షోరూమ్‌లలో శాశ్వత రిజిస్ట్రేషన్ సదుపాయం లభించనుంది. ప్రస్తుతం ఆటోమొబైల్ డీలర్లు తాత్కాలిక రిజిస్ట్రేషన్ పత్రాలను (టీఆర్) ఇస్తున్నారు. అనంతరం ఆర్టీఏ అధికారులు శాశ్వత రిజిస్ట్రేషన్ (ఆర్సీ) చేస్తున్నారు. మరోవైపు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వాహనాన్ని బదిలీ చేసేందుకు ఎన్‌ఓసీల అవసరం ఉండదు. సదరు వాహనం వివరాలను 'వాహన్'లో ధ్రువీకరించుకుని బదిలీ చేయవచ్చు. అలాగే ప్రమాద బీమా సదుపాయం కూడా తేలిగ్గా లభిస్తుందని అధికారులు చెప్పారు. వాహనాల సామర్థ్య పరీక్షలను కూడా ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌ల ద్వారా నిర్వహించడంతో పాటు ఆటోమేటిక్ డ్రైవింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లోనే లెర్నింగ్ పరీక్షలు

ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న లెర్నింగ్ లైసెన్స్ పరీక్షలను కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది. కర్ణాటకలో ఈ తరహా పద్ధతి విజయవంతంగా అమలవుతున్న దృష్ట్యా హైదరాబాద్‌లోనూ ఆన్‌లైన్ టెస్టింగ్ పద్ధతిని అమలు చేయాలనే రవాణా అధికారులు ప్రతిపాదిస్తున్నారు. దీనివల్ల వినియోగదారులు ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఇంటి నుంచి ఎల్ఎల్ఆర్ (లెర్నింగ్ లైసెన్స్) పొందవచ్చు. ఇది 6 నెలల పాటు చెల్లుబాటులో ఉంటుంది. ఆ తర్వాత మరో నెల వరకు పొడిగించుకొనే సదుపాయం ఉంటుంది. లెర్నింగ్ లైసెన్స్ తీసుకున్న నెల రోజుల నుంచి 6 నెలల్లోపు అందజేసే శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ కోసం మాత్రం టెస్ట్‌ట్రాక్‌లలో అధికారులు నిర్వహించే ప్రత్యక్ష పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది.

జంతువులపై హింస నిరోధానికి.. నోడల్ అధికారిని నియమించాం

హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: జంతువులపై హింస నిరోధానికి కేంద్ర జంతు సంరక్షణ మండలి నోడల్ అధికారిగా అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (లా అండ్ ఆర్డర్)ను నియమించినట్లు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. 2021 కేంద్ర జంతు సంరక్షణ మండలి సర్క్యులర్ ప్రకారం చట్టం అమలుకు నోడల్ అధికారిని నియమించకపోవడాన్ని సవాలు చేస్తూ లఖిల భరత్ క్రిషి గోసేవా సంఘ్‌తో పాటు మరో ముగ్గురు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది పి.శ్రీరమ్య వాదనలు వినిపిస్తూ కేంద్ర జంతు సంరక్షణ మండలి సర్క్యులర్ ప్రకారం ఏసీపీ స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాల్సి ఉందన్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు నియామకం చేపట్టలేదన్నారు. ప్రభుత్వ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (లా అండ్ ఆర్డర్)ను జంతు సంక్షేమ మండలి నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి నోడల్ అధికారి నియామకం పూర్తయినందున ఎలాంటి ఉత్తర్వులు అవసరంలేదని అభిప్రాయపడ్డారు. కేంద్ర జంతు సంరక్షణ మండలి 2020లో జారీ చేసిన సర్క్యులర్‌ను అమలు చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేస్తూ పిటిషన్‌పై విచారణను మూసివేసింది.


వికలాంగుల కార్పొరేషన్‌లో జేఎండీ, జీఎంలను మార్చండి

మంత్రి సీతక్కకు ఉద్యోగుల వినతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వికలాంగుల సహకార సంస్థలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ), జనరల్ మేనేజర్ (జీఎం)లను మార్చాలని, ఈ స్థానాల్లో కొత్తవారిని నియమించాలని తెలంగాణ వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందు నుంచి జేఎండీ, జీఎంలు ఈ పోస్టుల్లో కొనసాగుతున్నారని, ఇన్ని సంవత్సరాలుగా ఏ శాఖలో కూడా ఒకే అధికారి ఈ విధంగా కొనసాగలేదన్నారు. ఈ శాఖ పరిధిలోని పలు యూనిట్లు మూతబడ్డాయని, పైగా ఉద్యోగులు పనిచేయడం లేదంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో దీర్ఘకాలికంగా ఒకేచోట కొనసాగుతున్న అధికారులను బదిలీ చేస్తోందని, ఈ క్రమంలో ఈ ఇద్దరినీ బదిలీ చేయాలని కోరుతూ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రాములుతో పాటు పలువురు మంత్రి సీతక్క, శాఖ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు.

భారత వ్యతిరేక శక్తులతో రాహుల్ సమావేశం

బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్ మండిపాటు



సాక్షి, హైదరాబాద్: అమెరికాలో భారత వ్యతిరేక శక్తులు, వ్యక్తులతో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సమావేశం అవడంపై బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. దేశంపై విషం చిమ్మే పాకిస్తాన్ సమర్థకురాలు ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్‌గాంధీ సమావేశమవడాన్ని ఆయన తప్పుబట్టారు. బుధవారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్‌లో పరిస్థితులు అనుకూలిస్తే.. రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించడాన్ని కూడా లక్ష్మణ్ ఆక్షేపించారు. ఎన్నికల సమయంలో బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ తప్పుడు ప్రచారం చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు రాహుల్ అసలు విషయాన్ని బయటపెట్టారని విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్నంత కాలం రిజర్వేషన్లు రద్దు చేసే ప్రసక్తే లేదని లక్ష్మణ్ స్పష్టం చేశారు.

'భౌమాకోన్ ఎక్స్‌పో ఇండియా'కు రండి

మంత్రి కోమటిరెడ్డిని ఆహ్వానించిన నిర్వాహకులు

సాక్షి, హైదరాబాద్: అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్‌తో కలిసి మెస్సె ముంచన్ ఇండియా సంస్థ డిసెంబర్ 11 నుంచి 14 వరకు గ్రేటర్ నోయిడాలో నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక భౌమాకోన్ ఎక్స్‌పో ఇండియాకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నిర్వాహకులు ఆహ్వానం అందించారు. నిర్మాణ రంగంలో వస్తున్న అధునాతన పరికరాలు, టెక్నాలజీలను ప్రదర్శించే ఈ ఎక్స్‌పోలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన వెయ్యికి పైగా సంస్థలు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు సంస్థ నిర్వాహకులు మంత్రికి వివరించారు.



వీహెచ్‌తో పీసీసీ చీఫ్ మహేశ్ భేటీ

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ నూతన అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం మాజీ ఎంపీ వి.హనుమంతరావుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందనేందుకు మహేశ్‌గౌడ్ నియామకమే నిదర్శనమని వ్యాఖ్యానించారు. మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు. బాగ్ అంబర్‌పేటలోని వీహెచ్ నివాసానికి వెళ్లిన మహేశ్‌గౌడ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

నల్లమలలో పక్షుల కిలకిల


అరుదైన వన్యప్రాణులతో పాటు పక్షులకు నిలయంగా మారిన నల్లమల అడవులు

- నంద్యాల జిల్లాలో 230 రకాల పక్షులు
- యూరప్, అమెరికా, మధ్య ఆసియా నుంచి నల్లమలకు
- అన్ని రకాల వాతావరణ పరిస్థితులు ఉండటమే కారణం
- ఆహారం, ఆవాసం తేలికగా లభిస్తుండటంతో భారీగా వలసలు

నల్లమల అంటేనే ఎన్నో వింతలు, విశేషాలకు పుట్టినిల్లు. జాతీయ జంతువైన పెద్దపులి నుంచి అరుదైన వన్యప్రాణులు, ఆయుర్వేద ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, ఆధ్యాత్మిక కేంద్రాలైన ప్రముఖ పుణ్యక్షేత్రాలు, అద్భుత జలపాతాలు, పచ్చటి పర్వత సానువులు, దట్టమైన అడవుల అందాలు...ఇలా నల్లమల ఎన్నో అద్భుతాలకు అలవాలం. జీవ వైవిధ్యానికి పెట్టింది పేరైన నల్లమల తాజాగా దేశ, విదేశీ పక్షులకు స్థావరంగా మారింది. వేల కిలోమీటర్లు దాటుకుంటూ వలస పక్షులు నల్లమలకు చేరుకుని ఆవాసాలు ఏర్పరచుకుంటున్నాయి. నల్లమలలో పచ్చని చెట్లు, గలగల పారే సెలయేటి సవ్వడులు వలస పక్షులను మరింత ఆకర్షిస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. – మహానంది


పెయింటెడ్ స్టార్క్


గర్గనీ జాతి పక్షులు


స్పాటెడ్ ఓవెల్(చుక్కల గుడ్లగూబ)


బాండ్ బాక్ జకానా


డార్టర్ కార్మోరెంట్

నంద్యాల జిల్లాలో 230 రకాల పక్షులు

నంద్యాల జిల్లాలో 230 రకాల పక్షిజాతులు ఉన్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. మనం నిత్యం చూసే చిలుకలు, కింగ్ ఫిషర్, కొంగలు, బాతులు, వడ్రంగిపిట్టలు, పిచ్చుకలు, పావురాలతో పాటు దేశ, విదేశాల నుంచి వచ్చే వలస పక్షులు సైతం ఈ ప్రాంత వాతావరణాన్ని ఇష్టపడుతున్నాయి. గడ్డి భూములు, కొండలు, చిత్తడి నేలలు ఇలా అన్ని రకాల నేలలు ఉండటంతో వివిధ రకాల పక్షులకు ఆహారం కూడా తేలికగా లభిస్తోంది. మనం నిత్యం చూసే పక్షి జాతులతో పాటు బార్ హెడెడ్ గూస్, హ్యారియర్స్, టర్న్స్, ఎల్లో త్రోటెడ్ బుల్‌బుల్, ఇండియన్ పిట్ట, స్వాంపెన్, గ్రేటర్ ఫ్లెమింగోస్, డార్టర్ కార్మోరెంట్, స్పాట్ బిల్డ్ పెలికాన్, పాండ్ హెరాన్, రెడ్ నాప్డ్ ఐబిస్, పర్పుల్ సన్ బర్డ్స్, వైట్ త్రోటెడ్ కింగ్ ఫిషర్, మార్ష్ హారియర్, శాండ్ పైపర్, స్పాటెడ్ ఓలెట్, కాంబ్ డక్, బ్లూ టెయిల్డ్ బీ ఈటర్ లాంటి వాటితో పాటు రాత్రుళ్లు మాత్రమే కనిపించే నైట్‌జార్స్ వంటి అనేక రకాల పక్షులు నల్లమల పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి.

ఇండియన్ పిట్ట

చిన్న మొండితోకను కలిగి ఎంతో అందంగా కనిపించే పక్షి ఇండియన్ పిట్ట. ఇది దట్టమైన అడవుల్లోని నేలలపై, పొదల్లో ఉంటుంది. ఆకులు, చెత్తలో ఉండే క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుంటుంది. గతంలో ఓ ఆంగ్లేయుడు ఈ పిట్ట(పక్షి)ని చూసి దీని పేరేంటి అని అడిగితే మన భారతీయులు ఇండియన్ పిట్ట అన్నారని, అందుకే ఇండియన్ పిట్టగా పేరు పడిపోయిందని పలువురు శాస్త్రవేత్తల అభిప్రాయం.


ఇండియన్ పిట్ట

ఊలి నెక్డ్ స్టార్క్(ఉన్ని మెడ కొంగ)

కొంగల్లో ఊలి నెక్డ్ స్టార్క్ ఒకటి. దీని మెడ వద్ద ఉన్నిలాగా ఉండటంతో దీన్ని ఉన్ని మెడ కొంగ అని పిలుస్తారు. వీటిలో ఆసియా, ఆఫ్రికన్ జాతులు అని రెండు రకాలు ఉంటాయి. నల్లమల ప్రాంతంలో ఆసియా జాతికి చెందినవి ఎక్కువగా సంచరిస్తున్నట్లు పరిశోధనల్లో తేలింది.


ఊలీ నెకడ్ స్టార్క్

బార్ హెడెడ్ గూస్

ప్రపంచంలోనే అత్యంత ఎత్తుకు ఎగిరే పక్షి బార్ హెడెడ్ గూస్ అని చెబుతారు. ఇవి సంతానోత్పత్తి కోసం మధ్య ఆసియాలోని పర్వత ప్రాంతాల నుంచి దక్షిణాసియాలోని ద్వీపకల్ప ప్రాంతానికి వస్తాయి. ఈ పక్షులు ఒకేసారి మూడు నుంచి పది గుడ్లు పెడతాయి. ఇవి అత్యంత ఎత్తయిన హిమాలయాల మీదుగా ఎగురుకుంటూ వలస వస్తాయి.



పక్షులనే ఆహారం తీసుకునే "హారియర్స్":

విదేశీ పక్షిజాతుల్లో రకరకాల పక్షులు ఉంటాయి. వాటిలో పక్షులనే ఆహారంగా తీసుకునే హ్యారియర్స్ జాతి ఒకటి. ఇది ఆక్సిపిట్రిడే అనే వేటాడే పక్షి కుటుంబానికి చెందిన సర్కస్ జాతి. ఇవి మైదాన ప్రాంతాల్లో తిరుగుతూ పక్షులు, చిన్న చిన్న క్షీరదాలను ఆహారంగా తీసుకుంటాయి. యూరప్, పశ్చిమాసియా నుంచి నల్లమలకు వలస వస్తాయి.



ఎల్లో త్రోటెడ్ బుల్‌బుల్

ఎంతో అందంగా కనిపించే అరుదైన పక్షిజాతుల్లో ఎల్లో త్రోటెడ్ బుల్‌బుల్ ఒకటి. అంతరించిపోతున్న పక్షి జాతుల్లో ఇది ఒకటని ఆర్నిథాలజిస్టులు చెబుతున్నారు. ఇవి తాము సంచరించే ప్రాంతాలను చిన్న చిన్న సర్కిల్స్‌గా ఏర్పాటు చేసుకుంటాయి. కీటకాలను తింటాయి. భారత ద్వీపకల్పానికి చెందిన పక్షిజాతుల్లో ఇది ఒకటి. నిటారుగా ఉండే కొండ ప్రాంతాల్లో ఇవి నివసిస్తాయి.



గ్రేటర్ ఫ్లెమింగోలు

ఫ్లెమింగో కుటుంబానికి చెందిన అతి పెద్ద జాతి గ్రేటర్ ఫ్లెమింగో. ఇవి ఉత్తర తీర ప్రాంతాలు, దక్షిణ ఐరోపా, హిమాలయ ప్రాంతాల్లో ఉంటాయి. తల, మెడ, రంగుల ఆధారంగా గ్రేటర్ ఫ్లెమింగో, అమెరికన్ ఫ్లెమింగోలుగా వర్గీకరిస్తారు. వీటి ఈకలు గులాబీ రంగులో ఉంటాయి.



నంద్యాల జిల్లాలో అరుదైన పక్షులు



పెద్దపులి, చిరుతపులులతో పాటు ఎన్నో అరుదైన వన్యప్రాణులు, వింతలు, విశేషాలకు నల్లమల నిలయం. నంద్యాల జిల్లాలోని నల్లమల, అహోబిలం ప్రాంతాల్లోని అడవుల్లో అరుదైన దేశీయ, విదేశీ వలస పక్షులు ఉన్నాయి. మేము చేసిన పరిశోధనల్లో 230 రకాల పక్షులను గుర్తించాము. ఒకే జిల్లాలో ఇన్ని రకాల పక్షులు ఉండటం ఎంతో విశేషమనే చెప్పాలి.

– తరుణ్‌కుమార్ సింగ్, జూనియర్ సైంటిస్ట్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ

వలసపక్షులకు కేంద్రం



నల్లమలలో పెద్దపులులే కాదు. అరుదైన వన్యప్రాణులు, క్రిమికీటకాలు ఎన్నో ఉన్నాయి. పక్షుల్లో అనేక రకాల జాతులకు నంద్యాల జిల్లా పరిధిలోని నేలలు ఎంతో అనువైనవి. కొన్ని రకాల పక్షులు చిత్తడి నేలలంటే ఇష్టపడతాయి. ఎక్కడ తడినేలలు కనిపిస్తే అక్కడికి అన్నీ చేరి ఆహారాన్వేషణ చేస్తూ రైతులకు తెలియకుండా రైతు నేస్తాలుగా మారిపోతున్నాయి.

– దూపాడు శ్రీధర్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ

తుంగభద్ర జలాలకు కర్ణాటక ఎసరు!

- తుంగభద్ర నదిపై రెండు చోట్ల బ్రిడ్జి కమ్ బ్యారేజీలు
- కర్నూలులో ఇంజనీర్లకు వివరించిన కర్ణాటక మంత్రి, ఎంపీ
- ప్రభుత్వ అతిథి గృహంలో అనధికార సమావేశం
- పాల్గొన్న కర్నూలు ఎంపీ, ఇంజనీర్లు
- త్వరలోనే రెండు రాష్ట్రాల ఉన్నతస్థాయి అధికారుల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక మంత్రి ఎన్ఎస్ బోస్‌రాజు

కర్నూలు సిటీ: ఇప్పటికే తుంగభద్ర నది పరీవాహక ప్రాంతాల్లోని అనధికార ఆనకట్టలు, చెక్ డ్యాంలతో ఆయా ప్రాంతాల్లో నీటిని అక్రమంగా వాడుకుంటున్న కర్ణాటక చర్యలతో ఏపీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తాజాగా తుంగభద్ర నదిపై మరో రెండు బ్యారేజీలను నిర్మిస్తామంటూ చావు కబురు చల్లగా చెప్పడంతో ఏపీ అధికారులు, ప్రజాప్రతినిధుల్లో గుబులు మొదలయ్యింది. ఇప్పటికే టీబీ డ్యామ్ ఎగువన అనధికారికంగా నిర్మించిన సుమారు 50 ఎత్తిపోతల పథకాలతో దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వీటితో పాటు డ్యామ్ దిగువ భాగంలో నిర్మించిన వివిధ నిర్మాణాల వల్ల.. హక్కుగా రావాల్సిన వాటా నీటికి ఏటా గండి పడుతోంది. ఇలాంటి సమయంలో మరోసారి తుంగభద్ర జలాలను తాగునీటి సమస్య పేరుతో కాజేసేందుకు కర్ణాటక ఎత్తు వేసింది. ఇందులో భాగంగానే తుంగభద్ర నదిపై రెండు చోట్ల బ్రిడ్జి కమ్ బ్యారేజీ పేరుతో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. వీటిపై ఏపీ ఇంజనీర్లకు అవగాహన కల్పించేందుకు బుధవారం కర్నూలులోని ప్రభుత్వ అతిథిగృహంలో కర్ణాటక చిన్ననీటిపారుదల శాఖ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి ఎన్.బోస్‌రాజు, రాయచూరు ఎంపీ బాలానాయక్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జలవనరుల శాఖ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలోని మాన్వి, సింధనూరు, శిరుగుప్ప తాలూకాలోని 40 రెవెన్యూ గ్రామాల్లో ప్రతి ఏటా వేసవిలో తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆ సమస్య పరిష్కారం చేయడంతో పాటు నదికి కుడివైపు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని 19 గ్రామాలకు సైతం నీటి సమస్య లేకుండా పరిష్కారం చూపేందుకు రాయచూరు జిల్లా చికలపర్వి గ్రామం దగ్గర తుంగభద్ర నదిపై నిర్మిస్తున్న నేషనల్ హైవే బ్రిడ్జితో పాటు బ్యారేజీ నిర్మించనున్నామని కర్ణాటక మంత్రి తెలిపారు. ఇప్పటికే మంత్రాలయం దగ్గర సైతం బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించేందుకు రూ.138 కోట్లతో తమ రాష్ట్రం చేసిన ప్రతిపాదన సైతం పరిశీలనలో ఉన్నాయని, ఈ రెండు బ్రిడ్జి కం బ్యారేజీలు 0.318 సామర్థ్యంతో నిర్మించనున్నామని వివరించారు. వీటి నిర్మాణం వల్ల ఏపీ ప్రభుత్వంపై ఎలాంటి భారం పడదని, త్వరలోనే దీనిపై ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల స్థాయిలో ఓ సమావేశాన్ని నిర్వహించనున్నామని మంత్రి తెలియజేశారు. ఏపీ రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరగకుండా బ్యారేజీ నిర్మిస్తే బాగుంటుందేమోనని కొందరు ఇంజనీర్లు సమావేశంలో ప్రస్తావించారు. అయితే ముందుగా బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణమని, ఆ తర్వాత ఆ బ్యారేజీల నుంచి నీటిని తోడేందుకు లిఫ్టులు ఏర్పాటు చేస్తే తమ రాష్ట్ర ఆయకట్టు రైతుల పరిస్థితి ఏంటని కొందరు ఇంజనీర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కర్నూలు మండల పరిధిలోని సుంకేసుల దగ్గర 1.2 టీఎంసీ సామర్థ్యంతో నిర్మించిన బ్యారేజీ ఎడమ వైపు తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం వల్ల ఆయకట్టుకు సక్రమంగా నీరందని పరిస్థితి ఉందన్నారు. జలవనరుల శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ కబీర్ బాషా, కర్నూలు సర్కిల్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఎల్ఎల్‌సీ ఈఈ శైలేష్ కుమార్, కేసీ కెనాల్ డీఈ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌర కాంతిని ఒడిసిపట్టేలా!

గృహాలు, కార్యాలయాలకు సోలార్ యూనిట్ల ఏర్పాటు

- ఇటు ఖర్చు ఆదా.. అటు వినియోగదారుడికి ఆదాయం
- పీఎం సూర్య ఘర్ పథకం కింద కేంద్రం రాయితీ



సాక్షి, పార్వతీపురం మన్యం: సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా విద్యుత్ శాఖ సోలార్ యూనిట్ల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. సోలార్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ పథకం కింద రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. సోలార్ యూనిట్ ఏర్పాటుతో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను అవసరానికి సరిపడా వాడుకోగా మిగులు విద్యుత్‌తో ఆదాయం కూడా సంపాదించుకోవచ్చు. రానున్న మూడు నెలల్లో పార్వతీపురం మన్యం జిల్లాలో వెయ్యి కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గృహ సముదాయాలు, ఆస్పత్రులు, దుకాణ సముదాయాల్లో వీటిని ఏర్పాటు చేసుకునేలా సచివాలయ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు..

వినియోగదారులు 10 కిలోవాట్ల సామర్థ్యం వరకు యూనిట్ల ఏర్పాటుకు నేరుగా సూర్యఘర్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం రూ.1300 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మూడు కిలో వాట్ల వరకు ప్రభుత్వ రాయితీ పొందవచ్చు. ఒక కిలో వాట్ యూనిట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు కేంద్రం రాయితీ ఇస్తుంది. ఈ మొత్తాన్ని యూనిట్ ఏర్పాటుచేసిన తరువాత 45 రోజుల్లో వినియోగదారుని బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. యూనిట్ మొత్తానికి బ్యాంకు రుణం కూడా పొందే అవకాశం ఉందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. నెలకు 300 యూనిట్ల విద్యుత్ వినియోగించుకునేవారు కిలోవాట్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని పేర్కొంటున్నారు.

జిల్లాలో 121 దరఖాస్తులు

పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటి వరకు 121 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 16 మంది మాత్రమే నిర్దేశించిన రూ.1,300 ఫీజు చెల్లించారు. వీటిలో ఇప్పటికే ఆరు యూనిట్లను విద్యుత్‌శాఖ అధికారులు ఇన్‌స్టాల్ చేశారు. మిగిలిన 10 అంచనాల స్థాయిలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

అన్ని ప్రభుత్వ భవనాలకూ అమర్చేలా ప్రణాళిక

జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వసతిగృహాలు తదితర ప్రభుత్వ భవనాలు 5,883 వరకు ఉన్నాయి. 2025 నాటికి వీటన్నిటికీ విద్యుత్‌శాఖ ద్వారా పూర్తి స్థాయిలో సోలార్ యూనిట్లు ఏర్పాటుచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 26 ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ సదుపాయం ఉంది. మిగిలిన 2,135 ప్రభుత్వ కార్యాలయాల్లో 19.70 లక్షల చదరపు అడుగుల స్థలంలో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు అవకాశం ఉన్నట్లు గుర్తించారు.

వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి

సూర్య ఘర్ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసుకున్న వినియోగదారులు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా పొందవచ్చు. బిల్లుల ఆదాతో పాటు.. మిగిలిన విద్యుత్‌ను విద్యుత్‌శాఖ కొనుగోలు చేస్తుంది. వివరాలకు టోల్‌ఫ్రీ నంబరు 1912నుగానీ, సమీప కార్యాలయంలోగానీ సంప్రదించవచ్చు.

– ఎం.లక్ష్మణరావు, ఎస్ఈ, విద్యుత్ శాఖ

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 62,380 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 21,405 మంది తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.95 కోట్లు సమర్పించారు.

వైభవంగా రాధాష్టమి వేడుకలు


తిరుపతి కల్చరల్: తిరుపతిలోని ఇస్కాన్ మందిరంలో బుధవారం శ్రీకృష్ణభగవానుని ఇష్టసఖి అయిన శ్రీరాధాదేవి జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణజన్మాష్టమి తర్వాత 16వ రోజు రాధాష్టమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా నున్న వేలాది ఇస్కాన్ మందిరాల్లో రాధారాణి ఆవిర్భావ దినోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని లాసెన్స్‌బేకాలనీకి చెందిన వై.పరదేశి అనే దాత రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాన్ని చెక్కురూపంలో ఆలయ ఏఈవో పాలూరి నరసింగరావుకి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రం, ప్రసాదాన్ని అందజేశారు.

14 నుంచి శ్రీగోవిందరాజస్వామి పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 14 నుంచి 16 వరకు స్వామి వారి పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఈమేరకు 13వ తేదీ సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉదయం రుత్వికులకు విధులు కేటాయించి వస్త్ర సమర్పణ చేస్తారు. సాయంత్రం సేనాధిపతి ఊరేగింపు నిర్వహించి యాగశాలలో అంకురార్పణ చేపడతారు.



కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.25.37 లక్షలు

డాబాగార్డెన్స్: విశాఖలోని కనకమహాలక్ష్మి దేవస్థాన హుండీల లెక్కింపు బుధవారం చేపట్టారు. గత నెల 3 నుంచి ఈ నెల 11 వరకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. రూ.25 లక్షల 37 వేల 268 నగదు, 115.1 గ్రాముల బంగారం, 742 గ్రాముల వెండితో పాటు యూఎస్‌కి చెందిన 14 డాలర్లు, 27 సింగపూర్ డాలర్లు, ఖతార్‌కు చెందిన 10 రియాల్స్ వచ్చాయి.

అశ్వ వాహన గణపతిగా సంపత్ వినాయగర్

సీతమ్మధార: విశాఖపట్నంలోని ఆశీలమెట్టలో గల శ్రీ సంపత్ వినాయగర్ స్వామి బుధవారం అశ్వ వాహన గణపతి అవతారంలో దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయదాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

13 నుంచి ఉరుసు మహోత్సవం

సిద్దవటం: వైఎస్సార్ జిల్లా సిద్దవటం మండల కేంద్రం పరిధిలోని ఎగువపేటలో చారిత్రాత్మకమైన ఆస్తాన-ఏ- ఫత్తుమియ్యా దర్గాలో ఈనెల 13న ఆసార్-ఎ-షరీఫ్ ఉరుసు మహోత్సవాలు జరుపనున్నట్టు ముత్తవల్లి సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 13వ తేదీ శుక్రవారం మగరీబ్ నమాజు తరువాత ముత్తవల్లి ఇంటి వద్ద నుంచి గంధంను తీసుకొని పకీర్ల మేళ తాళాలతో ఊరేగింపుగా మసీద్ చేరుతుందన్నారు. సయ్యద్ అహ్మద్ దర్వేష్ షా ఖాద్రి సమాది వద్ద షిజర పఠించబడునేని ఫతేహా ఖాని జరుగుతుందన్నారు.

విద్యా సమాచారం

పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు అంతంతే..

తిరుపతి సిటీ: ఎస్వీయూలో తొలివిడత పీజీ అడ్మిషన్లు పరిస్థితి దారుణంగా ఉంది. ఏపీపీజీ సెట్–2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు తొలివిడత అడ్మిషన్ల ప్రక్రియ గురువారంతో ముగియనుంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు గురువారం సాయంత్రం 5 గంటల్లోపు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సి ఉంది. వర్సిటీలో తొలివిడత అడ్మిషన్లలో భాగంగా ఇప్పటివరకు ఆర్ట్స్ గ్రూపులకు సంబంధించి కనీసం 20 శాతం సీట్లు కూడా భర్తీ కాలేదు. మరి కొన్ని కోర్సుల్లో సింగిల్ డిజిట్ అడ్మిషన్లు జరుగుతున్నాయి. సైన్స్ విభాగాల్లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సులో 55 శాతం, ఫిజిక్స్‌లో 50 శాతం, కామర్స్ అండ్ కంప్యూటర్స్ విభాగాల్లో 30 శాతం మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయి.

11 గెస్ట్ టీచర్ల పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో గెస్ట్ టీచర్లుగా పనిచేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త టి.పద్మజ తెలిపారు. జిల్లాలోని ఏడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, వీటిలో 11 గెస్ట్ టీచర్ల పోస్టులను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఆంగ్ల మాధ్యమంలో బోధనకు గెస్ట్ టీచర్లను తీసుకుంటున్నామని, బీఈడీతోపాటు టెట్‌లో అర్హత సాధించి ఉండాలన్నారు. అంతేకాకుండా పీజీలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కలెక్టరేట్‌లోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. గెస్ట్ టీచర్ల పోస్టులకు సంబంధించి స్త్రీల విభాగంలో జూనియర్ లెక్చరర్లు(కెమిస్ట్రీ)–01, ఆర్థికశాస్త్రం–01, కామర్స్ –01, హిందీ–01, మ్యాథ్స్–02, సోషియల్ స్టడీస్–02, పురుషుల విభాగంలో జేఎల్‌గా మ్యాథ్స్–01, పీజీటీ మ్యాథ్స్–01, హిందీ–01 ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు.

శంకర్ ఫౌండేషన్‌తో ఏపీ నిట్ ఎంఓయూ

తాడేపల్లిగూడెం: విశాఖకి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రితో తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్ బుధవారం హైదరాబాద్‌లో అవగాహన ఒప్పందం చేసుకుంది. గ్లకోమా వ్యాధిని కృత్రిమ మేధ ద్వారా ముందస్తుగా గుర్తించేలా యాప్ రూపకల్పనకు ఏపీ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఫణి కృష్ణ కర్రి ఆధ్వర్యంలో పరిశోధనలు జరుగుతున్నాయి. శంకర్ కంటి ఆస్పత్రితో ఈ మేరకు నిట్ ఒప్పందం చేసుకోవడం ఆనందంగా ఉందని ఇన్‌చార్జి డైరెక్టర్ మూర్తి అన్నారు.



వైవీయూ పీజీ ఫలితాలు విడుదల

వైవీయూ: కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ 2వ సెమిస్టర్ ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి బుధవారం సాయంత్రం తన ఛాంబర్లో విడుదల చేశారు. ఐదేళ్ల ఎల్.ఎల్.బి మొదటి సెమిస్టర్, మూడేళ్ల ఎల్.ఎల్.బి తొలి సెమిస్టర్ ఫలితాలను కూడా విడుదల చేశారు.

15 వరకు డిగ్రీ మూడో విడత కౌన్సెలింగ్

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ కళాశాలల్లో మూడవ విడత డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 15వ తేదీ వరకు పొడిగిస్తూ అన్ని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు ఉన్నత విద్యామండలి బుధవారం సమాచారం అందించింది.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్ కోర్సులలో ప్రవేశాలకు సంబంధించిన గడువును ఈ నెల 15వ తేదీ వరకు పెంచినట్లు ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, డీఈఓ మర్రెడ్డి అనూరాధ సంయుక్త ప్రకటనలో తెలిపారు. దీంతోపాటు రూ. 200 అపరాధ రుసుంతో ఈనెల 25వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్‌గా అమరేంద్ర కుమార్

వేంపల్లి: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సండ్రా నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు ఆర్జీయూకేటీ వైస్ ఛాన్స్‌లర్ విజయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ డైరెక్టర్‌గా పని చేశారు. సివిల్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడి గా విధులు నిర్వహిస్తున్నారు.

సన్నిధి
సాక్షి ప్లస్
గురువారం ॥ 12-9-2024



మీకు తెలుసా?

● స్వయంగా బ్రహ్మదేవుడు ఆరాధించిన అర్చామూర్తి ఈ ఆలయ మూల విరాట్టు. ● నారాయణీయం అనే గ్రంథాన్ని రచించిన నారాయణ భట్టాద్రి ఈ క్షేత్రాన్ని గురు పవన పురి అని కీర్తించారు. ఈ గ్రంథ రచనతో తనకున్న దీర్ఘవ్యాధి నయమయిందని ఆయనే స్వయంగా రాసుకున్నాడు. ● జయదేవుని గీతగోవిందం, బిల్వమంగళుడి శ్రీకృష్ణ కర్ణామృత గ్రంథాలు గురువాయూర్ తోనే ముడిపడి ఉన్నాయి.



భూలోక వైకుంఠం గురువాయూర్

ప్రకృతి అందాలకు, ఆయుర్వేద పంచకర్మ చికిత్సకు, అనేకానేక అపురూపమైన ఆలయాలకు నెలవు కేరళ. అటువంటి కేరళలో స్వర్గ మర్త్య పాతాళ లోకాలూ కలసిన భూలోక వైకుంఠం గురువాయూర్. అసలు ఈ పేరు వినగానే శంఖుచక్ర గదా పద్మాలతో కూడి, విష్ణుస్వరూపుడైన శ్రీకృష్ణ భగవానుడి దివ్యమంగళ స్వరూపం కనుల ముందు కదలాడుతుంది. దేవతల గురువైన బృహస్పతి అంటే గురువు, వాయుదేవుడు కలిసి పరశురాముడి సాయంతో సముద్రగర్భంలోకి చేరకుండా కాపాడిన శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దివ్యస్థలి ఇది. అంతకుముందు వరకు రుద్రతీర్థం అనే పేరుతో విలసిల్లిన ఈ క్షేత్రానికి వారి పేరు మీదుగానే గురువాయూరు అనే పేరొచ్చింది.

ఆలయంలోకి అడుగుపెట్టగానే ఒక చేత శంఖం మరో చేత చక్రం మరో రెండు చేతులలోనూ గదాపద్మాలను, మెడలో తులసిమాలను ధరించిన స్వామి విగ్రహం చూడటానికి రెండు కన్నులూ చాలవేమో అన్నంత మనోహరంగా ఉంటుంది. మీ మనసులోని భావాలన్నీ నాకు తెలుసు, మీరు కోరకుండానే నేనే తీరుస్తానుగా మీ కోర్కెలను అన్నట్లు చిరునవ్వులు చిందిస్తూ ఉన్న ఆ సుందర స్వరూపాన్ని చూడగానే పాపాలన్నీ ప్రక్షాళన అవుతాయి. అన్నట్లు అయిదు వేల సంవత్సరాల చరిత్ర గల ఈ విగ్రహం తక్కిన అన్ని విగ్రహాలలాగా రాతితో లేదా పంచలోహాలతో తయారైనది కాదు. పాతాళాంజనమనే విశిష్టమైన వనమూలికలతో రూపొందించినది. ఇది చాలా మహిమాన్విత క్షేత్రం కాబట్టి ఆలయంలో మడీ తడీ శుచీ శుభ్రతలకు ప్రాముఖ్యతనిస్తారు.

ఇక్కడ పరిణయమాడితే జీవితమంతా పరిమళ భరితమే అనే విశ్వాసంతో భక్తులు ఎంతో వ్యయప్రయాసలకోర్చి మరీ ఈ ఆలయ ప్రాంగణంలో పాణిగ్రహణం చేసుకోవాలని ఉబలాటపడతారు. నామకరణాలు, అన్నప్రాశనలు, అక్షరాభ్యాసాలు, ఉపనయనాల వంటి శుభకార్యాలన్నీ ఇక్కడ నిత్యం జరుగుతూనే ఉంటాయి.



ఆపదలు, గండాలు, దీర్ఘవ్యాధులు తొలగాలని స్వామికి మొక్కుకుని, ఆయా ఆపదలన్నీ హారతి కర్పూరంలా కరిగిపోగానే తమ బరువుకు సరిపడా బంగారం, వెండి, రూపాయి కాసులు, ఆకుకూరలు, కూరగాయలు, వెన్న, పటికబెల్లం... ఇలా ఒకటేమిటి, తమ స్తోమతకు తగ్గట్టుగా తులాభారం తూగుతూ కనిపిస్తారు. కొందరు భక్తులు స్వామివారికి అమూల్యమైన ఆభరణాలనూ సమర్పిస్తుంటారు. ఆయా ఆభరణాలను భద్రపరిచేందుకు ఒక ప్రత్యేకమైన గది ఉంది. ఆ గదిని అనునిత్యం అంటిపెట్టుకుని పంచనాగులనే పేరుగల ఐదుసర్పాలు సంరక్షిస్తుంటాయి.

ఇక్కడ ఎల్లప్పుడూ సంగీత, నృత్యకార్యక్రమాలు జరుగుతుంటాయి. ఆలయానికి చేరువలో రుద్రతీర్థమనే పేరుగల పెద్ద కోనేరు ఉంది. స్వామికి ఈ కోనేటినీటితోనే నిత్యం అభిషేకం చేస్తారు అర్చకులు. ఏకాదశి, రోహిణీ నక్షత్ర వేడుకలు ఇక్కడ విశేషంగా జరుగుతుంటాయి. ఏనుగులకు ఈ ఆలయంలో ఎంతో ప్రత్యేకత, గౌరవాభిమానాలూ దక్కుతాయి. ఏనుగు పందేలు కూడా జరుగుతాయి. అవి అల్లాటప్పాగా కాదు.. ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉల్లాసోత్సాహాలతో నిర్వహిస్తారు.

చుట్టుపక్కల చూడదగ్గ స్థలాలు: మమ్మియూర్ మహాదేవ క్షేత్రం, ఎలిఫెంట్ క్యాంప్ శాంక్చువరీ, పున్నతూర్ కొట్ట, పార్థసారథి టెంపుల్, వెంకటాచలపతి టెంపుల్, చోవళూర్ శివాలయం, పళయూర్ చర్చ్, గురువాయూర్ దేవస్థాన దారుశిల్ప కళాసంస్థ, నవముకుందాలయం, చాముండేశ్వరి ఆలయం, హరికన్యక టెంపుల్, నారాయణంకులాంగర టెంపుల్ మొదలైనవి.

ఎలా వెళ్లాలి?

దేశంలోని అన్ని ప్రధాన నగరాల నుంచి గురువాయూర్‌కు రైళ్లున్నాయి. విమాన మార్గంలో అయితే కోజికోడ్‌లోని కాలికట్ విమానాశ్రయంలో దిగి అక్కడినుంచి గురువాయూర్‌కు బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలలో చేరుకోవచ్చు. ఆలయంలో నిత్యాన్నదానం ఉంటుంది. అన్నసత్రాలూ ఉన్నాయి. వసతి కోసం చిన్న, పెద్ద హోటళ్లనేకం ఉన్నాయి.

– డి.వి.ఆర్. భాస్కర్



అదే నిజమైన భక్తి

‘‘మంత్రజపాలు చేసినా, హోమాలు నిర్వహించినా, యజ్ఞయాగాదులు చేసినా, గొప్ప గొప్ప శాస్త్రాలు చదివినా బుద్ధి కుదురుగా లేకపోతే, ప్రవర్తన సరిగా లేకపోతే మోక్షం కలుగదు’’ అని తనను దర్శించడానికి వచ్చే భక్తులకు తరచు బోధించేవారు సాయి. ఒక గింజ మొలకెత్తి, చిగురులు తొడిగి, వృక్షం కావాలంటే ఎన్నో శక్తులు, ఎన్నో విధాల సాయం చేస్తాయి. నేల, నీరు, గాలి, సూర్యుడు... ఇవన్నీ ఊపిరులూదితే కానీ ఆ గింజ ప్రాణం పోసుకోదు. ఎదగదు. అయినా ఇవన్నీ ఆ మొక్క నుంచి ఏమీ ఆశించవు. మీరూ ఎవరినుంచీ ఏమీ ఆశించకండి. చేతనైతే ఎవరికైనా మేలు చేయండి లేదంటే కనీసం కీడు చేయకుండా ఉండండి.’’ అని బాబా బోధించేవారు.

ఎల్లవేళలా దైవనామస్మరణ చేసేవారిని మాత్రమే కాదు, కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవటం, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, ఇతరుల గురించి చెడుగా మాట్లాడకపోవటం, మంచి భావనలతో మనసును నిష్కల్మషంగా ఉంచుకోవటం ... వీటిని ఆచరించే వారిని కూడా బాబా సదా అంటిపెట్టుకుని ఉంటారు. బాబా చూపిన ఆధ్యాత్మిక బాట కేవలం భక్తిపరమైనదే కాదు, అది మంచి జీవనశైలిని కూడా అలవరుస్తుంది. దానిని ఆచరించిన వారు అన్నింటా మంచి ఫలితాలను పొందుతారు. ఎందుకంటే ఆయన ఆచరణ సాధ్యం కాని విషయాలను ఆచరించమని చెప్పలేదు. ఫలానా నియమాలను పాటించాలని, యజ్ఞయాగాదులు చేయమని సూచించలేదు. తననే పూజించమని చెప్పలేదు. మరేం చేశారంటే... మనిషి మోక్షం పొందడానికి సరికొత్త జీవన విధానాన్ని ప్రచారం చేశారు. అంతేకాదు, ఆ విధానంలో ఎలా జీవించాలో అందరికీ జీవించి చూపారు. ఆ జీవనశైలిని అలవరచుకుంటే ఎవరయినా ఎంతటి స్థాయికి చేరుకోగలరో తెలిసేలా జీవించారు.

సాయి చెప్పిన దానిని బట్టి ప్రార్థన అంటే దేవుడితో బేరం కుదుర్చుకోవడం కాదు. ‘ఫలానా పని అయితే నీ దగ్గరకు వస్తాను, అదిస్తాను, ఇదిస్తాను, నాకు ఈ పని అయ్యేలా చూడు’ అని మొక్కుకోవడం కాదు. నిజమైన ప్రార్థనలో ప్రతిఫలాపేక్ష ఉండదు. మనకు జీవితమనే గొప్ప అవకాశం ఇచ్చిన దేవుడికి కృతజ్ఞత చెప్పుకోవడం ప్రార్థనలోని పరమార్థం. ఇంకా సూటిగా చెప్పాలంటే – ‘ప్రార్థన అంటే మనం దేవుడితో మాట్లాడే సమయం’అన్నమాట. నిజంగా దేవుడి కోసం చేసే ప్రార్థనలో కోరికలు ఉండకూడదు. ఇచ్చిపుచ్చుకోవడాలు ఉండకూడదు. నిజమైన భక్తి ఎలా ఉండాలంటే... మనసులో మంచిని తలుచుకో, కళ్లతో మంచిని చూడాలి. నాలుకతో మంచిని మాట్లాడాలి. చెవులతో మంచిని వినాలి. మనసును నిర్మలంగా ఉంచుకోవాలి. ఎందుకంటే నిర్మలం కాని మనసులోకి భగవంతుడు ప్రవేశించలేడు. కాబట్టి పైన చెప్పిన మంచి పనులన్నింటినీ చేస్తూ, మనసును పూర్తిగా భగవంతుడి పైన లగ్నం చేయాలి అని బోధించేవారు షిరిడి సాయి. భక్తులు దానిని అర్థం చేసుకుని ఆచరించాలి.

ధర్మ సందేహం



● గణపతి విగ్రహానికి పూజ చేసి, ఎంతో చక్కగా అలంకరించి తిరిగి నీటిలో కలిపేయడం ఎందుకు?

● మరో ప్రశ్న ‘గణపతికి నవరాత్రులు లేవనీ, బాలగంగాధర్ తిలక్ దీనిని ప్రవేశపెట్టాడంటారు. నిజమేనా?

నిమజ్జన ఆంతర్యం అదే!

గణపతి విగ్రహాన్ని పూజించి తిరిగి నీటిలో కలపడంలోనే – మన విగ్రహారాధన – తత్త్వం అర్థమౌతుంది. విగ్రహాన్ని మాత్రమే దేవుడనుకోరు హిందువులు.

ఇంట్లో నిత్యం పూజించే ఇత్తడి, వెండి, బంగారు ప్రతిమలు నిమజ్జన చేయనవసరం లేదు. కానీ, వినాయక, దేవీ మొదలైన విగ్రహాలకు ఆయా పర్వదినాలలో ప్రత్యేకించి మట్టితో చేసి అందులో మంత్ర సహితంగా సంస్కారం చేసి, ‘ఆవాహన’ మొదలైనవి ఆచరించి, ఆరాధిస్తారు. విశ్వవ్యాపకమైన భగవత్ చైతన్యాన్ని ఆ విధంగా కేంద్రీకృతం చేసి, ఆరాధించి, ఆ తరువాత యథావిధి పూజలన్నీ సమాప్తమయ్యాక, తిరిగి ‘ఉద్వాసన’ చేస్తాం. అంటే ఆరాధింపబడిన మహాశక్తిని మన అంతరంగంలో నిక్షిప్తం చేసుకోవాలి. తద్వారా ఆ దేవతాశక్తి మనల్ని అనుగ్రహిస్తుంది.



బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ

ఈ విగ్రహాన్నే కలకాలం ఉంచితే నిత్యమూ తగిన శాంతి జరపడం సాధ్యం కాదు. అలా ఉద్వాసన చేసిన తరువాత ఆ విగ్రహం కేవలం మృణ్మయమే. దానిని తిరిగి జలతత్త్వంలో లీనం చేయాలి. పృథ్వీతత్త్వాన్ని జలతత్త్వంలో లయింపజేయడం ఒక యోగ ప్రక్రియ కూడా.

అయితే, కరగని విధంగా విగ్రహాల్ని చేయడం శాస్త్రం కాదు. కేవలం నీటిలో కరిగే మట్టితోనే ప్రతిమను చేసి, దానిని పత్రాలతో అర్చించడం సంప్రదాయం.

తిలక్ మహాశయుడు సామూహికంగా గణపతి పూజల్ని ప్రాచుర్యం చేసిన మాట వాస్తవమే. కానీ గణపతి నవరాత్రులు ఆయన కల్పితం కాదు. గాణపత్యంలో నవరాత్రి విధానం ఉంది. గణపతినే పరదైవంగా భావించి కొలిచే మతం గాణపత్యం. శక్తి నవరాత్రులు, రామ నవరాత్రులు వలె గణపతి ఉపాసకులకు నవరాత్ర దీక్ష ఉంది. ఆ దీక్షతో గణపతిని పూజించడం సంప్రదాయ సిద్ధమే.

మహారాష్ట్రలో గాణపత్యం ఎక్కువగా వ్యాప్తిలో ఉంది కనుక, అక్కడ అధికంగా ఈ నవరాత్రులు కనిపిస్తాయి. గణపతి ఉపాసకులు, భక్తులు ఎక్కడివారైనా, శాస్త్ర సిద్ధంగా భాద్రపద నవరాత్రులు చేయవచ్చు.

(‘ఋషిపీఠం’ ప్రచురణ ‘సమాధానమ్’ సంచిక నుంచి సేకరణ)

దేవుడు అందరివాడు



సువార్త

క్రీ.పూ. 722లో అష్షూరును ఇశ్రాయేలీయులు ఓడించాడు. అష్షూరు దేశం ముఖ్యపట్టణం నీనెవె. ప్రభువు వాక్కు యోనా అనే ప్రవక్తకు వినిపించి ‘‘నీనెవె పట్టణస్థుల దౌష్టీకం నా దృష్టికి కనపడింది. నీవు వెళ్ళి వారిని దాష్టీకమును విడిచి పశ్చాత్తాపపడునట్లు సందేశమివ్వవలసినది’’ అని యోనాను ఆజ్ఞాపించాడు.

అయితే యోనా ప్రభువు మాట వినక తర్షీషు అనే ప్రాంతానికి వెళ్ళదలచి తర్షీషు ఓడలో ప్రయాణమై పారిపోయాడు. అంటే ప్రభు ఆజ్ఞను శిరసావహించలేదు. అప్పుడు ఆ ఓడలో పెద్ద తుఫాను చెలరేగి పెనుగాలికి ఓడ బద్దలయ్యే పరిస్థితి వస్తుంది. దాంతో ఓడ నావికుడు భయపడి తోటి ప్రయాణీకులను ఆ విపత్తు నుండి బయటపడటానికి వారి వారి దేవుళ్ళకు మొరపెట్టుకోమంటాడు. ఓడ బరువు తగ్గించుకోవడానికి దానిలోని సరుకులను సముద్రంలో పడవేస్తారు. కానీ యోనా అనే ఇశ్రాయేలీయుడు ఓడ కింద భాగాన ఉండటాన్ని ఓడ నావికుడు గమనించి గాఢనిద్ర నుండి లేపి ‘‘ఈ విపత్తుకు కారకులెవరు? నీవు ఎక్కడి నుండి వస్తున్నావు? ఎవరు నీవు? ఏ దేశస్థుడవు? ఏజాతి మీది’’ అని ప్రశ్నించాడు. అతడు ‘‘నేను హెబ్రూ జాతి వాడిని’’ అని చెప్తాడు. ఈ దురదృష్టానికి కారకులెవరని చీట్లు వేస్తారు. ఆ చీటీ యోనా పేరున వస్తుంది. అప్పుడు ఓడ నావికుడు నన్ను ఏమి చెయ్యమంటావు ఓడ నిమ్మళించడానికి అని అడిగాడు. అతను నన్ను ఎత్తి సముద్రంలో పడవేయమని చెప్పగా అతను అదే చేస్తాడు. అతన్ని పెద్ద చేప మింగుతుంది.

ఓడ తుఫాను నుండి నెమ్మదిస్తుంది. ఈ దురదృష్టానికి ఇశ్రాయేలీయుడైన యోనా కారణమని తెలుస్తుంది. అతడు పెద్ద చేప కడుపులో మూడు రోజులు వున్న తర్వాత చేప ‘యోనా’ను నీనెవె పట్టణ ఒడ్డున పడవేస్తుంది. యోనా అంటే పావురం అని అర్థం.

తర్వాత యోనా నీనెవె పట్టణానికి వెళ్ళి దేవుడు మీ అక్రమాలను దృష్టించాడు. మీరు పశ్చాత్తాప పడి మీ అక్రమాలను విసర్జించి మార్పు చెందకపోతే దేవుడు 40 రోజుల్లో మీ పట్టణాన్ని నాశనం చేయబోతున్నాడని సందేశమిచ్చాడు. ఆ వార్త ఆ దేశపు రాజు చెవినపడి ప్రజలందర్నీ అక్రమాలను విడిచి, ఉపవాసముండి పశ్చాత్తాప పడాలని ఉత్తర్వులు జారీ చేస్తాడు. రాజు, ఆయన మంత్రులు ఆజ్ఞ యివ్వగా మనుషులు తమ దుర్మార్గాలను మానుకొనగా దేవుడు అది చూసి వారికి యిచ్చిన మాట కీడుచేయక విరమించుకొంటాడు.

దేవుడు కరుణ, కటాక్షం, జాలి, దయగలవాడు. మనుష్యులే అవిశ్వాసులు, అసూయాపరులు. కనుక పాలు–తేనె కలిసినట్లుగా, నింగి నేల కలిసినట్లుగా జాతికన్న నీతి గొప్పదని, మతం కన్న మమత గొప్పదని మనుష్యులు ఏకమై జాతి, మతం, వర్గ, ప్రాంతాల విభేదాలు విడిచి కలిసి జీవించాలి. అదే మానవతకు అర్థం.

– కోట బిపిన్ చంద్రపాల్

వధూవరులకు జీలకర్ర, బెల్లం ఎందుకు పెడతారు?

జీలకర్ర, బెల్లం జీలకర్ర, బెల్లం కలిపితే ధన విద్యుత్ ఉత్పన్నమై వస్తువులను ఆకర్షించే శక్తి కలుగుతుందని సైన్స్ చెబుతోంది. జీలకర్ర, బెల్లం పెట్టడం వల్ల తలపై ఉండే బ్రహ్మరంధ్రం తెరుచుకుంటుంది. అలాగే జీలకర్ర, బెల్లం మిశ్రమం బాగా కలిసిపోతుంది. అలా వధూవరులు కూడా కలిసిపోవాలని పూర్వీకులు ఈ సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. జీలకర్ర, బెల్లం రెండింటికీ వేర్వేరు లక్షణాలు కనిపిస్తాయి. బెల్లం ఎలాంటి అవశేషమూ మిగల్చకుండా కరిగిపోతుంది. జీలకర్ర తన రూపంలో ఎలాంటి మార్పూ లేకుండానే, తనని అంటిపెట్టుకుని ఉన్న పదార్థానికి సద్గుణాలను అందిస్తుంది.



వివాహ బంధంతో ఒకరిలో ఒకరు కరిగిపోతూనే, ఎవరి అస్తిత్వాన్ని వారు నిలుపుకోవాలనీ... తనలోని సద్గుణాలని ఎదుటివారికి అందించాలనీ ఈ రెండు పదార్థాల కలయిక మనకి చెబుతుంది. జీలకర్ర, బెల్లం పెట్టే చోటే సహస్రార చక్రం ఉంటుందని యోగశాస్త్రం చెబుతోంది. ఇక భృకుటి మధ్యలో ఆజ్ఞా చక్రం ఉంటుంది. అంటే ఈ క్రతువులో మనిషి అత్యున్నత స్థితిని సూచించే రెండు చక్రాలనీ మేల్కొలిపే ప్రయత్నం జరుగుతుందన్న మాట! ఇలా ఏర్పడిన అనుబంధం జీవితకాలం నిల్చిపోతుందట.

ఖుర్ ఆన్ అవగాహనం

సమావేశపు మర్యాదలు



విశ్వసించిన ఓ ప్రజలారా! మీ సమావేశాలలో చోటు కల్పించండని మీతో అన్నప్పుడు, మీరు జరిగి, చోటు కల్పించండి. అల్లాహ్ మీకు విశాలమైన చోటును ప్రసాదిస్తాడు. మిమ్మల్ని లేచి వెళ్ళండి అని అన్నప్పుడు లేచి వెళ్ళండి. మీలో విశ్వసించిన వారికి, జ్ఞానం ప్రసాదించిన వారికి అల్లాహ్ ఉన్నత స్థానాలు కల్పిస్తాడు. మీరు చేసేదంతా అల్లాహ్ కు తెలుసు.(58:11)

వివరణ: ఒక సభలో ముందు నుంచే కొందరు కూర్చుని ఉన్నప్పుడు, తరువాత ఇంకా కొంతమంది వచ్చినట్లయితే, ముందు నుంచే కూర్చుని ఉన్న వారిలో ఈ సంస్కారం ఉండాలి, వారు స్వయంగా కొత్తగా వచ్చిన వారికి చోటివ్వాలి. వీలైనంతవరకు సర్దుకుని కూర్చుని వారికి చోటు కల్పించాలి. అలాగే తర్వాత వచ్చే వారిలోనూ ఈ మాత్రం సంస్కారం, మర్యాద ఉండాలి. వారు బలవంతాన వారిలోకి చొరబడరాదు. ఎవరూ మరొకరిని లేపి వారి స్థానంలో కూర్చునే ప్రయత్నం చేయరాదు. మహనీయ ప్రవక్త ముహమ్మద్ సల్లం ఇలా సెలవిచ్చారు: ‘‘ఏ వ్యక్తి మరొకరిని లేపి అతని స్థానంలో కూర్చోరాదు. మీరు స్వయంగా ఇతరులకు చోటు కల్పించండి. ఏ వ్యక్తికైనా ఇద్దరు వ్యక్తుల మధ్య నుండి వారి అనుమతి లేకుండా దూరిపోవడం ధర్మ సమ్మతం కాదు.’’

ప్రజలు ప్రవక్త మహనీయుల సభలలో చాలాసేపటి వరకు కూర్చుని ఉండేవారు. చివరి నిమిషం వరకు కూర్చుండాలన్నది వారి ప్రయత్నం. దీనివల్ల ఒక్కొక్కసారి ప్రవక్త గారికి కష్టం కలిగేది. ఆయన విశ్రాంతికి భంగం కలిగేది. ఆయన కార్యక్రమాల్లోనూ అవాంతరం ఏర్పడేది. అందువల్ల మిమ్మల్ని లేవమని కోరినప్పుడు లేచి వెళ్ళండి’ అనే ఆదేశం అవతరించింది (ఇబ్ను కసీర్)

సభలో ఇతరులకు చోటు కల్పించడానికి మీరు ప్రవక్త సల్లంకు కాస్త దూరం వెళ్లి కూర్చున్నంత మాత్రాన మీ స్థాయి పడిపోయిందని అనుకోకండి లేదా సమావేశం ముగించి మిమ్మల్ని లేచి వెళ్లిపోవాలని అన్నట్లయితే మీకేదో అవమానం కలిగిందని అనుకోకండి. స్థాయి ఉన్నతమవడం అన్నది విశ్వాసం, జ్ఞానం ఆధారంగా జరుగుతుంది అంతేగాని దైవ సందేశహరులకు సమీపాన కూర్చునే అవకాశం దొరకడం వల్ల కాదు. అలాగే ఎక్కువసేపు ఆయన సన్నిధిలో కూర్చోవడం వల్లనూ కాదు. ఒక వ్యక్తి ఎక్కువసేపు ఆయన సన్నిధిలో కూర్చుంటే దాని అర్థం అతనికి ఉన్నత స్థానం ప్రాప్తమయిందని కాదు. ఉన్నత స్థానమైతే విశ్వాసం, జ్ఞానాల సంపద ఇతోధికంగా పొందిన వారికే ప్రాప్తం అవుతుంది.అలాగే ఎవరైనా చాలాసేపు కూర్చొని దైవ సందేశ హరునికి కష్టం కలిగించినట్లయితే అతను దానికి బదులుగా అజ్ఞానపు పని చేసినట్లు అవుతుంది. కేవలం చాలాసేపు ఆయన సన్నిధిలో కూర్చొనే అవకాశం దొరికిందన్న మనిషికి అతని స్థాయిని పెంచదు. అతని కన్నా ఎన్నో రెట్లు ఉన్నత స్థానం అల్లాహ్ దృష్టిలో ఆయన సాంగత్యంలో ఈమాన్, విశ్వాసం, జ్ఞానాల సంపదను పొందిన వ్యక్తికి, ఒక విశ్వాసిలో ఉండవలసిన నైతిక తను నేర్చుకునే వ్యక్తి ప్రార్థన అవుతుంది.

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

బిజినెస్ రీల్

పెట్ ఫుడ్ కేటగిరీలోకి గ్రోవెల్ గ్రూప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెంపుడు జంతువుల ప్రత్యేక ఆహార అవసరాల కోసం కారినైవెల్ బ్రాండ్‌ను ప్రారంభించినట్లు గ్రోవెల్ గ్రూప్ తెలిపింది. దీని కింద పెంపుడు పిల్లులు, కుక్కల పోషకాహార అవసరాలను తీర్చే విధంగా శాఖాహార, మాంసాహార ఉత్పత్తులను అందిస్తున్నట్లు ప్రమోటర్ గ్రూప్‌నకు చెందిన ఎంఎస్ఆర్ కార్తీక్ తెలిపారు. త్వరలో ఎగుమతులు కూడా ప్రారంభించనున్నట్లు వివరించారు. దేశీయంగా పెంపుడు జంతువుల మార్కెట్ 2027 నాటికి బిలియన్ డాలర్ల స్థాయిని చేరుతుందనే అంచనాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో పెట్ ఫుడ్ మార్కెట్ కూడా విస్తరించేందుకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

డెల్టా గలీల్‌తో రిలయన్స్ రిటైల్ జత

సమాన భాగస్వామ్య సంస్థ ఏర్పాటు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ రిటైల్ విభాగం తాజాగా ఇజ్రాయెల్ దిగ్గజం డెల్టా గలీల్ ఇండస్ట్రీస్‌తో చేతులు కలిపింది. సమాన వాటా(50:50)తో భాగస్వామ్య సంస్థ(జేవీ)కు తెరతీసింది. వెరసి రిలయన్స్ రిటైల్ దుస్తుల మార్కెట్‌లో మరింత విస్తరించనుంది. ప్రపంచస్థాయిలో బ్రాండెడ్, ప్రయివేట్ లేబుల్ ఇన్నర్‌వేర్ తయారుచేసే డెల్టా గలీల్‌తో జేవీని ఏర్పాటు చేసినట్లు రిలయన్స్ రిటైల్ వెల్లడించింది. యాక్టివ్‌వేర్, లాంజ్‌వేర్, మహిళలు, పురుషులు, పిల్లల డెనిమ్ దుస్తులు తదితరాలను రూపొందించనున్నట్లు ఒక సంయుక్త ప్రకటనలో రెండు సంస్థలు పేర్కొన్నాయి. రిలయన్స్ సొంత బ్రాండ్ల తయారీ, డిజైన్‌లోనూ డెల్టా గలీల్ జేవీ ద్వారా సహకరించనుంది. అంతేకాకుండా రానున్న 18 నెలల్లో డెల్టా ఫ్యామిలీ లైఫ్‌స్టైల్ స్టోర్లు తెరవనుంది. పురుషులు, మహిళల అథెనా బ్రాండ్ ఇన్నర్‌వేర్‌ను ప్రవేశపెట్టనున్నాయి. తద్వారా దేశీ దుస్తుల మార్కెట్లో పరివర్తనకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలియజేశాయి. దేశీ దుస్తుల మార్కెట్లో రిటైల్, హోల్‌సేల్, డిజిటల్ చానల్స్ ద్వారా విస్తరించనున్నట్లు డెల్టా గలీల్ పేర్కొంది.

ఫెడెక్స్‌కు 'ఎయిర్‌లైన్' గుర్తింపు

న్యూఢిల్లీ: లాజిస్టిక్స్ ఆపరేటరీ కేటగిరీలో ఫెడరల్ ఎక్స్‌ప్రెస్ కార్పొరేషన్ భారత విభాగానికి కస్టమ్స్ నుంచి 'ఎయిర్‌లైన్' గుర్తింపు లభించింది. ఆథరైజ్డ్ ఎకనమిక్ ఆపరేటర్ (ఏఈవో) ప్రోగ్రాంలో భాగంగా భారత్‌లో ఈ హోదాను దక్కించుకున్న ఏకైక ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ప్రొవైడర్ తామేనని సంస్థ తెలిపింది. 2023 మేలోనే 'కొరియర్, కస్టోడియన్, కస్టమ్స్ బ్రోకర్, లాజిస్టిక్స్ ప్రొవైడర్'గా తమకు ఏఈవో సర్టిఫికేషన్ లభించినట్లు వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-9-2024	
విశాఖ	535-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.55

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	11,430.15	4.03
ASIANPAINT	3,368.50	2.23
BAJFINANCE	7,361.00	1.65
SHRIRAMFIN	3,288.00	0.86
BRITANNIA	6,017.75	0.8

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	976.4	-5.73
ONGC	286.9	-2.94
WIPRO	516	-1.85
LT	3,540.00	-1.56
ADANIENT	2,940.00	-1.55

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,643
ఎన్ఎస్ఈ	1,07,693
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,99,698
ఎఫ్ఐఐ	+ 1,755
డీఐఐ	+ 231

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.59	$ 65.75
బ్రెంట్	70.83	$ 69.19

ఐపీవోకు ఇన్‌ఫ్లక్స్ హెల్త్‌టెక్

ఎన్ఎస్ఈ ఎమర్జ్ ద్వారా లిస్టింగ్

న్యూఢిల్లీ: న్యూట్రాస్యూటికల్స్, కాస్మెటిక్స్ తదితరాల కాంట్రాక్ట్ తయారీ కంపెనీ ఇన్‌ఫ్లక్స్ హెల్త్‌టెక్ ఐపీవోకు వస్తోంది. ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్ ద్వారా లిస్టయ్యేందుకు వీలుగా ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా 46.32 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 13.68 లక్షల షేర్లను సంస్థ వ్యవస్థాపకుడు మునీర్ అబ్దుల్ గనీ చాంద్‌నీవాలా విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 21.61 కోట్లను న్యూట్రాస్యూటికల్ తయారీ ప్లాంటుకు, పశుపోషణ(వెటరినరీ ఫుడ్) యూనిట్‌కు రూ. 8.76 కోట్లు వెచ్చించనుంది. 2020లో ఏర్పాటైన కంపెనీ ప్రధానంగా కాంట్రాక్ట్ పద్ధతిన అభివృద్ధి, తయారీ(సీడీఎంవో) కార్యకలాపాలు నిర్వహిస్తోంది. న్యూట్రాస్యూటికల్స్, కాస్మెటిక్స్, ఆయుర్వేదిక్, వెటరినరీ ఫీడ్ విభాగాలలో ప్రత్యేకత కలిగి ఉంది. గతేడాది(2023-24) రూ. 100 కోట్ల టర్నోవర్, రూ. 11 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది.

వెస్టర్న్ క్యారియర్స్ @ రూ. 163-172

ఈ నెల 13-18 మధ్య ఐపీవో



న్యూఢిల్లీ: మల్టీమోడల్ లాజిస్టిక్స్ కంపెనీ వెస్టర్న్ క్యారియర్స్ (ఇండియా) లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ శుక్రవారం(13న) ప్రారంభంకానుంది. బుధవారం(18న) ముగియనున్న ఇష్యూకి కంపెనీ రూ. 163-172 ధరల శ్రేణిని ప్రకటించింది. ఐపీవోలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 54 లక్షల(రూ. 93 కోట్ల విలువ) షేర్లను ప్రమోటర్ రాజేంద్ర సేథియా విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా మొత్తం రూ. 493 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు రేపు(12న) షేర్లను జారీ చేయనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో 163.5 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 152 కోట్లు పెట్టుబడి వ్యయాల(షిప్పింగ్ కంటెయినర్స్, వాణిజ్య వాహనాల కొనుగోలు)కు వెచ్చించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 87 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. కంపెనీ కస్టమర్లలో టాటా స్టీల్, హిందాల్కో, వేదాంతా, బాల్కో, కోకకోలా ఇండియా, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ తదితర దిగ్గజాలున్నాయి. గతేడాది(2023-24) రూ. 1,685 కోట్ల ఆదాయం, రూ. 80 కోట్ల నికర లాభం ఆర్జించింది.

శ్రీరామ్ గ్రూప్ బీమా కంపెనీల లిస్టింగ్

ఏడాది నుంచి రెండేళ్లలోగా ఐపీవోలు



ముంబై: వచ్చే ఏడాది లేదా రెండేళ్ల కాలంలో బీమా రంగ సంస్థల లిస్టింగ్‌ను చేపట్టనున్నట్లు కంపెనీ శ్రీరామ్ గ్రూప్ తాజాగా వెల్లడించింది. సాధారణ బీమా, జీవిత బీమా(జనరల్, లైఫ్ ఇన్సూరెన్స్) విభాగాలు రెండూ పటిష్టంగా పనిచేస్తున్నట్లు శ్రీరామ్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ ఉమేష్ రేవంకర్ పేర్కొన్నారు. ఒకస్థాయికి చేరాక వీటి లిస్టింగ్‌పై దృష్టి సారించనున్నట్లు తెలియజేశారు. వెరసి ఏడాది నుంచి రెండేళ్లలోగా పబ్లిక్ ఇష్యూలను చేపట్టవచ్చని తెలియజేశారు. రెండు బీమా సంస్థలు లాభాలు ఆర్జిస్తున్నాయని, అయితే జీవిత బీమా బిజినెస్‌కంటే ముందుగానే జనరల్ ఇన్సూరెన్స్‌ను లిస్ట్ చేసే యోచనలో ఉన్నామని వివరించారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపును చేపట్టాక విదేశాలలో సెక్యూరిటీల జారీ ద్వారా నిధుల సమీకరణకు తెరతీయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు దేశీయంగా బ్యాంక్ రుణాలు, సెక్యూరిటైజేషన్, బాండ్ల జారీ వంటి మార్గాలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు.

ఐటీలో వృద్ధి 6 శాతంలోపే

- నిర్వహణ లాభం 22 శాతం
- 2024-25 సంవత్సరంపై ఇక్రా అంచనా
- ఈ రంగానికి స్థిరమైన అవుట్‌లుక్




న్యూఢిల్లీ: భారత ఐటీ రంగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) 4 నుంచి 6 % మధ్య ఆదాయంలో వృద్ధిని నమోదు చేయవచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. స్థూల ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో యూఎస్, యూరప్‌లోని క్లయింట్లు టెక్నాలజీలపై వ్యయాలు తగ్గించుకోవడాన్ని కారణంగా పేర్కొంది. ఆదాయం పరంగా సవాళ్లు ఉన్నప్పటికీ నిర్వహణ మార్జిన్లు మెరుగ్గా 22% మేర ఉంటాయని తెలిపింది. అట్రిషన్ రేటు (ఉద్యోగుల వలస) గణనీయంగా తగ్గి, సమీప కాలంలో స్థిరపడొచ్చని అంచనా వేసింది. మెరుగైన నగదు ప్రవాహాలు, బలమైన బ్యాలన్స్ షీట్లను పరిగణనలోకి తీసుకుని ఐటీ పరిశ్రమకు స్థిరమైన అవుట్‌లుక్ ఇచ్చింది. అధిక ద్రవ్యోల్బణం, వడ్డీ వ్యయాలు కీలక రంగాల్లోని క్లయింట్లపై ఒత్తిళ్లకు దారితీశాయని, ఫలితంగా వ్యయాలని యంత్రణ, విచక్షణారహిత వ్యయాలను క్లయింట్లు వాయిదా వేసుకోవడాన్ని ప్రస్తావించింది. ఆర్డర్ల రాక తగ్గుముఖం పట్టినప్పటికీ.. ఐటీ కంపెనీలకు ఆర్డర్, డీల్స్ పైప్‌లైన్ బలంగానే ఉన్నట్లు ఇక్రా తెలిపింది. ఒక్కసారి ఆర్థిక పరిస్థితులు కుదుటపడితే మధ్యకాలానికి ఐటీ కంపెనీల్లో వృద్ధి మళ్లీ పుంజుకుంటుందని ఇక్రా కార్పొరేట్ రేటింగ్స్ హెడ్ దీపక్ జోత్వాని పేర్కొన్నారు.

కీలక మార్కెట్లో రికవరీ కీలకం..

దేశ ఐటీ కంపెనీల ఆదాయం గడిచిన ఐదారు త్రైమాసికాలుగా పెద్ద వృద్ధిని చూడకపోవడం గమనార్హం. ఇక్రా ఎంపిక చేసిన 15 పెద్ద, మధ్యస్థాయి లిస్టెడ్ ఐటీ కంపెనీలు 2023-24లో డాలర్ పరంగా కేవలం 5.5 శాతం వృద్ధినే నమోదు చేశాయి. 2022-23లో ఇది 9.2 శాతంగా ఉంది. అయినప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీల నిర్వహణ మార్జిన్లు 22 శాతంగా ఉంటాయని ఇక్రా అంచనా వేస్తోంది. దేశ ఐటీ కంపెనీలకు సింహభాగం ఆదాయం యూఎస్ నుంచి వస్తుంటే, ఆ తర్వాత యూరప్, మిగిలిన ప్రపంచ మార్కెట్ల (ఆర్‌వోడబ్ల్యూ) నుంచి వస్తోంది. ఇక్రా ఎంపిక చేసిన ఐటీ కంపెనీల ఆదాయంలో 55-60 శాతం మేర ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలోయూఎస్ నుంచే వచ్చింది. యూరప్ నుంచి 22-25 శాతం సమకూరింది. స్థూల ఆర్థిక అనిశ్చితుల ప్రభావం పరిశ్రమపై ఇక మీదట ఉండొచ్చని, కీలక మార్కెట్లలో నియంత్రణపరమైన తీవ్ర మార్పులు చోటు చేసుకుంటే అది ప్రతికూల ప్రభావం కొనసాగేలా చేయొచ్చని పేర్కొంది. జెనరేషన్ ఏఐ మధ్య కాలంలో ఐటీ పరిశ్రమ వృద్ధికి కీలకమని.. ప్రముఖ ఐటీ కంపెనీలు తమ సిబ్బందికి ఇందులో శిక్షణ ఇప్పించి, సేవల పరంగా తమ సామర్థ్యాలను పెంచుకున్నట్టు ఇక్రా తన నివేదికలో వివరించింది. జెనరేషన్ ఏఐ పరంగా ఆర్డర్‌బుక్ లేదా ఆదాయం ఇప్పటి వరకు పరిమితంగా ఉండగా, మధ్య కాలానికి పుంజుకోవచ్చని అంచనా వేసింది. డిమాండ్ మోస్తరుగా ఉండడం, 2022-23లో అధికంగా చేరిన సిబ్బందితో ఇటీవలి కాలంలో ఐటీ కంపెనీల నియామకాలపై ప్రభావం పడినట్టు తెలిపింది. లిస్టెడ్ కంపెనీలకు సంబంధించి నికర సిబ్బంది తగ్గుదల చోటుచేసుకున్నట్టు పేర్కొంది.

కస్టమర్ సర్వీసులపై మరింతగా దృష్టి పెట్టండి

ఆటో రంగానికి మంత్రి గడ్కరీ సూచన



న్యూఢిల్లీ: దేశీ ఆటో రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో కస్టమర్లకు మెరుగైన సేవలు అందించడంపై మరింతగా దృష్టి పెట్టాలని వాహన సంస్థలకు కేంద్ర రహదారి రవాణా, హైవేస్ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. నాణ్యతకు భరోసానిస్తూ, విక్రయానంతర సేవలను మెరుగుపర్చుకునే విధంగా కొత్త ఆవిష్కరణలపై ఫోకస్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆటోమొబైల్ డీలర్ల సమాఖ్య ఫాడా కార్యక్రమానికి పంపిన వీడియో సందేశంలో మంత్రి ఈ విషయాలు తెలిపారు. స్వయం సమృద్ధి సాధించాలన్న భారత లక్ష్యాన్ని సాకారం చేసుకోవడంలో ఆటోమోటివ్ డీలర్లు ప్రధాన పాత్ర పోషించగలరని ఆయన తెలిపారు. దేశ ఎకానమీలో కీలకంగా ఉంటున్న ఆటో రిటైల్ పరిశ్రమకు ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతునిస్తుందని గడ్కరీ హామీ ఇచ్చారు. పర్యావరణహిత మొబిలిటీ సొల్యూషన్స్ విషయంలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదిగేందుకు భారత్ కృషి చేస్తోందని ఆయన చెప్పారు.

హైదరాబాద్ మార్కెట్లోకి బ్రిగేడ్ బజ్‌వర్క్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రీమియం వర్క్‌స్పేస్ బ్రాండ్ బజ్‌వర్క్స్‌ను హైదరాబాద్‌లో కూడా ఆవిష్కరించినట్లు బ్రిగేడ్ గ్రూప్ తెలిపింది. 'ఆరో ఆర్బిట్'లో 25,000 చ.అ. విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఇందులో 416 డెస్కులు, మీటింగ్ రూమ్స్ మొదలైనవి ఉంటాయి. 2026 ఆర్థిక సంవత్సరం నాటికి 1 మిలియన్ చ.అ. మేర ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ జేఎండీ నిరూప శంకర్ తెలిపారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నైవ్యాప్తంగా సామర్థ్యాలను 10,000 సీట్లకు పెంచుకోనున్నట్లు చెప్పారు.

యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లపై ఆర్‌బీఐ కొరడా



ముంబై: యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లపై ఆర్‌బీఐ కొరడా ఝుళిపించింది. నియంత్రణపరమైన నిబంధనలు పాటించకపోవడంతో వీటిపై రూ.2.91 కోట్ల జరిమానా విధించింది. నిబంధనల ఉల్లంఘనలపై యాక్సిస్ బ్యాంక్‌పై రూ.1.91 కోట్ల జరిమానా విధించినట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. నిబంధనలకు విరుద్ధంగా రూ.1.60 లక్షల వరకు వ్యవసాయ రుణాలకు సంబంధించి యాక్సిస్ బ్యాంక్ హామీలను తీసుకున్నట్టు వివరించింది. డిపాజిట్లపై వడ్డీ రేటు, రికవరీ ఏజెంట్లకు సంబంధించి నిబంధనలను పాటించనందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌పై రూ.కోటి జరిమానా విధించింది.

బీవోపై ఎఫ్‌పీఐల వెనకడుగు

న్యూఢిల్లీ: అంతిమ లబ్ధిదారుల(బీవో) వెల్లడి నిబంధనలను వ్యతిరేకిస్తూ సెక్యూరిటీస్ అపిల్లేట్ ట్రిబ్యునల్(శాట్)ను ఆశ్రయించిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్(ఎఫ్‌పీఐ) సంస్థలు తాజాగా వెనక్కి తగ్గాయి. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ జారీ చేసిన బీవో నిబంధనల వెల్లడి గడువు ముగియనుండటంతో అత్యవసర ఉపశమనాన్ని కోరుతూ తొలుత శాట్‌కు ఫిర్యాదు చేశాయి. మారిషస్ ఎఫ్‌పీఐ సంస్థలు ఎల్‌టీఎస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, లోటస్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సెబీ కొత్తగా విడుదల చేసిన నిబంధనల అమలు వాయిదాను కోరుతూ దరఖాస్తు చేశాయి. అయితే ఎఫ్‌పీఐల తరఫు న్యాయవాదులు ఫిర్యాదులను ఉపసంహరించుకునేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ అంశాన్ని ఇప్పటికే కోర్టుకు విన్నవించుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిచాయి. గత ఐదు రోజులుగా ఎఫ్‌పీఐలు తమ పోర్ట్‌ఫోలియోలను విజయవంతంగా రీబ్యాలన్స్ చేసుకున్నట్లు తెలుస్తోంది. నిబంధనల పరిధిలోకి రాని హోల్డింగ్స్‌ను లిక్విడేట్ చేసుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.



అదానీ గ్రూప్‌పై 2023 జనవరిలో యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వెలువరించిన నివేదికలో ఈ రెండు ఎఫ్‌పీఐల పేర్లను ప్రస్తావించడం గమనార్హం!

ఏం జరిగిందంటే?

సెబీ బీవో నిబంధనల అమలులో మరింత గడువు కోసం ఎఫ్‌పీఐలు శాట్‌ను ఆశ్రయించాయి. హోల్డింగ్స్ విషయంలో యాజమాన్య హక్కుల పూర్తి వివరాలను వెల్లడించని ఎఫ్‌పీఐలకు సెబీ సెప్టెంబర్ 9 డెడ్‌లైన్‌గా ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే 2025 మార్చి వరకూ గడువు పెంపును కోరుతూ రెండు ఎఫ్‌పీఐ సంస్థలు శాట్‌కు దరఖాస్తు చేశాయి. 2023 ఆగస్టులో సెబీ బీవో నిబంధనలను జారీ చేసింది.

అదానీ ఎయిర్‌పోర్ట్స్ 'ఏవియో' డిజిటల్ ప్లాట్‌ఫాం



న్యూఢిల్లీ: అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ తాజాగా 'ఏవియో' డిజిటల్ ప్లాట్‌ఫాంను ఆవిష్కరించింది. విమానాశ్రయాల్లో ప్యాసింజర్ల ట్రాఫిక్, బ్యాగేజ్ ఫ్లో, గేట్ల దగ్గర పట్టే వెయిటింగ్ సమయం, కన్వేయర్ బెల్టుపై బ్యాగ్‌లు మొదలైన వివరాలను రియల్-టైమ్‌లో తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ (సీఐఎస్ఎఫ్), ఎయిర్‌లైన్స్, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, గ్రౌండ్ స్టాఫ్‌కి ఈ యాప్ యాక్సెస్ ఉంటుంది. ప్రయాణికుల రద్దీ, బ్యాగేజ్ ఫ్లోను పర్యవేక్షించేందుకు ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లు/మేనేజర్లు ఏవియోను ఉపయోగిస్తారు. విమానయాన రంగ సంస్థలు ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఈ ప్లాట్‌ఫాం సహాయకరంగా ఉండగలదని సంస్థ తెలిపింది. అదానీ గ్రూప్ సంస్థ అయిన అదానీ ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ దేశీయంగా ఏడు విమానాశ్రయాలను నిర్వహిస్తోంది.

లఘు, చిన్న పరిశ్రమలకు కేంద్రం బూస్ట్

మరో రూ.5 లక్షల కోట్లకు 'క్రెడిట్ గ్యారెంటీ'!



న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల కోసం క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ (సీజీటీఎంఎస్ఈ) ద్వారా ఇచ్చే క్రెడిట్ గ్యారెంటీలను వచ్చే రెండేళ్లలో మరో రూ. 5 లక్షల కోట్లకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అదనపు కార్యదర్శి, డెవలప్‌మెంట్ కమిషనర్ (లఘు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు) రజనీష్ ఈ విషయాన్ని తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం ప్రకారం, 22 సంవత్సరాల్లో క్రెడిట్ గ్యారెంటీలు రూ.2.6 లక్షల కోట్లు. అయితే గడచిన రెండేళ్లలో ఈ విలువ రూ. 4 లక్షల కోట్లకు పెరిగింది. వచ్చే రెండేళ్లలో మరో రూ.5 లక్షల కోట్లకు పెంచాలన్నది కేంద్రం లక్ష్యమని ఫిక్కీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. లఘు, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు సంస్థాగత రుణలను భారీగా అందించడానికి క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్‌ను సంబంధిత మంత్రిత్వశాఖ అలాగే సిడ్బీ (స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)లు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి.

నానో ఎరువులపై రూ.2,000 కోట్లు: ఇఫ్కో

న్యూఢిల్లీ: నానో లిక్విడ్ యూరియా, నానో లిక్విడ్ డీఏపీ కోసం 2017 నుంచి రూ.2,000 కోట్లు పెట్టుబడి చేసినట్టు ఎరువుల తయారీ దిగ్గజం ఇఫ్కో వెల్లడించింది. పరిశోధన, అభివృద్ధి, తయారీ కేంద్రాలు, బ్రాండింగ్, మార్కెటింగ్ కార్యకలాపాలకు ఈ మొత్తాన్ని ఖర్చు చేసినట్టు సంస్థ ఎండీ యు.ఎస్. అవస్తి తెలిపారు. 'వచ్చే రెండు మూడేళ్లలో ఈ ఉత్పాదనలను రైతులు పెద్ద ఎత్తున వినియోగిస్తారని ఆశిస్తున్నాం. నానో యూరియా, నానో డీఏపీలను ప్రోత్సహించేందుకు, సంప్రదాయ యూరియా, డీఏపీతోపాటు ఈ ఉత్పత్తులను ఎలా ఉపయోగించాలనే అంశంపై రైతుల్లో అవగాహన పెంచేందుకు ఏటా రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నాం. సంస్థకు ప్రస్తుతం ఏటా 16 కోట్ల బాటిళ్ల నానో లిక్విడ్ యూరియా, 7 కోట్ల బాటిళ్ల నానో లిక్విడ్ డీఏపీ తయారీ సామర్థ్యం ఉంది. స్థాపిత సామర్థ్యంలో 15 శాతమే వినియోగిస్తున్నాం. రెండు మూడేళ్లలో ఇది 80 శాతానికి చేరుకునే అవకాశం ఉంది. నానో ఎరువులు సరైన పద్ధతిలో ఉపయోగిస్తే పంట ఉత్పాదకతను 3-20 శాతం మెరుగుపరచడంలో సహాయపడతాయి. నేల ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది' అని అవస్తి పేర్కొన్నారు. 2021 జూన్‌లో ప్రపంచంలోనే మొట్టమొదటి నానో లిక్విడ్ యూరియాను ఇఫ్కో మార్కెట్లోకి తెచ్చింది. అలాగే 2023 ఏప్రిల్‌లో నానో డీఏపీని ప్రవేశపెట్టింది. 500 మిల్లీలీటర్ల నానో లిక్విడ్ యూరియా బాటిల్ దాదాపు రూ.240కి లభిస్తుంది. నానో లిక్విడ్ డీఏపీ బాటిల్‌కు రూ.600 ఉంది.



ఈక్విటీ ఫండ్స్ అదే జోరు



- ఆగస్టులో రూ.38,239 కోట్లు రాక
- థీమ్యాటిక్ ఫండ్స్‌కు ఆదరణ
- సిప్ రూపంలో రూ.23,547 కోట్లు

న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఆగస్టులోనూ తమ జోరు చూపించాయి. నికరంగా రూ.38,239 కోట్లను ఆకర్షించాయి. ముఖ్యంగా థీమ్యాటిక్ ఫండ్స్, కొత్త పథకాల (న్యూ ఫండ్ ఆఫర్లు/ఎన్ఎఫ్‌వోలు) రూపంలో ఎక్కువ పెట్టుబడులను సమీకరించాయి. ఈ ఏడాది జూలైలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి వచ్చిన రూ.37,113 కోట్లతో పోల్చి చూస్తే 3.3 శాతం మేర ఆగస్టులో వృద్ధి నమోదైంది. జూన్‌లో వచ్చిన రూ.40,608 కోట్ల పెట్టుబడులు ఇప్పటి వరకు నెలవారీ గరిష్ట రికార్డు కాగా, ఆగస్టులో పెట్టుబడులు రెండో గరిష్ట రికార్డుగా ఉన్నాయి. ఈ గణాంకాలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసింది. మొత్తం మీద మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ వ్యాప్తంగా అన్ని రకాల పథకాల్లోకి కలిపి ఆగస్టులో రూ.1.08 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జూలైలో ఇవి రూ.1.9 లక్షల కోట్లుగా ఉన్నాయి. దీంతో మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ జూలై చివరికి ఉన్న రూ.65 లక్షల కోట్ల నుంచి ఆగస్ట్ చివరికి రూ.66.7 లక్షల కోట్లకు చేరింది.

కొత్త గరిష్టానికి సిప్ పెట్టుబడులు

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా వచ్చే పెట్టుబడులు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిలో రూ.23,547 కోట్లుగా నమోదయ్యాయి. జూలైలో ఇవి రూ.23,332 కోట్లుగా ఉన్నాయి.

విభాగాల వారీగా పెట్టుబడులు..

- థీమ్యాటిక్ ఫండ్స్ (రంగాలు/ప్రత్యేక థీమ్‌లలో ఇన్వెస్ట్ చేసేవి) పథకాల్లోకి అత్యధికంగా రూ.18,117 కోట్లు వచ్చాయి. ఈ తరహా పథకాలు జూలైలో రూ.18,336 కోట్లు, జూన్‌లో రూ.22,352 కోట్ల చొప్పున ఆకర్షించడం గమనార్హం.
- ఆగస్టులో ఆరు కొత్త పథకాలు ప్రారంభం కాగా, అందులో ఐదు సెక్టోరల్/థీమ్యాటిక్ ఫండ్స్ ఉన్నాయి. ఇవి రూ.10,202 కోట్లను సమీకరించాయి.
- లార్జ్‌క్యాప్ పథకాల్లోకి రూ.2,637 కోట్లు వచ్చాయి. మిడ్ క్యాప్ పథకాలు రూ.3,055 కోట్లు, స్మాల్‌క్యాప్ ఫండ్స్ రూ.3,209 కోట్ల చొప్పున ఆకర్షించాయి. అన్ని రకాల పథకాల్లోకి పెట్టుబడుల రాక ఇన్వెస్టర్లలో మార్కెట్ల పట్ల ఉన్న సానుకూల ధోరణిని తెలియజేస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు.
- ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక రూ.3,513 కోట్లుగా ఉంది.
- కేవలం ఫోకస్డ్ ఫండ్స్, ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ నికరంగా పెట్టుబడులను కోల్పోయాయి.
- డెట్ పథకాల్లోకి నికరంగా రూ.45,169 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జూలైలో వచ్చిన రూ.1.2 లక్షల కోట్ల కంటే 62 శాతం తక్కువ.
- డెట్‌లో ఓవర్‌నైట్ ఫండ్స్ అత్యధికంగా రూ.15,106 కోట్లను ఆకర్షించాయి. ఆ తర్వాత లిక్విడ్ ఫండ్స్, మనీ మార్కెట్ ఫండ్స్ పట్ల ఇన్వెస్టర్లు మొగ్గు చూపించారు. మొత్తం పెట్టుబడుల్లో 86 శాతం ఈ మూడు విభాగాల్లోని పథకాల్లోకే వచ్చాయి.
- గోల్డ్ ఈటీఎఫ్‌లు రూ.1,611 కోట్లను ఆకర్షించాయి. జూలైలో వచ్చిన రూ.1,337 కోట్లతో పోల్చి చూస్తే 20 శాతానికి పైగా వృద్ధి కనిపిస్తోంది.
- మొత్తం ఫోలియోలు (ఇన్వెస్టర్ల పెట్టుబడి ఖాతాలు) జూలై చివరికి ఉన్న 19.84 కోట్ల నుంచి ఆగస్ట్ చివరికి 20 కోట్ల మార్క్‌ను అధిగమించాయి.

రింకూ, శ్రేయస్, సుందర్‌లపై దృష్టి

నేటి నుంచి దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ మ్యాచ్‌లు

- భారత్ ‘ఎ’తో ఆడనున్న భారత్ ‘డి’
- భారత్ ‘బి’తో భారత్ ‘సి’ పోరు
- ఉదయం గం. 9:30 నుంచి జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


శ్రేయస్


సుందర్


రింకూ సింగ్ సంజూ సామ్సన్

సాక్షి, అనంతపురం: దేశవాళీ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీలో నేడు రెండో దశ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. అనంతపురం వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌ల్లో భారత్ ‘ఎ’ జట్టుతో భారత్ ‘డి’... భారత్ ‘బి’ జట్టుతో భారత్ ‘సి’ తలపడనున్నాయి. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో భారత్ ‘బి’, ‘సి’ జట్లు విజయాలు సాధించాయి. ఈ నెల 19 నుంచి భారత్, బంగ్లాదేశ్ మధ్య తొలి టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో సర్ఫరాజ్ ఖాన్ మినహా టీమిండియా ప్లేయర్లెవరూ రెండో రౌండ్ దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో పాల్గొనడం లేదు. తొలి మ్యాచ్‌లో ఆడిన శుబ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురేల్, కుల్దీప్ యాదవ్, ఆకాశ్‌దీప్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, యశ్ దయాళ్, అక్షర్ పటేల్... తమతమ జట్లను వీడి టీమిండియాతో జట్టు కట్టారు. దీంతో భారత్ ‘సి’ జట్టులో మినహా మిగిలిన టీమ్‌లలో మార్పులు చోటు చేసుకున్నాయి. భారత ‘ఎ’ జట్టుకు మయాంక్ అగర్వాల్ సారథ్యం వహించనుండగా.. ‘బి’ టీమ్‌కు అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ‘సి’ టీమ్‌కు రుతురాజ్ గైక్వాడ్, ‘డి’ జట్టుకు శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహించనున్నారు. ప్రధాన ఆటగాళ్ల గైర్హాజరీలో దేశవాళీల్లో నిలకడ కొనసాగిస్తున్న యువ ఆటగాళ్లకు ఈ మ్యాచ్‌లు మంచి అవకాశం కానున్నాయి. రింకూ సింగ్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్, మయాంక్ అగర్వాల్, వాషింగ్టన్ సుందర్ వంటి వాళ్లు మెరుగైన ప్రదర్శన చేసి జాతీయ జట్టులో చోటు దక్కించుకోవాలని భావిస్తున్నారు. గత మ్యాచ్‌లో భారత్ ‘ఎ’ జట్టుకు సారథిగా వ్యవహరించిన శుబ్‌మన్ గిల్ అందుబాటులో లేకపోవడంతో మయాంక్‌కు జట్టు పగ్గాలు దక్కాయి. రెండేళ్ల క్రితం జాతీయ జట్టు తరఫున చివరి టెస్టు ఆడిన మయాంక్ తిరిగి సెలెక్టర్ల దృష్టిలో పడాలంటే భారీగా పరుగులు చేయాల్సిన అవసరముంది. బంగ్లాదేశ్‌తో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి టెస్టు కోసమే భారత జట్టును ఎంపిక చేయగా... దులీప్ ట్రోఫీలో మెరుగైన ప్రదర్శన చేస్తే బంగ్లాతో రెండో టెస్టు కోసం ప్రకటించనున్న జట్టులో చోటు దక్కించుకునే అవకాశం లేకపోలేదు. ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లండ్‌తో స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేసిన మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు కోసం ప్రకటించిన టీమిండియాలో సభ్యుడైన సర్ఫరాజ్... ఈ మ్యాచ్ అనంతరం నేరుగా చెన్నైలో జట్టుతో చేరనున్నాడు. భారత్ ‘బి’ జట్టు తరఫున బరిలోకి దిగనున్న సర్ఫరాజ్ ఖాన్... మరో మంచి ఇన్నింగ్స్‌తో రాణించి టీమిండియాలో చేరాలనుకుంటున్నాడు. ఇక గత మ్యాచ్‌లో భారీ సెంచరీతో చెలరేగిన సర్ఫరాజ్ సోదరుడు ముషీర్ ఖాన్ అదే జోరు కొనసాగించాలనుకుంటున్నాడు. అటు బ్యాట్‌తో ఇటు బంతితో సత్తాచాటగల స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ భారత్ ‘బి’ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఆకట్టుకోలేకపోయిన రజత్ పాటీదార్‌తో పాటు శ్రేయస్ అయ్యర్ తిరిగి సత్తాచాటి సెలెక్టర్ల దృష్టిలో పడాలని చూస్తున్నారు. గత మ్యాచ్ ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకోలేకపోయిన దేవదత్ పడిక్కల్, సంజూ సామ్సన్ భారత్ ‘డి’ జట్టు తరఫున ఈ మ్యాచ్‌లోనైనా అవకాశం దక్కించుకుంటారా చూడాలి. ఇక పేస్ బౌలర్లు ముఖేశ్ కుమార్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ సుదీర్ఘ టెస్టు సీజన్‌కు ముందు లయ అందుకునేందుకు ఇది చక్కటి అవకాశం. వచ్చే ఏడాది జరగనున్న ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు ముందు భారత్ మొత్తం 10 టెస్టులు ఆడనుండగా... పేస్ బౌలర్లకు విరివిగా అవకాశాలు వచ్చే చాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో దులీప్ ట్రోఫీలో రాణించిన వారిపై సెలెక్టర్ల దృష్టి ఉండనుంది. ఇక గత మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో సత్తాచాటిన లెఫ్టార్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ అదే జోరు కొనసాగించాలని చూస్తున్నాడు.

మనవాళ్లకు మంచి చాన్స్

దులీప్ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌ల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. భారత ‘డి’ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ గతంలోనే జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించినా... ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. దీంతో జట్టులో సుస్థిర స్థానం సంపాదించడంలో విఫలమయ్యాడు. వికెట్ల వెనక నైపుణ్యానికి కొదవలేకపోయినా... బ్యాటింగ్‌లో సత్తాచాటితేనే తిరిగి సెలెక్టర్ల దృష్టి పడనుంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మిడిలార్డర్ ఆటగాడు తిలక్ వర్మ... సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ టీమిండియా చోటు దక్కించుకోవాలని తహతహలాడుతున్నాడు. ఈ నేపథ్యంలో దులీప్ ట్రోఫీలో మెరుగైన ప్రదర్శన అతడి కెరీర్‌కు తోడ్పడనుంది. ఈ ఏడాది ఐపీఎల్లో ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డు దక్కించుకున్న పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి భారత్ ‘బి’ జట్టు తరఫున బరిలోకి దిగనుండగా... రికీ భుయ్ భారత్ ‘డి’ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. తొలి రౌండ్ మ్యాచ్‌కు ఎంపిక కాని 19 ఏళ్ల రషీద్, తిలక్ వర్మతో కలిసి భారత్ ‘ఎ’ జట్టుకు ఆడనున్నాడు.

దులీప్ ట్రోఫీలో తెలుగు రాష్ట్రాల ఆటగాళ్లు

- తిలక్ వర్మ (భారత్ ‘ఎ’)
- షేక్ రషీద్ (భారత్ ‘ఎ’)
- నితీశ్ కుమార్ రెడ్డి (భారత్ ‘బి’)
- రికీ భుయ్ (భారత్ ‘డి’)
- శ్రీకర్ భరత్ (భారత్ ‘డి’)




ప్రియమైన శ్రీజేశ్‌కు...

మాజీ గోల్‌కీపర్ సేవల్ని కొనియాడుతూ ప్రధాని లేఖ

న్యూఢిల్లీ: భారత హాకీ దిగ్గజం, మాజీ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేశ్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లేఖ రాశారు. అతని కెరీర్ సాఫల్యతలో ఎదురైన ఆటుపోట్లు... పడిన కష్టం... చిందించిన చెమటను కీర్తిస్తూ ఆ లేఖలో ప్రధాని ప్రశంసల వర్షం కురిపించారు. త్వరలో భారత జూనియర్ జట్టుకు కోచ్‌గా సరికొత్త ఇన్నింగ్స్ మొదలు పెట్టనున్న శ్రీజేశ్‌కు శుభాకాంక్షలు కూడా తెలిపారు. గోల్‌కీపర్‌గా విజయవంతమైనట్లే... కోచ్‌గానూ జూనియర్లను తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ‘ఆటలో నీ అంకితభావం, నిబద్ధత నాకు తెలుసు. ఇకపై కోచ్‌గానూ ఇదే పంథా కొనసాగిస్తావని ఆశిస్తున్నా. కోచ్ పాత్రలో జూనియర్ జట్టును ప్రభావవంతంగా, స్ఫూర్తిదాయకంగా మలుస్తావని విశ్వసిస్తున్నాను. సుదీర్ఘకాలం పాటు భారత హాకీకి సేవలందించిన నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా’నని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. కేవలం పతకాలు, ఘన విజయాలే కాదు... లెక్కలేనన్ని స్మృతులెన్నో అతని కెరీర్‌లో ఉన్నాయని ప్రధాని కొనియాడారు. అతనేంటో అతన్ని వరించిన అవార్డులు, పతకాలే తెలియజేస్తాయని ప్రశంసించారు. ప్రధాని లేఖ తన గుండెని తాకిందని శ్రీజేశ్ బదులిచ్చాడు. ‘హాకీనే నా జీవితం. అందుకే ఆట కోసమే ఇన్నాళ్లు శ్రమించాను. ఇకపై కూడా శ్రమిస్తాను. ప్రపంచ హాకీలో భారత్ బలీయమైన శక్తిగా అవతరించేందుకు నా వంతు కృషి చేస్తాను’ అని ఎక్స్‌లో పోస్ట్ చేశాడు.

పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు కాంస్యం గెలుపొందడంలో కృషి చేసిన శ్రీజేశ్ తన కెరీర్‌కు పతకంతో గుడ్‌బై చెప్పాడు. గోల్‌పోస్ట్ ముందు పెట్టని గోడలా నిలబడే శ్రీజేశ్ 15 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో రెండు ఆసియా క్రీడల స్వర్ణాలతో పాటు చాంపియన్స్ ట్రోఫీ రజత పతకాలు కూడా ఉన్నాయి.


బుర్జ్‌ఖలీఫాపై మహిళల టి20 ప్రపంచకప్ ప్రదర్శన

18 ఏళ్ల లోపు వారికి ఉచిత ప్రవేశం

మహిళల 20 ప్రపంచకప్

దుబాయ్: వచ్చే నెలలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల టి20 ప్రపంచకప్‌నకు 18 ఏళ్ల లోపు అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. ఆటకు మరింత ఆదరణ పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐసీసీ వెల్లడించింది. అక్టోబర్ 3 నుంచి 20 వరకు జరగనున్న మెగా టోర్నీలో మొత్తం 10 జట్లు పాల్గొననున్నాయి. ఈ టోర్నీకి కనీస టికెట్ ధర 5 దిర్హామ్‌లు (రూ. 115)గా నిర్ణయించినట్లు ఐసీసీ బుధవారం వెల్లడించింది. అలాగే 18 ఏళ్లలోపు ప్రేక్షకులకు ఉచితంగా ప్రవేశం కల్పించనుంది. ‘యూఏఈ అనేది భిన్నత్వానికి ప్రతీక. టి20 ప్రపంచకప్‌ను ఆస్వాదించేందుకు అన్ని దేశాల అభిమానులు ఇక్కడికి వస్తారు. అందుకే ప్రవేశ రుసుము అతి తక్కువగా నిర్ణయించాం. మహిళల క్రికెట్‌కు మరింత చేయూత నిచ్చేందుకు 18 సంవత్సరాల లోపు వారిని ఉచితంగా మైదానంలోకి అనుమతించనున్నాం’ అని ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అలార్ డైస్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మహిళల టి20 ప్రపంచకప్‌నకు బంగ్లాదేశ్ ఆతిథ్యమివ్వాల్సి ఉండగా... అక్కడ రాజకీయ అనిశ్చితి నెలకొనడంతో మెగా టోర్నీని యూఏఈకి మార్చారు. వరల్డ్‌కప్‌నకు యూఏఈ ఆతిథ్యమిస్తున్నా... నిర్వహణ బాధ్యతలు మాత్రం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డే నిర్వర్తిస్తోంది.

వన్డే ప్రపంచకప్‌తో భారత్‌కు రూ.11, 637 కోట్ల ఆదాయం



దుబాయ్: గతేడాది నిర్వహించిన వన్డే ప్రపంచకప్ భారత దేశానికి గణనీయమైన ఆర్థిక లబ్ధిని చేకూర్చిందని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మెగా ఈవెంట్ ఆర్థికంగా పెద్ద ప్రభావమే చూపిందని, విదేశీ పర్యాటకులతో భారత్‌లోని ఆతిథ్య రంగం పెద్ద ఎత్తున లాభపడిందని అందులో వివరించింది. గత అక్టోబర్, నవంబర్‌లో జరిగిన ఈ మెగా టోర్నీలో భారత్ రన్నరప్‌గా నిలిచింది. ‘ఐసీసీ పురుషుల వన్డే ప్రపంచకప్ క్రికెట్‌కు ఉన్న ఆర్థిక శక్తి ఎలాంటిదో నిరూపించింది. ఆతిథ్య భారత్ 1.39 బిలియన్ అమెరికా డాలర్ల (రూ.11, 637 కోట్లు) ఆదాయం ఆర్జించేలా చేసింది. ఈ వరల్డ్‌కప్‌ను చూసేందుకు ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు భారత్‌కు పోటెత్తారు. ఇలా పర్యాటకుల రాకతో ఆతిథ్య నగరాలైన ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో హోటల్స్, భోజనం, వసతి, రవాణ, ఆహార పదార్థాలు, పానీయాల విక్రయంతో కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది’ అని ఐసీసీ ఆ నివేదికలో పేర్కొంది. టోర్నీ జరిగింత కాలం కొనుగోలు శక్తి పెరిగిందని, టికెట్ల రూపంలోనూ భారీ ఆదాయం వచ్చిందని, ఏకంగా 12.50 లక్షల మంది ప్రేక్షకులు క్రికెట్ మ్యాచ్‌ల్ని చూసేందుకు ఎగబడ్డారని అందులో తెలిపింది. ఐసీసీ ప్రపంచ కప్‌ల చరిత్రలోనే ఇది ఘనసీయమైన వృద్ధని, సగటున 75 శాతం ప్రేక్షకుల హాజరు నమోదు కావడం ఇదే తొలిసారని ఐసీసీ తెలిపింది. పర్యాటకులు, దేశీ ప్రేక్షకులకు సేవలందించడం ద్వారా 48 వేల మంది ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ ఉద్యోగాలతో ఉపాధి పొందారని ఐసీసీ వివరించింది.



రష్మిక శుభారంభం

పెర్త్ (ఆస్ట్రేలియా): అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 టోర్నీలో భారత మూడో ర్యాంకర్, హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 374వ ర్యాంకర్ రష్మిక 6–2, 6–3తో క్వాలిఫయర్ స్టెఫానీ వెబ్ (ఆస్ట్రేలియా)పై గెలిచింది. 84 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక రెండు ఏస్‌లు సంధించింది. తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. డబుల్స్ విభాగంలో మాత్రం రష్మికకు నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లో రష్మిక (భారత్)–హరూనా అరకావా (జపాన్) జోడీ 1–6, 6–7 (4/7)తో రెండో సీడ్ తాలా గిబ్సన్–మాడిసన్ ఇంగ్లిస్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది. ఇదే టోర్నీలో ఆడుతున్న భారత మాజీ నంబర్‌వన్ అంకిత రైనా సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. సింగిల్స్‌లో అంకిత 3–6, 2–6తో అయానో షిమిజు (జపాన్) చేతిలో... డబుల్స్‌లో అంకిత–నైకిత బైన్స్ (బ్రిటన్) ద్వయం 5–7, 4–6తో సయాక ఇషి–అయో ఇటో (జపాన్) జోడీ చేతిలో ఓటమి పాలైంది.

‘సెంచరీ’ మ్యాచ్‌లో హ్యారీ కేన్ ‘డబుల్’

రెండు గోల్స్‌తో మెరిసిన ఇంగ్లండ్ కెప్టెన్



లండన్: ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ హ్యారీ కేన్ తన 100వ అంతర్జాతీయ మ్యాచ్‌లో రెండు గోల్స్‌తో మెరిశాడు. యూరోపియన్ నేషన్స్ లీగ్‌లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక ఫిన్‌లాండ్‌తో జరిగిన పోరులో హ్యారీ కేన్ (57వ, 76వ నిమిషాల్లో) విజృంభించడంతో ఇంగ్లండ్ జట్టు 2–0తో గెలిచింది. మ్యాచ్‌కు ముందు కేన్‌కు బంగారు ట్రోఫీ బహుకరించగా... ఈ కార్యక్రమంలో హ్యారీ కుటుంబ సభ్యులు సందడి చేశారు. ఇంగ్లండ్ తరఫున వందో అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన పదో ప్లేయర్‌గా నిలిచిన కేన్... ఫిన్‌లాండ్‌తో పోరులో బంగారు బూట్లతో బరిలోకి దిగాడు. ద్వితీయార్థంలో తన మార్క్ స్టయిల్‌తో ప్రత్యర్థులను బోల్తా కొట్టిస్తూ తొలి గోల్ చేసిన కేన్... కాసేపటికే యువ ఆటగాడు నోనీ మాడ్యూకే ఇచ్చిన పాస్‌ను చాకచక్యంగా గోల్ పోస్ట్‌లోకి నెట్టి ఇంగ్లండ్‌కు తిరుగులేని ఆధిపత్యం అందించాడు. దీంతో మైదానం మొత్తం హోరెత్తిపోగా... మైలురాయి మ్యాచ్‌లో డబుల్ గోల్స్‌తో మెరిసిన కేన్‌కు అభిమానులు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. గ్రూప్ ‘ఎ’లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన ఇంగ్లండ్ 9 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది.

అర్జెంటీనాకు చుక్కెదురు

- ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ మ్యాచ్‌లో కొలంబియా సంచలనం

బొగోటా (కొలంబియా): ప్రస్తుత ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా జట్టుకు 2026 ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో షాక్ తగిలింది. 2022లో విశ్వవిజేతగా నిలిచిన అర్జెంటీనా... దక్షిణ అమెరికా వరల్డ్‌కప్ క్వాలిఫయర్‌లో కొలంబియా చేతిలో ఓడింది. బుధవారం జరిగిన పోరులో కొలంబియా 2–1 గోల్స్ తేడాతో అర్జెంటీనాపై గెలిచింది. కొలంబియా తరఫున యెర్సన్ మస్క్యూరా (25వ నిమిషంలో), జేమ్స్ రోడ్రిగ్జ్ (60వ నిమిషంలో) చెరో గోల్ చేయగా... అర్జెంటీనా తరఫున నికోలస్ (48వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. అర్జెంటీనా స్టార్ స్ట్రయికర్ మెస్సీ గాయంతో ఈ మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు. ఈ అర్హత టోర్నీలో ఎనిమిది మ్యాచ్‌లు పూర్తయ్యేసరికి అర్జెంటీనా 18 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దక్షిణ అమెరికా క్వాలిఫయింగ్ టోర్నీలో తొలి 6 స్థానాల్లో నిలిచిన జట్లు 2026 ప్రపంచకప్‌నకు అర్హత సాధించనున్నాయి.





జర్మనీలో డ్రెస్డెన్ నగరంలో ఎల్బ్ నదిపై కరోలా వంతెన ఇది. వంతెనలో ఒక భాగం బుధవారం ఇలా ఉన్నపళంగా నదిలోకి కుప్పకూలింది

ఇదిగో కూజా..!

ఇదేమిటో గుర్తుపట్టారా? దాదాపు మూడు వారాల క్రితం ఇజ్రాయెల్‌లోని హెక్ట్ మ్యూజియంలో ఏరియల్ గెలర్ అనే నాలుగేళ్ల చిన్నారి పొరపాటున తాకడంతో కింద పడి ముక్కలైపోయిన 3,500 ఏళ్ల నాటి అరుదైన కూజా ఇది. పట్టి చూస్తే తప్ప పగిలిన ఆనవాళ్లు కనిపించకుండా రిస్టొరేషన్ నిపుణుడు రో షెఫర్ సారథ్యంలోని బృందం దాన్ని అత్యంత నైపుణ్యంతో ఇలా తిరిగి అతికించింది. బుధవారం నుంచి కూజాను మ్యూజియంలో మళ్లీ ప్రదర్శనకు ఉంచారు. ఇంతటి అరుదైన కూజా పగిలిపోయినా మ్యూజియం సిబ్బంది హుందాగా స్పందించిన తీరు అందరి మనసులూ గెలుచుకుంది. బాలున్ని గానీ, అతని తల్లిదండ్రులను గానీ వాళ్లు ఏమాత్రమూ నిందించలేదు. పైగా 'పిల్లలన్నాక ఇలా చేస్తుంటారు, మరేం పర్లే'దంటూ ఊరడించారు. జరిమానా చెల్లిస్తామన్నా అలాంటిదేమీ అక్కర్లేదన్నారు. మ్యూజియం చీఫ్ దగ్గరుండి మరీ వారికి మ్యూజియం అంతా తిప్పి చూపించారు. గిల్టీ ఫీలింగ్ నడుమ సరిగా చూశారో లేదోనని పది రోజులు పోయాక మరోసారి మ్యూజియం సందర్శనకు ఆహ్వానించారు. ఆ సందర్భంగా చిన్నారి గెలర్ ఒక మట్టి కూజా తీసుకెళ్లి బహూకరించడంతో సిబ్బంది తెగ ఆనందపడిపోయారు. బాలునితో చాలాసేపు గడపడమే గాక పగిలిన కూజాలను ఎలా అతికిస్తారో ప్రత్యక్షంగా చూపించారు. ''పురాతత్వ వస్తువులను తాకి చూస్తే వాటిపై అనురక్తి కలుగుతుంది. వాటిని తాకి చూస్తే చరిత్ర, పురాతత్వ శాస్త్రాల పట్ల పిల్లల లేత మనసుల్లో గొప్ప ఆసక్తి పుట్టవచ్చు. ఎవరికి తెలుసు?! అందుకే అవి సందర్శకులకు చేతికందే సమీపంలోనే ఉండాలి తప్ప అద్దాల అరల్లో కాదన్నదే ఇప్పటికీ మా అభిప్రాయం'' అని మ్యూజియం చీఫ్ చెప్పుకొచ్చారు. అందుకు తగ్గట్టుగానే అతికించిన కూజాను రక్షణ వలయం వంటివేవీ లేకుండా తాజాగా మళ్లీ సందర్శకులకు అందుబాటులోనే ఉంచడం విశేషం!



సెక్షన్ 498ఏ.. అత్యంత దుర్వినియోగ చట్టం

వివాహ వివాదం కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: గృహహింస కేసులో అత్యంత కీలకమైన ఐపీసీ సెక్షన్ 498ఏ ఒక అత్యంత దుర్వినియోగం అవుతున్న చట్టంగా కనిపిస్తోందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ప్రశాంత్ మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం ముందుకు బుధవారం ఓ వివాహ వివాద కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయి ఐపీసీ సెక్షన్ 498ఏపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి అంశాల్లో స్వేచ్ఛను పొందడం చాలా అవసరమని పేర్కొన్నారు. ఓ వ్యక్తి వివాహం చేసుకొని ఒక రోజు కూడా భార్యతో కలిసి జీవించకుండా విడిపోయినా భార్యకు రూ.50 లక్షలు భరణంగా చెల్లించిన ఘటన నాగ్‌పూర్‌లో తనకు ఎదురైందని పేర్కొన్నారు. గృహహింస సెక్షన్ 498ఏ అనేది అత్యంత దుర్వినియోగం అవుతున్న చట్టమని బహిరంగంగా చెప్పగలనని అయితే, తోటి న్యాయమూర్తులు దీన్ని అంగీకరించకపోవచ్చని జస్టిస్ గవాయి వ్యాఖ్యానించారు.

పాక్‌లో భూకంపం.. వణికిన ఉత్తరాది

ఢిల్లీ, రాజస్తాన్, పంజాబ్, కశ్మీర్‌లో ప్రకంపనలు

సాక్షి, న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లో సంభవించిన భూకంపం ధాటికి ఢిల్లీలో ప్రకంపనలొచ్చాయి. పాక్ కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.28 గంటలకు భూకంపం వచ్చిందని, భూకంప కేంద్రాన్ని అక్కడి పంజాబ్ ప్రావిన్స్‌లోని డేరా ఘాజీఖాన్ ప్రాంతంలో 10 కి.మీ.ల లోతులో గుర్తించామని పాక్ వాతావరణ శాఖ పేర్కొంది. అయితే ప్రాణ, ఆస్తి నష్టాలపై ఇంకా ఎలాంటి సమాచారం అందలేదు. రిక్టర్ స్కేలుపై 5.7 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీని ప్రభావం భారత్‌లోని ఉత్తరాది రాష్ట్రాలతో పాటు రాజస్తాన్, పంజాబ్, జమ్మూ కశ్మీర్‌లపై కనిపించింది. ఢిల్లీ ఎన్సీఆర్, ఇతర ప్రాంతాల్లో స్వల్పంగా భూమి కంపించడంతో స్థానికులు భయంతో బయటకు పరుగులు తీశారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ముష్కరుల హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని ఉదంపూర్ జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు హతమయ్యారు. ఉదంపూర్‌లోని బసంత్‌ఘర్‌లో భద్రతా బలగాలు చేపట్టిన ఏరివేత కార్యక్రమంలో వీరిద్దరినీ మట్టుబెట్టారు. సంఘటనా స్థలంలో పెద్ద మొత్తంలో మందుగుండు సామాగ్రి లభ్యమయ్యాయి. ఖాందారా ఎగువప్రాంతంలో మరో తీవ్రవాది చిక్కుకొని ఉన్నట్లు భావిస్తున్నారు. అతన్ని మట్టుబెట్టడానికి అదనపు బలగాలను రప్పించి కూంబింగ్‌ను ముమ్మరం చేశారు.

బాలీవుడ్ నటి మలైకా అరోరా సవతి తండ్రి ఆత్మహత్య!

ముంబై: ప్రముఖ మోడల్, బాలీవుడ్ నటి మలైకా అరోరా సవతి తండ్రి అనిల్ మెహతా ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ముంబైలోని బాంద్రాలో ఆరు అంతస్తుల భవనం ఆయన కిందకు దూకారని పోలీసులు చెప్పారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు వెల్లడించారు. అనిల్ ఆత్మహత్యకు పాల్పడలేదని, ప్రమాదవశాత్తూ భవనం పైనుంచి పడిపోయి మరణించారని మలైకా సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. అనిల్ మరణించిన సంగతి తెలుసుకున్న మలైకా మాజీ భర్త అర్బాజ్ ఖాన్, అర్బాజ్ తల్లిదండ్రులు సలీం ఖాన్, సల్మా ఖాన్ తదితరులు మలైకా ఇంటికి చేరుకున్నారు.

గాజాలో ఐరాస స్కూల్‌పై ఇజ్రాయెల్ దాడి

గాజాస్ట్రిప్: గాజాలో ఇజ్రాయెల్ సైన్యం మరోసారి భీకరదాడికి దిగింది. సెంట్రల్ గాజాలోని ఐక్యరాజ్యసమితి స్కూల్‌పై వైమానిక దాడికి పాల్పడింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు, ఒక మహిళ సహా మొత్తం 14 మంది మృతిచెందినట్లు అధికార వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఈ పాఠశాలలో పాలస్తీనా శరణార్థులు ఆశ్రయం పొందుతున్నారు. ఇదే పాఠశాలలో హమాస్ మిలిటెంట్లు స్థావరం ఏర్పాటు చేసుకున్నారని, తమపై దాడికి కుట్ర పన్నారని, అందుకే తాము ఎదురుదాడికి దిగామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా 90 శాతానికిపైగా పాఠశాలలు ధ్వంసమయ్యాయి.

నీరవ్ మోదీ 30 కోట్ల ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ: పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి చెందిన రూ.29.75 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ బుధవారం వెల్లడించింది. బ్యాంక్ డిపాజిట్లు, భవనాలు, ప్లాట్ల రూపంలో ఉన్న ఆస్తులను అటాచ్ చేసినట్లు తెలిపింది. రూ. 16,700 కోట్ల రుణాలు తీసుకొని పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసిన కేసులో ఈడీ నీరవ్‌పై దర్యాప్తు చేస్తోంది. విదేశాల్లోని నీరవ్‌కు చెందిన రూ.2,596 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. బ్రిటన్ జైలులో ఉన్న నీరవ్ తనను భారత్‌కు అప్పగించకూడదని న్యాయపోరాటం చేసి ఓడిపోయాడు. అప్పగింత సంబంధ చట్టబద్ధమైన ప్రక్రియ లండన్‌లో పురోగతిలో ఉంది.

'మోదీ' ఘటనలో నలుగురికి శిక్ష తగ్గింపు

మరణశిక్ష నుంచి 30 ఏళ్ల జైలుశిక్షగా మార్చిన పట్నా హైకోర్టు

పట్నా: బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోదీ 2013లో పట్నాలో నిర్వహించిన తొలి సభలో పేలుళ్లకు పాల్పడ్డ కేసులో నలుగురి మరణశిక్షను పట్నా హైకోర్టు 30 ఏళ్ల జైలుశిక్షగా మార్చింది. అక్టోబరు 27, 2013లో గాంధీ మైదాన్‌లో జరిగిన సభలో నరేంద్ర మోదీ ప్రసంగిస్తుండగా తక్కువ తీవ్రత కలిగిన వరుస పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఫలితంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో నలుగురికి ఉరిశిక్ష, ఇద్దరికి జీవితఖైదు, ఇద్దరికి పదేళ్ల జైలుశిక్ష, ఒకరికి ఏడేళ్ల జైలుశిక్షకు ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు విధించింది. మరణశిక్ష పడ్డ ఇంతియాజ్ ఆలం, హైదర్ అలీ, నుమన్ అన్సారీ, ముజీబుల్లా అన్సారీలకు 30 ఏళ్ల జైలుశిక్ష సరిపోతుందని ధర్మాసనం బుధవారం తీర్పునిచ్చింది.

'ఖైదీ' సైనికులు

రష్యాతో యుద్ధానికి పంపుతున్న ఉక్రెయిన్.. సైనికుల కొరత నేపథ్యంలో వినూత్న నిర్ణయం

వాళ్లంతా కొన్ని నెలల క్రితం దాకా ఖైదీలు. పలు నేరాలకు శిక్షను అనుభవిస్తున్న వారు. కానీ ఇప్పుడు మాత్రం దేశ రక్షణ కోసం ప్రాణాలు పణంగా పెట్టి మరీ పోరాడుతున్న సైనిక వీరులు! రష్యాతో రెండేళ్లకు పైగా సాగుతున్న యుద్ధంలో నానాటికీ పెరుగుతున్న సైనికుల కొరతను అధిగమించేందుకు ఉక్రెయిన్ తీసుకున్న వినూత్న నిర్ణయం వారినిలా హీరోలను చేసింది. ఎంతోమంది ఖైదీలు పాత జీవితానికి ముగింపు పలికి సైనికులుగా కొత్త జీవితం ప్రారంభించారు. ఫ్రంట్ లైన్‌లో పోరాడుతూ, కందకాలు తవ్వడం వంటి సహాయక పనులు చేస్తూ యుద్ధభూమిలో దేశం కోసం చెమటోడుస్తున్నారు.

రష్యాతో రెండున్నరేళ్ల యుద్ధం ఉక్రెయిన్‌ను సైనికంగా చాలా బలహీనపరిచింది. ఈ లోటును భర్తీ చేసుకుని రష్యా సైన్యాన్ని దీటుగా ఎదుర్కోవడానికి ఖైదీల వైపు మొగ్గు చూపింది. ఇందుకోసం ఉక్రెయిన్ కొత్త చట్టం చేసింది. దాని ప్రకారం వాళ్లను యుద్ధంలో సైనికులుగా ఉపయోగించుకుంటారు. అందుకు ప్రతిగా యుద్ధం ముగిశాక వారందరినీ విడుదల చేస్తారు. అంతేకాదు, వారిపై ఎలాంటి క్రిమినల్ రికార్డూ ఉండబోదు! దీనికి తోడు ఫ్రంట్‌లైన్లో గడిపే సమయాన్ని బట్టి నెలకు 500 నుంచి 4,000 డాలర్ల దాకా వేతనం కూడా అందుతుంది!! అయితే శారీరక, మానసిక పరీక్షలు చేసి, కనీసం మూడేళ్లు, అంతకు మించి శిక్ష మిగిలి ఉండి, 57 ఏళ్ల లోపున్న ఖైదీలను మాత్రమే ఎంచుకున్నారు. ఈ లెక్కన 27,000 మంది ఖైదీలు పథకానికి అర్హులని ఉక్రెయిన్ న్యాయ శాఖ తేల్చింది. కనీసం 20,000 మంది ఖైదీలన్నా సైనికులుగా మారతారని అంచనా వేయగా ఇప్పటికే 5,764 మంది ముందుకొచ్చారు. వారిలో 4,650 మంది ఖైదీలు సైనికులుగా అవతారమెత్తారు. ఈ 'ఖైదీ సైనికు'ల్లో 31 మంది మహిళలున్నారు! 21 రోజుల శిక్షణ తర్వాత వీరు విధుల్లో చేరారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

గట్టి రూల్సే

ఖైదీలను ఇలా సైన్యంలోకి తీసుకునేందుకు కఠినమైన నిబంధనలే ఉన్నాయి. హత్య, అత్యాచారం, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల నేరాలు, దేశద్రోహం, ఇతర తీవ్ర నేరాలకు పాల్పడిన వారికి పథకం వర్తించబోదు. నేరాలకు పాల్పడిన ఎంపీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా అనర్హులే. అయితే హత్యకు పాల్పడిన ఖైదీలను తమతో చేర్చుకునేందుకు అనుమతివ్వాలని ష్క్వాల్ బెటాలియన్ కోరుతోంది. ఫ్రంట్ లైన్‌లో అవసరమైన నైపుణ్యాలు వారికి బాగా ఉంటాయని వాదిస్తోంది. కొన్ని కేసుల్లో డ్రగ్స్ నేరాలకు పాల్పడ్డ వారినీ తీసుకుంటున్నారు.

జైలరే వారి కమాండర్!

తూర్పు ఉక్రెయిన్‌లోని పోక్రోవ్స్క్‌లో 59 బ్రిగేడ్‌లో 15 మందితో కూడిన పదాతి దళ సిబ్బంది విభాగానికి ఓ గమ్మత్తైన ప్రత్యేకత ఉంది. బ్రిగేడ్ కమాండర్ ఒలెగ్జాండర్ వాళ్లకు కొత్త కాదు. ఆయన గతంలో జైలు గార్డుగా చేశారు. 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలవగానే సైనిక కమాండర్‌గా మారారు. ఇప్పుడు అదే జైల్లోని ఖైదీలు వచ్చి ఈ బ్రిగేడ్‌లో సైనికులుగా చేరారు. ఆయన కిందే పని చేస్తున్నారు! ''యుద్ధభూమిలో వారు నన్ను మాజీ జైలు గార్డుగా కాక అన్నదమ్ములుగా, కమాండర్‌గా చూస్తారు. అంతా ఒకే కుటుంబంలా జీవిస్తాం. వీరికి తండ్రి, తల్లి, ఫిలాసఫర్... ఇలా ప్రతీదీ నేనే'' అంటారాయన. సదరు జైలు నుంచి మరో పాతిక మంది దాకా ఈ బ్రిగేడ్‌లో చేరే అవకాశముందట.

మట్టి రుణం తీర్చుకునే చాన్స్

జైల్లో మగ్గడానికి బదులుగా సైనికునిగా దేశానికి సేవ చేసే అవకాశం దక్కడం గర్వంగా ఉందని 41 ఏళ్ల విటాలీ అంటున్నాడు. అతనిది డ్రగ్ బానిసగా మారి నేరాలకు పాల్పడ్డ నేపథ్యం. నాలుగు నేరాల్లో పదేళ్ల శిక్ష అనుభవించాడు. ''మా ఏరియాలో అందరు కుర్రాళ్లలా నేనూ బందిపోట్ల సావాసం నడుమ పెరిగాను. ఇప్పటిదాకా గడిపిన జీవితంలో చెప్పుకోవడానికంటూ ఏమీ లేదు. అలాంటి నాకు సైన్యంలో చేరి దేశం రుణం తీర్చుకునే గొప్ప అవకాశం దక్కింది. ఇలాగైనా మాతృభూమికి ఉపయోగపడుతున్నాననే తృప్తి ఉంది. కానీ సైనిక జీవితం ఇంత కష్టంగా ఉంటుందని మాత్రం అనుకోలేదు. కాకపోతే బాగా సరదాగా కూడా ఉంది'' అని చెప్పుకొచ్చాడు.



శిక్షణ పొందుతున్న ఖైదీ సైనికులు

మదర్సాల్లో బాలల హక్కుల ఉల్లంఘన

- సుప్రీంకోర్టులో ఎన్సీపీసీఆర్ అఫిడవిట్

న్యూఢిల్లీ: మదర్సాల్లో విద్యార్థులకు సరైన విద్య బోధించడం లేదని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్సీపీసీఆర్) ఆందోళన వ్యక్తం చేసింది. చాలావరకు మదర్సాలు చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని, అక్కడి పాఠ్యపుస్తకాల్లో అభ్యంతకర అంశాలు కనిపిస్తున్నాయని పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టులో తాజాగా సమగ్ర అఫిడవిట్ సమర్పించింది. నాణ్యమైన, సమగ్రమైన విద్య పొందడం బాలల ప్రాథమిక హక్కు కాగా, ఆ హక్కు మదర్సాల్లో ఉల్లంఘనకు గురవుతోందని ఆక్షేపించింది. విద్యాహక్కు చట్టం-2009 సైతం ఉల్లంఘనకు గురవుతున్నట్లు తెలియజేసింది. మదర్సాల్లో తగిన విద్యా బోధన జరగకపోగా, మరోవైపు ఆరోగ్యకరమైన వాతావరణం, జీవితంలో పైకి ఎదిగే అవకాశాలు కూడా కనిపించడం లేదని అఫిడవిట్‌లో స్పష్టంచేసింది. బిహార్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో ముస్లిమేతరులను సైతం చేర్చుకొని, ఇస్లామిక్ మత విద్య బోధిస్తున్నారని తప్పుపట్టింది. ఇలా చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 28(3)కు విరుద్ధమేనని తేల్చిచెప్పింది. ''మదర్సాల్లో బోధిస్తున్న విద్య పిల్లలకు పూర్తిగా ఉపయోగపడేది కాదు. అక్కడ సరైన పాఠ్యప్రణాళిక లేదు. విద్యాహక్కు చట్టం సెక్షన్ 29లో పేర్కొన్న మూల్యాంకన విధానాలు అమలు కావడం లేదు. అర్హత లేదని ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. నిధుల విషయంలోనూ పారదర్శకత కనిపించడం లేదు. క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. విద్యాహక్కు చట్టం నిర్దేశించిన ప్రమాణాలను లెక్కచేయకుండా చాలావరకు మదర్సాలు సొంతంగానే ఉపాధ్యాయులను నియమించుకుంటున్నాయి. వారికి తగిన విద్యార్హతలే ఉండడం లేదు. మదర్సాల్లో సంప్రదాయ విధానాల్లో ఖురాన్‌తోపాటు ఇతర మత గ్రంథాలు బోధిస్తున్నారు. ఇదంతా అసంఘటితమైన, అసంబద్ధమైన విద్యా వ్యవస్థగా రూపుదిద్దుకుంటోంది. పాఠ్యాంశాలు అభ్యంతకరంగా ఉంటున్నాయి. అత్యున్నత మతం ఇస్లాం మాత్రమే అని పిల్లల మెదళ్లలోకి ఎక్కిస్తున్నారు'' అని పేర్కొంది.

హెజ్‌బొల్లా స్పెషల్ ఫోర్స్ కమాండర్ హతం

బీరుట్: లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్ మృతి చెందారు. పశ్చిమ బెకా జిల్లాలోని ఖరౌన్ గ్రామంపై మంగళవారం జరిపిన దాడిలో హెజ్‌బొల్లా వారి 'రద్వాన్ ఫోర్స్' కమాండర్ మొహమ్మద్ ఖాసిం అల్-షాయెర్ హతమైనట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం(ఐడీఎఫ్) ప్రకటించింది. ఖాసిం మృతి వార్త తెల్సి హెజ్‌బొల్లా రెచ్చిపోయింది. ఉత్తర ఇజ్రాయెల్‌లోని రెండు ప్రాంతాలపై డజన్ల కొద్దీ కత్యూషా రాకెట్లు, డ్రోన్లను ప్రయోగించి చేసింది. ఈ దాడిలో 12 మంది గాయపడ్డారని లెబనాన్ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ తెలిపింది. అయితే హెజ్‌బొల్లా చేసిన దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, కొన్ని క్షిపణులను అడ్డుకున్నామని, మరికొన్ని బహిరంగ ప్రదేశంలో పడ్డాయని ఇజ్రాయెల్ ఆ తర్వాత వెల్లడించింది.

అంతులేని విషాదం

- కేరళ వరదల్లో 9 మంది కుటుంబీకులు మృతి
- తాజాగా రోడ్డు ప్రమాదంలో కాబోయే భర్త
- కేరళ యువతి దైన్యం

వయనాడ్: కేరళ యువతి శృతికి అంతులేని వ్యథ మిగిలింది. వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన ప్రకృతివిలయంలో శృతి కుటుంబం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. చూరల్‌మల, ముండక్కాయ్ గ్రామాల్లో జూలై 30న సంభవించిన విలయంలో ఏకంగా 9 మంది కుటుంబీకులు మృత్యువాతపడ్డారు. తల్లిదండ్రులు, చెల్లెలు మరణించారు. కొజికోడ్‌లో ఒక ఆసుపత్రిలో పనిచేసే 24 ఏళ్ల శృతికి ఈ మహావిషాదంలో అండగా నిలబడి నేనున్నానని ధైర్యం చెప్పారు 27 ఏళ్ల జెన్సన్. పదేళ్లుగా వీరు ఒకరికొకరు పరిచయం. ఈ ఏడాది జూన్ 2న నిశ్చితార్థం చేసుకున్నారు. తన కుటుంబీలను ఖననం చేసి పుథుమల స్మశానవాటికను ఆగస్టు 29న సందర్శించిన ఈ జంట జీవితాంతం కలిసి ఉంటామని బాసలు చేసుకున్నారు. ఇంతలోనే మరో విషాదం. జెన్సన్ ప్రయాణిస్తున్న కారు మంగళవారం ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిన జెన్సన్ బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు.

కాంగ్రెస్‌ది రిజర్వేషన్ల వ్యతిరేక వైఖరి: అమిత్ షా

సాక్షి, న్యూఢిల్లీ: అమెరికా పర్యటన వేళ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బీజేపీ, ఆర్‌ఎస్ఎస్‌లనుద్దేశిస్తూ చేసిన ప్రసంగాలపై బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తీవ్రంగా మండిపడ్డారు. పారదర్శక పరిస్థితుల్లో భారత్‌లో రిజర్వేషన్లు తీసేయొచ్చని రాహుల్ వ్యాఖ్యానించడం తెల్సిందే. '' మతం, ప్రాంతం, భాషల మధ్య చిచ్చు పెట్టేలా కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోంది. రిజర్వేషన్ల అంశాన్ని తెరమీదకు తెచ్చి కాంగ్రెస్ తమ రిజర్వేషన్ల వ్యతిరేక వైఖరిని మరోసారి బయటపెట్టుకుంది. జాతి వ్యతిరేక శక్తులతో అంటకాగడం కాంగ్రెస్, రాహుల్ గాంధీలకు అలవాటుగా మారింది. దేశాన్ని విభజించేందుకు కుట్ర పన్నుతున్న శక్తులకు రాహుల్ బాసటగా నిలుస్తున్నారు. జాతీయ భద్రతపై, సున్నిత అంశాలపై మాట్లాడుతూ రాహుల్ ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నారు' అని అన్నారు.

మతమార్పిడి కేసులో 12 మందికి జీవితఖైదు

లక్నో: చట్టవిరుద్ధంగా మతమార్పిడుల రాకెట్‌ను నడిపిన కేసులో ఎన్ఐఏ- యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ ప్రత్యేక కోర్టు బుధవారం 12 మందికి జీవితఖైదు విధించింది. ఇందులో ఇస్లాం మతప్రబోధకుడు మౌలానా కలీమ్ సిద్దిఖీ, ఇస్లామిక్ దవాహ్ సెంటర్ వ్యవస్థాపకుడు మొహమ్మద్ ఉమర్ గౌతమ్‌లు కూడా ఉన్నారు. ప్రత్యేక జడ్జి వివేకానంద్ శరణ్ త్రిపాఠి మరో పది మందికి పదేళ్ల జైలు శిక్ష విధించారు. దోషులకు భారీ జరిమానాలు విధించడమే కాకుండా బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు.

జులానా నుంచి రెజ్లర్ వినేశ్ ఫోగాట్ నామినేషన్

చండీగఢ్: హరియాణాలోని జులానా అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున మల్లయోధురాలు వినేశ్ ఫోగాట్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం వినేశ్ ఫోగాట్ కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. భూపీందర్ హుడా నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమని అన్నారు. జులానా స్థానంలో వినేశ్ ఫోగాట్‌పై బీజేపీ అభ్యర్థిగా మాజీ కమర్షియల్ పైలట్ యోగేష్ బైరాగీ పోటీ చేస్తున్నారు. వినేశ్ ఫోగాట్ స్వస్థలం చార్ఖీ దాద్రి జిల్లాలోని బలాలీ. ఆమె భర్త సోమ్‌వీర్ రాఠీ స్వస్థలం జులానా నియోజకవర్గంలోని భక్తఖేరా. హరియాణాలో అక్టోబర్ 5న ఎన్నికలు జరుగనున్నాయి.



ఢిల్లీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నివాసంలో బుధవారం గణపతి పూజలో పాల్గొన్న ప్రధాని మోదీ. చిత్రంలో సీజేఐ దంపతులు

సాక్షి ప్లస్
గురువారం: 12-9-2024

జైనకల్ప సూత్ర గ్రంథకర్త?

ప్రాచీన భారతదేశంలో మత ఉద్యమాలు

క్రీ.పూ 6వ శతాబ్దానికి భారతదేశ చరిత్రలోనే కాకుండా ప్రపంచ చరిత్రలోనే జ్ఞాన సంచలనాల శతాబ్దంగా పేరుంది. ఈ కాలంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్కర్తలు సామాజిక, మత దురాచారాల నుంచి సమాజాన్ని, మతాన్ని సంస్కరించే ప్రయత్నం చేశారు. వీరిలో ముఖ్యమైనవారు చైనాలో కన్ఫ్యూషియస్, పర్షియాలో జొరాస్టర్, గ్రీస్‌లో పర్మనైడ్స్ మొదలైనవారు. అయితే భారతదేశంలో పాళి గ్రంథాల ప్రకారం ఇలాంటి 62 మత ఉద్యమాల గురించి తెలుస్తుంది. దాదాపు 200 వరకు మత ఉద్యమాలున్నట్లు జైన గ్రంథాలు ప్రస్తావించాయి. వీటన్నింటిలోకి ముఖ్యమైనవి జైన, బౌద్ధ ఉద్యమాలే. క్రీ.పూ 6వ శతాబ్దంలో భారతదేశంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, మత పరిస్థితులే ఇంత పెద్ద స్థాయిలో ఉద్యమాలు రావడానికి ప్రధాన కారణం.

సామాజిక వ్యవస్థ


ఈ కాలంలో సమాజంలో వర్ణ వ్యవస్థ మరింత కఠినంగా మారింది. వర్ణ వ్యవస్థలో స్థానం కేవలం పుట్టుక ద్వారా మాత్రమే లభిస్తుంది. ధర్మశాస్త్రాలు చాతుర్వర్ణాల విధులను నిర్ణయించడమే కాకుండా వర్ణం ఆధారంగా న్యాయపాలనను ప్రవేశపెట్టాయి. ఉన్నత వర్ణాలపై శూద్రులు చేసే నేరాలకు తీవ్ర శిక్షలుండగా, శూద్రులపై జరిగే నేరాలకు ఉన్నత వర్గాలకు స్వల్ప శిక్షలుండేవి. స్త్రీల స్థాయి మరింత దిగజారింది. ఈ కాలంలో అస్పృశ్యత మొదలైంది. నాటి పాళి గ్రంథాల్లో చండాల, నిషధ, వేన, పుక్కుస వంటి పలు వర్గాల ప్రస్తావన ఉంది. సమాజంలో ఉన్న తీవ్రమైన సామాజిక వివక్షతల నుంచి తమను రక్షించి, సామాజిక సమానత్వాన్ని కల్పించే ఉద్యమాల కోసం ఆయా వర్గాలు ఎదురుచూస్తున్న పరిస్థితులు నాటి సమాజంలో నెలకొన్నాయి.

ఆర్థిక వ్యవస్థ

ఆర్థిక వ్యవస్థను మలుపు తిప్పగలిగిన అనేక అంశాలు ఈ కాలంలో కనిపిస్తాయి. మొదటిసారిగా గంగా మైదానం సాగులోకి వచ్చింది. ఇనుప పరిజ్ఞానం విస్తృత స్థాయిలో ఉపయోగించడం, వరినాట్లను ప్రవేశపెట్టడం వల్ల వ్యవసాయ విస్తరణతోపాటు వ్యవసాయోత్పత్తిలో మిగులు ఏర్పడింది. ఈ మిగులు అటు జనాభా పెరుగుదలకు, వ్యవసాయేతర వృత్తుల అభివృద్ధికి, వ్యాపారాభివృద్ధికి దోహదపడటమే కాకుండా క్రమ పద్ధతి గల పన్నుల వ్యవస్థ ఆవిర్భావానికి దారి తీసింది. ఈ పరిణామాలన్నీ కలిసి ఈ కాలంలో భారతదేశ చరిత్రలో రెండోసారి నగరీకరణకు దారితీశాయి. హరప్పా నగరాల తర్వాత దాదాపు వేయి సంవత్సరాలకు మళ్లీ భారతదేశంలో నగరాల ఆవిర్భావం జరిగింది. వీటిని ఆధారం చేసుకుని అనేక చేతి వృత్తులు, పరిశ్రమలు, వ్యాపార వాణిజ్యాలు మొదలయ్యాయి. వ్యాపారులు శ్రేణులుగా ఏర్పడి వాణిజ్యాన్ని కొనసాగించారు. ఈ కాలంలో మొదటిసారిగా లోహపు నాణేల జారీ మొదలైంది. వీటినే విద్ధాంక నాణేలు అంటారు. వెండి శతమాకార్షపణలు, రాగి మాషా, కాకినిలు ఆనాటి కొన్ని నాణేలు. ఈ కాలంలోనే రాత సంప్రదాయం మొదలైంది. భారతదేశంలో తొలిసారి బ్రాహ్మీ లిపిలో రాత ప్రారంభమైంది. దీని వల్ల వ్యాపార లెక్కల నిర్వహణ మరింత సులువై వ్యాపార, వాణిజ్యాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం కలిగింది. వీటి వల్ల వైశ్యులు ఆర్థికంగా మరింత బలపడ్డారు. కానీ వర్ణ వ్యవస్థలో వారి స్థాయిలో మార్పు రాలేదు. పైగా వైదిక గ్రంథాలు వడ్డీ వ్యాపారాన్ని, సముద్రయానాన్ని నిషేధించడం ద్వారా వ్యాపారాభివృద్ధికి అడ్డంకిగా పరిణమించాయి. దీంతో కొత్త మతాల ఆవశ్యకత ఏర్పడింది. అందుకే జైన, బౌద్ధ మతాలు ఆవిర్భవించాయి. వ్యాపార వర్గాలు వాటిని బాగా ఆదరించాయి.

రాజకీయ వ్యవస్థ

ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన పలు మార్పులు నాటి రాజకీయ వ్యవస్థపై ప్రభావం చూపాయి. వేద కాలపు తెగ ఆధారిత రాజకీయ వ్యవస్థ స్థానంలో ప్రదేశానికి ప్రాముఖ్యతనిచ్చే ప్రాదేశిక రాజ్యాలు ఏర్పడ్డాయి. వ్యవసాయం, వ్యాపార, వాణిజ్యాల అభివృద్ధి వల్ల పన్నుల వసూలు జరిగి సైనిక నిర్వహణ సాధ్యమైంది. ఈ అంశాలన్నింటి వల్ల రాజకీయంగా క్షత్రియులు ఉన్నత స్థానానికి చేరుకున్నారు. కానీ వర్ణ వ్యవస్థలో మాత్రం వారిది ద్వితీయ స్థానమే. కాబట్టి సామాజికంగా క్షత్రియులు బ్రాహ్మణుల కంటే ఉన్నత స్థానాన్ని కోరుకున్నారు. దీని పర్యవసానమే పలు మత ఉద్యమాలు అని చెప్పొచ్చు. జైన, బౌద్ధ మతాల ప్రారంభకులు ఇద్దరూ క్షత్రియులే కావడం ఇక్కడ గమనార్హం. ఈ మత గ్రంథాల్లో వర్ణ వ్యవస్థలో క్షత్రియులు మొదటి వరుసలో ఉంటే బ్రాహ్మణులు ద్వితీయ స్థానంలో ఉంటారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మత వ్యవస్థ

వైదిక మతం ఈ కాలానికి మరింత సంక్లిష్టంగా మారింది. వర్ణ వ్యవస్థలో మొదటి మూడు వర్ణాలకే మోక్షం సాధ్యమవుతుంది. అయితే మోక్ష సాధన మార్గం చాలా వ్యయభరితమైయింది. అనేక యజ్ఞ యాగాదులు, జంతు బలులు సర్వసాధారణమయ్యాయి. ఈ జంతు బలుల వల్ల అప్పుడప్పుడే బలపడుతున్న వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన పశు సంపదకు అపార నష్టం వాటిల్లింది. పశు సంపద లేనిదే వ్యవసాయాభివృద్ధి జరగదు. కాబట్టి వ్యవసాయదారులు వైదిక కర్మకాండల పట్ల విముఖత పెంచుకున్నారు. శూద్రులు, స్త్రీలతోపాటు నిషేధిత వృత్తుల్లో ఉన్నవారికి మోక్షాన్ని నిరాకరించారు. ఈ పరిస్థితులన్నీ కలిసి సహజంగానే, అందరికీ సులువైన మోక్షం ప్రసాదించే మతాల పట్ల ఆసక్తిని కలిగించాయి.

మత ఉద్యమాలు

ఈ కాలం నాటి ఉద్యమాలు చాలా వరకు బ్రాహ్మణాధిక్యతను, కర్మకాండలను వ్యతిరేకించాయి. జ్ఞాన మార్గాన్నే మోక్ష మార్గంగా బోధించాయి. ఈ ఉద్యమకర్తల్లో చాలా మంది ఉపనిషత్ బోధనల నుంచి ప్రేరితులయ్యారు. ఆనాటి మత ఉద్యమాల్లో ముఖ్యమైనవారు..

- **పురాణ కశ్యపుడు:** ఒక వ్యక్తి నడవడికకు, అతని కర్మకు ఎలాంటి సంబంధం లేదని బోధించాడు. ఇతని బోధనల నుంచే సాంఖ్యకతత్వ సిద్ధాంతం అభివృద్ధి చెందింది.
- **గోసల మస్కరి పుత్రుడు:** విధి నిర్ణయం (నియతి) ప్రకారమే అన్నీ జరుగుతాయని బోధించాడు. ఇతడు 'అజీవిక' అనే మతాన్ని ప్రారంభించాడు.
- **అజిత కేశకంబళి:** 'చార్వాక' అనే శాఖను ప్రారంభించాడు. వీరినే శూన్యవాదులని అంటారు. ఈయన భౌతికవాదాన్ని బోధించాడు.
- **పకుధ కాత్యాయనుడు:** ఈయన పరమాణువాది. ఏ విధంగా అయితే భూమి, గాలి, నీరు, వెలుగులను నాశనం చేయలేమో విచారం, సంతోషం, జీవితం మొదలైనవాటిని కూడా నాశనం చేయలేమని బోధించాడు. ఇతని బోధనల నుంచే షడ్దర్శనాల్లో ఒకటైన వైశేషిక సిద్ధాంతం అభివృద్ధి చెందింది.
- **సంజయ బలత్తిపుర:** ఈయన సంశయవాదాన్ని ప్రచారం చేశాడు. జ్ఞానం అంటూ ఏదీ ఉండదని ఇతని భావన.
- **నిర్గ్రంథ జ్ఞానపుత్రుడు:** ఈయనే వర్ధమాన మహావీరుడు. జైన మత తీర్థంకరుడు.

మాదిరి ప్రశ్నలు

1. మహావీరుడు ఏ భాషలో తన బోధనలను కొనసాగించాడు?
   1) అర్ధ మగధి 2) పాళీ
   3) బ్రాహ్మీ 4) మార్వారీ
2. అజీవిక మత స్థాపకుడు?
   1) పురాణ కశ్యప 2) పకుద కాత్యాయన
   3) గోసల మస్కరి పుత్రుడు
   4) అజిత కేశ కంబలి
3. కింది వాటిలో అశోక వృక్షాన్ని పూజించిన మతశాఖ?
   1) శక్త 2) పాశుపత
   3) దిగంబర 4) అజీవిక
4. జైన మత వాస్తవ స్థాపకుడు?
   1) రుషభనాథ 2) పార్శ్వనాథ
   3) నేమినాథ 4) వర్ధమాన మహావీర
5. మహావీరుడు కైవల్య (జ్ఞానాన్ని) పొందిన ప్రదేశం?
   1) కుంద 2) వైశాలి
   3) గయ 4) జృంభిక
6. మహావీరుని మొట్టమొదటి శిష్యుడు?
   1) జామాలి 2) ఆనందుడు
   3) గోసల మస్కరి పుత్రుడు
   4) భద్రబాహుడు
7. కిందివాటిలో మహావీరుడు మరణించిన ప్రదేశం?
   1) కుశినగర 2) వైశాలి
   3) రాజగృహ 4) పావా
8. కింది వాటిలో మొదటి జైన సంగీతి ఎక్కడ జరిగింది?
   1) పాటలీపుత్రం 2) వల్లభి
   3) జృంభిక 4) వైశాలి
9. కిందివాటిలో జైనమతం విస్తరించని ప్రాంతం ఏది?
   1) గుజరాత్ 2) రాజస్థాన్
   3) కర్నాటక 4) పశ్చిమ బెంగాల్
10. దక్షిణ భారతదేశంలో జైన మతాన్ని ప్రచారం చేసినవారు?
    1) చంద్రగుప్త మౌర్యుడు
    2) భద్రబాహు
    3) స్థూలబాహు 4) సుదర్శన్
11. జైన మతాన్ని లిచ్ఛవీల రాజ మతంగా చేసినవారు?
    1) చేతక 2) కుమారదేవ
    3) అభయ 4) ఉదయనుడు
12. జైన మతంలో పోసద లేదా ఉపోసత అంటే ఏమిటి?
    1) కొత్త వారిని జైనమతంలో సభ్యులుగా తీసుకొనే కార్యక్రమం
    2) జైనమత ఉపాసకులు పున్నమి రోజున ఉపవాసముండుట
    3) జైనులు తమ తప్పులను అంగీకరించే కార్యక్రమం
    4) నియమ ఉల్లంఘనకు విధించే శిక్ష
13. బసదులు ఏ మతానికి సంబంధించినవి?
    1) బౌద్ధం 2) జైనం
    3) హిందూ 4) అజీవిక
14. జైనకల్ప సూత్ర గ్రంథకర్త?
    1) కల్పాచార్య 2) గార్దభిల్ల
    3) భద్రబాహు 4) స్థూలభద్ర

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 2;
5) 4; 6) 1; 7) 4; 8) 1;
9) 4; 10) 2; 11) 3; 12) 2;
13) 2; 14) 3;

జైన మతం - వర్ధమాన మహావీరుడు

జైనమతంలో 24 మంది తీర్థంకరులున్నారని భావిస్తున్నారు. మొదటి, 22వ తీర్థంకరులైన రుషభనాథుడు, అరిష్టనేమిల ప్రస్తావన రుగ్వేదంలో ఉంది. అయితే 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుడే చారిత్రకంగా జైనమత స్థాపకుడని చెప్పాలి. ఈయన కాశీ రాజు అశ్వసేనుని కుమారుడు. క్రీ.పూ. 8వ శతాబ్దంలో జీవించాడు. జైనమతంలోని ఐదు సిద్ధాంతాల్లో మొదటి నాలుగింటిని పార్శ్వనాథుడు బోధించాడు. అవి.. అహింస, సత్య, అసతేయ, అపరిగ్రహ. చివరిదైన బ్రహ్మచర్యాన్ని మహావీరుడు చేర్చాడు.

వర్ధమానుడు క్రీ.పూ 540లో కుంద గ్రామంలో క్షత్రియ కులంలో త్రిశాల, సిద్ధార్థుడు అనే దంపతులకు జన్మించాడు. త్రిశాల వైశాలి రాజు చేతకుని సోదరి. చేతకుని కుమార్తె చెల్లనను మగధరాజు బింబిసారుడు వివాహం చేసుకున్నాడు. మహావీరుని భార్య పేరు యశోద. ఇతడు తల్లిదండ్రుల మరణం తర్వాత తన 30వ ఏట సన్యాసాన్ని స్వీకరించాడు. తర్వాత ఆరేళ్లు గోసల మస్కరి పుత్రునితో కలిసి జ్ఞానాన్వేషణ చేశాడు. ఆ తర్వాత ఆరేళ్లకు తన 42వ ఏట జృంభిక గ్రామం వద్ద రుజుపాలిక నది ఒడ్డున ఒకసాల వృక్షం కింద కైవల్యం (జ్ఞానం) పొందాడు. దీని వల్ల అతడు జినుడని, జితేంద్రియుడని, మహావీరుడనీ, నిర్గ్రంథుడని పేరు పొందాడు. ఇతని అనుచరులను నిర్గ్రంథులు లేదా జైనులని పిలిచేవారు. మహావీరుడు తన 72వ ఏట పావాపురి వద్ద హస్తిపాలుని ఇంట సల్లేఖన వ్రతం ద్వారా మరణించాడు.

జైనమతంలోని 5 సూత్రాలను భిక్షువులు ఆచరిస్తే వారిని మహావ్రతులని, సాధారణ భక్తులు ఆచరిస్తే అనువ్రతులని పిలుస్తారు. జైన మత త్రిరత్నాలు.. సరైన జ్ఞానం, సరైన విశ్వాసం, సరైన క్రియ. పంచ సిద్ధాంతాలతోపాటు త్రిరత్నాలను ఆచరిస్తే ఎటువంటి కర్మకాండలు అవసరం లేకుండా మోక్షం లభిస్తుందని జైన మతం బోధిస్తుంది.

జైన మహావీరుని 11 మంది శిష్యులను గణధారలు అంటారు. వీరిలో ఆర్య సుదర్శన్.. మహావీరుని అనంతరం తొలి థేర పదవి చేపట్టాడు. జైనమత గ్రంథాలైన 14 పూర్వాలను సంభూత విజయ, భద్రబాహు అనే గణధారలు క్రోడీకరించారు. భద్ర బాహు 'కల్పసూత్ర' అనే మరొక జైన మత గ్రంథాన్ని రచించాడు. ఇతడు చంద్రగుప్త మౌర్యుని సమకాలికుడు. చంద్రగుప్తుని కాలంలో మగధలో కరువు ఏర్పడగా భద్రబాహు అనుచరులతోపాటు చంద్రగుప్తుడు కూడా శ్రావణ బెళగొళకు వచ్చి అక్కడ సల్లేఖన వ్రతం ద్వారా మోక్షం పొందాడు.

జైనమతంలో చీలిక

శ్రావణ బెళగొళ నుంచి భద్రబాహు మగధకు తిరిగొచ్చాడు. అక్కడ జైన మత నాయకుడు స్థూలబాహుతో జైన సిద్ధాంత గ్రంథాల సూత్రాలపై చర్చించాడు. తర్వాత కాలంలో విభేదాల వల్ల జైనమతం.. దిగంబరులు, శ్వేతాంబరులు అనే రెండు శాఖలుగా విడిపోయింది. భద్రబాహు దిగంబర జైనమత నాయకుడు. దక్షిణ భారతదేశంలో జైనం వ్యాపించడానికి ప్రధాన కారకుడు. తర్వాతి కాలంలో దిగంబరుల నుంచి సమైయాలు, శ్వేతాంబరుల నుంచి థేర పంథీలు అనే శాఖలు ఏర్పడ్డాయి.

జైనమత గ్రంథాల సంకలనానికి క్రీ.పూ 3వ శతాబ్దంలో పాటలీపుత్రంలో స్థూల బాహు నాయకత్వంలో తొలి జైన సంగీతి జరిగింది. ఇందులో 14 పూర్వల స్థానం, 12 అంగాలు క్రోడీకరించారు. క్రీ.శ 6వ శతాబ్దంలో వల్లభిలో రెండో జైన సంగీతి నిర్వహించారు. ఇందులో 12 అంగాలను సంపూర్ణంగా సంకలనం చేయడంతో పాటు 12 ఉప అంగాలను రూపొందించారు. ఈ అంగాలపై రాసిన 10 వ్యాఖ్యలను నిర్యుక్తిలు అంటారు. జైన తత్వ సిద్ధాంతాన్ని స్యాద్వాదం అంటారు. అనేకాంతవాదం కూడా జైనమతానికి సంబంధించిన సిద్ధాంతమే.

జైనమత రాజపోషణ

మగధ రాజైన ఉదయనుడు, నంద వంశ రాజులు జైన మతాన్ని పోషించారు. చంద్రగుప్త మౌర్యుడు జైన మతాన్ని ఆదరించిన తొలి ముఖ్యమైన పాలకుడు అని చెప్పొచ్చు. తర్వాత దీన్ని ఆదరించిన రాజుల్లో ముఖ్యమైనవాడు ఖారవేలుడు. అశోకుడు బౌద్ధమతానికి ఆదరించినట్లే ఖారవేలుడు కూడా జైనమతాన్ని పోషించి దాన్ని నలు దిశలా ప్రచారం చేయించాడు. కుషాణుల కాలంలో మధుర ప్రముఖ జైన కేంద్రంగా ఉండేది. తొలి మధ్య యుగాల్లో పశ్చిమ గాంగులు, కాదంబులు, పశ్చిమ చాళుక్యులు, రాష్ట్రకూటులు మొదలైన వంశాల వారు జైన మతాన్ని ఆదరించారు.

జైనమత క్షీణత

హిందూ మతంతో పోల్చినప్పుడు బౌద్ధమతం తన ప్రత్యేకతను నిలుపుకున్నట్టు జైనమతం తన ప్రత్యేకతను నిలుపుకోలేదు. హిందూ మత కుల వ్యవస్థ జైనమతంలో పునరుద్ధరించడం వంటి అంశాల వల్ల ఇది సామాన్యుల ఆదరణ కోల్పోయింది. బౌద్ధమతంలా రాజాదరణ కూడా జైనానికి లభించలేదు. జైనమతంలో పలుమార్లు సంభవించిన చీలికలు కూడా ఈ మత ప్రాబల్య క్షీణతకు దారితీశాయి. శకులు, హూణులు, ముస్లింల వంటి విదేశీయుల దాడులు కూడా జైన మత పతనానికి కారణమయ్యాయి. చివరికి హిందూమత పునరుద్ధరణ జైన మతాన్ని దెబ్బ తీసింది.

అన్ని సబ్జెక్టుల బోధనకు అనుకూలమైన విధానం?

ఫలవంతమైన బోధనా ప్రణాళిక

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

1. బోధన ఎలా ఉండాలి, ఏ అంశాలు ఏ విధంగా బోధించాలి లాంటి విషయాల గురించి ఉపాధ్యాయుడు దేన్ని తయారు చేసుకోవాలి?
   1) బ్లూ ప్రింట్ 2) పాఠ్య పథకం
   3) మూల్యాంకనం 4) టీచర్స్ డైరీ
2. విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఉపాధ్యాయుడు బోధించే తరగతికి లక్ష్యసాధన దిశగా తయారు చేసుకునేది?
   1) వార్షిక పథకం 2) యూనిట్ పథకం
   3) వార్షిక పరీక్షలు 4) బ్లూ ప్రింట్
3. ఉపాధ్యాయుడు తాను తీసుకోబోయే సెలవులను కూడా పరిగణనలోకి తీసుకొని కింది వాటిలో దేన్ని రూపొందించుకోవాలి?
   1) వార్షిక పథకం 2) యూనిట్ పథకం
   3) వార్షిక పరీక్షలు 4) బ్లూ ప్రింట్
4. వార్షిక పథకం వల్ల కలిగే ఒక ప్రయోజనం?
   1) సెలవులను వాడుకోవచ్చు
   2) సమయాన్ని ఇష్టానుసారంగా వాడుకోవచ్చు
   3) రుతువులను, సహజ వనరులను ఉపయోగించి బోధించవచ్చు
   4) బోధన కష్టతరంగా పూర్తి చేయవచ్చు
5. ఒక కేంద్రీయ ఇతివృత్తం లేదా ప్రయోజనం చుట్టూ వ్యవస్థీకరించిన కృత్యాలు, అనుభవాల అభ్యసనానికి తోడ్పడే పాఠ్య విషయ భాగం?
   1) పాఠ్య పుస్తకం 2) పాఠ్య ప్రణాళిక
   3) యూనిట్ 4) సబ్జెక్ట్
6. పరస్పర సంబంధం ఉన్న ఒక సుదీర్ఘమైన సబ్జెక్ట్ విషయాన్ని యూనిట్ లేదా ప్రమాణం అంటారని తెలిపినవారు?
   1) వెస్లవే 2) కిల్‌ప్యాట్రిక్
   3) బ్లూమ్స్ 4) ప్రెస్టన్
7. బోధనా యూనిట్‌లో విషయం, పద్ధతి రెండూ ఉంటాయని తెలిపిందెవరు?
   1) థర్బర్, కొల్లెట్ 2) ప్రెస్టన్
   3) వెస్లవే 4) థామస్
8. మంచి యూనిట్ లక్షణాల్లో లేనిది?
   1) కృత్య అనుభవం
   2) త్వరగా పూర్తి చేసేది
   3) భవిష్యత్ అవసరాలు
   4) నిత్యజీవితంలో సంబంధం
9. యూనిట్ భావనలో సమగ్రమైన విషయ భావంలో ఏ సూత్రాన్ని కలిగి ఉండాలి?
   1) బహు సందేశ సూత్రం
   2) ద్వి సందేశ సూత్రం
   3) ఏక సందేశ సూత్రం
   4) పైవేవీకాదు
10. యూనిట్ పథకాన్ని తయారు చేసేటప్పుడు ఎవరిని సంప్రదించాలి?
    1) ప్రధానోపాధ్యాయుడు
    2) అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు
    3) జిల్లా విద్యాశాఖాధికారి
    4) తెలివి కలిగిన విద్యార్థి
11. విద్యార్థి సాధనను కొలవవచ్చు అని తెలియజేసిన వారెవరు?
    1) బ్లూమ్స్ 2) జాన్ డ్యూయి
    3) ప్రెస్టన్ 4) గ్లేసెస్
12. యూనిట్ దశల్లో ప్రేరణ కలిగించడం ఏ దశకు సంబంధించింది?
    1) సంగ్రహపరచడం
    2) పునఃశ్చరణ
    3) ప్రారంభక సోపానం
    4) అభివృద్ధి పరిచే సోపానం
13. యూనిట్ పథకం అమలు దశల్లో మూల్యాంకన పద్ధతులు ఉండే సోపానం?
    1) అభివృద్ధి పరిచే సోపానం
    2) ఉప సంహారక సోపానం
    3) ప్రారంభక సోపానం
    4) సంగ్రహపరచడం
14. యూనిట్ పథకం వల్ల కలిగే ప్రయోజనం:
    1) విద్యార్థి కేంద్రీకృతం
    2) బోధనతో పరీక్షలకు తయారీ
    3) విద్యార్థులు స్తబ్దతతో ఉన్నా బోధించవచ్చు
    4) పైవన్నీ
15. ఉపాధ్యాయుడు పనిచేసే తత్వం, విద్యార్థుల గురించి అతనికున్న సమాచారం, విద్యా లక్ష్యాలపై అతనికి ఉన్న అవగాహన, బోధించాల్సిన విషయం గురించి జ్ఞానం, ఫలితమైన పద్ధతులను ఉపయోగించడంలో అతని సామర్థ్యం 'పాఠ్యపథకం'లో ఉంటాయని తెలిపిన వారెవరు?
    1) థర్బర్ 2) గ్లేసెస్
    3) ప్రెస్టెస్ 4) లెస్టర్ బి. పెండ్స్
16. సమీప భవిష్యత్తులో ఉపాధ్యాయుడు బోధించబోయే చర్య కోసం రూపొందించిన పథకం?
    1) వార్షిక పథకం 2) యూనిట్ పథకం
    3) పాఠ్య పథకం 4) ఏదీకాదు
17. కిందివాటిలో ఉత్తమ పాఠ్య పథకానికి ఉండాల్సిన లక్షణం కానిది?
    1) లక్ష్యాలను స్పష్టంగా చూపాలి
    2) ఉపాధ్యాయునికి సులభతరంగా ఉండాలి
    3) మూల్యాంక సాధనలను పొందుపరచాలి
    4) బోధనా కృత్యాలను సూచించాలి
18. హెర్బార్షియన్ విధానంలో బోధనా ప్రమాణ కృత్యాలను ఎన్ని దశలుగా రూపొందించారు?
    1) 4 2) 3 3) 5 4) 2
19. ఉపాధ్యాయుడు విషయాన్ని హాజరు పరచడం అనే ప్రక్రియకు ప్రాధాన్యం ఇచ్చిన విధానం?
    1) బ్లూమ్స్ మూల్యాంకన విధానం
    2) హెర్బార్షియన్ విధానం
    3) RCEM విధానం
    4) పైవన్నీ
20. అప్రిసెప్టల్ మాస్ థియరీ ఆఫ్ లెర్నింగ్‌పై ఆధారపడి క్లాసికల్ హ్యూమన్ ఆర్గనైజేషన్ థియరీ ప్రభావం కలిగిన విధానం?
    1) హెర్బార్షియన్ విధానం
    2) బ్లూమ్స్ మూల్యాంకన విధానం
    3) RCEM విధానం
    4) పైవన్నీ
21. కిందివాటిలో హెర్బార్షియన్ విధానంలోని దశ ఏది?
    1) వివరించడం 2) పరిశీలించడం
    3) భేదాలు గుర్తించడం
    4) పోలిక లేదా సంసర్గం
22. హెర్బార్షియన్ విధానంలో బోధించబోయే పాఠ్యాంశానికి సంబంధించిన విద్యార్థి పూర్వ జ్ఞానాన్ని ఏ దశలో తెలుసుకుంటారు?
    1) సాధారణీకరం 2) అన్వయం
    3) సన్నాహం 4) హాజరుపరచడం
23. పాఠ్యపథక నిర్మాణంలో సమ్మిళిత కృత్యాలు అంటే?
    1) ఉన్ముఖీకరణ
    2) అభ్యసించిన విషయ జ్ఞానంతో సాధారణీకరణ, నియోజన
    3) బోధనా విషయాన్ని హాజరు పరచడం
    4) శీర్షికా ప్రకటన
24. అన్ని సబ్జెక్టుల బోధనకు అనుకూలమైన విధానం?
    1) హెర్బార్షియన్ విధానం
    2) బ్లూమ్స్ విధానం
    3) RCEM విధానం 4) ఏదీకాదు
25. బ్లూమ్స్ విధానంలో ఎన్ని సోపానాలు ఉన్నాయి?
    1) 5 2) 3 3) 4 4) 2
26. కిందివాటిలో బ్లూమ్స్ విధానంలో లేని దశ లేదా మూల్యాంకన ఉపగమం పాఠ్యపథక దశ కానిది?
    1) విద్యా లక్ష్యాల రూపకల్పన
    2) అభ్యసన అనుభవాల కల్పన
    3) పునఃశ్చరణ
    4) ప్రవర్తనా మార్పును మూల్యాంకనం చేయడం
27. హెర్బార్ట్ విధానంలో విషయ వ్యవస్థీకరణ లేదా హాజరుపరచడానికి ప్రాముఖ్యం ఇచ్చారు. బ్లూమ్స్ విధానంలో దేనికి ప్రాధాన్యం ఇచ్చారు?
    1) బోధనోపకరణ
    2) అభ్యసనం 3) బోధన
    4) లక్ష్యాధార కృత్యాలు
28. 'ఫలవంతమైన బోధన అంటే తాను పనిచేసే వాతావరణంలోని వ్యక్తుల చేత మెప్పు పొందేలా, నిర్ధారిత ఫలితాల సాధనకు ప్రత్యేక రీతిలోని ఉపాధ్యాయుని సామర్థ్యం' అని తెలిపిన వారెవరు?
    1) బిడిల్ 2) హెర్బార్ట్
    3) బ్లూమ్స్ 4) ప్రెస్టన్
29. 'సూక్ష్మంగా చెప్పాలంటే ఒక వ్యక్తి జ్ఞానం, నైపుణ్యాలు, వైఖరులు, చింతనా పద్ధతులను సంపాదిస్తూ, ధారణ చేస్తూ వినియోగిస్తున్నప్పుడు అతడి ప్రవర్తన ఏ ప్రక్రియ ద్వారా సంస్కరితమవుతుందో ఆ ప్రక్రియే అభ్యసనం' అని నిర్వచించినవారు?
    1) మన్ 2) కొలిస్నిక్
    3) గ్లేసెస్ 4) ప్రెస్టన్
30. 'చుట్టూ ఉన్న ప్రపంచంలో మనం చేసే పనులు, పరిశీలనల వల్ల ఇంచుమించు శాశ్వతంగా సంస్కరితమయ్యే ప్రక్రియే అభ్యసనం' అని నిర్వచించిన వారు?
    1) మన్ 2) కొలిస్నిక్
    3) గ్లేసెస్ 4) ప్రెస్టన్

సమాధానాలు

1) 2; 2) 1; 3) 1; 4) 3;
5) 3; 6) 4; 7) 1; 8) 2;
9) 3; 10) 2; 11) 4; 12) 3;
13) 2; 14) 1; 15) 4; 16) 3;
17) 2; 18) 2; 19) 2; 20) 1;
21) 4; 22) 3; 23) 2; 24) 1;
25) 3; 26) 3; 27) 4; 28) 1;
29) 2; 30) 1.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. అభ్యసన అనుభవాల జ్ఞానాత్మక, భౌతిక, స్వాభావిక వనరుల ప్రధాన వనరు? (డీఎస్సీ-2012)
   1) తరగతి గది 2) ప్రసార మాధ్యమాలు
   3) సమాజం 4) పాఠశాల
2. వార్షిక ప్రణాళికను ఎప్పుడు, ఎవరు రూపొందించాలి? (డీఎస్సీ-2012)
   1) నూతన సంవత్సరానికి, ఉపాధ్యాయుడు
   2) సంవత్సర ఆరంభంలో, ఉపాధ్యాయుడు
   3) విద్యా సంవత్సర ఆరంభంలో, ఉపాధ్యాయుడు
   4) విద్యా సంవత్సరాంతంలో నూతన విద్యాసంవత్సరానికి, ఉపాధ్యాయుడు
3. ఫలవంతమైన బోధన అంటే? (డీఎస్సీ-2004)
   1) తాను పనిచేసే ప్రదేశంలోని వ్యక్తుల మెప్పు పొందేలా, నిర్ధారిత ఫలితాల సాధన కోసం ఉపాధ్యాయుడు ప్రత్యేక రీతిలో ప్రదర్శించే సామర్థ్యం
   2) విద్యార్థుల్లో పఠన, లేఖన శక్తులను పెంపొందించడం
   3) పాఠ్య ప్రణాళిక పూర్తి చేసి, పరీక్షలు నిర్వహించడం
   4) బోధన తన విధి అన్నట్లుగా పాఠాలు చెప్పడం
4. విద్యార్థిలో అతి ప్రధాన ఫలితాలు కనిపించేటట్లు రూపొందిన సమాచారాలు అనుభవాల సవ్యవస్థిత కేంద్రరాశి? (డీఎస్సీ-2004)
   1) పాఠం 2) సబ్ యూనిట్
   3) యూనిట్ 4) పాఠ్య పుస్తకం
5. డాక్టర్ మారిషస్ విధానంలో యూనిట్‌లో ఉండే దశల సంఖ్య? (డీఎస్సీ-2004)
   1) 5 2) 4 3) 3 4) 2
6. పాఠ్యపథక రచనలో తొలిసారిగా ఒక క్రమబద్ధమైన విధానాన్ని ప్రవేశ పెట్టింది? (డీఎస్సీ-2002)
   1) మోరిసన్ 2) జె.ఎస్. హెర్బర్ట్
   3) బ్లూమ్స్ 4) గెగ్నే

సమాధానాలు

1) 3; 2) 4; 3) 1; 4) 3;
5) 1; 6) 2.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సబ్బులను ప్రధానంగా వేటితో తయారుచేస్తారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

మాదిరి ప్రశ్నలు

1. కొలెస్ట్రిరాల్ అనేది?
   1) ప్రొటీన్ 2) విటమిన్
   3) కొవ్వు పదార్థం 4) పిండి పదార్థం
2. మన శరీరంలో జరిగే అనేక చర్యలకు ఉత్ప్రేరకాలుగా పనిచేసే ఎంజైమ్‌లు అనేవి?
   1) కొవ్వు పదార్థాలు 2) పిండి పదార్థాలు
   3) ప్రోటీన్‌లు 4) విటమిన్‌లు
3. కొలెస్ట్రిరాల్‌కు సంబంధించి సరికాని వాక్యం ఏది?
   1) ఇది ప్రధానంగా కాలేయంలో తయారవుతుంది
   2) ఇది మొక్కల్లో లభించదు
   3) ఇది ఒక ఫాటీ ఆల్కహాల్
   4) ఇది మొక్కల్లో లభించే కొవ్వు పదార్థం
4. పురుషులతో పోల్చినపుడు స్త్రీలలో గుండెపోటు వచ్చే అవకాశం తక్కువ. దీనికి కారణం.
   1) స్త్రీల రక్తంలో హెచ్ డి ఎల్ (అధిక సాంద్రత కొవ్వు) ఎక్కువ
   2) స్త్రీల రక్తంలో హెచ్ డి ఎల్ తక్కువ
   3) స్త్రీల రక్తంలో ఎల్ డి ఎల్ (అల్ప సాంద్రత కొవ్వు) ఎక్కువ
   4) స్త్రీల రక్తంలో ఎల్ డి ఎల్ తక్కువ
5. సబ్బు అనేది?
   1) పొడవైన ఫాటీ ఆమ్లం
   2) పొడవైన ఫాటీ ఆమ్ల సోడియం లేదా పొటాషియం లవణం
   3) గ్లిజరాల్‌తో కూడిన ఫాటీ ఆమ్ల ఎస్టర్
   4) గ్లిజరాల్
6. సబ్బులను ప్రధానంగా వేటితో తయారుచేస్తారు?
   1) ప్రొటీన్‌లు 2) కార్బోహైడ్రేట్‌లు
   3) జంతు సంబంధ కొవ్వులు, మొక్కల సంబంధిత నూనెలు
   4) ఆల్కహాల్‌లు
7. దుస్తులు ఉతకడానికి వాడే కఠిన సబ్బు తయారీకి వాడే క్షారం?
   1) కాస్టిక్ సోడా (సోడియం హైడ్రాక్సైడ్)
   2) కాస్టిక్ పొటాష్ (పొటాషియం హైడ్రాక్సైడ్)
   3) వాషింగ్ సోడా (సోడియం కార్బొనేట్)
   4) బేకింగ్ సోడా (సోడియం బై కార్బొనేట్)
8. స్నానాలకు వాడే మృదు సబ్బు ఫాటీ ఆమ్లాల దేని లవణం?
   1) సోడియం 2) పొటాషియం
   3) కాల్షియం 4) మెగ్నీషియం
9. ఫాటీ ఆమ్లాలను సోడియం హైడ్రాక్సైడ్‌తో చర్యనొందించి జల విశ్లేషణ ద్వారా సబ్బు తయారుచేసే ప్రక్రియ?
   1) ఎస్టరిఫికేషన్ 2) సపోనిఫికేషన్
   3) కాల్సిఫికేషన్ 4) ఆసిడిఫికేషన్
10. కింది వాటిలో సబ్బు రసాయన నామం ఏది?
    1) సోడియం కార్బొనేట్
    2) సోడియం బై కార్బొనేట్
    3) సోడియం స్టీరేట్
    4) సోడియం ఎసిటేట్
11. కఠిన జలంతో ప్రభావశీలంగా పనిచేసేవి?
    1) స్వాదు సబ్బు
    2) కఠిన సబ్బు 3) డిటర్జెంట్‌లు
    4) కొవ్వు ఆధారిత సబ్బు
12. డిటర్జెంట్‌లు ప్రధానంగా?
    1) ఆల్కైల్ బెంజీన్ సల్ఫొనేట్‌లు
    2) కార్బాక్సిలేట్‌లు 3) ఎస్టర్‌లు
    4) ఆల్కైల్ బెంజీన్ కార్బొనేట్‌లు
13. పర్యావరణానికి ఎక్కువ హాని కల్గించేవి?
    1) మృదు సబ్బులు 2) కఠిన సబ్బులు
    3) వాషింగ్ సోడా 4) డిటర్జెంట్‌లు
14. కింది వాటిలో సబ్బు ఫార్ములా ఏది?
    1) CH_3COONa 2) $NaCl$
    3) $C_{18}H_{37}COONa$
    4) $C_3H_8O_3$
15. మనం తినే ఆహారంలోని ఏ పదార్థాలు రక్తంలో ట్రైగ్లిజరైడ్‌లు అధికం కావడానికి దోహదం చేస్తుంది?
    1) కార్బోహైడ్రేట్‌లు 2) ప్రోటీన్‌లు
    3) లిపిడ్‌లు 4) విటమిన్‌లు
16. దుస్తులు ఉతకడానికి సబ్బుల కంటే డిటర్జెంట్‌లను అధికంగా ఉపయోగించడానికి కారణం?
    1) చవకైనవి
    2) జీవక్షయీకృతమైనవి
    3) కఠిన జలంలో అవక్షేపించకుండా అధిక నురగనిస్తాయి
    4) చేతులకు తక్కువ హాని కల్గిస్తాయి
17. డిటర్జెంట్‌లు జలాశయాల్లో కలవడం వల్ల ప్రధానంగా ఏమి జరుగుతుంది?
    1) యూట్రోఫికేషన్ 2) నీటి ప్రక్షాళన
    3) నీరు స్వాదు జలంగా మారుతుంది
    4) చేపలు త్వరగా పెరుగుతాయి
18. నీటి కాఠిన్యతకు కారణమైన ప్రధాన లవణాలు?
    1) సోడియం, కాల్షియం
    2) మెగ్నీషియం, కాల్షియం
    3) సోడియం, పొటాషియం
    4) పొటాషియం, మెగ్నీషియం
19. సబ్బు తయారీలో ప్రధాన సహ ఉత్పన్నం?
    1) గ్లిజరాల్ 2) ఇథనోల్
    3) ఫినాల్ 4) వెనిగర్
20. వెనిగర్‌లో ప్రధానంగా ఉండేది?
    1) గ్లిజరాల్ 2) ఫినాల్
    3) ఎసిటికామ్లం 4) ఫార్మిక్లామం
21. సబ్బులో, నీటిలో కరగని గ్రీజు వంటి మురికి కణాలను ఆకర్షించే భాగం ఏది?
    1) హైడ్రోఫోబిక్(నీటిని వికర్షించే) కొవ్వు భాగం
    2) హైడ్రోఫిలిక్ (నీటిని ఆకర్షించే) కొవ్వు భాగం
    3) సోడియం అయాన్‌లు
    4) పొటాషియం అయాన్‌లు
22. చర్మం పొడిబారకుండా చేసే తేమ కల్గించే సబ్బుల తయారీలో వాడే రసాయనం?
    1) గ్లిజరాల్ 2) గ్లైకాల్
    3) ఇథైల్ ఆల్కహాల్ 4) వెనిగర్
23. కఠిన జలం అంటే ఏమిటి?
    1) సబ్బుతో నురగనివ్వని,అవక్షేపం ఏర్పరచే నీరు
    2) సబ్బుతో బాగా నురగనిచ్చేది
    3) సబ్బు తగలగానే గడ్డ కట్టేది
    4) సబ్బును అసలు కరిగించుకోనిది
24. నీటి తాత్కాలిక కాఠిన్యాన్ని తొలగించే పద్ధతి?
    1) నీటిని వడపోయడం
    2) నీటిని మరిగించడం
    3) నీటికి డిటర్జెంట్ కలపడం
    4) నీటికి సాధారణ ఉప్పు కలపడం
25. నీటి శాశ్వత కాఠిన్యాన్ని ఏ విధంగా తొలగించవచ్చు?
    1) ఉతికే సోడా (సోడియం కార్బొనేట్) కలిపి మరిగించడం
    2) నీటిని మరిగించడం
    3) పటిక కలపడం 4) తినే సోడా కలపడం
26. నీటి తాత్కాలిక కాఠిన్యతతో పాటు శాశ్వత కాఠిన్యతను తొలగించే పద్ధతి?
    i) మరిగించడం
    ii) వాషింగ్ సోడా కలపడం
    iii) అయాన్ వినిమయ పద్ధతి
    iv) తిరోగామి ద్రవాభిసరణం
    1) i, ii, iv 2) iii, iv
    3) ii, iv 4) ii, iii, iv
27. కింది వాటిలో ఏ పదార్థం నీటిలోని తాత్కాలిక కాఠిన్యాన్ని తొలగిస్తుంది?
    1) తడి సున్నం (కాల్షియం హైడ్రాక్సైడ్)
    2) బేకింగ్ సోడా
    3) టేబుల్ సాల్ట్ 4) పటిక
28. సాధారణ నీటికి క్షారత్వం కల్గించే లవణాలు ఏవి?
    1) పొటాషియం కార్బొనేట్
    2) పొటాషియం బై కార్బొనేట్
    3) సోడియం కార్బొనేట్ 4) పైవన్నీ



29. కింది వాటిలో ఏ లవణం వల్ల నీటికి క్షారత్వంతో పాటు కాఠిన్యత కలుగుతుంది?
    1) కాల్షియం కార్బొనేట్, మెగ్నీషియం కార్బొనేట్ - శాశ్వత కాఠిన్యత
    2) కాల్షియం క్లోరైడ్, మెగ్నీషియం క్లోరైడ్ - శాశ్వత కాఠిన్యత
    3) కాల్షియం బై కార్బొనేట్, మెగ్నీషియం బైకార్బొనేట్ - తాత్కాలిక కాఠిన్యత
    4) పైవన్నీ
30. సబ్బులు, డిటర్జెంట్‌ల తయారీలో ఉపయోగించే ఏ పదార్థం వల్ల పర్యావరణం ఎక్కువ కలుషితం అవుతుంది?
    1) క్లోరైడ్‌లు 2) బై కార్బొనేట్‌లు
    3) ప్లాస్టిక్ 4) ఫాస్ఫేట్‌లు
31. సబ్బు తయారీకి అవసరమైన పదార్థాలు?
    1) ఆల్కహాల్, కాస్టిక్ సోడా
    2) నూనె, కాస్టిక్ సోడా
    3) నూనె, ఆమ్లం 4) ఆల్కహాల్, ఆమ్లం
32. ప్రస్తుతం తయారుచేస్తున్న అనేక డిటర్జెంట్‌లకు ముడి సరుకుగా వేటిని ఉపయోగిస్తున్నారు?
    1) పెట్రోలియం ఉత్పత్తులు 2) సిరామిక్స్
    3) సున్నపురాయి 4) ప్లాస్టిక్
33. పెట్రోలియం అంటే?
    1) పెట్రోల్‌మాత్రమే
    2) డీజిల్ మాత్రమే 3) టోలిన్
    4) పెట్రోల్, డీజిల్, కిరోసిన్, ఏరోమాటిక్ సమ్మేళనాల మిశ్రమం
34. నాఫ్తలీన్ ఉండలకు ఆధారం?
    1) డీజిల్ 2) పెట్రోల్
    3) పెట్రోలియం నుంచి లభించే కోల్‌తార్
    4) పెట్రోలియం నుంచి లభించే కిరోసిన్
35. పెట్రోలియం బావుల్లో ఇంధన వాయువు, పెట్రోలియం నూనెలు లభించే ప్రదేశం?
    1) నీటిపై 2) నీటి కింద
    3) నీరు, ఇసుక మధ్య
    4) నీటితో కలిసి మిశ్రమంగా
36. గాలిలో కోల్‌ను మండిస్తే ఏర్పడే వాయువులు?
    1) కార్బన్ మోనాక్సైడ్ 2) కార్బన్ డై ఆక్సైడ్
    3) సల్ఫర్ ఆక్సైడ్‌లు 4) పైవన్నీ
37. ఎక్కువ శుద్ధత ఉన్న కార్బన్ కింది వాటిలో దేనిలో ఉంది?
    1) కోల్ 2) కోక్
    3) చార్‌కోల్ 4) పైవన్నీ
38. సౌర విద్యుత్ ఉత్పత్తిలో సౌరశక్తి విద్యుచ్ఛక్తిగా మారుతుంది. వీటిలో ఉపయోగించే మూలకం?
    1) సిలికాన్ 2) కార్బన్
    3) బంగారం 4) సిల్వర్
39. సౌర విద్యుత్‌ను విరివిగా ఉపయోగించకపోవడానికి కారణం?
    1) పర్యావరణానికి హాని చేస్తుంది
    2) ఉత్పత్తి ఖర్చు ఎక్కువ
    3) భారతదేశంలో సూర్యరశ్మి లభ్యత తక్కువ
    4) అన్నీ సరైనవే
40. మీథేన్ ఉండే ఇంధనం ఏది?
    1) కోల్ గ్యాస్ 2) బయోగ్యాస్
    3) గోబర్ గ్యాస్ 4) పైవన్నీ
41. ఎల్‌పీజీలో ఉండే ప్రధాన వాయువు?
    1) బ్యూటేన్ 2) ఈథేన్
    3) ఎసిటలీన్ 4) మీథేన్
42. మీథేన్ లేదా బ్యూటేన్‌లను మండించడం వల్ల గాలిలోకి విడుదలయ్యే ప్రధాన పదార్థాలు?
    1) కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్
    2) కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్
    3) కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి
    4) నీటి ఆవిరి మాత్రమే
43. హైడ్రోజన్ వాయువును ఇంధనంగా ఉపయోగిస్తే వాతావరణంలోకి విడుదలయ్యేది?
    1) నీటి ఆవిరి మాత్రమే
    2) కార్బన్ డై ఆక్సైడ్
    3) హైడ్రోజన్ పెరాక్సైడ్ 4) పైవన్నీ
44. ఇంధన ఘటాల్లో మండించే ఇంధనం?
    1) మీథేన్ 2) ఆక్సిజన్
    3) నైట్రోజన్ 4) హైడ్రోజన్
45. కోక్‌ను అధికంగా ఉపయోగించుకునే పరిశ్రమ?
    1) లెడ్ 2) బంగారం 3) స్టీల్ 4) కాపర్
46. కింది వాటిలో డిటర్జెంట్ ఫార్ములా ఏది?
    1) $C_{17}H_{35}COONa$
    2) $C_{17}H_{35}C_6H_4SO_3Na$
    3) CH_3COONa
    4) C_6H_5COONa
47. నీరు, కొవ్వు అనేవి సాధారణంగా ఒకదానిలో మరొకటి కలవని విరుద్ధ ధర్మాలున్న పదార్థాలు. కానీ పాల లాంటి కొల్లాయిడ్‌లో నీటిలో కొవ్వు కణాలు విస్తరించి ఉంటాయి. అయితే పాలలో వీటిని కలిపి ఉంచేది ఏది?
    1) కెసిన్ అనే ఎమల్సీకరణ కారకం
    2) రైబోఫ్లేవిన్ అనే ఎమల్సీకరణ కారకం
    3) కెసిన్ అనే ఆక్సీకరణ కారకం
    4) కెరాటిన్ అనే వర్ణద్రవ్యం
48. స్వచ్ఛమైన స్థితిలో ఒకే రకమైన పరమాణువులను కలిగి ఉండేది?
    1) పదార్థం 2) అణువు
    3) మూలకం 4) సమ్మేళనం
49. కింది వాటిలో జర్మన్ సిల్వర్‌లో ఉండని లోహం ఏది?
    1) కాపర్ 2) జింక్
    3) నికెల్ 4) సిల్వర్
50. జతపరచండి.

జాబితా - I	జాబితా - II
A) కంచు (బ్రాంజ్)	i) కాపర్+టిన్
B) ఇత్తడి (బ్రాస్)	ii) నికెల్+ఇనుము +క్రోమియం
C) నిక్రోమ్	iii) కాపర్ + జింక్
D) గన్ మెటల్	iv) రాగి+జింక్ + తగరం(టిన్)

	A	B	C	D
1)	i	ii	iii	iv
2)	i	iii	ii	iv
3)	iv	iii	ii	i
4)	ii	iii	i	iv

51. గాజు అనేది ఒక..?
    1) స్ఫటికం
    2) అతి శీతల ద్రవం (Super cooled Liquid)
    3) సాధారణ ద్రవం 4) ప్లాస్మా
52. ఒకే పరమాణు సంఖ్య కలిగి, వేర్వేరు ద్రవ్యరాశులున్న కేంద్రకాలను ఏమంటారు?
    1) సమస్థానీయాలు (ఐసోటోపులు)
    2) ఐసోబార్‌లు 3) ఐసోటోనులు
    4) ఐసోడయఫర్‌లు

సమాధానాలు

1) 3	2) 3	3) 4	4) 1	5) 2
6) 3	7) 1	8) 2	9) 2	10) 3
11) 3	12) 1	13) 4	14) 3	15) 1
16) 3	17) 1	18) 2	19) 1	20) 3
21) 1	22) 1	23) 1	24) 2	25) 1
26) 4	27) 1	28) 4	29) 4	30) 4
31) 2	32) 1	33) 4	34) 3	35) 1
36) 4	37) 2	38) 1	39) 2	40) 4
41) 1	42) 3	43) 1	44) 4	45) 3
46) 2	47) 1	48) 3	49) 4	50) 2
51) 2	52) 1			

Laissez-faire attitude means..

BANK EXAMS

ENGLISH

Directions (Q.No.1-5): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) As an architect of his own reputation, Ravi Varma worked more like a professional seeking to meet the expectations of his clients than as a modern artist committed to self-expression at all costs

B) By oleographing his paintings for wider circulation, he ensured his hegemony over Indian middle class taste

C) Ravi Varma's professional success came not merely through responding to the growing taste for western naturalism among Indian elites but also through the creation of his own opportunities and a careful cultivation of his persona

D) One of the consequences of this was the absence of stylistic coherence in his work

E) Even more shrewdly, by taking the initiative for creating a public collection of his works at a time when the idea of individual museums was unknown, he also invested in the perpetuation of his fame

F) Thus after successfully garnering pan-Indian elite patronage - of the native rulers and merchants, the colonial administrators and the early nationalists - in good measure

1. What is the LAST sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) D 5) E
2. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) D 5) F
3. What is the SECOND sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) E 5) F
4. What is the FOURTH sentence after rearrangement?
   1) B 2) A 3) C 4) D 5) E
5. What is the FIFTH sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No. 6 - 10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Female cardinals are quite nondescript compared to the male distinctive and conspicuous markings: brilliant red with a black mask and throat, large long-tailed song bird with a short, very thick bill and a prominent crest.
   1) those of adult males, their
   2) the male, which has
   3) adult male cardinals'
   4) adult males, whose
   5) No correction required
7. Memorial at the point of farthest advance of the tidal wave, near the town of Avanigadda, was built in memory of the people who died in the Diviseema storm - a devastating tropical cyclone that hit Andhra Pradesh in November 1977, killing at least 14, 204 people.
   1) A memorial, at the point of furthest advancing of the tidal wave
   2) A memorial, at the point of furthest advancement of the tidal wave,
   3) A memorial, in the point of further advances of the tidal wave
   4) A memorial, at the point of furthest advance of the tidal wave,
   5) No correction required
8. They have been living in the most appalling conditions from two months
   1) They have been living under the most appalling conditions for two months.
   2) They are living below the most appalling conditions from two months.
   3) They have been living in the most appalling conditions since two months.
   4) They have been living under the most appalling conditions since two months.
   5) No correction required
9. During the financial meeting, the company president reminds each ones that no department was too sacrosanct to avoid a cut in its yearly budget.
   1) Reminded every one that all department
   2) reminds all that no department
   3) reminded everyone that no department
   4) reminded everyone that all departments
   5) No correction required
10. During boot camp, we are often awakened by the stentorian voice of our drill sergeant.
    1) we are constantly awaken
    2) we were often awakened
    3) we were rarely awakened
    4) we are hardly awakened
    5) No correction required

Directions (Q.No. 11 - 15) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

California is known all over the world for its size, its sun, and its surf, its glamour and its **optimism**. But it is known too as "Earthquake Country" - a truly vulnerable region where big deva-stating quakes have occurred in the past and could happen again. It is unlikely that a disaster on the scale of recent disasters in Italy or Japan could occur in California; California has learnt from its past disasters, and most buildings are designed to withstand major quakes. Nevertheless,Californians are worried. When will the next big quake strike the state, and where will all the shaking and crumbling and rocking begin?

Nobody knows for sure, but at all times California is on the alert. The earth is permanently monitored with high-tech seismographs situated in universities and government research stations; they are constantly watched by highly-trained employees and volunteers from the California Office of Emergency Services; and students in every school receive training in what to do in the event of an earthquake.

Responsibility for California's earthquakes lies in the fact that the state sits atop the famous and terrifying San Andreas Fault. This fault rocks and quakes often and unexpectedly as the earth's tectonic plates shift along fault lines that run 700 miles from the Mexican border to the north California coast. It is almost unbelievable that more than 20 million people should choose to live along this fault; but because their state has prosperity, an ideal climate, and a wonderful ambiance, Californians take a **laissez-faire** attitude to the potential danger.

Living in the hills above the Hayward Fault, I know all about the danger. Like many Californians, I buy costly earthquake insurance for my home. If I walk along certain streets in the town of Hayward, I can see how the earth creeps and shifts. In some places, the town looks as if the architects and builders made big mistakes in construction, because the buildings are out of kilter.

Actually, what has happened is that the streets have cracked and shifted, so that curbs no longer meet. Houses have shifted, so that walls are uneven. Buildings have interior and exterior cracks that can't be prevented, because the slowly shifting earth causes an inexorable movement in foundations, walls and streets! Geologists believe that displacements along this fault have been occurring for 15-20 million years. The drift can be measured-in the present decades-as a displacement of two inches per year, on average. It doesn't take an expert to figure out what moving part of a building two inches a year will do to that structure. During the destruc-tive 1906 earthquake, in some places the earth moved as much as 21 feet!

Scientists now know that major earthquakes occur at about 150-year intervals along the San Andreas fault; but in the future, they will probably not happen unannounced. Scientists can now better **predict** when a quake is coming, by foreshocks and other techniques discovered in the studies they are constantly undertaking, so Californians can normally go to bed at night without worrying whether the house will fall down around them while they are sleeping.

Still, with or without a warning, the next Big One, when it comes, will still do enormous damage. It's something that we Californians just live with.

11. A suitable title for the passage is:
    1) California awaits the big one
    2) Displacements
    3) Scientists & predictions
    4) architects and builders
    5) recent disasters
12. Which of the following statements is true as per the passage?
    a) The possibility of a disaster on the scale of recent disasters in Italy or Japan is not ruled out in California.
    b) The vulnerability to disasters is a fact with which the Californians live.
    1) Only a 2) Only b
    3) Both a & b 4) Neither a nor b
    5) Either a or b
13. Laissez-faire attitude means:
    1) Unautocratic attitude
    2) Dictatorial attitude
    3) Intolerant attitude
    4) Indecent attitude
    5) Uncouth attitude
14. The synonym of predict is:
    1) Espionage 2) Envisage
    3) Surveillance 4) Tentative
    5) Provisional
15. The antonym of optimism is:
    1) Disparagement
    2) Confidence 3) Buoyancy
    4) Sanguinity 5) Poise

Directions (Q.No. 16-17) In the given questions, a theme followed by three passages is given. Determine which passage is based on the given theme and mark it as your option. More than one passage can be based on the given theme.

16. Environment

A) Some people call themselves environmentalists. They think we must protect the natural environment, to keep it safe. Things in the natural environment that we value are called natural resources. For example; fish, sunlight, and forests. These are renewable resources because they come back naturally when we use them. Non-renewable resources are important things in the environment that are limited for example, ores and fossil fuels. Some things in the natural environment can kill people, such as lightning.

B) Rocks are composed of grains of minerals, which are homogeneous solids formed from a chemical compound arranged in an orderly manner. The aggregate minerals forming the rock are held together by chemical bonds. The types and abundance of minerals in a rock are determined by the manner in which it was formed.

C) People seldom find absolutely natural environments on Earth, and naturalness usually varies in a continuum, from 100% natural in one extreme to 0% natural in the other. More precisely, we can consider the different aspects or components of an environment, and see that their degree of naturalness is not uniform. If, for instance, in an agricultural field, the mineralogical composition and the structure of its soil are similar to those of an undisturbed forest soil, but the structure is quite different.

1) only B 2) Both B & C
3) Only C 4) Both A & C
5) All A, B & C

17. Euthanasia

A) Euthanasia is categorized in different ways, which include voluntary, non-voluntary, or involuntary. Voluntary euthanasia is legal in some countries. Non-voluntary euthanasia is illegal in all countries. Involuntary euthanasia is also illegal in all countries and is usually considered murder.

B) A doctor is allowed by law to end a person's life by a painless means, as long as the patient and their family agree. A doctor assists a patient to commit suicide if they request it.

C) It was a massive forced displacement of people. The punishment for ignoring the order was execution and the destruction of the defector's properties.

1) only A 2) Both B & C
3) Only C 4) Both A & B
5) All A, B & C

Directions (Q.No. 18-19) In the given questions a pair of words are related, mark that pair which is related as your answer. If no option is related mark 5 'None' as your answer.

18. 1) fraud - impostor
    2) pensive - kin
    3) charisma - neutral
    4) generic - merry 5) None
19. 1) rotund - bashful
    2) malodorous - fragrance
    3) expound - disdain
    4) irascible - approbate 5) None
20. 1) supercilious - germane
    2) quiescent - fatuous
    3) matutinal - sartorial
    4) impecunious - wealthy
    5) None

KEY

1) 4	2) 2	3) 5	4) 5	5) 1
6) 2	7) 4	8) 1	9) 3	10) 2
11) 1	12) 2	13) 1	14) 2	15) 1
16) 4	17) 4	18) 1	19) 2	20) 4